# మతాలన్నిటికి
# ప్రాథమిక జ్ఞానము


<u>రచయిత</u>

**బి. యోహాను**

(సువార్త క్రైస్తవ సంఘం ప్రెసిడెంట్)

**హైదరాబాద్, తెలంగాణ.**



<u>ప్రచురించిన వారు</u>

**సువార్త క్రైస్తవ సంఘం**

(Regd.No. : 159/2015)

**అనంతపురము జిల్లా.**

త్రైత శకము-37 ప్రథమ ముద్రణ : సం॥ 2015

ప్రతులు : 1000 **వెల : 90 /-**

# సువార్త క్రైస్తవ సంఘం ప్రచురణలు

1. సువార్త బైబిలు.
2. దేవుని మార్గము–మన ప్రయాణము.
3. మత్తయి సువార్త మర్మాలు.
4. పాప క్షమాపణ ఎలా కలదు?
5. మతాలన్నిటికి ప్రాథమిక జ్ఞానము.

# గ్రంథములు లభించు చిరునామా

**బి. యోహాను**

సత్యనారాయణపురం కాలనీ,

చైతన్యపురి, హైదరాబాద్, తెలంగాణ – 500 060

Cell : 92982 01323, 90005 84063

**పి. తులసీరావు**

శ్రీరాంనగర్ కాలనీ,

ధర్మపురి రోడ్, విజయనగరం జిల్లా, ఆం.ప్ర – 535 002.

Cell : 94418 78096, 94943 30640

మూలకర్త


త్రైత సిద్ధాంత ఆదికర్త

శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు


# ఇందూ జ్ఞానవేదిక





**ఇందూ జ్ఞానవేదిక** (I.G.V)

**(Estd in 1978 - Regd.No.: 168/2004)**

**చిన్నపొడమల(గ్రా), తాడిపత్రి(మం), అనంతపురం (జిల్లా), ఆంధ్రప్రదేశ్-515411**

e-mail id : info@thraithashakam.org

***www. thraithashakam.org***

మూలకర్త

త్రైత సిద్ధాంత ఆదికర్త

## శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు

# ఖుదా ఇస్లామిక్ స్పిరిచ్యువల్ సొసైటీ

KHUDA ISLAMIC SPIRITUAL SOCIETY

K.I.S.S

**ఖుదా ఇస్లామిక్ స్పిరిచ్యువల్ సొసైటీ (K.I.S.S)**

(Regd.No.: 459/2011)

చిన్నపొడమల(గ్రా), తాడిపత్రి(మం), అనంతపురం (జిల్లా), ఆంధ్రప్రదేశ్-515411

e-mail id : info@khudaislamicspiritualsociety.org

*www. khudaislamicspiritualsociety.org*

# మతాలన్నిటికి ప్రాథమిక జ్ఞానము

పూర్వము 'ఇందూ' దేశముగా పిలువబడిన మన భారతదేశము నేడు 'హిందూ' దేశముగా కాలపరిణామ క్రమములో చెప్పుకోవడము మన దురదృష్టమనే చెప్పకోవచ్చు. నాడు జ్ఞానులకు నిలయమైన దేశముగా, ప్రపంచదేశములలో దైవజ్ఞానము కలిగిన దేశముగా, ఆధ్యాత్మికములో ప్రపంచ దేశములకు నిలువుటద్దంలా భాసిల్లిన మన 'ఇందూ'దేశము, నేడు అజ్ఞానముతో తొణికిసలాడడం మన తెలివితక్కువ తనం, సిగ్గుచేటు. ఇంకా చెప్పాలంటే ఇందువుల ప్రామాణిక దైవగ్రంథము **'భగవద్గీత'** అని తెలియకపోవడము, అజ్ఞానములో ఉన్నదనటానికి ఇదే పరాకాష్ట. దీనికి కారణము భగవద్గీతలోని భావము తెలియక వక్రభాష్యం పట్టించడము ఒక రకమైతే, బ్రహ్మవిద్యా శాస్త్రానికి మారుపేరైన 'భగవద్గీత'కు ప్రాచుర్యం లేకపోవడము మరోరకముగా చెప్పుకోవచ్చు. బ్రహ్మవిద్యాశాస్త్రము తెలిసిన జ్ఞానులు ఎవరూ ఈ ప్రపంచము ఎలా పుట్టింది? అని అడగరు, పరిశోధన చేయరు.

ఈ సృష్టిలో ఆధ్యాత్మికములో ప్రాథమికముగా ముందు మనకు తెలియవలసిన అత్యంత రహస్యమైనది 'ఆత్మ' గురించే. 'ఆధ్యాత్మికము' అను పదములోనే 'ఆత్మ' ఉండడము ఇంకా రహస్యము. అనగా 'ఆత్మ'ను అధ్యయనము చేయడమే 'ఆధ్యాత్మికము' అని అర్థము. 'ఆత్మ' అనగా జనానికి బాగా తెలిసిన సాధారణ పదము. కానీ ఆధ్యాత్మికములో అత్యంత కీలకమైనది, ముక్తికి మూలము ఈ ఆత్మే. దీనినే 'తత్త్వమును తెలుసు కోవడము' అనికూడా అందురు. 'తత్త్వము' అనగా ఆత్మ అని అర్థము. ఇంకా వివరముగా చెప్పుకుంటే, సూక్ష్మమైనది, జీవునికి మేనమామ, గుప్తముగా ఉన్న చిత్రగుప్తుడు, పరమాత్మకు ప్రతినిధి, జీవాత్మకు అధిపతి, హృది, నిన్ను నడుపువాడు, తోలేవాడు, అన్నీ చేసేవాడు అని అర్థము.

సర్వజీవరాశుల శరీరముల లోగల జీవాత్మతో కలిసి దేవుని ఆధీనములో ఉండి, సర్వ జీవరాశుల శరీరములోని కర్మను అనుభవింపజేస్తున్న 'ఆత్మ'ను గూర్చి వివరముగా విశదీకరించి, అవి భగవద్గీతలోని పురుషోత్తమప్రాప్తి యోగము అను అధ్యాయములో క్షర, అక్షర, పురుషోత్తమ అను ముగ్గురు పురుషుల ప్రతీకగా సూచిస్తూ, మూడు ఆత్మల జ్ఞానమును **"త్రైత సిద్ధాంత భగవద్గీత"** ద్వారా **శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానందయోగీశ్వరుల** వారు త్రైత సిద్ధాంతమును ప్రతిపాదించి, ఇంకా త్రైత సిద్ధాంత గ్రంథముల ద్వారా బ్రహ్మవిద్యా శాస్త్రమును వివరముగా తెలియజేయటం, జ్ఞానజిజ్ఞాసువులకు, సత్యాన్వేషులకు ఆనందభరితం మరియు ఒక శుభకరమైన వరములాంటిది.

ఈ విషయమునే రెండవ దైవగ్రంథమైన బైబిలులో తండ్రి (ఆత్మ), కుమారుడు (జీవాత్మ), పరిశుద్ధాత్మ (పరమాత్మ)గా చెప్పియుండగా, అంతిమ దైవగ్రంథమయిన ఖురాన్ దైవగ్రంథములో కూడా "తోలేవాడు (ఆత్మ), తోలబడేవాడు (జీవాత్మ), సాక్షిగా ఉన్నవాడు (పరమాత్మ)"గా చెప్పియుండగా, 'మతము' అనే గోడలు నిర్మించుకొని 'మాయ" లేదా సాతాను' లేదా 'సైతాను' అనే గుణముల చట్రంలో చిక్కుకొని సహజీవనము సాగిస్తున్న నేటి సమాజములకు అర్థము కాలేదంటే అతిశయోక్తికాదు. దేవుడు మూడు ప్రదేశములలో, మూడు సమయములలో, ముగ్గురి ద్వారా, మూడు దైవగ్రంథములను అందించి ఈ జ్ఞానము సమస్త జీవరాశులకు అని చెప్పగా, ఒకే బ్రహ్మ విద్యాశాస్త్రమును మూడుచోట్ల మూడు భాషలుగా చెప్పగా, మతిభ్రమించిన మానవులు 'మా దేవుడు, మా దేవుడు' అని గెరిగీచుకొని (గీత గీచుకొని) కుమ్ములాడుకొంటూ, అసలు ముక్తిమార్గాన్ని వదిలేసి మతబలాన్ని పెంచుకునే దిశలో పరుగుతీయడం ఎంత శోచనీయం? ఎంత అజ్ఞానము?

దేవుడు (దేవులాడబడేవాడు) ఏమి చెప్పుచున్నాడు? అనగా! ఏ మనిషి అయితే దేవుని కల్మషము లేని నిజమైన జ్ఞానాన్ని సాటి మనుష్యులకు అందిస్తాడో వానిని చూచి నేను ఆనందిస్తాను అని చెప్పుచున్నారు. కొందరు నాకు ఇష్టములేని భజనలు, పూజలు, ఆరాధనలు, ప్రార్థనల ద్వారా ఆనందించండని కూడా చెప్పుచున్నారు. అలా చేయడము ధర్మమే కాదు. మనమేమి చేస్తున్నాము? మతము అనే ముసుగులో దేవుని మార్గమేనని భ్రమిస్తూ సాతాను (మాయ) మార్గములో పయనిస్తున్నామా? లేక శాస్త్రబద్దమైన దేవుని ధర్మములు ఆచరిస్తున్నామా? అసలు శాస్త్రము అంటే ఏమిటి? అని చూస్తే శాస్త్రము అనగా శాసనములతో కూడుకొని ఉన్నది, ఖండింపబడనిది, నిరూపణకు వచ్చునది అని అర్థము. దేవుని ధర్మములు అంటే ఏమిటి? అని చూస్తే దేవుని సిద్ధాంతములను తెలుపునది ధర్మము. ఒక వస్తువు లేక పదార్థము జీవమున్నదికానీ, జీవములేనిది కానీ దానికున్న సూక్ష్మ సహజత్వమును 'ధర్మము' అనవచ్చును. ఇంకా జన్మకు కారణమైన కర్మను లేకుండా చేయునది. శరీరములోనున్న దైవమును తెలుపునది అని అర్థము. ఇప్పుడు మనకేం కావాలి? మన శరీరములో నున్న ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మను తెలుసుకోవాలంటే 'జీవాత్మ'గా శరీరములో మన ఉనికిని (అడ్రస్సును) మనము తెలుసుకోవాలి. జీవుని ఉనికి జీవునికి తెలియాలంటే జ్ఞానము అవసరము. జ్ఞానము అంటే ఏమిటి? ఈ సృష్ఠిలో జ్ఞానము రెండు విధములుగా ఉన్నది. అవి ఏమనగా ఒకటి ప్రాపంచిక జ్ఞానము, రెండు పరమాత్మ జ్ఞానము. ప్రాపంచికములో తెలుసుకున్న విషయములను 'విజ్ఞానము' అంటాము. అలాగే ఆధ్యాత్మికములో తెలుసుకున్న విషయములను 'జ్ఞానము' అంటాము. ప్రాపంచికముగా ఎన్ని విద్యలనభ్యసించినా, ఎంత గొప్ప విషయములను కనుగొన్నా మనిషి

'విజ్ఞాని'గానే ఉంటాడుగానీ, జ్ఞానికాలేడు. ప్రాపంచిక విద్యలు సుఖవంతముగా జీవించడానికి పనికి వస్తాయికానీ, జీవునికి ముక్తిని కలిగించలేవు. ముక్తి అనగా జన్మరాహిత్యము. జన్మరాహిత్మము అనగా జన్మకు కారణమైన కర్మలేకుండా పోవడము. కర్మ అనగా కష్టము మరియు సుఖము రెండిటి కలయిక 'కర్మ' అని అంటాము. కర్మను రూపుమాపాలంటే జ్ఞానము అవసరము.

ఈ సృష్ఠిలో అన్ని విద్యలకంటే పెద్ద విద్య అయిన బ్రహ్మవిద్యా శాస్త్రము ప్రకారము, ఎంతపెద్ద విజ్ఞానిని కూడా 'అజ్ఞానిగానే' పరిగణలోకి తీసుకోవచ్చును ఎందువలనంటే! జీవుడు ఎన్ని జన్మలెత్తినా తిరిగి జ్ఞానియై ముక్తిని పొందము అనివార్యము గనుక. ముక్తి అనగా విడుదల అని అర్థము. వేదములను, ఉపనిషత్తులను బ్రహ్మవిద్యాశాస్త్రము ఆధారముతో ప్రకృతి జనితములుగా చెప్పుకోవచ్చు. అనగా మనుషులు చెప్పినవేగానీ, దేవుడు చెప్పినవి కావు అని అర్థము. ప్రకృతి అనగా అచర ప్రకృతి, చరప్రకృతి అని రెండు భాగములుకాగా, అచర ప్రకృతి విశేషముగా ఆకృతి చేయబడినది, పంచభూతముల సముదాయము, సర్వజీవులకు రూపమిచ్చు నది, ఒక భాగముకాగా, రెండవది 'మాయ'గా చెప్పుకోవచ్చును. రెండిటినీ దేవుడే సృష్ఠించి ఉంచాడు. దేవుని అంశతో భగవంతునిగా వచ్చిన శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో 'మమ మాయా దురత్యయా' అని చెప్పారు. అనగా 'నా మాయను జయించడం సులభ సాధ్యంకాదు' అని అర్థము. అనగా మాయ పనేంటి అని విశ్లేషించుకొని చూస్తే, ఒక కోణములో జీవునికి తల్లిగా ఉన్న ప్రకృతియే అనగా మాయయే జీవునికి దేవున్ని (తండ్రిని) తెలియకుండా చేయడమే మాయ యొక్క ప్రధానమైన పనిగా మనకు భగవద్గీత ద్వారా అర్థమవుతుంది. అలాగే 'నన్ను శరణువేడితే ఈ మాయను

జయించడం సులభసాధ్యము' అని కూడా భగవద్గీతలో కృష్ణ పరమాత్మ చెప్పియున్నారు. ఎందుకనగా జ్ఞానియై మాయను జయించి తత్త్వాన్ని కనుగొనువాడే ముక్తికి అర్హుడు కనుక.

బ్రహ్మవిద్యాశాస్త్రము ప్రకారము విశ్లేషించుకొని చూస్తే భగవద్గీత గ్రంథము మొత్తము మనిషి శరీర యంత్రాంగము గురించే వివరించి ఉండటం విశేషము. ఇక్కడ చిత్రం ఏమిటంటే, జీవుని శరీరములో జీవుని అడ్రస్సు ఎక్కడో జీవునికే తెలియకపోవడము. సాధారణంగా మనము ఒక వ్యక్తిని 'నీ అడ్రస్సు ఎక్కడ?' అని అడిగితే అతని ఇంటి అడ్రసు ఇస్తాడు. ఆ వ్యక్తి శరీరాన్నే చూపించి, ఈ నీ శరీరములో నీవు ఉండే అడ్రస్సు ఎక్కడ? అని అడిగితే, ఆశ్చర్యంతోపాటు సంద్గిగ్ధావస్థలో పడతాడు. తరువాత 'ఈ శరీరమే నాది కదా! విచిత్రముగా అడుగుతావే' అంటాడు. అనగా ఈ శరీరమే నాదని, అన్ని పనులు నేనే చేస్తున్నాను కదా! అని జీవుడు అనుకోవడముతోనే ప్రతిరోజు వచ్చు ఆగామిక కర్మను ఆహ్వానించి నట్లు అయినది. ఇప్పుడు ప్రతిరోజూ వచ్చు ఆగామిక కర్మ జీవునిలో ఎలా చేరుతున్నట్లు? అనగా, ముందు కర్మల గురించి వివరించుకొందాము. కర్మ మూడు రకములుగా ఉన్నది. 1) సంచిత కర్మ 2) ప్రారబ్ధకర్మ 3) ఆగామికర్మ. ఇప్పుడు సంచితకర్మ గురించి తెలుసుకొన్నట్లయితే 'సంచిత కర్మ' అనగా, జీవుడు జన్మజన్మలకూ కర్మను అనుభవించగా మిగులుచూ వస్తూ కుప్పలాగా పేరుకుపోవుచున్నది. అదియే సంచితకర్మ. ఇక 'ప్రారబ్ద కర్మ' అనగా మనిషి పుట్టినప్పుడే నిర్ణయము జరిగేది. అంటే సంచితకర్మ నుండి కొంత కర్మను తీసుకొని, ఈ జన్మలో పుట్టినప్పటినుండి చనిపోవు వరకు జరిగే కర్మనే ప్రారబ్ధకర్మ' అంటాము. ఇప్పుడు విషయానికి వద్దాము. ఇందాక చెప్పుకొన్న ప్రతిరోజు వచ్చు 'ఆగామికకర్మ' ఇప్పుడు జీవుడిలో

ఎలా చేరుతున్నదంటే, జీవునియొక్క తల నుదుటి భాగములో బ్రహ్మ, కాల, కర్మ, గుణచక్రము సముదాయములోని కర్మచక్రములోని సంచితకర్మలో ఈ ఆగామిక కర్మ చేరిపోవుచున్నది.

ఇప్పుడు జీవునియొక్క (జీవాత్మ) ఉనికి గురించి కొంత తెలుసు కొందాము. జీవుడు శరీరములో నుదుటి భాగములోగల బ్రహ్మనాడియందు బ్రహ్మ, కాల, కర్మ, గుణచక్ర సముదాయములో తామసము, రాజసము, సాత్త్వికము అను మూడు గుణభాగములలో ఏదో ఒక భాగములో ఆత్మతో పాటు నివాసముంటున్నాడు. ఇక్కడ జీవుడు (జీవాత్మ) చిన్న సూదిమొన అంత పరిమాణములో ఉండి, శరీరములో అస్వతంత్రునిగా ఉన్నాడు. కర్మబద్ధుడై కర్మను అనుభవించువానిగా, అనామకుడిగా ఉన్నాడేగానీ, కార్యము చేయువానిగా లేడు. శరీరములో ఆత్మ మాత్రమే 'గ్రంథిరాజము' సహస్రారము అనబడు బ్రహ్మనాడి ఆధారముగా ఏడు నాడీకేంద్రముల ద్వారా శక్తిని ప్రసారము చేయుచూ, జీవునియొక్క కర్మ ప్రకారము శరీరమును నడుపుచున్నది. శరీరములోనున్న మూడున్నర లక్షలనాడులలో, డెబ్బై రెండువేల నాడులు ముఖ్యమైనవికాగా, అందులో పది శిరోనాడులు ప్రాముఖ్యత చెందియుండగా వాటికంటే ముఖ్యమైనవి మూడుగలవు వాటినే 'ఇడ', 'పింగళ', 'సుషుమ్న' నాడులు అందురు. వీటికే సూర్య, చంద్ర, బ్రహ్మనాడులని పేర్లు గలవు. శరీరములోని పది శిరోనాడులు ఈ మూడు నాడులనుండే బయలుదేరినవి. శరీరములోని ప్రతి చిన్న నాడీ ఈ మూడు నాడులతో అనుసంధానమై ఉన్నవి. ఈ నాడుల ద్వారా ఆత్మ శరీరమంతా ఆక్రమించి, జీవుని కర్మానుసారము పనిచేయు చుండగా, ఆ పనిలో వచ్చు కష్టమో, సుఖమో, పాపమో, పుణ్యమో, అనుభవించడము జీవునియొక్క పనిగా ఉన్నది. కానీ ఇక్కడ జీవుడేమి చేస్తున్నాడంటే, అంతా నేనే చేస్తున్నాను

అంటున్నాడు. ఆత్మ జీవుని శరీరములో జీవుని కర్మప్రకారము పనిని నిర్వర్తించగా, శరీరములో ఏమీ చేయక అనామకుడిగా ఉన్న జీవుడు 'నేనే చేశాను', అంటే ఇది ధర్మమునకు విరుద్ధము. ప్రాపంచికములో ఒకడు చేసిన పనిని నేనే చేశాననడము ఎంత అన్యాయమో, దేవుని పరిపాలన (సూక్ష్మపరిపాలన) అనగా కంటికి కనబడని లేదా ఆధ్యాత్మికములో ధర్మమునకు విరుద్ధముగా అంతే అధర్మమగుచున్నది. ఇక్కడ గమనించ వలసినదేమనగా! నీతి, న్యాయములు ప్రపంచ సంబంధము, జ్ఞానము, ధర్మము దైవసంబంధముగా పరిగణింపవలెను.

ఇక్కడేమి జరుగుచున్నదంటే, ప్రారబ్ధకర్మతో జీవుడు పుట్టి, కర్మను అనుభవిస్తూ ముందుకుపోతూ, శరీరములోని ఐదు అంతఃకరణములలో ఒక భాగముగా ఉన్న 'అహము' అను తన్మాత్ర, జీవునకు 'అంతా నీవే చేస్తున్నావని' ప్రేరేపించగా, జీవుడు అదే నిజమనుకొని ఆ అహంకార భావముతో నేనే చేశాను అనుచూ ఆగామికకర్మను (క్రొత్తగా రోజూ వచ్చుకర్మ) తిరిగి సంపాదించుకొనుచున్నాడు.

ఇక శరీర యంత్రాంగము గురించి తెలుసుకొనే ముందు దేవుని పరిపాలన గురించి కొంత వివరముగా చెప్పుకొన్నట్లయితే, విశ్వమును దేవుడు సృష్ఠించినప్పుడే తన పరిపాలనను కూడా తయారు చేశాడు. దానితో దేవుడు సృష్ఠించిన విశ్వము పాలించువారు, పాలించబడువారు అను రెండు రకముల జీవరాశులతో నిండిపోయినది. పాలించబడువారు మనకు ప్రత్యక్షముగా కనిపించు జీవరాశులుగా ఉండగా, పాలించువారు కనిపించని గ్రహములు, ఉపగ్రహములు మరియు భూతములు, ఉపభూతములుగా ఉన్నారు. పాలించబడు జీవరాశులు అండజ, పిండజ, ఉద్భిజములుగా ఉన్నవి. భూమండలములో ఎన్నో కోట్ల జీవరాశులుండగా, వాటిని పాలించు

గ్రహములు, భూతములు కోట్లకొలది ఉన్నవి. జీవరాశులను నడిపించి అనుభవింపజేయుటకు కారణమైన కర్మ ఉన్నది. కర్మను అనుభవించు జీవులన్నియూ మాయ (సాతాను) ఆధీనములో ఉండగా, అనుభవింపజేయు గ్రహ, భూత వ్యవస్థలన్నియూ ప్రకృతి ఆధీనములో ఉండును. ప్రకృతి అంతయూ దేవుని ఆధీనములో ఉండునని బ్రహ్మవిద్యాశాస్త్రము ద్వారా మనకు తెలియుచున్నది.

ఇప్పుడు మనిషి శరీర యంత్రాంగ వ్యవస్థ గురించి చెప్పుకొన్నట్ల యితే, ప్రతి జీవరాశి స్థూలశరీరము, సూక్ష్మశరీరము అను రెండు భాగములుగా ఉన్నది. స్థూలశరీరము అనగా కంటికి కనిపించునది. సూక్ష్మ శరీరము అనగా, కంటికి కనిపించనిదిగా ఉన్నది. కొంత వివరముగా చెప్పుకొంటే, జీవుని యొక్క శరీరము 25 భాగములతో స్థూల, సూక్ష్మ శరీరముగా ఉన్నది. అనగా జ్ఞానేంద్రియములు (అగ్ని తత్త్వములు) కన్నులు, చెవులు, చర్మము, నాలుక, ముక్కు అను ఐదు భాగములుగా జ్ఞానేంద్రియము లున్నవి. అలాగే కాళ్ళు, చేతులు, నోరు, గుదము, గుహ్యము అను ఐదు భాగములుగా కర్మేంద్రియములు (భూమి తత్త్వములు) ఉన్నవి. ఈ పది భాగముల సముదాయము స్థూలశరీరముగా ఉన్నది. అనగా కంటికి కనిపించునది. పోతే, సూక్ష్మశరీరమును వివరించుకొంటే, వ్యాన, సమాన, ఉదాన, ప్రాణ, అపానవాయువులు అను ఐదు పంచప్రాణములు (వాయు తత్త్వములు), రుచి, స్పర్శ, శబ్దము, రూపము, వాసన అను ఐదు భాగములు అంతఃకరణములు (నీటి తత్త్వములు), జీవుడు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహము అను తన్మాత్రలు (ఆకాశతత్త్వములు) మొత్తము 15 భాగముల సముదాయము మన శరీరములో సూక్ష్మశరీరముగా ఉన్నది.

ఇప్పుడు మనము సూక్ష్మశరీములోని అంతఃకరణ తన్మాత్రల సముదాయములో అతి ముఖ్యమైన 'మనస్సు', 'బుద్ధి' (ఆకాశతత్త్వములు) గురించి కొంత వివరణ ద్వారా తెలుసుకొందాము. మనస్సును 'మది' అనికూడ అంటాము. దీని పనిని చెప్పుకొంటే, ఒక విషయమును మననము చేయడము, లేదా జ్ఞాపకము చేయడము దీని పని. అంతేకాక చంచల మైనది మరియు వేగవంతమైనదిగా చెప్పుకోవచ్చు. మనస్సును ఆధ్యాత్మికము లో రెక్కల గుర్రముతో పోల్చారు. జీవుని దైనందిన జీవితములో ఎప్పుడో జరిగిపోయిన విషయాలను, జరుగవలసియున్న విషయాలను, జీవునికి అవసరము లేని విషయాలను, ఊహలను, భ్రమలను గుర్తు చేయడముతో పాటు వాటి తాలూకు సందర్భాలను, అసందర్భాలను, చూచిన చిత్రాలను, చూడని చిత్రాలను గుర్తు చేయడము, మనోదృష్టి తెరపైన సినిమాలాగ చూపడము, ఊహల్లో తేలియాడించి భ్రమకు గురిచేయడము అనగా ఉన్నది లేనట్లూ, లేనిది ఉన్నట్లూ అని అర్థము. ఎడతెరపి లేని విషయాలను తెచ్చి జీవుని ముందుంచడము దీనిపని. జీవుడు ఊహించి ఆలోచించే పగటికలల జ్ఞాపకాలు కూడా ఇందులో అంతర్భాగమే. ఒక రకంగా వార్తాహరుడు అనగా వార్తలను చేరవేయువాడుగా మనస్సును చెప్పుకోవాలి. పగటికలలు అనగా పగలు మాయకు చిహ్నము కనుక ఆధ్యాత్మిక రీత్యా పెద్దలు అలా అన్నారు. మనస్సుకు సంబంధించి ఇంకో గొప్ప విచిత్రము యదార్థము ఏమంటే, జీవుని శరీరములో నిద్రించేది మనము అనుకొనే జీవుడుకాదనీ, ఒకే ఒక మనస్సు మాత్రమేనని బ్రహ్మవిద్యా శాస్త్రము ద్వారా తెలియుచున్నది. నిద్రకు, జీవునకు సంబంధములేదనీ, మనస్సు నిద్రించినప్పుడే మనిషికి (జీవునికి) ఏ విషయములూ తెలియబడవు, కనుక జీవునికి ప్రశాంతత లభిస్తుందనీ అర్థమవుతోంది. మనస్సు నిద్రనుండి

మేల్కొనిన వెంటనే తిరిగి తన పనిని తాను చేస్తూ పోతూవుంటుంది. మనిషి యొక్క దైనందిన జీవితములో చాలా మందికి అనుభవమే. అనగా కొంతమందిని ఏదో ఒక విషయము గురించి అడిగితే మర్చిపోయాము, గుర్తులేదు, గుర్తుకురాలేదు అంటూ ఉంటారు. అనగా ఆ విషయములను మనస్సు గుర్తు చేయలేదన్నమాట.

మనస్సు నిద్రించుచున్న సమయములో జీవుడు అటు, ఇటూ దొర్లుతూ ఉంటాడు. ఈ పనులన్నీ శరీరము మొత్తము ఆక్రమించుకొన్న ఆత్మ చేస్తుంటుంది. ఆత్మకు నిదుర ఉండదు. అనునిత్యం ఎరుకకలిగి ఉంటుందని అర్థమవుతొంది. మనసు గురించి మనము తెలుసుకొనే ఇంకొక కీలకమైన వాస్తవమేమంటే, యోగులు బ్రహ్మయోగము ఆచరించే టప్పుడు మనస్సును తమ ఆధీనములోనికి తెచ్చుకుంటారు. అనగా ఏ ప్రాపంచిక సంబంధ విషయముల జోలికి పోకుండా, గుర్తు చేయకుండా కట్టడి చేస్తారు. బ్రహ్మయోగము అనగా మనస్సు మీద తిరగబడడము, మనస్సు మీద పోరాటము అని అర్థము. ఇది బ్రహ్మయోగులకు చాలా కీలకమైన ప్రక్రియ.

ఇప్పుడు 'బుద్ధి' గురించి తెలుసుకుందాము. ప్రతి మనిషి శరీరములో ఐదు అంతఃకరణములలోని తన్మాత్రల సముదాయములో ఒక భాగమైన బుద్ధిని గురించి దాని పని గురించి తెలుసుకొన్నట్లయితే, ఒకటి యోచించడము, రెండు ఆలోచించడము అని అర్థమవుతుంది. అనగా యోచించడము దైవమునకు సంబంధించినదికాగా, ఆలోచించడము ప్రాపంచికమునకు సంబంధించినది. ముందు చెప్పుకొన్న గుణభాగములలో (సాత్వికము, రాజసము, తామసము) ఏ గుణ భాగములో కర్మప్రకారము జీవుడుండునో దానికి సంబంధించిన యోచన, ఆలోచనలతో బుద్ధి ద్వారా

తెలుసుకోవడము మరియు బాహ్యేంద్రియములకు తెలియని జ్ఞానమును గ్రహించు సామర్థ్యము బుద్ధికి ఉన్నది. గుణాలకు అతీతమైన గుణాతీత ఆత్మ భాగములోని జ్ఞానము గురించి కూడా యోచించగలుగు శక్తి బుద్ధి కలిగియున్నది. ఇప్పుడు మనము బుద్ధి ద్వారా, బుద్ధి గురించి యోచించు కున్నట్లయితే మనకేమి అర్థమవుతుందంటే, ఏ విషయమునైనా (ప్రాపంచికము లేదా పారమార్థికము) బుద్ధితో యోచించి, శోధించి తెలుసుకోవచ్చునని అర్థమవుతుంది.

ఇప్పుడు సర్వజీవరాశులకు తండ్రియైనటువంటి దేవుని గురించి కొంత తెలుసుకొందాము. ప్రపంచములో అతి రహస్యమైనది ఒకే ఒకటి కలదు. అదియే దైవము. దేవుడు సృష్ట్యాదినుండి రహస్యముగా ఉన్నాడు. ఇంతవరకూ దేవున్ని చూచినవాడు ఎవడూ ఈ జగతిలో లేడు. అందువలన ఆయనను 'దేవులాడబడేవాడు దేవుడు' అన్నారు. అంత రహస్యమైన దేవుడు ఎప్పుడూ మన ఎదురుగానే ఉన్నాడు. ఎదురుగానే కాక వెనుకకూడా ఉన్నాడు. దేవుడు ప్రపంచమంతా అణువణువునా వ్యాపించి యున్నాడు. దేవుడు ఎంత రహస్యమైనవాడయినా, రహస్యమైన దేవుని గురించి అందరికీ తెలియునట్లు భగవద్గీతలో పూర్తిగా వ్రాయబడినా, మనిషి స్వంత భావములను కల్పించుకొని, గీతలో చెప్పిన దానిని వదిలి, వేరు విధానములో ఉండుట వలన ఎంతో రహస్యమైనవాడుగా దేవుడు ఉన్నాడు. అంతటా వ్యాపించి బట్టబయలుగా ఉన్నా, రహస్యమైన దేవున్ని తెలియక మనిషి వెతుకుచునే ఉన్నాడు. దేవుడు అంతటా వ్యాపించి దాపరికము లేని జ్ఞానము కలిగియుండి, ఎవరికీ తెలియని రహస్యముగా ఉండుట వలన ఆ విషయము అర్థమగుటకు పెద్దలు 'అతి రహస్యమ్ బట్ట బయలు" అను 'సమత'గా (సామెత) చెప్పారు. బట్టబయలు అనగా అంతటా

వ్యాపించిన వాడు తెర తీసినచో దృశ్యము కనిపించినట్లు కనిపించును. చూచువాడు జీవుడు, చూపించువాడు గురువు. దేవున్ని తెలిస్తే దేవుడు బట్టబయలు. తెలియకపోతే దేవుడు అతి రహస్యము. జన్మను, మరణమును తప్పించుకొనుటకు జ్ఞానము, యోగము తప్పనిసరిగా ఉన్నది. భవద్గీతలోని బోధను, బాధగా అనగా తప్పుగా అర్థము చేసుకొనుట వలన జనన మరణములు తప్పడము లేదు. ఇప్పుడు 'గురువు' అనగా ఎవరో తెలుసు కొందాము.

'గురువు' అనువాడు ప్రజల మధ్యలో ఉండడనీ, జన సంచారము లేని అడవిలోనూ, గుహలలోనూ ఉండుననీ, మనకు జ్ఞానము అవసరమైన ప్పుడు అడవిలోనో, లేదా గుహలలోనున్న గురువును వెతుకుచూ పోయి గురూపదేశము తీసుకోవాలనీ కొందరంటుంటారు. అంతేకాక గురువును శిష్యుడే వెదకుచూపోవాలి. కానీ గురువు శిష్యున్ని వెదకుచూ రాడని కూడా చెప్పుచుందురు. ఈ మాటలను వినిన కొందరు సామాన్య జనులు ఊరిలో జ్ఞానమును చెప్పువాడు గురువుకాదనీ, గురువు అడవిలో ఉంటాడనీ, గురూపదేశము అవసరమైనప్పుడు అడవికి పోయి గురువును వెదకవలెనని అనుకొనుచుందురు. సాధారణముగా విద్యను బోధించువాడు గురువని చాలామంది అనుకొంటుంటారు. మనము ఇక్కడ విద్యలను రెండు రకములుగా విభజించుకొనిన, ఒకటి ప్రాపంచిక విద్య, రెండవది పరమాత్మ విద్య అని తెలియుచున్నది. దానిప్రకారము పరమాత్మ విద్యలో గురువు ఎట్లుంటాడో, ఎవరు గురువో తెలుసుకొందాము.

బ్రహ్మవిద్య లేక దైవవిద్య అయిన పరమాత్మ జ్ఞానమును బోధించు చున్నామను వారు నేడు భూమిమీద చాలామంది కలరు. అయితే వీరందరూ గురువులౌతారా? అని ప్రశ్నించుకొని చూస్తే 'ఒక్క ప్రాంతములో ఒక్క

కాలములో, ఒక వ్యక్తిగానే గురువుంటాడు' అనే సూత్రము ప్రకారము మేము గురువులము అని ఎందరో పేరుగాంచినా, అందరిలో ఒక్కడు మాత్రము గురువుండవచ్చును. పై సూత్రము ప్రకారము ఏకకాలములో ఒకనికంటే మించి గురువులుండుటకు వీలులేదు. ఒక్క ప్రాంతములో అన్నాము కాబట్టి భూమండలములో దేశములన్నింటిని కలిపి చూచినా ఒక దేశములోనే ఒకే గురువుండును. దీనిప్రకారము విశ్వమంతటికీ గురువు ఒక్కడేనని తెలియుచున్నది. దైవజ్ఞానమును తెలుపువారు ఎందరుండినా వారిలో ఒకడు గురువు ఉండవచ్చును. 'దేవుని జ్ఞానము దేవునికి తప్ప ఇతర ఏ మనిషికీ తెలియదు' అను సూత్రము ప్రకారము దైవజ్ఞానము మనుషులకు తెలియాలంటే దేవుడే గురువుగా భూమిమీద ఉండి, తన జ్ఞానమును తానే చెప్పవలసియుండును. అతనే నిజమైన గురువు. దేవుడు భూమిమీదకు ఎప్పుడు వస్తాడంటే? తన ధర్మములు భూమిమీద తెలియకుండా పోయినప్పుడు, అధర్మములు ప్రజలలో ప్రాకిపోయినప్పుడు, అధర్మములను లేకుండా చేయుటకు, తన ధర్మములను తెలుపుటకు తనకు తానుగా వచ్చువాడు దేవుడు. ఆ దేవుడే నిజమైన గురువు. ధర్మములకు ముప్పు ఏర్పడి అధర్మములు భూమిమీద చెలరేగుటకు కొన్ని వేలు లేక కొన్ని లక్షల సంవత్సరముల కాలము పట్టును. జ్ఞానము చెప్పు ప్రతి వాడూ బోధకుడు కావచ్చునుగానీ గురువు ఎప్పటికీ కాలేడు. దేవుడు మనిషిగా వస్తే గురువు అవుతాడు. కానీ మనిషి ఎప్పటికీ గురువు కాలేడు.

అన్ని మతముల సోదరులు, పెద్దలు ముఖ్యముగా గమనించ వలసినదేమనగా! దేవుడు విశ్వమంతా అణువణువునా వ్యాపించియున్నాడు. అట్లు సర్వవ్యాపి, సర్వధారి అయిన దేవుడు, ఈ సువిశాలమైన దేవునినుండి ఒక్క అణువంత అంశ (భాగము) లేక విశాలమైన దేవుని శక్తినుండి ఒక

అణువంత శక్తి ఒక కనిపించెడి మనిషిగా పుట్టడమును దేవుని అవతారము అంటున్నాము. అటువంటి వానినే భగవంతుడు (భగమునుండి పుట్టినవాడు, లేక గర్భమునుండి పుట్టినవాడు) లేక గురువు అంటున్నాము. దేవునికి గల అనేక కోటాను కోట్ల అంశలలో ఒక్క అంశ పుడితే అదే గురువు. దీనినిబట్టి దేవుడు మనిషిగా రావచ్చును. దేవుడు మనిషిగా అనగా గురువుగా భూమిమీద కనిపిస్తే, ఆ సమయములోనే అసలైన ధర్మములతో కూడుకొన్న జ్ఞానము మానవులకు ఆయన ద్వారా తెలియును. కానీ ఆయన గురువుగా ఏమాత్రము తెలియబడడు. ఆయన మనుష్యులకు తెలిసినా తెలియకుండినా, ఆ సమయములో విశ్వమంతటికీ ఆయనొక్కడే గురువు. ఈ విధముగా దేవుడే గురువు లేక గురువే దేవుడని చెప్పవచ్చును. అందువలన ఏ మనిషీ గురువుగా మారలేడు అని చెప్పాము. భూమిమీద కనిపించని దేవుడు, కనిపించే గురువుగా రావచ్చును.

నేటికాలములో డబ్బు సంపాదనే ధ్యేయంగా ఉన్న మనిషి ఏమాత్రము వెనుతిరిగి చూడకుండా ముందుకు పోతూ, భూతములు విధించు అన్ని శిక్షలను అనుభవిస్తూ, తన శిక్షల వెనున ఏ శక్తులు పని చేయుచున్నవని కొద్దిగానైనా ఆలోచించడము లేదు. తద్వారా మానవజాతి అంతయూ మిగతా జీవరాసులకంటే ఎక్కువ అజ్ఞానమార్గములో కూరుకుపోయి ఉన్నదని అర్థమగుచున్నది. వేదములు ప్రకృతి జనితములగుట, పురాణములు, ఉపనిషత్తులు తదితరములన్నియు మనిషికి ఆధ్యాత్మికమును తెలియనీయక తికమక చేస్తూ దిశానిర్దేశం తెలియనీయక, అజ్ఞానపు సుడిగుండాలలో కొట్టుమిట్టాడులాగున చేస్తున్నాయని మనకు ఇట్టే అర్థమవుతోంది. వేదములను, ఉపనిషత్తులను సనాతన ధర్మములుగా చెప్పుకొంటున్నారు. అసలు సనాతన ధర్మమంటే ఏమిటి? అని

ప్రశ్నించుకొంటే, సనాతన ధర్మమనగా ఆదినుండి ఉన్న ధర్మమని అర్థము. అనగా కృతయుగమునుండి ఉన్న ధర్మమును సనాతన ధర్మమని పెద్దలు అన్నారు. అనగా దానికి ప్రామాణిక మూలగ్రంథమే **భగవద్గీత.** ఇందులో శ్రీకృష్ణులవారు అర్జునునికి హితబోధ చేస్తూ 'ఈ జ్ఞానమును సృష్ఠి ఆదిలోనే సూర్యునికి శబ్ధ సందేశము ద్వారా చెప్పియున్నాను' అన్నారు. దీనినిబట్టి మనకేమి అర్థమవుతుందంటే, ద్వాపరయోగము (యుగము)లో భగవద్గీతకు ముందు వ్యాసుడు వ్రాసిన నాలుగు వేదములు, 18 పురాణములను, మూల గ్రంథము ద్వారా జనించిన ఉపనిషత్తులను 'సనాతన ధర్మము' అనడానికి అర్హత లేనివిగా చెప్పు కోవచ్చును. ఇక ఉపనిషత్తులలో లోపాలు ఉన్నమాట కూడా వాస్తవమే. పురాణముల విషయమునకు వస్తే పూర్తి అవాస్తవములని అనవచ్చును. శాస్త్రబద్దత లేదు గనుక ధర్మశాస్త్రము ముందు నిలువలేవు. ఈ విషయమును గ్రహించిన పెద్దలు కాలక్షేపానికి చెప్పుకొనే కథలుగా, పుక్కిటిపురాణములుగా చెప్పుకొన్నారు. పుక్కిటి పురాణములు అనగా అబద్దపు పురాణములు అని అర్థము.

ద్వాపరయోగములో (ద్వాపరయుగములో) వ్యాసుడు నాలుగు వేదములను, 18 పురాణములను, ఉపనిషత్తులను వ్రాసిన తరువాతనే భవద్గీతను వ్రాయడము జరిగినది. అప్పటి కాలములో వేదములను వ్రాసిన కారణంగా వేదవ్యాసుడు అన్నారు. వ్యాసుడు చెప్పిందే వేదంలా ఉండేది. శ్రీకృష్ణులవారు అర్జునునకు చెప్పిన భగవద్గీతను, అర్జునుని ద్వారా తెలుసుకొన్న వేదవ్యాసునకు జ్ఞానోదయమై, భగవద్గీతకు ముందు వ్రాసినవన్నీ మాయతో కూడిన తప్పుడు తడకలేనని పశ్చాత్తాపము చెంది, భగవద్గీతను వ్రాసి తన తప్పును సరిచేసుకున్నాడని తెలుస్తోంది.

ఇప్పుడు సృష్ఠిలోని సకల చరాచర జీవరాసులకు నిజమైన తల్లి, తండ్రుల గురించి, కొంత తెలుసుకొందాము. ఈ జగతిలో అనగా (పుట్టుక,

చావులు గల దానిలో) పరమాత్మ భర్తకాగా, ప్రకృతి భార్యగా ఉన్నది. పతి, సతులుగా ఉన్న పరమాత్మ ప్రకృతి ఇద్దరూ కలిసి కాపురము చేయుట వలన ఇంత జగతి ఏర్పడినది. దేవునికి భార్యగా ఉన్న ప్రకృతియే సర్వ జీవరాసులకు తల్లిగా ఉన్నది. దేవుడు తన భార్యను రెండు ఆకారములుగా ఉండునట్లు చేశాడు. ప్రకృతియైన తన భార్యకు రెండవ వేషముగా ఉండునట్లు చేసి, రెండవరూపముగా ఉన్న ఆమెకు 'మాయ' అని పేరు పెట్టాడు. ప్రకృతిగా ఉన్న ఒక భార్యకు ఒక పనిని, మాయ పేరుతో ఉన్న రెండవ భార్యకు మరొక పనిని అప్పజెప్పాడు. తన భర్త చెప్పినట్లు ఇరువురు భార్యలు పనులు చేయుచున్నారు. గుణరూపములోనున్న రెండవ భార్య అయిన మాయ మనుషుల తలలయందు నివాసము చేయుచున్నది. దేవునికి మొదటి భార్య అయిన ప్రకృతి 'చరప్రకృతి, అచరప్రకృతి' అని రెండు భాగములుగా ఉన్నది. ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమి అను ఐదు భాగములుగా అచర అనగా కదలిక లేని మార్పుచెందని ప్రకృతి ఉండగా, సకల జీవరాసుల శరీరములుగా చరప్రకృతి అనగా మార్పు చెందునటు వంటిది మరియు జీవమున్న ప్రకృతిగా ఉన్నది. ఇకపోతే, రెండవ భార్యగా ప్రకృతి నుండి (మొదటి భార్యనుండి) విడివడి వచ్చిన మాయ కూడా కనిపించని ఆకారముకలదై రెండు భాగములుగా ఉన్నది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు అను ఆరు గుణములు జీవునకు శత్రువులుగా ఒక భాగముండగా, దాన, దయ, ఔదార్య, వైరాగ్య, వినయ, ప్రేమ అను ఆరు జీవునకు మిత్ర గుణముల గుంపుగా రెండవ భాగమున్నది.

దేవునికి సతియైన ప్రకృతి కనిపించు ప్రపంచముగా మరియు జగతిగా ఒక ఆకారమును, కనిపించని మిత్ర మరియు శత్రు గుణములను మాయ ఆకారము కలిగి విశ్వమంతా వ్యాపించియున్నది. దేవుడు

విశ్వమంతా ఉన్నాడు. ఆయన సతీమణి కూడా ఆయతనోపాటు విశ్వమంతా వ్యాపించియున్నది. కావున దేవున్ని మనము విశ్వవ్యాపి అని పిలువవచ్చును. అలాగే ప్రతి పదార్థములోనూ, ప్రతి వస్తువులోనూ నాశనము కాని అర్థముగా మిగిలియున్నాడు. కావున ఆయనను (దేవున్ని) అర్థమ్ అనికూడా చెప్ప వచ్చును. ఇప్పుడు పుట్టిన ప్రతి మనిషి తనను పుట్టించిన తండ్రి ఎవరో తెలియకుండా బ్రతికితే అతని బ్రతుకు వ్యర్థమని చెప్పవచ్చును. తనను పుట్టించిన తండ్రిని గురించి తెలియనివాడు, తన తండ్రి ఎట్లుంటాడోనని కనీసము విచారించని వాడు పుట్టి కూడా ప్రయోజనములేదని చెప్పవచ్చును. ప్రపంచములో పుట్టిన ప్రతి మనిషి దేవుని బీజముతోనే పుట్టుచున్నాడు. దీనినిబట్టి ప్రతి మనిషికీ దేవుడు స్వయముగా తండ్రియైయున్నాడు. తన తండ్రిని తెలియనివాడు, తన తండ్రి ఫలానావాడు అని చెప్పనివాడు, పుట్టినా వాని జీవితము వృథా అనియే చెప్పవచ్చును. దాని ప్రకారము దేవున్ని గురించి జీవితములో తెలియకపోతే వాని జీవితము వ్యర్తము. ఇదే విషయమును చెప్పుటకే అర్థములేని జీవితము వ్యర్థము అను సమత (సామెత)గా అన్నారు.

అర్థమ్ అనగా అన్నిటియందు నాశనము కాకుండా ఉన్న దేవుడని తెలియాలి. వ్యర్థమ్ అను పదములో అర్థము కలదు. జీవితము కలవాడు జీవుడు. జీవుడు నాశనము కలవాడు అని తెలుపుటకు వ్యర్థము అను పదమును చెప్పారు. దేవున్ని తెలియనంతవరకూ ఆ జీవుడు నాశనమగు వాడుగా ఉండును. దేవుని తెలిసిన జీవుడు నాశనమగువాడిగా ఉండక నాశనము లేనివాడైపోవును. అనగా వాడు అర్థమ్‌గా మారిపోవును. దేవున్ని తెలియనంతవరకూ జీవుడు వ్యర్థుడే కావున పెద్దలు ఎంతో యోచించి 'అర్థము లేని జీవితమ వ్యర్థమ్' అన్నారు.

ఇలా వ్యర్థముగా సాగుతున్న అర్థములేని జీవితములకు దేవుని జ్ఞానము ముఖ్యముగా అవసరము. ప్రస్తుతము జగతిలో ప్రధానముగా ఉన్న ఇందూ, క్రైస్తవము మరియు ఇస్లామ్ అనే మూడు మతాలలో అర్థము లేని జీవితములే సాగుతున్నాయనడములో అతిశయోక్తిలేదు. ముఖ్యముగా పూర్వము జ్ఞానమార్గములో ప్రపంచ దేశములకు కలికితురాయిలా నిలిచిన మన ఇందూ దేశమే నేడు శిథిలావస్థకు మారినదనుటకు కారణమేమనగా, రూప, నామ, క్రియా రహితుడైన దేవుని యొక్క రెండవ భార్యగా ఉన్న మాయ యేనని చెప్పుకోవచ్చు. ఎందుకనగా ఈ జగతికి తల్లియైన (రెండో అంశ) మాయ ఆధీనములో దాదాపు 33 కోట్లమంది దేవతలే ప్రధాన కారణముగా చెప్పుకోవచ్చు. ముఖ్యముగా జీవులకు, దేవునికి, దేవతలకూ తేడా తెలియకపోవడము, ఒకవేళ సూచాయగా తెలిసినా జీవులయొక్క కర్మచక్రములోని ఆశ అను గుణమునకు పురాణములు ఆజ్యం పోసేవిగా ఉండుట ప్రధాన కారణమైతే, ఇంకా ముఖ్యమైన కారణం జ్ఞానము చెప్పేవారు కరువై జ్ఞానము తెలియకపోవడము. జనులు అజ్ఞానమనే సమిధలతో మతము అనే అడ్డుగోడలను నిర్మించుకొని వాటిని దాటే ప్రయత్నము కూడా చేయకపోవడము మరో ముఖ్యకారణము.

సరే, ఇక్కడ దేవుడు ఒక్కడేనని ఏకేశ్వరోపాసన చేసే రెండు ప్రధానమైన మతాలలో కూడా మాయ అనగా సాతాను మరియు సైతాను ప్రభావము జనులకు తప్పలేదు. తాము దైవమార్గములో ఉన్నామని భ్రమిస్తూనే, దేవునికి ఇష్టులుగా లేరని చెప్పుకోవచ్చును. నేడు ఎన్నో దేశములలో ప్రధాన మతముగా ఉన్న క్రైస్తవమతములో ఎన్నో చీలికలు వచ్చి, ఒకరికొకరు విభేదించుకొని చీలిపోయి ఎవరికి వారు సంఘములుగా ఏర్పడి వారికి అనుకూలమైన ఆచరణలు వారు పెట్టుకొన్నారు. ఐతే,

ప్రపంచ క్రైస్తవము మొత్తము మాయ(సాతాను) ఆధీనములోనే నడుస్తుందన డానికి ప్రధాన కారణము ఏమంటే, క్రైస్తవమునకు శిలువ గుర్తునే ప్రధానంగా పెట్టుకోవడం. అనగా ఒక భగవంతుని (ఏసుప్రభువు) చావునకు కారణమైన చెక్కతో చేసిన శిలువను గుర్తుగా పెట్టుకోవడము ఎంత అవివేకం! ఎంత అజ్ఞానము!! శిలువను మ్రొక్కడము, శిలువను మెడలోవేసుకోవడము ఎంత పాపము!!!

క్రైస్తవము ఇంత అజ్ఞానపు పాపపు కోణములో ఉన్నదని గుర్తు చేసినటువంటి శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారిని ఎవరు నమ్మినా నమ్మకున్నా మేము మాత్రము 'ఆదరణకర్తగా' నమ్మి విశ్వాస పాత్రులుగా యున్నాము. మరియు దేవునికి విధేయులుగా ఉన్నామని చెప్పుకొనుటకు సిగ్గుపడక ఆత్మయందు ఆనందిస్తున్నాము. "దేవుని విషయము అనగా దేవుని జ్ఞానము దేవునికి తప్ప ఏ మనిషికీ తెలియలేదు" అను సూత్రము ప్రకారము 'బుద్ధి, శ్రద్ధయున్నవాడు మాత్రమే గ్రహించగలుగు తాడు' అను దైవగ్రంథముల వాక్యము ప్రకారము ఎవరైనా దేవున్ని కనుగొనవచ్చు. కులము, మతము అనే పదములు మనష్యులకే తప్ప దేవునికి వర్తించవు. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" అనగా శ్రద్ధ కలిగిన వానికే జ్ఞానము లభిస్తుంది. అని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పియున్నాడు. అనగా కర్మతో సంబంధము లేకుండా ప్రతి జీవరాశికి జ్ఞానము తెలుసుకోవడానికి స్వేచ్ఛ, మినహాయింపునిచ్చారు. ఇది ఎంత గొప్ప అవకాశమో బుద్ధితో యోచిస్తేనేగానీ, ఇందులోని సూక్ష్మతత్త్వం అర్థము కాదు. శిలువ అనగా పాము అని అర్థము. పామును ఎవరైనా మెడలలో వేసుకొని తిరుగుతారా? ఇప్పుడు మనకు శిలువ కావాలా? ఏసుప్రభువు కావాలా? ప్రపంచ దేశాలన్నిటికీ క్రైస్తవమత పెద్దమనుషులుగా చెలామణి

అవుతున్న పోప్‌లు, బిషప్‌లే మాయకు (సాతానుకు) తలవంచి శిలువను మెడలో వేసుకుని తిరగంగ, మామూలు, విశ్వాసులు బోధకులు మాత్రము ఏమి చేయగలరు? వాళ్ళ బాటలో వీళ్ళు కూడా నడువవలసిందే. ప్రస్తుతం జరుగుతున్నదదే.

మనిషి ప్రాపంచిక విషయములలో ఎంతటి విజ్ఞానియైనా కావచ్చును, దేనినైనా కనిపెట్టవచ్చును. ప్రాపంచికములో ఎవరు ఏ వస్తువును కనుగొన్నా, ఏ విషయమును పరిశోధించి కనుగొనినా, ఇవన్నియూ దేవునికి తెలియని విషయములుకావు. ఇవన్నీ దేవుని సృష్ఠి జరిగినప్పుడే తయారు చేసి ఉంచాడు. ఇంకా మనిషి కనుగొనవలసిన వస్తువులు, విషయములు సృష్ఠిలో లెక్కలేనన్ని ఉన్నవని తెలుస్తోంది. ఈ విషయము తెలియని శాస్త్రజ్ఞులు ఏ వస్తువును కనిపెట్టినా మేమే చేశామని సంకలు గుద్దుకొని, రొమ్ములు చరుచుకొంటుండగా, దానికి తోడు నాస్తికులు (దేవుడు లేడనేవారు), ఆస్తికులు, హేతువాదులు తదితరులంతా సైన్సుకు తాళం వేస్తూ, తొత్తులుగా ఉన్నారు. రూప, నామ, క్రియా రహితుడైన అనగా ఒక ఆకారము, ఒక పేరు, ఒక పని లేని దేవునికి అనగా సృష్ఠికర్త, పరమాత్మ, యెహోవా, అల్లా, పురుషోత్తముడు, ఈశ్వరుడు, శివుడు, సర్వవ్యాపి, సర్వధారి, సర్వాంతర్యామి అను ఇవన్నియు దేవుని యొక్క పేర్లుకావు. దేవుని యొక్క ఉనికిని, ఉన్నతిని తెలియజేయునవి. మరియు బిరుదుల లాంటి పదములు మాత్రమేనని తెలియవలెను. భూమిమీద వున్న ఆరు శాస్త్రములలో గణితశాస్త్రము, ఖగోళశాస్త్రము, రసాయనశాస్త్రము, భౌతిక శాస్త్రము, జ్యోతిష్యశాస్త్రము, బ్రహ్మ విద్యాశాస్త్రములు గలవు. ఐదు శాస్త్రములు ప్రపంచ సంబంధమైనవి ఉండగా, ఒకే ఒక బ్రహ్మ విద్యాశాస్త్రము మాత్రము దేవునికి సంబంధించినదైయున్నది. ప్రపంచ సంబంధ ఎన్ని

శాస్త్రములైనా (ఎన్ని సైన్సులయినా) సూపర్‌సైన్సు అయినటువంటి బ్రహ్మ విద్యాశాస్త్రము ముందు వెలవెల పోవలసిందే. సృష్టిలో అణువణువున వ్యాపించిన ఉన్న సర్వవ్యాపి అయినటువంటి దేవునికి తెలియకుండా ఏ పని జరుగడము లేదనునది నగ్న సత్యము. దేవుని తరువాత దేవునిగా తనయొక్క ప్రతిరూపముగా ఆత్మను తయారు చేసి ప్రతి జీవరాసులయందు ఉంచాడు పరమాత్మ. సృష్టిలో ఆత్మకు తెలియని విషయమంటూ ఏదీలేదు. సృష్టిలో ప్రతి జీవరాశికి వారివారి కర్మప్రకారము పనులు అప్పగించగా, ప్రతి జీవరాశిలో జీవునికి ఆత్మ అధిపతిగా ఉంటూ, సూక్ష్మశక్తి కలిగి చైతన్యవంతముగా వారివారి కర్మలను ఆత్మే అనుభవింపజేస్తుండగా, 'సూక్ష్మము తెలియనివాడికి మోక్షము లేదు' అను సమత (సామెత) ప్రకారము, మనిషి స్థూలము (కనపడునది) నకే అలవాటుపడి, సూక్ష్మము తెలియక అంతా 'నేనే' అంటున్నాడు.

25 భాగములతో తయారైన జీవుని శరీరములో ఆత్మ అధిపతిగా ఉండి, జీవుని కర్మప్రకారము అన్ని పనులు జీవుని శరీరముతో ఆత్మ చేయించగా, ఆ పనులన్నీ నీవే చేశావని జీవునకు చూపునదే అహము. దానిని జీవుని శరీరములో అంతఃకరణములలో భాగమైన 'అహము'గా గుర్తించవలెను. ఆధ్యాత్మికము చేత ప్రపంచ సంబంధ విజ్ఞానమును చూడవచ్చును. విజ్ఞానము చేత ఆధ్యాత్మికము చూడలేము. కారణమేమనగా విజ్ఞానమునకు స్థూల దృష్టి (కనిపించేది) కలదు. స్థూలదృష్టికి ఆత్మగానీ దాని అధ్యయనముగానీ గోచరపడదు. "ఆత్మకు సూక్ష్మదృష్టికలదు, సూక్షదృష్టితోనే దేనినైనా తెలియవచ్చును." ఈ సూత్రముతోనే ఆత్మ ఎంతటి రహస్యమునైనా తెలియజేయునని మరువ కూడదు. ప్రపంచ సంబంధ విషయముల రహస్యములు ప్రత్యేకత కల్గిన

కొందరినుండి బహిర్గతముకాగా, పరమాత్మ విషయము మాత్రము ఒకేఒక శరీర ఆత్మనుండే బయల్పడునని మరువకూడదు. పరమాత్మ వివరములు రహస్యములు తెల్పు ప్రత్యేకమైన ఒకేఒక ఆత్మగల వ్యక్తినే "భగవంతుడు" అనుచున్నాము. పరమాత్మ విషయములు ఒక్క భగవంతుని ఆత్మకు తప్ప ఎవరికీ తెలియవు. మూడవ పురుషుడైన అనగా జీవాత్మ, ఆత్మ, పరమాత్మ (తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ)లలో పరమాత్మ అనగా పరిశుద్ధాత్మ విషయములను ఒక్క భగవంతుని ఆత్మయే తెలుపవలసియున్నది. ఈ ప్రకారముగా ఇప్పుడు ఆదరణకర్తగా సాకారములో ఉన్నటువంటి శ్రీ భగవంతులవారు బైబిలు గురించి చెప్పిన ఇంకో గొప్ప రహస్యమేమనగా!

ఇప్పుడున్న పరిశుద్ధ గ్రంథమైన బైబిలుగ్రంథములోని 66 అధ్యాయములలో కేవలము నాలుగు అధ్యాయములే దేవుడు చెప్పిన వాక్యములుగా అవియే మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలుగా ఉన్నాయని, మిగతా 62 అధ్యాయములతో మనకు పనిలేదని, అవన్నియూ మాయ (సాతాను) కలుషితముతో మనుష్యులు వ్రాసిన అధర్మములతో కూడిన పుస్తకములని, క్రొత్త నిబంధన గ్రంథములోని మత్తయి సువార్త, మార్కుసువార్త, లూకాసువార్త, యోహానుసువార్త అను ఈ నాలుగు సువార్తలు అర్థమయితే చాలు "మీరు ముక్తిని అనగా పరలోకము పొందక పోతే నన్నడగండి" అని ఒక గొప్ప ఈ సువార్తను సకల జనులమధ్య ప్రకటించడము ఎంతో ఆనందదాయకముగా భావిస్తున్నాము. ఇంకో ముఖ్య విశేషం ఏమి చెప్పారనగా, ఈ నాలుగు అధ్యాయములకు మాత్రమే చివర 'సువార్త' అని ఉండుట గమనించమని సువార్త అనగా సుప్రసిద్ధమైన వార్త లేక విశేషమైన జ్ఞానము అని అర్థమని చాలా గొప్పగా ఉద్బోధించారు.

యోగీశ్వరులవారు వ్రాసిన త్రైత సిద్ధాంత గ్రంథముల ద్వారా విశేషమైన జ్ఞానమును ఇంకా ఏమి చెప్పుచున్నారనగా, నేడు మనము చూస్తున్న బైబిలు ఒక పెద్ద గ్రంథముగా ఉన్నది మరియు రెండు భాగములుగా ఉన్నది. అందులో 'పాతనిబంధన' అను ఒక భాగముండగా, 'క్రొత్త నిబంధన' అను రెండవ భాగము కలదు. పాతనిబంధన అను మొదటి భాగములో 39 పుస్తకములు కలవు. అలాగే క్రొత్త నిబంధన అను భాగములో 27 పుస్తకములు గలవు. దీనిప్రకారము మొత్తము బైబిలో 66 పుస్తకములు గలవు. క్రొత్త నిబంధన ఏసుప్రభువు పుట్టిన తరువాత ప్రారంభమైనది. ఏసుపుట్టకముందు ఉన్న పుస్తకములన్నీ పాతనిబంధనలోనివే. ఏసుప్రభువు పుట్టిన తరువాత క్రొత్తనిబంధనలో మొదటి నాలుగు పుస్తకములలో మాత్రమే ఏసుప్రభువు బోధ కనిపించుచున్నది. ఏసుప్రభువు చనిపోయిన తర్వాత వ్రాసిన పుస్తకములు 23 మాత్రమే. క్రొత్తనిబంధన అను బైబిలు రెండవ భాగములో మొదటి పుస్తకము మత్తయి, రెండవది మార్కు, మూడవది లూకా, నాల్గవది యోహాను అనునవి. ఈ నాలుగు పుస్తకములలో మాత్రమే ఏసుప్రభువు చెప్పిన బోధలు కలవు. పాతనిబంధనలోని 39 పుస్తకములలో ఏసుప్రభువుకంటే ముందు పుట్టినవారు చెప్పిన సమాచారము కలదు.

క్రొత్త నిబంధనలో మొదటి నాలుగు పుస్తకములలో ఏసుప్రభువు బోధకలదని చెప్పుకొన్నాము కదా! అందువలన ఆ నాలుగు పుస్తకములకు పేర్లతోపాటు ప్రత్యేకమైన బిరుదులు కలవు. నాలుగు పుస్తకములకు చివరిలో 'సువార్త' అను బిరుదుకలదు. క్రొత్తనిబంధనలో నాలుగు సువార్తలు ప్రత్యేకముగా ఉన్నవి. నాలుగు సువార్తలు అయిపోయిన తరువాత ప్రారంభ మయిన మొదటి పుస్తకము పేరు అపోస్తలుల కార్యములు, చివరి పుస్తకము పేరు ప్రకటనల గ్రంథము. 5వ పుస్తకమునుండి 27వ పుస్తకము వరకు

మధ్యలోగల 23 పుస్తకములు 'పత్రిక' అను పేరుతో గలవు. ఇక్కడ స్వామివారు చెప్పునదేమనగా! నేడు 'బైబిలు' అని చెప్పబడునది అనగా 62 పుస్తకములతో కూడుకొన్నది ఏసుప్రభువుకు సంబంధించిన బైబిలు కాదు. ఏసుప్రభువు చెప్పిన బైబిలు కేవలము నాలుగు సువార్తలు మాత్రమే. అందువలన ఏసుప్రభువు బోధను గుర్తించుటకు నాలుగు పుస్తకములే ప్రత్యేకముగా ఉన్నవని గుర్తించునట్లు వాటికి సువార్తలు అని పేరుపెట్టడము జరిగినది. ప్రజలు ఏసుప్రభువుకు సంబంధించిన నాలుగు సువార్తలనే నిజమైన దైవగ్రంథముగా గ్రహించుటకు స్వామివారు 'సువార్త బైబిలు' అని ప్రత్యేకమైన పేరుతో పిలుస్తున్నారు. మధ్యదైవ గ్రంథము 'సువార్త బైబిలు' మాత్రమేగానే బైబిలు అంతయూ కాదు అని అర్థము చేసుకోవలెను.

ఇంతవరకు అందరూ చెప్పు బైబిలును స్వామివారు చెప్పడము లేదు. స్వామివారు నాలుగు సువార్తలుగల బైబిలును గురించి మాత్రమే చెప్పుచున్నారు. స్వామివారు బైబిలులోని ఏ జ్ఞానమును మాట్లాడినా, నాలుగు సువార్తలలోని విషయములనే తీసికొని మాట్లాడడము జరుగుచున్నది గానీ మిగతా 62 పుస్తకములలోని ఏ ఒక్క విషయమునూ తీసుకొని చెప్పడము లేదు. అసలైన ఆధ్యాత్మికమంతయూ ఏసుప్రభువు చెప్పిన నాలుగు సువార్తలలోనే కలదు. స్వామివారు కొన్ని సంవత్సరముల ముందునుండి ఈ విషయమును చెప్పుచునేయున్నారు.

**ఇంకా యోగీశ్వరులవారు చెప్పునదేమనగా!**

ఇస్రాయెల్ దేశములో పుట్టిన బైబిలు గ్రంథములో ఒకే ఒక వాక్యమును చూస్తే భగవద్గీతకు, ఖురాన్‌కు మధ్యలో వచ్చిన గ్రంథము 'బైబిలు' అని తెలిసిపోవుచున్నది. ప్రతి విషయానికీ అది సత్యమనుటకు

హేతుబద్ధత, శాస్త్రబద్ధత అవసరము. ద్వాపరయుగము చివరినుండి కలియుగములోని 3600 సంవత్సరముల కాలములో తయారయిన గ్రంథములను పరిశీలించి చూస్తే, బైబిలులో ఉన్న ఎన్నో వాక్యములందు ఒక వాక్యము ఆధారముగా దొరికినది. అప్పుడు దానిని చెప్పిన వ్యక్తి ఏసుప్రభువుయని తెలిసినది. ఏసుప్రభువును చూస్తే ఏమీ తెలియదు గానీ, ఆయన చెప్పిన ఒకమాటయే ఎంతో ఆలోచింపజేసినది. ఆ వాక్యమును గురించి చెప్పుకొనుటకు ముందు, ఆ వాక్యమునకు ఉన్న విలువను తెలియుటకు కొంత వివరము తెలియవలసియున్నది. 'ఏసు' అను వ్యక్తి భూమిమీద పుట్టి ఏ గుర్తింపు లేని వ్యక్తిగా 30 సంవత్సరములు గడిపి తరువాత మూడు సంవత్సరములు మాత్రము జ్ఞానబోధను చెప్పి చనిపోయాడు. దీనినిబట్టి 'ఏసు' కేవలము 33 సంవత్సరములు బ్రతికాడని చెప్పవచ్చును. 33 సంవత్సరములు బ్రతికిన ఏసుప్రభువు చనిపోయిన తరువాత 33 గంటలకే తిరిగి లేవడము జరిగినది. అలా చనిపోయిన తరువాత బ్రతికి బయటకు వచ్చి 40 దినముల వరకూ తన శిష్యులకు కనిపించడము, వారితో మాట్లాడడము జరిగినది. ఆ విధముగా 40 దినములలో 33 మార్లు మాత్రమే ఆయన శిష్యులకు ఏసుప్రభువు కనిపించడము జరిగినది. తరువాత ఎప్పటికీ శిష్యులకు కూడా కనిపించ కుండాపోయాడు. ఏసుప్రభువు తన శిష్యులకు చిట్టచివరిగా కనిపించినది, చనిపోయి లేచిన తరువాత 33వ దర్శనములోనే అని చెప్పవచ్చును. 33వ మారు చివరిగా కనిపించిన ఏసు తన శిష్యులతో చివరిగా మూడు వాక్యములను చెప్పాడు. ఆ మాటలను బైబిలు గ్రంథమున మత్తయి సువార్త చివరి 28వ అధ్యాయములో 18,19,20 వాక్యములలో చూడవచ్చును. ఆ వాక్యములు ఇలా గలవు. **(18) "పరలోకమందునూ, భూమిమీదనూ**

**నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. (19) "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులను చేయుడి, తండ్రియొక్కయు, కుమారునియొక్కయూ, పరిశుద్ధాత్మయొక్కయూ నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుము. (20) "నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుము. ఇదిగో నేను యుగసమాప్తి వరకు, సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను"** ఏసుప్రభువు చెప్పిన ఈ మూడు వాక్యములు, ఆయన చిట్టచివరిగా పలికిన పలుకులు. అందువలన ఈ మూడు వాక్యములు ఎంతో ప్రాధాన్యతతో కూడుకొని యున్నాయి. మూడు వాక్యములు ఆధ్యాత్మికములో గొప్పవే అయినా, వాటియందు మధ్యలోయున్న 19వ వాక్యములో **"తండ్రియొక్కయూ, కుమారునియొక్కయూ, పరిశుద్ధాత్మయొక్కయూ నామములోనికి వారికి బాప్తిస్మము ఇచ్చుచూ, సమస్త జనులను శిష్యులుగా చేయుము"** అని కలదు.

ఈ వాక్యములోని అంతరార్థమును గమనించితే, ప్రథమ దైవగ్రంథమయిన భగవద్గీతయందు పురుషోత్తమప్రాప్తి యోగమున 16, 17 శ్లోకములలోని అర్థమునకు ఈ వాక్యము సరిపోవుచున్నది. అలాగే అంతిమ దైవగ్రంథమైన పవిత్ర ఖురాన్‌గ్రంథమునందు 50వ సూరా, 21వ ఆయత్‌లోని అర్థమునకు పై వాక్యము సరిపోవుచున్నది. దేవుడు చెప్పిన ఆదిలోని జ్ఞానమే, ఆకాశవాణి జ్ఞానమే మూడుచోట్ల, మూడు గ్రంథములుగా బయటికి వచ్చినది. అందువలన ముందే మనము మూడు గ్రంథములు అని వ్రాసుకొన్నాము. ఖురాన్ దైవగ్రంథమును అంతిమ దైవగ్రంథము అన్నారు. ఖురాన్ గ్రంథమును ఆధారము చేసుకొని చూస్తే, అన్నిటికంటే ముందు పుట్టిన ఆధ్యాత్మిక గ్రంథము భగవద్గీతయని తెలిసినది. అందువలన భగవద్గీతను ప్రథమ దైవగ్రంథముగా చెప్పుచున్నాము. మధ్య దైవగ్రంథము

బైబిలుగా తెలియుచున్నది. అంతిమ దైవగ్రంథమని ఖురాన్‌గ్రంథమునకు పేరుపెట్టగా, మిగతా రెండు గ్రంథములలో ఏది మొదటి గ్రంథమో, ఏది మధ్య గ్రంథమో సులభముగా తెలియబడినది.

ప్రథమ దైవగ్రంథమయిన భగవద్గీతలో పురుషోత్తమ ప్రాప్తియోగ మను అధ్యాయమున 16,17 శ్లోకములను వివరించుకొందాము.

*16వ శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకేక్షరశ్చాక్షర ఏవచ ।*
*క్షరస్సర్వాణి భూతాని కూటస్థోక్షర ఉచ్యతే ॥*

**భావము :-** (శరీర) లోకమున గల పురుషులలో రెండు రకముల పురుషులు గలరు. వారిలో ఒకడు క్షరుడుగాయున్నాడు మరియొకడు అక్షరునిగా యున్నాడు. సర్వజీవరాశులలోనూ క్షరుడు, అక్షరుడు ఇద్దరూ కూటస్థులుగా యున్నారు.

*17వ శ్లో॥ ఉత్తమ పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।*
*యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥*

**భావము :-** క్షరుడు, అక్షరుడను ఇద్దరు పురుషులకంటే ఉత్తమమైన పురుషుడు వేరొకడు గలడు. అతను పరమాత్మయని పిలువబడుచున్నాడు. మూడవ పురుషుడైన పరమాత్మ ముల్లోకములు (విశ్వమంతా) వ్యాపించి నాశనము లేనివాడై, ఈశ్వరుడైయున్నాడు.

**వివరము :-** ఇక్కడ మొత్తము ముగ్గురు పురుషులను చెప్పడమైనది. పురుషులనగా మగవారని అనుకోకూడదు. ఆత్మను పురుషుడనీ, ప్రకృతిని స్త్రీయనీ ఆధ్యాత్మిక విద్యలో చెప్పుచుందురు. అందువలన మూడు ఆత్మలను ముగ్గురు పురుషులుగా భగవద్గీతలో చెప్పడమైనది. ప్రతి మనిషిలో క్షరుడు

అనగా నాశనమయ్యేవాడు, అక్షరుడు అనగా నాశనముకానివాడు అనగా జీవాత్మ, ఆత్మ అని అర్థము. ఈ రెండు ఆత్మలను జోడు ఆత్మలని అంటాము. అనగా ఆత్మలేని జీవాత్మగానీ, జీవాత్మలేని ఆత్మగానీ ప్రపంచములో ఎక్కడా ఉండదు. అందువలన ఈ రెండు ఆత్మలను కూటస్థ ఆత్మలన్నారు. మరణములో ఆత్మవెంట జీవాత్మ శరీరమును వదలి పోవుచున్నది. పుట్టుకలో ఆత్మవెంట జీవాత్మ వస్తున్నది. ఇది భగవద్గీతలో అతి ముఖ్యమైన ఆత్మల విషయమని తెలియాలి. శరీరములో క్షర, అక్షర అను ఈ రెండు ఆత్మలే కాకుండా మరియొక ఆత్మకూడా కలదు. శరీరములో రెండు ఆత్మలకంటే వేరుగాయున్న మూడవ ఆత్మను పురుషోత్తముడు అంటున్నారు. క్షరుడు, అక్షరుడు అను ఇద్దరు పురుషులకంటే మూడవ పురుషుడు ఉత్తమమైనవాడు అయినందున పురుషోత్తముడని ప్రత్యేకముగా పిలుచుచున్నారు. మూడవ పురుషుడు, శరీరము లోపలా, బయటా, అంతటా వ్యాపించినవాడై 'దేవుడు'గా ఉండగా క్షరుడు, అక్షరుడు అను రెండు ఆత్మలూ సలక జీవరాశుల శరీరములలో ఉంటూ క్షరుడు కర్మను అనుభవించుచుండగా, అక్షరుడు కర్మను అనుభవింపజేయుచున్నాడు.

వాస్తవముగా జీవాత్మ ఏ సంతతికీ తండ్రికాదు. ఒక మనిషిలోని జీవుడు, తన భార్యకు పుట్టిన బిడ్డకు తానే తండ్రియని అనుకోవడము సహజమే అయితే, వాస్తవానికి అతనికి తన సంతతి అనుకొనువారు ఎవరూ తనకు బిడ్డలుకాదని తనకే తెలియదు. ప్రతి బిడ్డకూ తండ్రి, మనకు తెలిసినా, తెలియకున్నా శరీములోని ఆత్మయే. ఈ మాటను జీర్ణింపజేసుకొనుటకు కొంత కష్టముగా ఉండినా యోగీశ్వరులవారు చెప్పుమాట నూటికి నూరు పాళ్ళు నిజము. అందువలన రెండవ దైవగ్రంథమునందు మత్తయి సువార్త 23వ అధ్యాయము, 9వ వచనములో "భూమిమీద ఎవనికైనను తండ్రి

అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీ తండ్రి, ఆయన పరలోకమందున్నాడు అని చెప్పారు. ఆ వాక్యమును అర్థము చేసుకొంటే, అందులో విశేషమైన జ్ఞానమున్నది. ఆ లెక్కప్రకారము మరియు మూడు గ్రంథములలో చెప్పిన జ్ఞానము ప్రకారము ప్రతి మనిషికీ కనిపించువాడు తండ్రికాడు అని అర్థమగుచున్నది. ఇది మనకు మింగుడుపడని విషయమైనా, యదార్థముగా ధర్మబద్ధమైన విషయము.

ఇక అంతిమ దైవగ్రంథమయిన ఖురాన్‌లో ఈ మూడు ఆత్మల గురించి తెలియజేసిన విషయమును చూడండి. ఖురాన్ గ్రంథములో 50వ సూరాలో 21వ ఆయత్‌నందు **1) "ప్రతి వ్యక్తీ, తనను తీసుకువచ్చేవాడు ఒకడు, సాక్ష్యమిచ్చేవాడు ఒకడు గల స్థితిలో వస్తాడు"** ఇదే వాక్యమునే మరియొక ఖురాన్ గ్రంథములో ఈ విధముగా అనువదించియున్నారు చూడండి. **2) "ప్రతి ప్రాణి లేక ప్రతి జీవి, ఒక తోలేవాడితో, మరియొక సాక్ష్యమిచ్చేవాడితో సహా వస్తుంది."** అని క లదు. మరియొక ఖురాన్ గ్రంథములో ఇట్లు కలదు. **3) "ప్రతి వ్యక్తీ తన వెంట ఒక తోలేవాడూ, మరొక సాక్ష్యం చెప్పేవాడు ఉన్న స్థితిలో వస్తాడు."** ఈ విధముగా మూడు ఖురాన్ గ్రంథములలో ఈ వాక్యమును తెలుగు భాషలోనికి అనువదించి యున్నారు. మూడు వాక్యములను ఎటు చూసినా, మూడూ ఒకే అర్థము నిచ్చుచున్నవి. ప్రతి జీవినీ (జీవాత్మను) నడిపేవాడు ఆత్మయనీ, నడిపింపబడే వాడు లేక త్రోలబడేవాడు జీవాత్మయనీ తెలియవలెను. మూడవ వాడు సాక్ష్యముగా ఉండేవాడు దేవుడే అని అందరికీ తెలుసు. క్షరుడు, అక్షరుడు, పురషోత్తముడు అని ముగ్గురు పురుషులుగా (జీవాత్మ, ఆత్మ, పరమాత్మ) భగవద్గీతలో చెప్పినవారే ఖురాన్ గ్రంథములో త్రోలబడేవాడు క్షరుడు, త్రోలేవాడు అక్షరుడు, సాక్షిగా ఉండేవాడు పురుషోత్తముడు లేక పరమాత్మ

అని తెలిసిపోయినది. జీవాత్మ (జీవుడు) స్వయముగా ఏమీ చేయువాడు కాదు. ఆత్మ చేయిస్తే చేయువాడేననీ, ఎల్లప్పుడూ ఆత్మ ఆధీనములో జీవాత్మ యుండువాడేననీ, జీవుడు ఎప్పటికీ నడుపబడు వాడేననీ, ఆత్మ ఎప్పటికీ నడిపేవాడేననీ, పరమాత్మ (దేవుడు) ఎప్పటికీ సాక్షిగా చూస్తూ ఉండేవాడేననీ తెలియవలెను.

ప్రథమ, అంతిమ గ్రంథములలో ఒకే ఆత్మల విషయము వేరువేరు వాక్యములలో గుర్తింపబడునట్లు ఉన్నదని, శ్రద్ధ, బుద్ధిగలవారికి మాత్రమే ఆ రెండు వాక్యములు ఒకే జ్ఞానమును బోధించుచున్నవని తెలియునని స్వామివారు చెప్పుచున్నారు. అంతేకాక మధ్యగ్రంథమును కూడా ఆత్మల విషయమును తెలుపు వాక్యములను ఆధారము చేసుకొని ఆ గ్రంథము ఫలానా గ్రంథమని తెలియగలిగాము. మధ్య గ్రంథములోని వాక్యములను చూస్తే జ్ఞానమున్న వానికి ఇది మూడు ఆత్మల విషయమని సులభముగా అర్థమయిపోగలదు. జ్ఞానములేని వారికి అక్కడి వాక్యము ఏమాత్రము బోధపడక, ఇది ముగ్గురు పురుషులను గురించి చెప్పినదేనా? అని అనుమానము కల్గించగలదు. ఐదువేల సంవత్సరముల పూర్వము చెప్పిన భగవద్గీత గ్రంథములో క్షరుడు, అక్షరడు, పురుషోత్తముడనియూ, అనగా జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనియూ చెప్పబడిన వాక్యము, తోలబడేవాడు, తోలేవాడూ, చూచేవాడూ అని 1400 సంవత్సరముల క్రిందట చెప్పబడిన ఖురాన్ దైవగ్రంథములో వ్రాయడము జరిగినది. అదే మూడు ఆత్మల విషయమునే 2000 సంవత్సరముల క్రిందట చెప్పిన బైబిలు గ్రంథములో ఎవరూ సులభముగా గుర్తించనట్లు గుడ్డనుచుట్టి కనిపించకుండా చేసి చెప్పినట్లయినది. ఒకే జ్ఞానము మూడు గ్రంథములలో మూడు విధములుగా ఉన్నదను విషయము ఎవరికీ తెలియక పోవడము వలన మనుషులలో

మతముల మాయ పూర్తి నిండిపోయి, దేవుడుగానీ, దేవుని జ్ఞానముగానీ ఎవరికీ గుర్తింపబడకుండా ఉండి పోయింది. ఇప్పుడు మూడు ఆత్మల విషయము బైబిలులో ఏ విధముగా ఉన్నదో ఎట్లు తెలియబడకుండా ఉన్నదో ఇప్పుడు కొంత వివరముగా తెలుసుకొందాము.

మూడు ఆత్మల విషయమును చూచి బైబిలును మధ్య దైవ గ్రంథముగా తెలియగలిగాము. బైబిలులో మూడు ఆత్మల విషయము భగవద్గీతకంటే, ఖురాన్‌కంటే భిన్నముగా చెప్పబడియుండుట వలన దానిని చదివినవారెవరూ, ఇది భగవద్గీతలో చెప్పిన క్షర, అక్షర, పురుషోత్తమ అను మూడు ఆత్మల విషయమని గ్రహించలేరు. మత్తయి సువార్త 28వ అధ్యాయములో 19వ వచనములో **"తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయని చెప్పి, వీరి నామమున బాప్తిస్మమిచ్చి సర్వజనులను శిష్యులుగా చేయుము"** అని కలదు. బాప్తిస్మము అనగా ఉపదేశము అని అర్థము. ఉపదేశమిస్తే శిష్యులుగా మారిపోవుదురు. నామమున అనగా జ్ఞానముతో అని అర్థము. మూడు ఆత్మల జ్ఞానముతో ప్రజలకు ఉపదేశమిచ్చి శిష్యులుగా చేయమని అక్కడ చెప్పడమైనది. 'తండ్రి' అనగా 'ఆత్మ' అనియూ, 'కుమారుడు' అనగా 'జీవాత్మ' అనియూ, 'పరిశుద్ధాత్మ' అనగా 'పరమాత్మ' అని అర్థము. అయితే బైబిలు గ్రంథము చదివిన వారికి మత్తయి సువార్త 28వ అధ్యాయము 19వ వాక్యము మూడు ఆత్మల విషయమని తెలియదు. ఆ వాక్యమును మతముతో ముడిపెట్టుకొనియుండుట వలన కుమారుడు అంటే ఏసు అని, తండ్రి అంటే దేవుడని లెక్కించుకొని దేవుని కుమారుడు ఏసు అని అనుకోవడము జరుగుచున్నది. పరిశుద్ధాత్మ విషయానికి వస్తే, ఏసుప్రభువు పుట్టకముందు దేవున్ని పరిశుద్ధాత్మ అనెడివారని, ఏసుప్రభువు పుట్టిన తరువాత పరిశుద్ధాత్మను తండ్రి అని చెప్పడము జరుగుచున్నదని లెక్క సరిచేసి చెప్పుచున్నారు.

వారి లెక్కలో తండ్రి అనినా, పరిశుద్ధాత్మ అనినా, రెండూ ఒకటేయని అర్థము. ఆ విధముగా చెప్పడము వలన దేవుని చట్టమునకు పూర్తి వ్యతిరేఖముగా మాట్లాడినట్లగుచున్నది. మూడు ఆత్మలను దేవుడు చెప్పితే మనిషి వాటిని రెండు ఆత్మలుగా చెప్పుకోవడము అజ్ఞానమగును. దేవుడు తన జ్ఞానమును మూడు ఆత్మల రూపములో తెలియజేసినా, దానిని మనిషి సూక్ష్మముగా తీసుకోకుండా, స్థూలముగా అర్థము చేసుకోవడము వలన బయట కనిపించు ఏసుప్రభువును కుమారునిగా లెక్కించి, జ్ఞానమును తప్పుగా అర్థము చేసుకోవడము జరిగినది. అందువలన బైబిలు గ్రంథము లోని తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను వాక్యమునకు పూర్తి భావమును ఎవరూ గుర్తించలేకపోయారు. తండ్రి ఎవరో, కుమారుడెవరో క్రైస్తవులకు తెలియకుండా పోయినది. అలాగే తోలేవాడు, తోలబడేవాడు ఎవరో ముస్లీమ్‌లకు తెలియకుండా పోయినది. నాశనమయ్యేవాడు ఎవరో, నాశనము కానివాడెవరో ఇందు (హిందు)వులకు కూడా తెలియకుండా పోయినది. మొత్తానికి ఆత్మల విషయమే మూడు మతములవారికీ తెలియకుండా పోయినది. ఆత్మల వివరము తెలియకుండా పోయిన దానివలన, అందరికీ ఆధ్యాత్మికమే తెలియకుండా పోయినది. 'ఆధ్యాత్మికము' పేరుకు మాత్రమే ఉన్నది. కానీ అవగాహనకు ఏమాత్రము లేదని చెప్పవచ్చును.

దేవుని జ్ఞానము లేక దేవుని విషయమంతా సూక్ష్మము మీద ఆధారపడియుంటుంది. అందువలన జ్ఞానమంతటినీ సూక్ష్మముగానే యోచించవలసి ఉంటుంది. ప్రపంచములో పన్నెండు మతములుండినా అన్నిటికంటే ముఖ్యమైనవి మూడు మతములు మాత్రమే. ఇందూ, క్రైస్తవము, ఇస్లామ్ అను మూడు మతములలో దేవుని జ్ఞానము కొంతయినా ఉన్నది.

ఆ లెక్కకుపోతే మిగతా అన్ని మతములకంటే ఈ మూడు మతములలో జ్ఞానము ఎక్కువగానే ఉన్నదని చెప్పవచ్చును. గ్రంథములలో చెప్పినదంతా జ్ఞానము కాకపోయినా, నూటికి ఇరవై శాతము జ్ఞానమును గ్రహించగలిగితే, మనిషి జ్ఞానికాగలడు. ఒక్కొక్క గ్రంథములో 20 శాతము జ్ఞానమున్నదనుకో దానిలో సగము తెలిసినా మనిషి క్రమేపీ సంపూర్ణ జ్ఞాని కాగలడు. ఉదాహరణకు భగవద్గీతలో నూటికి 75 శాతము జ్ఞానమున్నది. అందులో 25 శాతము అర్థమయినా కాలము జరుగుకొలది పూర్తి 75 శాతము అర్థమగుటకు అవకాశము గలదు. అయితే మొదటనే ఆ 25 శాతము అజ్ఞాన భావముతో అర్థము చేసుకొంటే, మిగతా 50 శాతము కాలక్రమేపీ అజ్ఞానముగానే అర్థముకాగలదు. మొదట అజ్ఞాన దారి పట్టితే అదే దారిలో పోవడము జరుగుతుంది. అందువలన గ్రంథములోని విషయమును ఒక్కటి అర్థము చేసుకొన్నా దానిని జ్ఞానముతో అర్థము చేసుకోగలిగితే, తర్వాత తెలియునదంతయూ జ్ఞానమార్గములోనే అర్థమగును. అందువలన గ్రంథములనుండి మనము **"ఎంత చదివామనునది ముఖ్యముకాదు. గ్రంథములనుండి ఎంత జ్ఞానమును గ్రహించామన్నదే ముఖ్యము."**

ఇప్పుడు సర్వజీవరాశులకు నిజమైన తల్లి, తండ్రుల గురించి కొంత వివరముగా తెలుసుకుందాము. ప్రపంచములో పతి, సతులైనవారు ఇద్దరూ ఒక బిడ్డకు లేక అనేక బిడ్డలకు తల్లి, తండ్రులుగా ఉన్నారు. 'పతి' నాన్నగా, 'సతి' తల్లిగా ఉన్నదని ఏ పుత్రుడైనా, ఏ పుత్రికైనా ఒప్పుకోక తప్పదు. కొడుకులు లేక కూతుళ్ళకు ఒక "పతి, సతి" నాన్న, అమ్మలుగా ఉన్నట్లు, ఈ ప్రపంచములోని మనుషులందరికీ కలిపి ఒక తల్లి, ఒక తండ్రి కలరు. వారినే 'ఆదిదంపతులు' అని కూడా అంటాము. ఇంకా వారినే 'పరమాత్మ, ప్రకృతి' అని కూడా చెప్పవచ్చును. అందరికీ తండ్రి పరమాత్మ కావున ఆయనను సృష్టికర్త అనికూడా అంటారు.

భూమిమీద కొందరు దేవున్ని తెలియాలని ప్రయత్నము చేయుచుందురు. అటువంటివారు తప్పుదారి పట్టిపోవునట్లు మాయ చేయుచున్నది. 'మాయ' అంటే ఏమిటని వివరించుకొని చూస్తే, అందరికీ అమ్మ అయిన ప్రకృతియే మాయ అను పేరు కలిగి ఉన్నదని తెలియవలెను. కనిపించే ప్రకృతియే కనిపించని 'మాయ'గా శరరీములోపల గుణముల రూపములో ఉన్నది. మనుషులు ఎవరైనా దేవున్ని తెలియాలనిగానీ, దేవుని వద్దకు రావాలనిగానీ ప్రయత్నము చేస్తే, వాడు ఎటువంటివాడో తెలిసిన దేవుడు, వాడు ఆయనకు ఇష్టుడు కాకపోతే, వానిని తనవద్దకు రాకుండా చేయుటకు తన 'మాయ'కు చెప్పును. అప్పుడు మాయ తానే దేవునిగా కనిపించి తనవైపు లాగుకొనును. ఆ విధముగా మాయనే దేవునిగా గ్రహించిన మనిషి అసలు దేవున్ని మరచిపోయి, తనకు తెలిసినదే దేవుడనుకొనును. దేవునికి నచ్చనిచో ఎటువంటి వాడినైనా ఆయన 'సతి' అయిన మాయ (సాతాను) ద్వారా ఆమె వలనుండి బయటపడకుండా చేసి, దేవుని వైపు పోకుండా చేయును.

ప్రపంచములో ఏ స్త్రీకి సంతానము కల్గినా, ఏ స్త్రీ గర్భమునుండి ఎవరు పుట్టినా ఆ స్త్రీకి బీజదాతను నేనే, పుట్టినవానికి తండ్రిని నేనే అని భగవద్గీతలో గుణత్రయ విభాగయోగమున 3,4 శ్లోకములయందు శ్రీకృష్ణ భగవానుడు స్వయముగా తెలియజేశాడు.

*శ్లో॥ మమయోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దదామ్యహమ్ ।*
*సంభవ స్సర్వ భూతానాం తతో భవతి భారత ॥*

*శ్లో॥ సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతియాః ।*
*తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజ ప్రదః పితా ॥*

ఈ రెండు శ్లోకముల సారాంశమును చూస్తే "పుట్టేటువంటి జీవరాశులన్నింటికీ నేనే బీజదాతను, కావున ఏ స్త్రీయోనిలో ఎవరు పుట్టినా లేక ఏ తల్లిగర్భము నుండి పుట్టినా ఏ జీవరాశికైనా తండ్రిని నేనే" అని ఆ దేవుడు చెప్పినట్లు తెలియుచున్నది. దీనినిబట్టి స్త్రీ యొక్క కనిపించే భర్తకు ఎవరూ పుట్టడము లేదని తెలియుచున్నది. అలాంటప్పుడు తన బిడ్డకు నిజమైన తండ్రి ఎవరో తెలియక, తండ్రి కానివానిని తండ్రి అని చెప్పుట వలన ఆ స్త్రీ వ్యభిచారిణిగా లెక్కించబడును. అట్లు కాకుండా పై శ్లోకముల యొక్క జ్ఞానము తెలిసి, ఏ స్త్రీ అయినా తనకు కనిపించని భర్త ఉన్నాడనీ, ఆయన వలననే తనకు సంతానము కల్గినదనీ, తనబిడ్డకు దేవుడే తండ్రి అని తెలిసినప్పుడు ఆమెది వ్యభిచారము కాదు. అలా కాకుండా, దైవజ్ఞానము తెలియని ఏ స్త్రీ అయినా, తన శాశ్వత భర్త, నిజమైన భర్త ఎవరో తెలియని స్త్రీ ఎవరైనా, తనబిడ్డకు తండ్రి ఎవరో తెలియని ఏ స్త్రీ అయినా, తన గర్భమునకు బీజము ఎవరిదో తెలియని స్త్రీ ఎవరయినా, తన భర్త జగద్భర్తయని తెలియక జీవితము మధ్యలో వచ్చి, మధ్యలో పోవు వ్యక్తిని భర్తగా అనుకొను ఏ స్త్రీ అయినా వ్యభిచారిణే అగును.

భారతదేశములో రాజస్థాన్‌లో పుట్టిన మీరాబాయి తనకు భౌతికముగా పెళ్ళయినా, తన నిజమైన మరియు శాశ్వతముగానున్న భర్త, జగద్భర్త శ్రీకృష్ణుడే అని చెప్పింది. కనిపించు భర్తతో కాపురము చేయుచున్నా, మానసికముగా అతనిని భర్తగా ఎప్పుడూ ఒప్పుకోలేదు. మీరాబాయి గురించి ఇక్కడ కొంత క్లుప్తంగా వివరించుకొందాము.

శ్రీకృష్ణుని భక్తురాలైన మీరాబాయి నిత్యము అతని భక్తికీర్తనలు పాడుకొనుటకు కూడా స్వతంత్రములేనిదై పడుకొనే సమయములో కృష్ణ గానము చేసెడిది. అయినప్పటికీ భర్తకు, మరిదికి, ఇంటిలోని అత్తకు

ఆడబిడ్డకు సరిపోయెడిది కాదు. ఆ రోజులలో మీరా కృష్ణ దేవాలయమునకు పోవుచుండెడిది. రాజపుత్రిక కనుక ఆమెకు 'సితార' చక్కగా వాయించుటకు వచ్చును. ఆమె కృష్ణ భక్తులలో చేరి అప్పుడప్పుడు భజనలొనర్చెడిది. ఇంకేమున్నది ఆడబిడ్డయిన ఉదాదేవి మీరాబాయిపై ఎన్నో ప్రచారములు లేవదీసినది. భక్తులను పేరిట వంచకులైన వారితో ఆమె సంబంధములు పెట్టుకొనుచున్నదని మీరా భర్తయైన భోజునకు నూరిపోసినది. అతడు కొంత సాత్త్వికుడు కనుక భార్యయందు ప్రేమాదరములు కలవాడు. మొదట పెద్దగా పట్టించుకోకుండా కొంత ఉపేక్షనే వహించినా, దినదినమూ తల్లియు, సోదరియూ చెవిన ఇల్లు కట్టుకొని పోరుచుండిరి. ఆనక లేనిపోని కృతక సాక్ష్యములు కల్పించుట వలన భర్త కూడా మీరా ప్రవర్తనను అనుమానించు స్థితికి వచ్చాడు. ఒక దినము ఉదాదేవియు, మీరా భర్తయు కృష్ణాలయము నకు వచ్చినారు. ఆలయ ద్వారములు బంధింపబడి ఉన్నవి. లోపల మీరా ఒక్కతియే ప్రతిమ ఎదుట కూర్చుండి భజన యొనర్చుచుండెను. ఆమె ఆవేశముతో నడుమ నడుమ 'గిరిధరుని'తో మాటలాడుచుండినది. ఆమె అతనిని వింత వింత ప్రశ్నలడుగుచుండెను. ఏదో పురుషకంఠము ఆ ప్రశ్నలకు జవాబులొసగుచుండెను. ఉదాదేవి, భోజుడు ఆలయ వాకిండ్లకు చెవులాన్చుకొని వినుచున్నారు. భోజునికి అనుమానము దృఢపడెను. అతడు వాకిండ్లను త్రోసుకొని లోపలికొచ్చెను. "ఇంతవరకూ వినబడిన పురుష కంఠమేది?" అని అతడు ఆలయమంతయూ గాలించెను. ఒక మగ పురుగు కూడా అతనికి కనిపించలేదు. అతడు నిస్తబ్ధుడై భార్య ఎదుట నిలిచెను. ఆమె భోజుని అభిప్రాయము గ్రహించినది. ప్రక్కనే ఉదాదేవి ఉన్నది. మీరా కృష్ణప్రతిమను చూపి 'నాతో ఇంతవరకూ మాటలాడచున్న మగవాడీతడే. వానిని చేతనైన చంపమని' ఏడ్చుచూ పలికెను. ఆ ఏడ్పులోనే

ఆమె మూర్ఛపోయినది. భోజుని మనసు నీరైనది. ఉదాదేవి పశ్చాత్తాప పడినది. కానీ ఆ సద్భావము క్షణికము. ఆమె వదినను ముద్దాడబోయినది. ఆమెకు తాత్కాలికముగా వదినపై ప్రీత్యాదరములు ఏర్పడెను. వాటిని తెలుపు చేష్ఠా విశేషమే చుంబనము (ముద్దు). కానీ భోజుడామెను వద్దనెను. పవిత్ర ప్రవర్తనవతియైన తన భార్యను శంఖించు నందులకై ఒకింత అసంతృప్తి కలిగినది. కానీ అదియూ క్షణికమే. అనేకాలోచనలు అతని మనస్సున పొరాడజొచ్చెను. ఆ ఆలోచనలతోనే అతడు ఇంటికి పోయెను.

మీరా భజన ముగించి ఆమె గదిలో ప్రవేశించినది. భర్త మరలా ఆవేశితుడయ్యెను. అతడు ఖడ్గమును పట్టుకొని ఆమె గదిలోనికి ప్రవేశించి నాడు. మీరా అలసిపోయి నిద్రించుచుండెను. ఆ ముఖమును చూచినంతనే అతనికేదో మనస్సు మారినది. అతను నిర్మలముగా తిరిగి వెనక్కు వచ్చెను. ఆనాటినుండి తన భార్యకు పిచ్చి ఎక్కినదని అతని నమ్మకము. ఆమె మనస్సునకు కష్టములు కల్గించు కొన్ని విశేషములు జరిగియుండెను. ఆమె తండ్రి గతించినాడు. ఆ రాజ్యమున విప్లవము రేగినది. కడకు రాజ్యమే మిగలకపోయెను. మీరాబాయి మనస్సున ఇవి అల్ప పదార్థములు. భర్త ఆమె మానసిక స్థితిలో లేదు కనుక ఈ సన్నివేశములతో ఆమెకు మానసికా రోగము చెడిపోయెనని తలంచెను. మీరాకు పిచ్చి పట్టిందను భర్త పుకారును లోకము నమ్మలేదు. వారి చూపు దోషరహిత చూపు. కడకాతడు ఆమెకు అంతఃపుర సమీపమందే ఒక కృష్ణాలయమును కట్టించి ఇచ్చెను. ఆమె ఆ గుడిలో భజన కీర్తనాదులు చేసెడిది. ఆమె పదరచనలు తానే సాగింప మొదలుపెట్టెను. ఆవేశముతో అవి హృదయమునుండి వచ్చెడివి. ఆ పద మాధుర్యము కృష్ణ పరమాత్మనే వలపింప చేయుచుండెను. సంగీతమున గొప్ప ప్రవేశముకలది అగుటచే వింతవింత రాగములతో ఆమె పదములను

సృష్టించెను. రానురాను ఆమె కీర్తి దేశములోనే ఎక్కువయ్యెను. ఆ కీర్తి 'తాన్‌సేన్' చెవిలో కూడా పడినది. అప్పుడాతడు సంగీత సామ్రాజ్యమునకు చక్రవర్తిలా ఉన్నాడు. అక్బరు సార్వభౌముడు కూడా స్వయముగా ఆమె సంగీతమును వినవలెనని కుతూహలమొందెను. కానీ ఆమెను దర్శించుట ఎట్లు? చిత్తోర్ రాజులు వారికి ఆగర్భ శత్రువులు. అయినా, అక్బరు మహా సాహసోపేతులు కనుక వారొక ఉపాయము ఆలోచించిరి. ఆమె భజన చేయునపుడెందరో సాధువులు మీరాతో చేరి పాడుచుందురు. వారు బిక్షువులు, దేహాభిమాన వర్జితులు కాబట్టి అట్టివారితో ఆమె మాట్లాడెడిది.

అక్బరు చక్రవర్తి ఆమె దర్శనమునకై బిక్షువు వేషము ధరించెను. 'తాన్‌సేన్' కూడా ఒక బిక్షగాడైనాడు. ఆ రసపాంథులిర్వురును గాన బిక్షకై ఆమె చెంతకు చేరిరి. మీరా సౌందర్యము జగన్మోహకము. ఆమె కృష్ణపరమాత్మ ఎదుట లీలార్థము అవనికి దిగివచ్చిన రాధాదేవివలే పాడు చుండెను. ఆ కంఠమున కృష్ణవేణుగాన మాధుర్యములున్నవి. ఆ భజన సాగుచున్నంత సేపునూ తాన్‌సేన్ మరియు అక్బరులు రస సముద్రములో నున్నారు. భజన ముగిసిన తరువాత అక్బరు చక్రవర్తి ఆమె పాదములు స్పృశించి నమస్కారము చేసినాడు. అక్బరు మహా మనస్వి, భారతదేశ చరిత్రలో విచిత్రమైన చక్రవర్తి. అతడు ఆమెకొక రతనాల హారము నొసంగెను. దానిని ఆమె గ్రహింపలేదు. నాకక్కరలేదని తిరస్కరించినది. అయితే కృష్ణపరమాత్మకు సమర్పింపుమని అతడు వినయ పూర్వకముగా కోరెను. అంతట ఆమె ఆ హారమును రాధాకృష్ణుల పాదముల చెంత అలంకరించినది. కాషాయాంబరధారియైన బిక్షకునికడనేమి? రతనాల హారమేమి? అను సంశయము ఆ ఊరి జనులలో నల్లుకొన్నది. ఎట్టకేలకు ఆ వచ్చినవాడు అక్బరుచక్రవర్తి అను విషయము బయటికి దావానలములా

వ్యాపించినది. ఇది భోజునకు మింగుడు పడని మరణవేదనైనది. ఆనాడు హిందూ ముస్లీముల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే రోజులు. అక్బరు చక్రవర్తి పాదములు స్పృశించుటతో ఆమె శరీరమంతయూ కళంకితమై పోయినదని ఆమె భర్త తలంచెను. ఆమెను అతడు వధింప మనస్సు నొల్లక మీరాను బయటకు తరిమివేసినాడు. ఇంకేమున్నది ఆమె వీధుల పాలైనది. ఇతరులకైనచో అది మహాకష్టము. ఆమె పాలిట కది పరమ సంతోషమైనది. ఎందుకనగా ఆమెకు భక్తిమార్గములో అంతో ఇంతో ఉన్న కొంత బంధము కూడా తెగిపోయినది. దాంతో మీరా వీధులలో స్వేచ్ఛగా, బాహాటముగా కృష్ణ సంకీర్తనలు పాడుచూ, రసముగ్ధ హృదయమున ఆడుట కారంభించెను. ఈ పరిస్థితులలో ఆమె గీతములచే ఆకర్షితులై వందలకొలది భక్తులు ఆమెను వెంబడించుచుండిరి. తదనంతరము వారితో అతి ప్రయాసము మీద ప్రయాణములతో మీరాబాయి తుదకు బృందావనము చేరినది. ఆ బృందావనములోని ప్రతి అంగుళ స్థలము కూడా కృష్ణపాద తాకిడిచే పవిత్రతనొందియున్నది కావున, విరహ వేదనలో కృష్ణ విరహితయైన రాధవలే ఆ స్థలమంతయూ భక్తి పారవశ్యము పొంగుచుండగా, పిచ్చిదానివలె తిరుగాడుచున్నది. భజనయే ఆమె సాధనము, కన్నీరే ఆమె పూజ, ఆత్మార్పణమే ఆమె నైవేధ్యము. ఆ మహా భక్తురాలికి దేవతలే నమస్కరించు చుండిరి.

అప్పుడు బృందావనిలో ఒక రసవత్తర సంఘటన జరిగినది. అప్పుడక్కడ రూపగోస్వామి అను భక్తుడొకడుండెను. అతడు వల్లభ సాంప్రదాయమునకు చెందిన సంస్థానమునకు పీఠాధిపతి. ఈ వల్లభా చార్యుడు మన కృష్ణదేవరాయల సమకాలికుడు, ఆంధ్రుడు, మహాపండితుడు ప్రేమ ప్రధానమైన గోపికాభక్తిని అతడు యావద్భారతావనికి ఎక్కువ

ప్రచారము చేసినవాడు. ఉత్తర భారతదేశమున ఆయనకెందరో కవులు శిష్యులైరి. హిందీ సాహిత్యరంగమున కృష్ణభక్తిని ప్రాధాన్యము వచ్చుటకు అతడే మూలకారణమని చెప్పవచ్చును. రూపగోస్వామి అను అతనికి స్త్రీలన్నచో భయము కలిగెడిది. ఎందువలననగా, వారిని చూచినచో వారి సౌందర్యముచే ఆకర్షితమై, నా కృష్ణమై చలించి తన మనస్సు పతితమగు నేమోయని అతడు వారి దర్శనమునే నిషేధించినాడు. మీరాబాయి అతనిని చూడతలంచి, అతనికడకేగినది. ఆయన శిష్యులు ఆమెను అడ్డగించి, మా గురువు స్త్రీల ముఖము చూడరని వారు బదులు పలికిరి. మీరాబాయి పకపకా నవ్వినది. **"ఇంతవరకూ కృష్ణపరమాత్మయొక్కడే పురుషుడనుకొను చుంటినే, నేటికి మీ గురువొక పురుషుడు తయారైనాడన్నమాట. ప్రకృతికి లోబడినవారు పురుషులైననూ, స్త్రీలయిననూ నా దృష్ఠికి స్త్రీలే"** అని వారితో అని మరలా నవ్వెను. ఈ విషయము రూపగోస్వామికి తెలిసినది. అతడు తన అజ్ఞానమునకు ఎంతయో బాధపడినాడు. ఆమెకు దర్శనమొసగి క్షమాపణ చెప్పుకొనెను.

బృందావనమున మహా భక్తులెందరో ఆమెకు శిష్యులైరి. మీరాబాయి కీర్తి దేశదేశములకు ప్రాకినది. ఆమె ఎడల తను కావించిన అపకృతికి భర్త ప్రశ్చాత్తాపపడెను. అతడు బిక్షువు వేషమున బృందావనమును చేరినాడు. ఒకనాడు అతడు మీరాబాయిని బిక్షమడిగినాడు. ఆమె బిక్షము వేయ బోయినది. అతడు చిత్రమైన బిక్షకావలెనన్నాడు. అదేమిటని ఆమె అడిగెను. అప్పుడామెను మరలా చిత్తోర్‌కు రావలసినదిగా ఆమెను కోరెను. అప్పుడామె బిక్షకుడై వచ్చినవాడు తన భర్తయని గ్రహించి ఆమె మారు మాట్లాడక సమ్మతించినది. ఆ జగజ్యోతి చిట్లూరుకు వచ్చెను. ఆమె వచ్చిన కొన్ని దినములకే భర్త మరణించినాడు. అప్పుడు మీరాబాయికి

ఇంకనూ ఇరువదియైదేండ్లు దాటలేదు. మీరాబాయి భర్త మరణించిన పిదప అతని తమ్ముడు రత్నసింగు రాజయ్యెను. అతనికి వదినె వాలకము నచ్చలేదు. ఈమెను నాశనమొనర్చువరకూ వంశపుమచ్చ పోదని అతని విశ్వాసము. అతడు ఆమెను చంపుటకు ఎన్నో రీతులలో ప్రయత్నించెను. తన అన్న మరణించినప్పుడు ఆమెను సతీ సహగమనము చేయమని వాడు నిర్బంధించి ఒత్తిడి తెచ్చెను. దానికామె అంగీకరింపలేదు. తన తనువు, మనస్సు కృష్ణార్పితములనీ, వాటిపై తనకు హక్కులేదనీ ఆమె నిర్భయముగా తెలిపినది. దీనితో వాడువేసిన ఎత్తు సాగిరాలేదు.

వాడు ఆమెకొకనాడు ఒక బుట్టను పంపినాడు. అందులో కృష్ణ సేవకై పూమాలలున్నవని బొంకి, నమ్మబలికెను. అంతట మీరా మొదటనే అనుమానపడినది. ఆమెకేమి భయమున్నది? కృష్ణనామ స్మరణముతో ఆ బుట్టను తెరిచెను. అందులోనున్న నల్లత్రాచు నిజముగా మాలగానే మారి పోయినది. మీరాబాయి ఆ మాలను కృష్ణపాదములకు సమర్పించెను. మరిది అంతటితో తన ప్రయత్నములు మానలేదు. మరియొకనాడాతడు వాసుదేవ సాలగ్రామమని మరియొక సర్పమును పంపినాడు. నిరంతర కృష్ణ పాదార్పిత నిష్టగరిష్ట చిత్తయగు ఆమె ఆ బుట్టను తెరచినది. అందులో నిజమునకు సాలగ్రామమే ఉన్నది. ఇక మరిది రహస్యము పనికిరాదను కొనెను. ఒకనాడు పచ్చి విషము ఒక పాత్రలో నింపుకొని స్వయముగా వచ్చెను. ఆ విషమును త్రాగి మరణింపవలసినదని నిర్బంధించినాడు. మీరాబాయి వానిని ధిక్కరింపవచ్చును. అయిననూ గిరిధరుడు తన పాలిట నున్నాడని ఆమెకు తెలియును. ఆమె విషపాత్రను తీసికొని గుటగుట త్రాగివేసినది. ఆ విషము ఆమెకు అమృతమైనది. మరియొకనాడు రత్నసింగు కంటక శయ్యను పంపి దానిపై శయనింపవలసినదని హుకుం జారీ

చేయగా, ఆ మేరకు ఆమె అట్లే శయనించినది. ఆ కంటకముల పాన్పు క్షణములో పూలపాన్పుగా మారిపోయినది. ఇటువంటి విచిత్రములు ప్రతి భక్తుని జీవితములో కూడా ఉండును. వారీ సిద్ధశక్తులను కోరరు. అవి భక్తికి బాధకములని వారి తలంపు. కానీ పరమాత్ముడు వారి యోగక్షేమమును కంటికి రెప్పవలే రక్షించును.

మరిది పెట్టు బాధలు ఆమెకు నానాటికి దుస్సాహసములైనవి. కానీ ఆమెకొక సమస్య బాధించుచున్నది. స్త్రీకి చిన్ననాడు పుట్టినింట ఉండవలెను. వివాహమైన తరువాత భర్త ఇంట ఉండవలయును, ముసలి తనమున సంతానమును ఆశ్రయించి ఉండవలయును. అనగా జీవింప వలెను. తనకు భర్త లేడు, సంతానము లేదు, కానీ భర్త గృహమును వదిలిపోవుట తగునో తగదో అను సందేహము ఆమెను తొలిచివేయు చుండెను. ఈ సూక్ష్మవిషయమును వివరింపవలసినదని ఆమె తులసీదాసు నకు ఒక పత్రిక వ్రాసినది. వారప్పుడు కాశీనగరమున ఉండిరి. తులసీ దాసు మహా భక్తుడు. రామాయణమును వ్రాసిన భక్త కోటీరము. మహా కవిగా, మహా భక్తుడిగా అతనికి సరియైనవారు హిందీ సాహిత్యమున లేరనవచ్చును. మీరాబాయి తులసీకి వ్రాసిన పత్రిక ఈ క్రింది విధముగా నున్నది.

"స్వామీ! మీరు సుఖ నిదానులు భక్తుల దుఃఖమును హరించు కరుణా హృదయులు. మీకు మాటిమాటికీ నమస్కరించుచున్నాను. నా హృదయ తాపమును హరింపుడు. ముఖ్యముగా వ్రాయునది ఇంటిలోని స్వజనము నా భక్తిని సాగనిచ్చుట లేదు. వారు అనేక ఆటంకములు కల్పించుచున్నారు. సాదు సంగతి ఒనర్పనివ్వరు. భజన చేసుకొనునివ్వరు. చిన్ననాటినుండి నాకు గిరిధరునితోటి మైత్రి ప్రాప్తించినది. ఎంత

ప్రయత్నించినను ఆ స్నేహము వదలుట లేదు. నన్నిప్పుడేమి చేయమందురు? నా పాలిటికి తల్లితండ్రులు మీరే నాకు ఉచిత మార్గమును ఉపదేశింప వలెను."

తులసీదాసు ఆ విషయమునకు ఇట్లు సదుత్తరము క్రింది విధముగా పంపినాడు. "బిడ్డా! భగవంతుడు ఎవ్వరికి ప్రియుడు కాడో, వారు మనకు పరమ స్నేహితులైనను వదలితీరవలెను. అట్టివారు కోటి శత్రువులతో సమానము. భక్తుడైన ప్రహ్లాదుడు శ్రీహరి కొరకై తండ్రిని వదిలెను. విభీషణుడు అన్నను వదిలెను. భరతుడు తల్లిని ద్వేషించెను. బలి, శుక్రా చార్యుని వదులుకొనెను. గోపకాంతలు భర్తలనే వదిలిరి. వీరందరూ దేవుని భక్తులే. తల్లీ! ఎవరికి భగవంతునిపై అనన్య ప్రీతి ఉండునో వారి తోటి సంబంధమే ధన్యము. తక్కిన సుఖములు కన్ను చెరచు కాటుకవంటివి. లౌకిక బంధములు వినాశహేతువులు. భగవంతుడే పరమహితుడు. భక్తులకు ప్రాణాధికుడు. ఏ మార్గమున శ్రీకృష్ణుడు చిక్కునో అదియే ఉత్తమ ధర్మము."

పైన వ్రాసిన ప్రత్యుత్తరముతో మీరాబాయి సందేహము పటా పంచలైనది. ఆమె తక్షణమే ఇల్లు వదిలెను. మీరా బృందావనము చేరినది. అక్కడ ఒక కృష్ణ దేవాలయము ఉన్నది. ఈ స్వామికి 'రణబాంకురా' అని పేరు అక్కడ ఆమె భజన కీర్తనాదులు చేయుచుండెడిది. కొంతకాలమైన తరువాత మీరాబాయి తీర్థయాత్రకు బయలుదేరినది. త్రోవలో తులసీదాసు చరణకమలములను ఆమె సేవించెను, ఆ పరమభక్తుని ఆశీర్వాదము పొందెను. శ్రీకృష్ణ సంచరణ పవిత్రక్షేత్రములను ఆమె దర్శించుచూ ద్వారక చేరినది. శ్రీకృష్ణ పరమాత్ముడు కడపటి రోజులలో నివాసమొనర్చిన పరమ పవిత్ర ప్రాంతమది. ఆమె అచటనే తన జీవిత శేషమును గడిపి కడకు

కృష్ణఐక్యము పొందెను. గోలోకమునుండి దిగివచ్చిన రాధాదేవివలె మరలా గోలోకమునకు పోయినది. చూశారా! మీరాబాయి ఎన్ని కష్టములకోర్చి తనవారెవరూ లేకున్ననూ ఒంటరిగా ధైర్యముగా, దైవభక్తితో ఎలాగ ముందుకు సాగిపోయిందో, అందువలన మనమంతా నేటినుండి దైవభక్తినే ఎక్కువగా తలచి, శరీర బంధువులకంటే ఆత్మబంధువులకే ఎక్కువ విలువ నిచ్చి, జ్ఞానవంతులుగా ముందుకు సాగిపోతూ మోక్షము పొందవలెనని కోరుచున్నాము. మీరాబాయి యొక్క దేవుని భక్తిని జ్ఞానమార్గములోని ప్రతి వారూ స్ఫూర్తిగా తీసుకొని భక్తి యోగములో ముక్తిని పొందగలరని ఆశిస్తున్నాము.

నేటి మానవులను మరియు కేవలము అరవై సంవత్సరముల వెనుకటి కాలపు మానవులను గమనిస్తే, ఇటు ప్రపంచ పద్ధతిలోనూ, అటు పరమాత్మ పద్ధతిలోనూ ఎంతో గణనీయమైన తేడా కనిపిస్తున్నది. మానవుని జీవితములో ఎన్నో అధునాతన పరికరములు, యంత్రములు చోటు చేసుకొని మానవుని జీవితము సుఖవంతమైనట్లు స్థూలముగా మనకు కనిపిస్తున్నది. కానీ ఒకే ఒక్క పరమాత్మ ధ్యాసలో, ఆధ్యాత్మిక రంగములో మనిషి చాలా వెనుకబడిపోయి కనిపిస్తున్నాడు. అరవై సంవత్సరముల వెనుక కాలములో మనిషిలోనున్న తత్త్వ భావముగానీ, ఆధ్యాత్మిక చింతనగానీ, దేవుని మీద విశ్వాసముగానీ ఈనాడు లేకుండా పోయినట్లు తెలియుచున్నది. ప్రపంచ రంగములో ఎంతో ఎత్తుకు ఎగబాకిన మానవుడు, పరమాత్మ రంగములో చాలా క్రిందికి దిగజారిపోయాడు. కొందరు ఏమనుచున్నారంటే "మనిషి ప్రపంచ రంగములో ఎదిగినమాట వాస్తవమే కానీ, పరమాత్మ రంగములో దిగజారిపోయాడను మాటను మేము నమ్మము" అంటున్నారు. ఇంకా ఏమంటున్నా రంటే, పూర్వకాలములో దేవుని గుడులు ఏ ఊరిలోనూ పెద్దగా

ఉండేవి కావు, ఒకవేళ ఎక్కడైనా ఉంటే అవి కూడా శిథిలావస్థలో ఉండేవి. నేడు చూడండి! ప్రతి ఊరిలోనూ, ప్రతి పట్టణములోనూ, ప్రతి పేటలోనూ సాయిబాబా గుడి, అయ్యప్పగుడి మొదలగునవి ఎన్నో క్రొత్త దేవుళ్ళ గుడులు కూడా తయారైనవి. పూర్వమున్న రాముడు, ఆంజనేయుని గుళ్ళు కూడా పునరుద్ధరించబడినవి, అంతేకాక భక్తి విధానమును ఎంతోమంది స్వామీజీలు తెలియజేస్తున్నారు. ఇప్పటి కాలములో అటుగుడులు, గోపురాలు ఎంతో అభివృద్ధియై, ఇటు స్వామీజీలు, బాబాలు చాలామంది ఉండి, భక్తి భావమును పెంచుతూ ఉంటే, మీరేమిటి? పరమాత్మ రంగములో దిగజారిపోయా రంటున్నారు?" అని మమ్ములను ప్రశ్నించుచున్నారు. ఈ మాటకు మా సమాధానమేమనగా! నేటి కాలములో గుడులూ, గోపురములు స్వామీజీలు, బాబాలు ఎక్కువైన మాట నిజమే. నిత్యమూ వివిధ రకాల పూజలు జరుగుమాట కూడా యదార్థమే. అంతమాత్రమున మనిషి ఆధ్యాత్మిక రంగములో వెనుకబడలేదనుట, ప్రపంచ రంగములో ముందుకు పోయినట్లు దైవరంగములో కూడా ముందుకు పోయాడనుట అసత్యమనియే చెప్పుచున్నాము. ఎందుకనగా! కొన్ని విషయములలో పైకి కనిపించున వన్నీ సత్యములని అనుకోవడము పొరపాటవుతుంది. ఎండమావులు నీటి సరస్సులవలే కనిపించినప్పటికీ చివరకు పోయి చూస్తే అక్కడ నీరు లేదని తెలియుచున్నది. అదే విధముగా అధునాతన పరికరములతో, యంత్రము లతో వాహనములతో, వైద్యముతో మనిషి జీవితము సుఖవంతమైనట్లు కనిపించినా, ఎండమావులవలే మనిషి జీవితములో వాస్తవానికి పూర్వమున్న సుఖము లేదు. అలాగే నేడు ఎంత భక్తి పెరిగినా, మనిషి జీవితములో ఆధ్యాత్మికత ఏమాత్రమూ లేకుండా పోయినదనుమాట వాస్తవము.

మనిషియొక్క సుఖముకానీ, ఆధ్యాత్మికముగానీ బాహ్యారంగమునకు సంబంధించినవి కావు. అవి అంతరంగమునకు మాత్రమే సంబంధించిన వని ఏ మనిషీ మరచిపోకూడదు. అందువలన మనిషి యొక్క సుఖమునకు గానీ, ఆధ్యాత్మికమునకుగానీ కనిపించువాటితో సంబంధముండదు. అలాగే నేడు బయటికి కనిపించు భక్తిమార్గములు ఎన్ని ఉండినా, మనిషికి లోపల ఆధ్యాత్మికము లేదనియే చెప్పవచ్చును. ఎందువలననగా, మనిషి పూర్వము కంటే ఎక్కువ చింతించుచున్నాడనీ, పూర్వములేని అనేక రోగములను పొందు చున్నాడనీ, పూర్వమున్న తృప్తి మనిషిలో లేకుండా పోయినదనీ, చాలామంది ఒప్పుకొంటున్నారు. ఎన్ని ఔషధములను శాస్త్రజ్ఞులు కనిపెట్టినా, వాటిని మించిన పూర్వములేని రోగములు ఇప్పుడు రాలేదని ఎవరయినా చెప్పగలరా? వైద్యులకు తెలియని ఎన్నో రోగములు పుట్టుకొస్తున్న మాట అందరూ ఒప్పుకోక తప్పదు. పూర్వము మనిషిలో లేని అందోళన నేడు మనిషిలో కలదు. పూర్వములేని స్వార్థము నేడు మనిషిలో పెరిగిపోయి, బయటి సుఖములు ఎన్నియుండినా, అంతరంగములో సుఖము లేకుండా పోయినది. బాగా యోచించి చూస్తే మేము చెప్పుమాట వాస్తవమని ఒప్పుకోక తప్పదు. ఇదంతయూ గమనిస్తే బాహ్యము ఎన్ని సుఖములు పెరిగినా, శరీరాంతరంగములో మనిషికి దుఃఖములే ఎక్కువైనాయని చెప్పక తప్పదు. దేవాలయములు స్వామీజీలు పెరిగినప్పుడు మనిషిలో ఆధ్యాత్మిక, జ్ఞానమెందుకు పెరగలేదని ప్రతి ఒక్కరికీ సంశయము రావచ్చును. దానిని గురించి వివరముగా తెలుపుటయే ఈ పుస్తకము యొక్క సారాంశము. ఇప్పుడు మనము భక్తిని గురించి చెప్పుకొన్నట్లయితే, ఇంతకుముందు మనము చెప్పుకొన్నటువంటి మీరాబాయే ఆధారము. భక్తి అను పదమునకు సరియైన అర్థము 'విశ్వాసము' అని చెప్పవచ్చును. విశ్వాసము అనగా

నమ్మకము అని అర్థము. ఇక్కడ మనము ఎవరిని నమ్ముచున్నాము? అని ప్రశ్నించుకొంటే ప్రతి మనిషి చూడకుండా నమ్మవలసింది ఒకే ఒక దేవున్నని తెలియుచున్నది. చూచి నమ్మవలసినవి కొన్ని, చూడకుండా నమ్మవలసినవి కొన్ని ఈ భూమిమీద గలవు. దేవుని విషయానికి వస్తే, దేవునికి ఆకారము లేదు, పేరు లేదు కనుక చూడకుండానే నమ్మాలి. నమ్మకముండాలి! కానీ, ఆ నమ్మకము గ్రుడ్డి నమ్మకము కాకూడదు. గ్రుడ్డి అంటే కనిపించక చీకటిగా ఉండడమని అర్థము. అందువలన గ్రుడ్డి నమ్మకమును మూఢ నమ్మకమని కూడా అనుచున్నాము. మూఢనమ్మకము అదే పదము యొక్క అర్థము గ్రుడ్డి భక్తి అని తెలియుచున్నది. దేవుని విషయములో గ్రుడ్డి నమ్మకమేకాక చూపున్న నమ్మకము కూడాకలదని తెలియుచున్నది. దీనిని బట్టి చూపులేని భక్తిని మూఢనమ్మకమని, అటువంటి మూఢనమ్మకము దేవునిపట్ల ఉండకూడదని, మూఢనమ్మకము హేతువాదమునకు కూడా నిలువదనీ చెప్పుచున్నాము. దేవుడు కనిపించకుండినా దేవుని గురించిన సమాచారమును సవివరముగా, శాస్త్రబద్ధముగా తెలిసి విశ్వసించడమును చూపున్న భక్తి అనుచున్నాము. ప్రస్తుత కాలములో దేవునిపట్ల మనుషులకు చూపున్న భక్తి కలదా? మూఢభక్తి కలదా? అని ప్రశ్నించుకొని చూస్తే, తొంభై తొమ్మిది పాళ్ళు మూఢభక్తియే కలదని చెప్పవచ్చును. అందువలన చూపు లేనివాడు దేనినో పట్టుకొని దేనినో తెలియునట్లు, మనిషి మూఢభక్తి వలన దేవుడు కాని దానిని పట్టుకొని దేవుడు అనుకొనుచున్నాడు. అట్లను కోవడము వలన దేవున్ని వదలి దయ్యమును ఆశ్రయించినట్లగుచున్నది.

మూఢభక్తి వలన దేవుని విషయములో పొరపడి దేవుడుకాని దానిని దేవుడు అనుకోవడము జరుగుచున్నది. అట్లు అనుకోవడము మానవ జీవితములో పెద్ద పొరపాటు. దేవుని వివరము తెలియకుండా గ్రుడ్డిగా ఒక దానిని దేవుని జ్ఞానము అనుకొంటే అది దైవజ్ఞానము కాదు.

చాలామంది ప్రథమ దశలోనే చూపున్న భక్తి కాకుండా చూపులేని గ్రుడ్డి విశ్వాసము కల్గియున్నారు. అట్లున్న మూఢవిశ్వాసమును వదలి చూపుకల్గిన విశ్వాసము కలవారమై నిన్ను, నన్ను సృష్ఠించిన అసలైన దైవమునే ఆరాధించడము సరియైన పద్ధతి అగును. ఇప్పుడు ఆధ్యాత్మికమును గురించి కొంత తెలుసుకొందాము.

'ఆధ్యాత్మికము' అనుమాటను దాదాపు చాలామంది వినియే యుందురు. మన స్వామీజీలందరూ వాడే పదము ఆధ్యాత్మికము. ఆధ్యాత్మికమును గురించి భగవద్గీతలో భగవంతుడు **'ఆత్మను తెలుసుకోవడమే ఆధ్యాత్మికము'** అని చెప్పియున్నారు. ఆత్మను అధ్యయనము చేసి తెలుసుకొను విధానమును ఆధ్యాత్మికమని అనవచ్చును. ఇంకో విధముగా చెప్పుకొంటే, ఆత్మను ధర్మయుక్తముగా తెలుసుకోవడమనియూ, ఆత్మను శాస్త్రబద్ధముగా తెలుసుకోవడమనియూ అనవచ్చును. ముఖ్యవిషయమేమంటే మనము ఏ విధముగా తెలుసుకొనినా తెలుసుకోవలసినది ఆత్మను. ఈ ఆత్మ అను పదమును తెలియనివారుగానీ, ఆ శబ్దమును విననివారుగానీ, బహుశా ఎవరూ ఉండరేమో! ఎందుకనగా, అన్ని మతములలోనూ దాదాపు ఆత్మ అను పేరును అందరూ పలుకుచునే ఉన్నారు. దీనినిబట్టి చూస్తే ప్రతి మనిషికీ ఆత్మ అను మాట పరిచయమైనదేనని తెలియుచున్నది. మనము దైనందిన జీవితములో వాడు భాషలో ఎన్నోచోట్ల ఆత్మ అను శబ్దమును పలుకుచునే యుందుము. ఇటు జ్ఞానిగానీ అటు అజ్ఞానిగానీ నిత్యమూ పలుకుమాటలలో ఆత్మ అను పదము ఇలా కలదు. ఆత్మజ్ఞానము, ఆత్మద్రోహము, ఆత్మహత్య, ఆత్మబలము, ఆత్మవిమర్శ, ఆత్మబంధువు, ఆత్మశోకము, ఆత్మదర్శనము, ఆత్మసాక్షి, ఆత్మాహుతి, ఆత్మసమర్పణ, ఆత్మ చైతన్యము మరియు అంతరాత్మ మొదలగునవి ఇలా ఎన్నో పదములు

కలవు. ప్రతి మతములోనూ ఆత్మ అను పదమును పలుకుచునే ఉన్నారు. విచిత్రమైన సత్యమేమంటే, ఎంతోమంది చేత ఎన్నో సందర్భములలో పలుకబడు ఈ ఆత్మ, ప్రతి మతములోనూ, ప్రతి బోధకుడు బోధించు జ్ఞానములోనూ పలుకబడు ఈ ఆత్మ, ప్రపంచ జ్ఞానమునందు అజ్ఞానుల చేతగానీ, జ్ఞానులచేతగానీ పలుకబడు ఈ ఆత్మ, ఎటువంటిదో ఎక్కడుంటుందో ఏమి చేస్తుందో, దాని స్వరూపమేమో, దాని స్థితి గతులేమిటో ఈ భూమిమీద ఎవరికీ తెలియదు అనునది నగ్నసత్యము. ఇంతమంది చేత పలుకబడుచున్న ఆత్మను గురించి స్వామీజీలుగానీ, బాబాలుగానీ బోధకులుగానీ తెలియరు. నాకు ఆత్మజ్ఞానము తెలుసుననుకొన్న ఎంతపెద్ద బోధకునికిగానీ ఆత్మను గురించి తెలియదని చెప్పడము విచిత్రముగా ఉంది కదా! అవును విచిత్రమే మరి! నేను ఆత్మజ్ఞానిని నాకు ఆత్మ తెలియక పోవడమేమిటని కొందరనుకోవచ్చును. మీరు ఎంత గాఢముగా అనుకొనినా, అందరికీ తెలియని సత్యమేనగా! **"ఆత్మ ఎవరికీ తెలియదు."**

ఒక దయ్యమును చూచినవాడు 'నేను ఆత్మను చూశాను' అంటున్నాడు. దయ్యమును ఆత్మ అనవచ్చునా? అనకూడదు. అయినా అందరూ అలాగే అంటున్నారు కొన్ని మతములలో దయ్యము 'ఆత్మే' అని చెప్పుచున్నారు. ఆత్మయొక్క నిజస్వరూపము తెలియక కొందరు జీవున్ని ఆత్మయనీ, మరికొందరు దేవున్ని ఆత్మయని అంటున్నారు. కానీ, **ఆత్మ అటు జీవుడుగానీ, ఇటు దేవుడుగానీ కాదని తెలియదు.** ఆత్మను తెలియడము లేక ఆత్మను అధ్యయనము చేయడము ఆధ్యాత్మికము అయితే, ఆత్మంటే ఏమిటో ఎవరికీ తెలియనప్పుడు, బోధించు బోధకులైన స్వామీజీలకే తెలియనప్పుడు, ఆధ్యాత్మికము వీరందరికీ తెలుసునని చెప్పవచ్చునా? 'ఆత్మను తెలియనివాడు ఆధ్యాత్మికుడు కాదు' అను సూత్రము ప్రకారము

భూమిమీద ఎవరు ఆధ్యాత్మికమును తెలిసినవారో మీరే లెక్కించి చూసుకోండి. యోగీశ్వరులవారు ఇక్కడ ఉన్న సత్యమును చెప్పుచున్నారు కానీ, ఎవరినీ కించపరచవలెనని చెప్పడము లేదు. ఇంత నమ్మకముగా ఎలా చెప్పు చున్నారని మీరు యోగీశ్వరులవారిని ప్రశ్నించవచ్చును. దానికి మా సమాధానము ఏమనగా! 'నేను సూత్రము ప్రకారమే చెప్పుచున్నాను కానీ, సూత్రమును వదిలి శాస్త్రబద్ధత లేని విధముగా చెప్పడము లేదు.' కొందరు దూరమునుండి చింతచెట్టును చూచి జమ్మిచెట్టని అనుకోవచ్చును. అలా వారనుకొన్నంత మాత్రమున చింతచెట్టు జమ్మిచెట్టు కాగలదా? అలాగే చాలామంది ఇటు జీవాత్మనుగానీ, అటు పరమాత్మనుగానీ ఆత్మగా భావించుకొంటున్నారు. ఇలా భావించుకొనియే బోధిస్తున్నారు. అంత మాత్రమున వారనుకొన్నట్లు ఆత్మ జీవాత్మ కాదు. అలాగే ఆత్మ పరమాత్మ కాదు. ముందు పేజీలలో మనము ఆత్మను గురించి కొంత వివరముగా చెప్పుకొన్నాము. ఆ ప్రకారము ఎవరికి త్రైత సిద్ధాంతము తెలియదో, ఎవరు త్రైత సిద్ధాంతమును ఒప్పుకోరో, వారికి ఆత్మను గురించి తెలియనట్లే అటువంటివారు ఎవరయినా వారికి ఆధ్యాత్మికమే తెలియదు.

భూమిమీద భగవాన్‌లని పేరుపెట్టుకొనినా, స్వామీజీలైనా, బాబాలైనా, గురువులని పేరుగాంచినా ఆత్మను గురించి తెలియనివారు ఆధ్యాత్మికులు కారు. ఆత్మ ఏదో తెలియనప్పుడు ఖచ్చితముగా జీవాత్మను కూడా చూడలేరు, పరమాత్మను కూడా తెలియలేరు. అటువంటివారు జీవాత్మను గురించి చెప్పవలసివచ్చినప్పుడు దానిస్థానములో పరమాత్మను గురించో, ఆత్మను గురించో చెప్పుచుందురు. అలాగే ఆత్మను గురించి చెప్పవలసి వచ్చినప్పుడు, వారికి తెలిసినవి రెండే కావున ఇటు పరమాత్మనో, అటు జీవాత్మనో చెప్పుచుందురు. అట్లుకాక మూడు ఆత్మలైన జీవాత్మ, ఆత్మ, పరమాత్మలను తెలిసినవాడే నిజమైన జ్ఞాని.

ఇప్పుడు గురువును గురించి కొంత విపులముగా తెలుసుకొందాము. 'గురువు' అంటే సాధారణ మనిషికాడు అని తెలిసిన కొందరు జ్ఞానులు గురువును దైవసమానముగానే భావించుచుండిరి. భూమిమీద 'గురువు' అని పేరేలేని ప్రాచీన కాలములో మొదట జ్ఞానమును తెలియజేసిన మనిషిని దేవుడని గుర్తించగలిగిన జ్ఞానముగల మనుషులు ఆయనను ఏ పేరుతో పిలవాలని యోచించి, చివరకు అర్థముకాక, నిన్ను ఏమని సంబోధించాలని ఆయననే అడిగారు. అప్పుడు బ్రహ్మవిద్యను బోధించి ఆయన చెప్పిన పేరే 'గురు' ఈ విధముగా మొదట భూమిమీద 'గురు' అను పదము బయటికి వచ్చినది. మొదట బ్రహ్మవిద్యను తెల్పినవాడు సామాన్యుడు కాదని తెలిసినవారు, ఆయననుండియే చెప్పబడిన 'గురు' అను పదము కూడా విశేష అర్థముతో కూడుకొనియుండునని తలచినవారై గురు అను పదమునకు అర్థమును చెప్పమనీ, మీరు తప్ప ఆ శబ్దమునకు ఎవరూ అర్థమును చెప్పలేరని కోరారు. అప్పుడు తన పేరును గురుగా ప్రకటించుకొన్న భగవంతుడు **'గుకారస్య గుణాతీత, రుకారో రూపవర్జితమ్'** అని అన్నాడు. అంతేకాక మరొక విషయమును కూడా చెప్పాడు. "నన్ను గురించి నేను ఎక్కువగా చెప్పుకోను. మీరు అడిగారు కాబట్టి రెండక్షరము లకు సూచనగా అర్థమును చెప్పాను. ఈ రెండక్షరములలో ఇంకనూ విశేషమైన అర్థము ఇమిడియున్నది. మీరు శ్రద్ధతో నేను చెప్పిన జ్ఞానమును ఎంతగా తెలుసుకోగలరో అంతగా గురు పదములోని రహస్యము తెలియ గలదు" అన్నాడు. దీనితో జ్ఞానులందరికీ ఒక పరుగుపందెము పెట్టినట్లయి నది. 'గురు' పద అర్థము కొరకు పరుగు ప్రారంభించారు. అప్పటినుండి బ్రహ్మవిద్యను తెలుసుకొన్న జ్ఞానులందరూ గురు పదమునకు అనేక రకములుగా అర్థమును చెప్పుచూ వచ్చారు. వారి వారి జ్ఞానమునుబట్టి

ఎందరో జ్ఞానులు గురువును గురించి వర్ణించుచూ సంస్కృతములో ఎన్నో శ్లోకములను కూడా చెప్పారు అలా ఎందరో జ్ఞానులు చెప్పిన అర్థములన్నియూ చాలా గొప్పవేనని చెప్పవచ్చును.

ఇప్పుడు మనము కూడా బ్రహ్మవిద్యను నేర్చుకొంటున్నవారమే, కావున మనము కూడా గురు పదము యొక్క అర్థము కొరకు పరుగు పందెములో పాల్గొనవచ్చును. మనకు సంస్కృత భాష రాకుండినా, శ్లోకముల రూపములో చెప్పకుండినా, మనకు వచ్చిన తెలుగు భాషలోనే మనము గురు పదమునకు అర్థము చెప్పుటకు ప్రయత్నిద్దాము. భూమిమీద మనుషులకు శరీరమున్న మనిషి ద్వారానే మొదట బ్రహ్మవిద్య తెలిసినది. జ్ఞానమును తెలిసిన ఆ మనిషి గుణములున్నవాడే. గుణములులేని మనిషి భూమిమీద ఉండడను సూత్రము ప్రకారము గురువు కూడా గుణములున్న వాడే, గుణములకు మారుపేరు 'మాయ' అని భగవద్గీతలో తెలుసుకొన్నాము. 'గుణమయీ మమ మాయా' అను గీత వాక్యము ప్రకారము శరీరముతో యున్న గురువుకు కూడా గుణములున్నవని తెలియుచున్నది. గురువు కూడా గుణముల ప్రకారమే పనులు చేయుచుండును. అయినప్పటికీ 'గుకారస్య గుణాతీత' అన్నట్లు గురు అను పదములో 'గు' అక్షరము యొక్క అర్థము ప్రకారము బ్రహ్మవిద్యా శాస్త్రమును తెల్పినవాడు గుణాతీతుడని తెలియుచున్నది. తరువాత 'గురు' పదములో రెండవ అక్షరమునకు 'రుకారో రూపవర్జితమ్' అన్నారు. దానిప్రకారము గురువుకు రూపమున్నా రూపము లేనివాడని తెలియుచున్నది. గుణములుండినా, గుణములకు అతీతుడని, రూపముండినా రూపములేనివాడనీ, మొదట గురువే తన విధానమును తెలియజేశాడు. ఇది మనము చెప్పినా అర్థము కాకపోయినా, మనిషిగా ఉన్నప్పుడు మనుషులు అడిగిన దానికి గురు

పదమునకు ఆయనే అర్థము చెప్పినప్పటికీ, ఇది కొద్దిమాత్రము అర్థమేననీ, 'గురు' అను రెండక్షరములలో ఇంకనూ విశేష అర్థమున్నదనీ దానిని మీ జ్ఞానముతో తెలుసుకొమ్మని కూడా చెప్పియున్నాడు. ఆయన చెప్పినట్లు మాకున్న జ్ఞానముతో పరిశీలిస్తే కొంత నిగూఢ అర్థము తెలియుచున్నది. అదేమనగా!

దేవుడు నిరాకారుడు మరియు సాకారుడు. నిరాకారమైన దేవుడు రూపములేని వాడూ, సాకారమైన భగవంతుడు రూపమున్నవాడూ మరియు గుణములున్నవాడు. దీనినిబట్టి దేవుడు రెండు రకములుగా ఉన్నాడని తెలియు చున్నది. భగమునుండి పుట్టిన భగవంతుడైనవాడు గుణములతోనే చరించు చున్నాడు. అటువంటి భగవంతుని ద్వారానే భూమిమీద మనిషి జ్ఞానమును తెలుసుకొనుచున్నాడు. కావున గుణములలోని మొదటి అక్షరమైన 'గు' అనుదానిని భగవంతుని గుర్తుగా పెట్టవలసివచ్చినది. భూమిమీద మనిషిగా గుణములలోనున్న భగవంతుడు, తరువాత రూపములేని నిరాకారునిగా మారిపోవును. రూపములేని దేవుని గుర్తుగా రూపములోని 'రు' అను మొదటి అక్షరమును 'గు' తరువాత అక్షరముగా పెట్టవలసి వచ్చినది. అలా రెండు అక్షరములను కలిపి చూచితే 'గురు' అగుచున్నది. గురు అనగా గుణములున్నవాడూ, రూపములేనివాడూ ఇద్దరూ కలిసియున్నదని తెలియుచున్నది.

ప్రస్తుతము గురువును విద్యను బోధించువాడు చాలామంది అనుకొంటుంటారు. మనము ఇక్కడ విద్యలను రెండు రకములుగా విభజించుకొనిన, ఒకటి ప్రపంచ విద్య, రెండు పరమాత్మ విద్య అని తెలుసుకొన్నాము. ప్రపంచ విద్యలలో గురువు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ పరమాత్మ విద్యలో తప్పనిసరిగా గురువు ఉండి తీరాలి అని కూడా

చెప్పుకొన్నాము. దానిప్రకారము పరమాత్మ విద్యలో గురువు ఎట్లుంటాడో, ఎవరు గురువో తెలుసుకొనేదానికి ప్రయత్నిద్దాము.

భూమిమీద ఇంతవరకూ గురువును గురించి వ్రాసినవారు ఇప్పుడు మేము చెప్పిన విధముగా గురువు మనిషిగా రావచ్చుననకుండా, మనిషి గురువుగా మారునని చెప్పియున్నారు. పుట్టిన మనిషి ఎవరూ గురువుగా మారడని వారికి తెలియక అలా వ్రాసియుండవచ్చును. ఆ విధముగానైనా పుట్టిన మనిషి గురువుగా మారుట దుర్లభము. ఎప్పుడైనా సంభవిస్తే, దేవుడు గురురూపముగా, అనగా మనిషిగా రావచ్చును. ఒకవేళ అలా వచ్చిన గురువు ఎల్లప్పుడు భూమిమీద ఉండడు. ఆయనకు అవసరమైనప్పుడు ధర్మములను తెలియజేసి పోవును. అటువంటి గురువు తాను గురువునను గుర్తింపు ఏమాత్రము తెలియకుండా సాధారణముగా ప్రజల మధ్యలో ఉండును. ఆయన చెప్పిన బోధను చూచి ఇది సాధారణ మనిషి చెప్పు జ్ఞానము కాదనీ, దీనిని ఒక గురువు తప్ప ఎవరూ చెప్పలేరని, ఎవడైనా తెలివైనవాడు మనిషిగాయున్న గురువును గ్రహించగలిగితే, నిజమైన గురువు వానిని ఆ భావమునుండి తప్పిపోవునట్లు చేయగలడు. గురువు శ్రీకృష్ణుడను పేరుతో మనిషిగా వచ్చినప్పుడు శ్రీకృష్ణుని బోధను చూచి ఈయన నిజమైన దేవుడని కొందరు గ్రహించినప్పటికీ, ఆయన ప్రవర్తనను చూచి శ్రీకృష్ణున్ని సాధారణ మనిషియేనని కొందరూ, మోసగాడని కొందరూ, జారుడని కొందరూ, చోరుడని కొందరూ అనుకొన్నారు. కానీ గొప్ప దైవాంశ నిండిన గురువనీ దేవుడనీ ఎవరూ అనుకోలేదు. ఆ కాలములో భగవద్గీతను విని, విశ్వరూపమును చూచిన అర్జునునికి కూడా శ్రీకృష్ణుడు దేవుడు కాదని అనుమానము రాగా, శ్రీకృష్ణున్ని మేధావిగా మాత్రము అర్జునుడు అనుకొన్నాడు తప్ప గురువుగాగానీ, దేవునిగాగానీ గుర్తించలేదు.

కానీ ఆనాటి భీష్ముడు శ్రీకృష్ణుని భగవద్గీతను వినకుండినా, ఆయన విశ్వ రూపము చూడకుండినా, శ్రీకృష్ణున్ని నిజమైన దేవునిగా సృష్ఠికర్తగా, జగద్భర్తగా జగద్గురువుగా లెక్కించాడు. చాలా సందర్భాలలో శ్రీకృష్ణుడు సాధారణ మనిషి కాదని ఇతరులకు కూడా చెప్పాడు. భీష్ముని విశ్వాసము ముందర ఏ మాయా పనిచేయలేదు. దీనినిబట్టి విశ్వాస లోపముంటే గురువును ఎవరూ గుర్తించనట్లు తన మాయచేత గురువు, అనుమానము రేకెత్తించునట్లు చేయును. సంపూర్ణ విశ్వాసిని మాత్రము తననుండి దూరము చేయడని తెలియుచున్నది. గురువును భూమిమీద ఎవరూ గుర్తించరు అనుటకు వీలులేకుండా దేవుని మీద శ్రద్ధ, విశ్వాసము ఉన్నావారు గుర్తించగలరని చెప్పుటకు భీష్ముడు తార్కాణముగా నిలిచాడు.

ఒక మనిషిలోని విలువబట్టి ఎదుటివానికి తెలిస్తే, వాడు ఆ మనిషిని గౌరవిస్తాడు. గురువులోని విలువ ప్రజలకు తెలియదు కదా! అలాంటప్పుడు ఎలా గౌరవిస్తారు? గురువు శరీరముతో ఉండి గుణాలతో సంచరిస్తున్నప్పుడు గుణాల కార్యములే కనిపించును. మిగతా ప్రజలందరు కూడా గుణాలతోనే కార్యములు చేయుచున్నారు. కావున గురువును గురువుగాకాక, సామాన్య మనిషివలె ప్రజలు గుర్తిస్తారు. గురువు యొక్క విలువ తెలియనప్పుడు కొన్ని సందర్భములలో ఆయనను అవమానముపాలు కూడా చేయుదురు. ఇదే విషయమును భగవద్గీతయందు రాజవిద్యా రాజగుహ్య యోగమను అధ్యాయములో 11వ శ్లోకమందు భగవంతుడే ఇలా చెప్పాడు.

*శ్లో॥ అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితం ।*
*పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥*

**భావము :-** సర్వజీవరాశులకు మహేశ్వరుడనైన నన్నూ, గొప్పదైన నా మహత్యమును తెలుసుకోలేక మానవ శరీరము ధరించిన నన్ను చూచి మూఢులు అవమానపరుస్తున్నారు.

**వివరము :-** భూమిమీదున్న సమస్త జీవరాశులను సృష్ఠించినవాడు, సృష్ఠికర్త అయిన దేవుడు. ఆ దేవుడు విశ్వమంతా వ్యాపించి ఉంటూనే తనశక్తిలోని కొంత అంశ శరీరమును ధరించి మనిషిగా పుట్టునట్లు చేయును. దేవుని నుండి అలా పుట్టిన ఆకారమును 'భగవంతుడు' లేక 'గురువు' అని మనము అంటున్నాము. గురువు లేక భగవంతుడు సాకారముగా కనిపిస్తున్నాడు. దేవుడు నిరాకారముగా కనిపించకుండా ఉన్నాడు. కనిపించడము, కనిపించ కపోవడము అను తేడా తప్ప దేవునికి, గురువుకు ఏ భేదమూ లేదు. గురువు శరీరము ధరించి కనిపించుట వలన, గురువు కూడా కర్మానుసారము అజ్ఞానివలె ప్రవర్తించుట వలన, జ్ఞానములేని మానవులు గురువును కూడా సాధారణ మనిషిగా లెక్కించి ఆయనను అవమానింతురు. గురువులోని గొప్పతనమును ఏమాత్రము గ్రహించని మనుషులు, ఆయన చెప్పు జ్ఞానమును విభేదించి ఆయనకంటే వారికే ఎక్కువ జ్ఞానము తెలుసుననుకొని 'నీవు అజ్ఞానమును బోధిస్తున్నావని' ఆయనతో వాదమునకు దిగి హేళనగా మాట్లాడుదురు. ఆయన యొక్క జ్ఞానమునుగానీ, ఆయన యొక్క వ్యక్తిత్వము నుగానీ లెక్కించక, ఆయన మీదికి దాడిచేయుటకు కూడా ప్రయత్నింతురు. ఇదంతయూ ఆయనను (గురువును) అవమానపరచినట్లు కాదా? సంపూర్ణ జ్ఞానకేంద్రమయిన గురువుకు ఏమాత్రము విలువ ఇవ్వక ఆయన చెప్పినది అజ్ఞానమనీ, తమకు తెలిసినదే జ్ఞానమనీ అనుకోవడము ఆయనను (గురువును) అవమానపరచినట్లు కాదా?

మనము బాగుపడేదానికీ, మనకు మోక్షము వచ్చేదానికీ, మనకు ధర్మములను తెలియబరచుటకూ పనిగట్టుకొని భూమిమీదకు వచ్చిన భగవంతున్ని (గురువును) ఆయన చెప్పునదేదో వినకనే, ఇతరుల చేత రెచ్చగొట్టబడిన వారు మూర్ఖముగా మనము ఏమి చేయుచున్నామని ఆలోచించక, గురువును దూషించి అవమానపరచువారు కూడా కలరు. అందువలన భగవద్గీతలో భగవంతుడు మూఢులు నన్ను అవమానించు చున్నారని చెప్పాడు. మూఢులైన అజ్ఞానులు, దేవుడైన భగవంతుడు (గురువు) ఎప్పుడు భూమిమీదకు వచ్చినా ఆయనను అవమానించుట మానరు. దీనికి తార్కాణముగ ఏసుప్రభువు భగవంతునిగా (గురువు)గా వచ్చినప్పుడు ఆయనకు జరిగిన అవమానము జగమెరిగిన సత్యమే. దానిని మరచి పోకూడదు. దైవభక్తి (గురుభక్తి) ఏమిటో తెలియని దేవతల భక్తి కలిగిన వారూ, దేశభక్తి కల్గినవారూ, మతభక్తి కల్గినవారూ తమకు తెలిసినదే నిజమైన జ్ఞానమని, గురువు చెప్పు జ్ఞానమును హేళన చేయడమేకాక గురువును దూషింతురు. కావున మీరు దేశభక్తులైతే దానిని మించిన దైవభక్తిని పెంచుకోవాలి. మీరు మత భక్తులైతే దానిని మించిన గురు భక్తిని పెంచుకోవాలి. అప్పుడే గురువును గౌరవించిన వారమగుదుము.

భౌతిక శరీరమును ధరించిన గురువును మూఢులైన వారు దూషించితే, గురువును అవమానపరచితే, గురువు వారిని ఏమీ చేయాలను కోడు. ఎందుకనగా! గురువును అవమానపరచితే వారికి భయంకరమైన కర్మ (పాపము) చేరుచున్నది. ఆ పాపమును అనుభవించితే పెద్దశిక్ష అయినప్పుడు వేరుగా ఆయనేమీ చేయవలసిన పనిలేదు. గురువును దూషించిన మూఢులు భయంకర పాపము పొందినవారై దేశభక్తి, దేవతల భక్తి, మతభక్తి అనుచు, వ్యర్థమైన జ్ఞానమును పొందినవారై, అసుర గుణములలో చిక్కుకొని పోవుచున్నారని రాజవిద్యా రాజగుహ్యా యోగమున

12వ శ్లోకమందు చెప్పియుండడమే కాక, అదే భగవద్గీతయందు దైవాసుర సంపద్వి భాగయోగమున 20వ శ్లోకములలో ఈ క్రింది విధముగా చెప్పియున్నారు.

*శ్లో॥ అసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।*
*మామప్రాప్యైవ కౌంతేయతతోయాన్త్యధమాం గతిమ్ ॥*

**భావము :- అసుర యోనులయందు జన్మించుచూ, మూఢులగుచూ నన్ను తెలుసుకొను జ్ఞానమును ఏమాత్రము తెలియక జన్మజన్మకూ అధోగతి పాలగు చున్నారు.** దీనిని ధృవీకరిస్తున్న ద్వితీయ దైవగ్రంథమయిన బైబిలులోని వాక్యములను చెప్పుకొందాము. మత్తయి సువార్త 12వ అధ్యాయము 31,32 వాక్యములు **(31) "కాబట్టి నేను మీతో చెప్పునదేమనగా! మనుష్యులు చేయు ప్రతి పాపమును, దూషణయు వారికి క్షమింపబడును గానీ, ఆత్మ విషయమైన దూషణకు పాపక్షమాపణలేదు. (32) "మనుష్య కుమారునికి విరోధముగా మాటాలాడువానికి పాపక్షమాపణ కలదుగానీ, పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ఈ యుగమందైనను, రాబోవు యుగమందైనను పాపక్షమాపణ లేదు."** ఇక్కడ ఈ యుగమందైనను అనగా ఇది కలియుగము. కలియుగ ప్రారంభములోనే ఏసుప్రభువు భగవంతునిగా (గురువుగా) జ్ఞానమును చెప్పియుండుట వలన కలియుగము (కలియోగము) యొక్క ఆయుష్షును లెక్కించకొనిన 4,32,000 సంవత్సరము లగుచున్నది. రాబోవు యుగమనగా కృతయుగము (కృత యోగము) దాని వయస్సు 17,28,000 సంవత్సరమలు. ఈ లెక్క ప్రకారము దేవునికి మరియు దేవుని జ్ఞానమునకు విరోధముగా మాటలాడు వానికి, ఎన్ని జన్మలెత్తవలెనో ఎన్ని జన్మల వరకూ అధోగతిపాలగునో, ఎన్ని జన్మల వరకూ దేవుని జ్ఞానము తెలియబడదో బుద్ధి, శ్రద్ధ కలిగి మీరే లెక్కించుకోవలెను.

ఇప్పుడు పై శ్లోకమునకు వివరము తెలుసుకొందాము. గురువును అవమానించువారు రాక్షస గుణముకలవారై, పాపములను మూటగట్టు కొన్నవారై, దేవుని జ్ఞానము యొక్క గట్టే దొరకక చస్తూ, పుట్టుచూ, జన్మ జన్మకు అధోగతి పాలగుచూ, అంతముకాని పాపముగలవారై యుందురు. ఈ విధముగా భగవద్గీతయందు తానేమీ చేయకనే పాపములలో చిక్కుకొందురని భగవంతుడు చెప్పియున్నాడు. భగవంతుడు ప్రతీకారముగా ఏమీ చేయడనీ, వాని పాపమే వానిని హింసించి అధోగతిపాలు చేయుచున్న దనీ, దానివలన అట్టి మూఢునికి జ్ఞానమే తెలుసుకొను అవకాశమే లేదని తెలియుచున్నది. మరియొక విచిత్రమేమనగా! గురువును నిందించినవారికి ఎవరికీ తెలియని చిత్రమైన సంఘటనలు కూడా జరుగుచున్నవి. వాటిని గూర్చి చెప్పినా అర్థము కానివిగా ఉన్నవి. తర్వాత జన్మలలో పాపములను అనుభవించవలయునని శ్రీకృష్ణుడు చెప్పగా! ఆయన చెప్పని సంఘటనలు ఈ జన్మలలోనే జరుగుచుండుట విచిత్రము కాదా? గురువును అవమానించిన వానికి ఈ జన్మలోనే శిక్షలు పడునని కూడా తెలియుచున్నది. ఎందు వలననగా, భూమిమీద కనిపించు స్థూల జీవరాశులేకాక, కనిపించని అన్ని జీవరాశులు ఉండుట సత్యమే. భూమిమీదనేకాక, ఖగోళములో ఎన్నో సూక్ష్మగోళ గ్రహములు కూడా కలవు. భూమిమీదకు గురువు వచ్చినపుడు, భూమిమీద స్థూల జీవరాశులుగానీ, సూక్ష్మజీవరాశులుగానీ గురువును గుర్తించలేవు. స్థూలముగా ఉన్నవారు గుర్తించలేరని ముందే తెలుసుకొన్నాము. స్థూలముకంటే సూక్ష్మములో గ్రహించుకొనుటలో కొంత తేడా యున్నప్పటికీ సూక్ష్మ జీవరాశులు కూడా గురువును గుర్తించలేకపోవు చున్నవి. ఇకపోతే ఖగోళములోని సూక్ష్మగోళగ్రహములు గురువును గుర్తించగలవు. అందువలన ఖగోళములోని సూక్ష్మగ్రహములు భూమిమీదకు

వచ్చి గురువు దగ్గర జ్ఞానము తెలుసుకొనుచుండును. గురువు వారికి ప్రత్యేకించి జ్ఞానమును చెప్పకుండినా, మనుషులకు చెప్పునప్పుడు గోళ గ్రహములు కూడా జ్ఞానమును శ్రద్ధగా తెలుసుకొనుచుండును. మనుషుల మధ్యలో సూక్ష్మముగా పెద్దపెద్ద గ్రహములు ఉండి, జ్ఞానమును తెలుసు కోవడము జరుగుచుండును. ఇలా జ్ఞానమును తెలుసుకొని గురువు మీద ఎంతో విశ్వాసముతో ఉండును. కనుక గురువును ఎవరైనా దూషించినా, అవమానపరచినా వారికి కోపమొచ్చును. అట్టివారు ఖగోళములో వారి స్థానములో వారుంటూ అప్పుడప్పుడు గురువువద్దకు వస్తూ, జ్ఞానమును తెలుసుకొనుచుందురు. వారు ఎప్పుడు వచ్చునది, ఎప్పుడు పోవునది మనుషులు చూడలేరు. కనుక వారి రాకపోకలు ఒక గురువుకు తప్ప ఎవరికీ తెలియదు. గురువు జ్ఞానము చెప్పునప్పుడు వందమంది మనుషులుంటే, అక్కడ అంతకంటే ఎక్కువగానీ, తక్కువగానీ ఖగోళ గ్రహములుంటున్నవి. గురువు జ్ఞానము చెప్పని దినములలో కూడా గ్రహములు వచ్చి గురువును దర్శించుకొని పోవుచుండును. అలా వచ్చువారు సూక్ష్మముగా కనిపించకయుందురు. కావున ఒక్కొక్కప్పుడు మనము వారి మధ్యలోనికి పోవడముగానీ లేక మనము వారి మధ్యలో ఉండడముగానీ జరుగుచుండును. అటువంటి సమయములలో వారి సమక్షములో ఎవరైనా గురువును నిందించినా, అవమానపరచినా వారికి గురువును దూషించిన వానిమీద కోపము వచ్చును. వారికి కోపమువస్తే వారికోపమునకు గురియైన వానిని వదలక ఏదో ఒక విధముగా కష్టనష్టములను కలుగజేయుడముగానీ, లేక రోగగ్రస్తుని చేయడముగానీ, లేక వానిని చంపివేయడముగానీ జరుగు చున్నది. దేవునికి వ్యతిరేఖముగా మాట్లాడినా, స్థూలముగానున్న అనగా సాకార రూపములోనున్న భగవంతున్ని (గురువును) దూషించినా, ఆ

సమయములో గ్రహములు అక్కడ ఉన్నట్లయితే, గురువును దూషించడము చూస్తే, దూషించిన వానికిగానీ, అవమానించిన వానికిగానీ ముప్పు తప్పదు. గురువు ఏమీ ప్రతీకారము చేయకున్ననూ గ్రహములు మాత్రము వదలవు. నేటికీ ఎందరో గురువును తెలియక, నిందించి ఎంతోనష్టపోయిన వారైనారు. కొందరు కాళ్ళు, చేతులు పోగొట్టుకొన్నారు. కొందరు మాట్లాడే నోరును పోగొట్టుకొని మూగవారైనారు. కొందరు కళ్ళ చూపును పోగొట్టుకొన్నారు. కొందరు ఏకంగా ప్రాణమునే పోగొట్టుకున్నారు. సూక్ష్మగ్రహములు బయటి ఆధారములేకుండా శిక్షలు వేయడము వలన అలా ఎందుకు జరిగినదని తెలియ కుండా పోయినది. కానీ వాస్తవ పరిస్థితి ఇంతకాలమునకు కూడా ఎవరికీ అర్థము కాలేదు.

ప్రపంచములో ఇతరులను దూషించినా, అవమానించినా, బాధించినా, మోసము చేసినా వచ్చు పాపమును తరువాత జన్మలో అనుభవించి అయిపోజేసుకోవచ్చును. అట్లు అనుభవించి లేకుండా చేసుకోవడము ప్రాపంచికములో ఒక సాధారణ పద్ధతికాగా, జ్ఞానము తెలిసి, యోగము చేసి, జ్ఞానాగ్నిని సంపాదించుకొని ఆ అగ్ని వలన వెనుక జన్మలో చేసుకొన్న పాపమును (కర్మను) ఆధ్యాత్మికములో శాస్త్రబద్ధముగా ఒక పద్ధతిలో కాల్చివేయవచ్చును. దీనినిబట్టి ప్రపంచములో మనుషుల ఎడల సాధారణముగా చేసిన పాపమును అనుభవించిగానీ, అనుభవించకనే జ్ఞానము వలనగానీ లేకుండా చేసుకోవచ్చును. కానీ సాకార గురువు (భగవంతుడు) ఎడలగానీ, నిరాకార దేవుని ఎడలగానీ వ్యతిరేఖ దూషణా భావములతో చేసుకొన్న పాపమును ఎటు తిరిగీ అనుభవించవలసి యుండును. దేవుని జ్ఞానశక్తి వలన కూడా అది కాల్చివేయబడదు. ఒక్క జన్మలో చేసుకొన్న పాపము తరువాత జన్మలో అనుభవించినా అయిపోదు.

దైవదూషణ లేక గురు దూషణ వలన ఏర్పడిన పాపము యుగయుగముల పర్యంతమూ అనుభవించవలసియుండును. దేవున్ని ప్రార్థించినా, దేవుడు కూడా ఆ పాపమును క్షమించడు. అందువలన అటువంటి పాపమును క్షమించబడని పాపము అంటాము. ఈ విషయమును నేటి కాలములోని మూడు ప్రధాన దైవగ్రంథములలో చెప్పబడియున్నది. దీనినిబట్టి నీవు ఏ మతస్థుడివైనా దేవున్ని దూషిస్తే క్షమించరాని పాపము (కర్మ) తప్పదు.

ఇక్కడ ముఖ్యముగా చెప్పుకోతగ్గ విచిత్రమేమంటే గురువుకు శిష్యులు ఉండరు. శిష్యులు లేకపోతే గురువెలా అవుతాడని మీరు ప్రశ్నించవచ్చును. దానికి జవాబు ఈ విధముగా ఉంది. గురువు ప్రజలకు ధర్మముతో కూడుకొన్న దైవజ్ఞానమును తెలుపుటకు భూమిమీదకు రావచ్చును. కానీ శిష్యులను తయారు చేసుకొనుటకు కాదు. గురువు భూమిమీదకు వచ్చిన ఉద్దేశ్యము ధర్మయుక్తమైన జ్ఞానమును తెల్పడము. అంతేకానీ ఏ ఒక్కనినీ శిష్యునిగా చెప్పుకోవడానికి రాడు. గురువు భూమిమీదకు కొన్ని లక్షల సంవత్సరములకో, కోట్ల సంవత్సరములకో ఒకమారు వస్తే, ఎవరికీ గురువుగా గుర్తింపులేనట్లు అజ్ఞానముగా ప్రజల మధ్యలో ఉండి, సందర్భము వచ్చినప్పుడు మాత్రమే జ్ఞానము చెప్పునని ముందే తెలుసుకొన్నాము. ప్రజలకు ఇతను 'గురువు' అని తెలియకుండునట్లు వలన శిష్యులేర్పడుటకు అవకాశమే లేదుకదా! అందువలన నిజ గురువుకు శిష్యులుండరు. ద్వాపర యుగములో గురువు శ్రీకృష్ణుని రూపములో వచ్చినప్పుడు శ్రీకృష్ణునికి ఒక్క శిష్యుడూ లేడని మరచిపోకూడదు. కనీసము ఒక్క శిష్యుడు కూడా లేని శ్రీకృష్ణుడు భూమిమీదనుండి పోయిన తరువాత చాలామంది జ్ఞానులు, యోగులు శ్రీకృష్ణున్ని 'జగద్గురువు' అన్నారు. శిష్యులే లేనప్పుడు ఆయన జగద్గురువని ఎలా పేరుగాంచాడని అడుగవచ్చును. దానికి మా

సమాధానము ఏమనగా! **“జగత్తులోనున్న సమస్త జీవరాశులకు వర్తించు జ్ఞానమును చెప్పినవాడు జగద్గురువు”** అను సూత్రము ప్రకారము శ్రీకృష్ణుడు జగద్గురువైనాడు. శ్రీకృష్ణుడు బోధించిన జ్ఞానమునుబట్టి గురువైనాడు. కానీ శిష్యులనుబట్టి గురువు కాలేదు. ప్రాపంచికములో శిష్యులున్న వాడు ‘గురువు’ అనుమాట చెప్పుకొనుటకు స్థూలముగా వాస్తవము కావచ్చును, కానీ ఆధ్యాత్మికములో శిష్యులున్నవాడు ‘గురువు’ అనుమాట సరియైనది కాదు మరియు అది సూత్రమూ కాదు. ఒకవేళ ఎవరైనా శిష్యులనుబట్టి గురువు అను సూత్రమును నమ్మితే, దానిప్రకారము ఇద్దరు శిష్యులున్నవాడు కూడా గురువే అగును. ఆ లెక్కప్రకారమైతే ఇప్పటి కాలములో భూమిమీద కొన్ని వేలమంది గురువులు గలరని చెప్పవచ్చును.

‘ఎప్పుడైనా భూమిమీద గురువు ఒక్కడే ఉంటాడు’ అను సూత్రము సత్యము. అనేకమంది గురువులు ఏక కాలములో ఉండుట అసత్యము. బోధలు చెప్పు ప్రతి వానిని గురువనుకోక, నిజముగా నీకు అధికారియైన దేవున్ని గురువుగా లెక్కించుకోవడము మంచిది. ప్రస్తుతానికి నీకు గురువుండినా ఫరవాలేదు. గురూపదేశము తీసుకొనినా ఫరవాలేదు. శిష్యులు లేని గురువును చూసుకో! శిష్యులనుబట్టి గురువుండడనీ, చెప్పే ధర్మములనుబట్టి గురువుంటాడని తెలుసుకో.

మనుష్యులందరూ మోసపొయ్యేది మహాత్యముల వద్దనే. మహాత్యములను చూచి అదే నిజమైన దైవత్వమనుకొని, మాయ మార్గములో పోవువారు చాలామంది గలరు. దీనినిబట్టి మాయకు మహాత్యములు ఉన్నాయా! గురువుకు మహాత్యములు లేవా? అని మీరు ప్రశ్నించవచ్చును. దానికి యోగీశ్వరులవారి జవాబు ఏమనగా! మాయకు మహత్యములు ఉన్నప్పుడు మాయకంటే పెద్ద మరియు మాయను సృష్ఠించి పెట్టిన వానికి

మహత్యము లేకుండునా? గురువుకు కూడా మహాత్యములు కలవనే చెప్పవచ్చును. ప్రపంచములో గురువువలనా మహత్యము జరుగుచున్నది. అట్లే మాయ వలనా మహత్యము జరుగుచున్నది. కానీ, ఏది గురువు మహిమో! ఏది మాయ మహిమో ఎవరికీ తెలియకుండా ఉన్నది. దేవుడు కనిపించు మనిషిగా వచ్చి భూమిమీద ఉన్నప్పుడు అంతవరకూ అన్ని శరీరములలో గుణముల రూపములోనుండి ఆ శరీర జీవులను మాత్రము తన ఆధీనములో ఉండునట్లు చేసిన మాయ, కొన్ని శరీర జీవులను గురువుకు వ్యతిరేఖముగా బోధించునట్లు చేయును. కొన్ని శరీరములను దైవజ్ఞానమను పేరుతో తన మాయా జ్ఞానమును బోధించునట్లు చేసి, గురువులుగా ప్రవర్తించునట్లు చేయును. కొందరిని బాబాలుగా తయారు చేసి వారి చేత వారికి తెలియకుండానే ఎన్నో మహాత్యములను చేయించును. బాబాలచేత, మనుష్యులు కోరిన కోర్కెలన్నింటినీ నెరవేరునట్లు చేయును. ఈ వ్యవహారమంతయూ దేవుడు గురువుగా రాకముందే, ఒక పథకము ప్రకారము ముందు జాగ్రత్తగా మాయ కొన్ని సంవత్సరముల ముందునుండే చేయుట వలన, ప్రజలందరూ అప్పటివరకూ తయారైన మాయా గురువుల చేతిలోనూ, మహత్యములు కలిగిన మాయా బాబాల చేతిలోనూ చిక్కుకొని వారికి భజన చేస్తూ, వారివద్ద చేరిపోయి ఉందురు. అలా జరుగట వలన నిజ గురువు దగ్గరకు చేరువారు కరువై, అరుదై పోవుదురు. అట్లు మాయ అందరి తలలయందు గుణముల రూపములో ఉండి, మనుషులనుండియే తన ప్రాపంచిక గురువులను, బాబాలను తయారు చేసి, అక్కడక్కడ బాగా ప్రచారములో ఉండునట్లు చేయుచున్నది.

నిజ గురువు భూమిమీదకు వచ్చి, ఆయన జ్ఞానమును చెప్పడమే కాక, ఆ జ్ఞానమునకు కర్మను కాల్చుశక్తి ఉన్నదని తెలుపు నిమిత్తము,

ఎక్కడైనా జ్ఞానాగ్ని వలన ఒకని కర్మను కాలిపోవునట్లు చేయుచున్నాడు. ఉదాహరణకు ఒక రోగము అనుభవించు వానికి వాని కర్మను తన అగ్ని చేత కాల్చివేసి, రోగమును లేకుండా చేశాడనుకొనుము. అప్పుడు అది బయటికి మహత్యముగానే కనిపించును. జ్ఞానముయొక్క శక్తిని నిరూపించు నిమిత్తము, కర్మను కాల్చి లేకుండా చేయడము బయటి ప్రజలకు మహత్యమే అయినప్పటికీ, అది కూడా బహు అరుదుగా కొన్ని సందర్భములలో గురువు గారి సంకల్పముతో మహత్యమును ఆ విధముగా చూపవలసియున్నది. దానిని గురు మహత్యమే అనవచ్చును. మాయ మాత్రము రోగ సంబంధ కర్మనేకాక, మానవునికి సుఖములు కలుగజేయు అన్ని మహత్యములను బాబాల ద్వారా నెరవేరునట్లు చేయించును. ఇటువంటి మహత్యముల మత్తులో పడిన మనిషి ఇంతకంటే కష్టాలు తీర్చు దేవుడులేడంటూ, అతనినే ప్రత్యక్ష దైవమంటూ, నిజగురువువైపు కూడా చూడరు. అటువంటి వారి దగ్గర ఎవరైనా నిజగురువు యొక్క ప్రస్తావన తెచ్చి, గురువు జ్ఞానమును బాగా చెప్పుచున్నాడనగా వారి మాటను వినకపోగా, మా బాబాకంటే మించిన గురువే లేడందురు. ఈ విధముగా మాయ తన మనుషుల నుండి నిజ గురువుకు వ్యతిరేఖముగా, గురువులనూ, బాబాలను, స్వామీజీలను తయారు చేయడమేకాక, అసలుకు మహత్యమంటే తెలియని, అది ఎలా వారి పేరిట జరుగుతుందో తెలియని, ప్రాపంచిక గురువులను, బాబాలను, స్వామీజీలను భ్రమింపజేసి, అన్నీ వారి సొంత మహత్యములు గానే వారిది వారికి చూపును. అనేక రకములుగా మనుషులను మభ్యపెట్టి మాయ తనవైపులాగుకొనుచున్నది.

సాధారణ జీవాత్మకు గత జన్మ ఉండును. ఆ జన్మలో పాపము చేసి ఉండును. ఆ జీవాత్మ మరుజన్మలో పుట్టి రోగరూపములోనున్న

పాపమును అనుభవించాడంటే సరిపోవును. అది సాధారణ మానవుల మరియు రకరకాల జీవుల పద్ధతి. కానీ గురువుకు వెనుకటి జన్మలేదు. మరియు ఒకచోట మరణించి మరొకచోట పుట్టినవాడూ కాదు. అతనికి కర్మంటూ లేనేలేదు. అయినప్పటికీ గురువుకు రోగములు వచ్చుట వాస్తవమే. ఎవడైనా ప్రాపంచికములో ఒక బాధను అనుభవించాలి అంటే దానివెనుక ఒక తతంగముండాలి. ఒక బాధనే కాకుండా, ఏ చిన్న పని జరుగవలెనన్నా దానికి సంబంధించిన 'కర్మ' అను విధానముండాలి. ప్రతి చిన్న కదలికకు సంబంధించిన వ్యవహారమునకు కారణము ముందే నిర్ణయింపబడి ఉండును. అలా వ్రాసిపెట్టబడిన దానినే కర్మ అంటున్నాము. ఎవనికైనా కర్మ ఉంది అంటే, వాడు వెనుకటి జన్మలలో చేసుకొన్నదేనని బ్రహ్మవిద్యా శాస్త్రము తెలియజేయుచున్నది. ఇక్కడ గురువుకంటూ వెనుక జన్మలేనే లేదు. అయితే ఆయన భూమిమీద సంచరించి, మాట్లాడి ఎంతో చేయుటకు కావలసిన విధానము ముందే వ్రాసిపెట్టబడి ఉండదు కదా! అలాంటప్పుడు గురువు అను మనిషి ఎలా ఏ విధానము ప్రకారము సంచరించు చున్నాడని, ఎవరికైనా ప్రశ్నరాగలదు. దానికి యోగీశ్వరుల వారి జవాబు ఏమనగా! దేవుడు తన శక్తిలోని ఒక చిన్న భాగమును భూమిమీద గురువుగా సంచరింపజేయవలసి వచ్చినప్పుడు, దేవుడే గురు ఆకారమునకు కావలసిన కర్మ విధానమును తయారుచేసి, గురు శరీరము యొక్క కర్మచక్రములో వ్రాసి పంపును. అలా దేవుడు తన కర్మను తానే వ్రాసుకొని గురువుగా అవతరించుచున్నాడు. తనకు తానుగా ఆయన వ్రాసుకొన్న కర్మయొక్క ప్రకారము తనను ఎవరూ గుర్తించనట్లు, అందరివలే అన్ని బాధలు అనుభవించునట్లు, తనకు ఎలా ఇష్టమయితే అలా, అప్పటి కాలములో భూమిపైనున్న పరిస్థితులను కూడా అంచనా వేసుకొని, తను నిర్ణయించు

కొనిన ప్రకారము వచ్చియుండును. ఆ నిర్ణయమును అనగా కర్మ విధానమును ఏ జ్యోతిష్యమూ గుర్తించలేదు. మానవుని కర్మను జాతకము ప్రకారము జ్యోతిష్య శాస్త్రము వలన కొంతకు కొంతైనా గుర్తించవచ్చును. కానీ జాతకమే లేని గురువుకు జ్యోతిష్యము 'కర్మ'ను కనుగొనలేదు. అందువలన గురువు ఎప్పుడు ఎలా ప్రవర్తించునో ఏ జ్యోతిష్యుడు చెప్పలేడు.

సాధారణ మనిషికి రోగములు వచ్చినట్లే గురువుకు కూడా రోగము రావడము, అనుభవించడము అన్నీ జరుగుచుండును. ప్రతి బాధను, ప్రతి సంఘటనను, ప్రతి కదలికను ఆయన నిర్ణయించుకొని వచ్చినవేనని ఎవరికీ తెలియదు. చూచువారందరికీ సాధారణ మనిషిగా కనిపించువాడు తన కర్మను తానే నిర్ణయించుకొని వచ్చాడని, ఇతరులెలా అనుకుంటారు? ఆయన గురువనే విషయమే ఎవరికీ తెలియనప్పుడు, ఆయన స్వయముగా పుట్టిన 'స్వయంభూ' అని తెలియనప్పుడు, ఆయన కర్మ విషయము ఎవరికీ తెలియదు. సర్వసాధారణ మనిషి ఏ విధముగా కర్మలననుభవించుచున్నాడో, ఏ విధముగా రోగములను పొందుచున్నాడో, ఏ విధముగా ప్రవర్తించు చున్నాడో అనుభవించు కర్మలనుబట్టిగానీ, ఆచరించు పనులనుబట్టిగానీ ఆయన గురువని ఎవరూ నిర్ణయించి చెప్పలేరు.

ఒక విధముగా గురువును ఎవరూ సర్వసాధారణముగా గుర్తించ లేరనియే చెప్పాలి. ఇంకొక విధానము ప్రకారము గుర్తించవచ్చునేమోనని కూడా చెప్పవచ్చు. ఎందుకనగా గురువు హోదాలో శ్రీకృష్ణుడు భూమిమీద ప్రత్యక్షముగా ఉన్నప్పుడు ఎవరూ ఆయనను గుర్తించలేకపోయినా, ఒకే ఒక భీష్ముడు గుర్తించగలిగాడు. అదే విధముగా శ్రీకృష్ణుడు భూమిమీద లేకుండా పోయిన తరువాత ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన మీరాబాయి, ఆయన ఫలానావాడనే సత్యమును గుర్తించగలిగింది. శ్రీకృష్ణుడు ప్రత్యక్షముగా

ఉన్నప్పుడు భీష్ముడు, పరోక్షముగా ఉన్నప్పుడు మీరాబాయి గుర్తించగలిగారంటే గురువును గుర్తించుటకు ఏదో ఒక విధానము ఉన్నదని తెలియుచున్నది. వారికి తెలిసిన దారి ఏదో మనకు తెలియదు. కానీ, గురువు చెప్పిన జ్ఞానమునుబట్టి, అందులోని ధర్మములనుబట్టి, ఇటువంటి ధర్మమును, జ్ఞానమునూ గురువు తప్ప ఎవరూ చెప్పలేరని గ్రహించుటకు అవకాశముకలదు. కానీ ఇక్కడ వచ్చిన చిక్కంతా ఆయన చెప్పిన జ్ఞానమును గుర్తించగలమా లేదా? అన్నదే ప్రశ్న.

వందేళ్ళ నుండి మాయ తన గురువులను, స్వాములనూ, బాబాలను మతపెద్దలను ప్రవేశపెట్టి వారిని దాటి ప్రజలు రాకుండా చేసినది. ఎంతోమందికి మతపెద్దలు, పేరు ప్రఖ్యాతులు పొందిన స్వామీజీలు చెప్పిన బోధలు రుచించి ఉండగా, గురువు చెప్పు ప్రతి బోధ వారికి వ్యతిరేఖకముగా, విడ్డూరముగా పంటిక్రింద రాయిలా కనిపిస్తుండును. పేరుగడించిన స్వామీజీలు చెప్పిన బోధను మతపెద్దలు చెప్పిన హద్దులను వదలి పేరులేనివాడు చెప్పుబోధను వినుటకు వారికి చాలా బాధగా ఉండును. అదికూడా, అన్నిటికీ వ్యతిరేఖముగా కనిపించు బోధను ఎవరయినా ఆశ్రయించగలరా? శాస్త్రబద్ధమైన జ్ఞానము, ధర్మము తెలియనప్పుడు గురువును వాటి ద్వారా గుర్తించుట ఒక రకముగా కత్తిమీద సామే అగును. అయితే ఆనాటి భీష్ముడుకానీ, నిన్నటి మీరాబాయిగానీ ఆయన చెప్పిన జ్ఞానము మరియు ధర్మములను ఆధారము చేసికొని శ్రీకృష్ణుడు ఫలానావాడని గుర్తించలేదు. అటు ద్వాపరయుగములోని భీష్మునికిగానీ, ఇటు కలియుగములోని మీరాబాయికి గానీ శ్రీకృష్ణుడు చెప్పిన ధర్మములు తెలియవు. కనుక వారు గుర్తించిన విధానమేదో ప్రత్యేకముగా ఉండి తీరాలి. అది మనకు అర్థము కాలేదు. ప్రస్తుతము మనకు ఆ విధానము ఏదో తెలియదనియే చెప్పుకోవచ్చును.

శరీరమును ధరించినవాడు తిరిగి దానిని వదలవలసిందే అన్నది సూత్రము మరియు జగమెరిగిన సత్యము. శరీరమును ధరించినది సాధారణ జీవాత్మ కావచ్చును, లేక దేవుడగు గురువయినా కావచ్చును. ఎవరైనా సరే, సూత్రము ప్రకారము అందరూ శరీరమును వదలి పోవలసిందే. అందువలన గురువు కూడా అందరివలే శరీరమును వదలిపోవును. “జాతస్య హి ధృవో మృత్యుః” అను భగవద్గీతా వాక్యము ప్రకారము పుట్టినవాడు మరణించవలసిందే. అయితే భగవద్గీతలో అక్షర పరబ్రహ్మ యోగమునందు మరణముల వివరమును చూస్తే అందరికీ చావు తప్పనిసరి. అయినా అన్ని మరణములలో మోక్షము పొందునవి, మోక్షము పొందనివి అని రెండు రకముల విధానములున్నవి. అంతేకాక సాధారణ మనుష్యుల మరణము వేరు, యోగుల యొక్క మరణములు వేరువేరుగా ఉన్నవి. ఇప్పుడు గురువు యొక్క మరణమును సాధారణ మనుష్యుల మరణములోనికి చేర్చవలెనా లేక యోగుల మరణములోనికి చేర్చవలెనా అను సంశయము రావచ్చును. గురువు సాధారణ మనిషివలే నటించినా ఆయన మనకు తెలిసినా, తెలియకుండినా, నిజమైన యోగియేనని చెప్పవచ్చును. అట్లని సాధారణ యోగికూడా కాదు. యోగీశ్వరుడు అనగా యోగులకే ఈశ్వరు డయినటువంటి వానిని రెండు రకముల మరణములలో, యోగుల మరణము లోనికే లెక్కించవలెను.

బ్రహ్మవిద్యా శాస్త్రమైన భగవద్గీతయందు అక్షర పరబ్రహ్మ యోగములో యోగుల మరణములలో కూడా విశ్లేషణ కలదు. యోగులు ఏ సమయములో చనిపోతే మోక్షమును పొందుదురో, ఏ సమయములో చనిపోతే మోక్షమును పొందరో అను విషయము ఆ విశ్లేషణలో కలదు. గురువు మరణము యోగుల మరణములోనికి లెక్కించి చూచినా, ఆ యోగుల

మరణములో మోక్షము పొందెడిదా లేక పొందనిదా? అని కూడా చూడవలసియున్నది. యోగుల యొక్క రెండు రకముల మరణములు అనునవి ఏవి? అని చూస్తే అవి మరణించు సమయమును బట్టి విభజింప బడియున్నవని తెలియుచున్నది. ఒకటి యోగి మోక్షమును పొందు మరణము అనగా! పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణములో ఉండును. రెండవది యోగి మోక్షమును పొందని మరణము ఏది అనగా! రాత్రి, కృష్ణ పక్షము, దక్షిణాయణములో ఉండును. దీనిప్రకారము సమస్త యోగుల మరణమును లెక్కించి చూడవల సిందే. అయితే ఇక్కడ గురువు యోగియే, అయినా ఆయన అందరూ మరణించినట్లు మరణిస్తే కదా! మనము ఆయన మరణమును విశ్లేషించి చూడగలము.

గురువు తల్లిగర్భమునుండి శరీరము ధరించి పుట్టినరోజు కూడా చైతన్యముతో పుట్టి 'భగవంతుడు' అనిపించుకొన్నాడు. అలాగే శరీరమును వదలి చనిపోయిన రోజుకూడా ప్రత్యేకత కలిగియున్నాడు. ఆ ప్రత్యేకత ఏమి అనగా! గురువు (దేవుడు)నకు పుట్టుక లేదు మరియు చావుకూడా లేదు. చావుపుట్టుకలు లేనివాడు గురువు. చావు, పుట్టుకలనునవి సాధారణ జీవరాశులకు మాత్రమేనని ఇక్కడ గుర్తుంచుకోవలెను. అయినా గురువు చావుపుట్టుకలున్నట్లు నటించుచుండును. గురువు శరీరమును ధరించి, పుట్టినప్పుడు ఎవరూ పుట్టనట్లు చైతన్యముతో పుట్టాడు. అలాగే శరీరమును వదలిపోవునప్పుడు, శరీరమును వదలి బయటికి పోకుండా శరీరములో పరమాత్మయందు అణిగిపోయాడు. శరీరములోనికి అణిగిపోయిన గురువు విశ్వవ్యాపి అయిపోయాడు.

కర్మశేషము లేకుండా కర్మను పోగొట్టుకొన్న యోగి మరణిస్తే పగటి కాలము శుక్లపక్షమునందు ఉత్తరాయణ కాలములో మరణించునని చెప్పు

కొన్నాము కదా! అలా మరణించు సమయములో యోగి శరీరములోని జీవుడు మొదట ఆత్మయందు కలసి ఆత్మగా మారిపోవును. అలా జీవాత్మ కలిసిన ఆత్మ, శరీరములోనే ఉన్న పరమాత్మలోనికి ఐక్యమైపోవును. ఈ విధముగా మోక్షమును (దైవమును) పొందు యోగి శరీరములో జరుగు మోక్షమను విధానము కలదు. కానీ గురువు మరణిస్తే అది యోగుల మరణముల మాదిరి కూడా ఉండదు. జీవాత్మ ఆత్మలోనికి, ఆత్మ పరమాత్మ లోనికి కలిసిపోవడమంటూ గురువు శరీరములో జరుగదు. ఆయన మొదటికే జీవుడూ కాదూ, ఆత్మాకాదు. గురువు శరీరములో, యోగి శరీరములో ఉన్నట్లు జీవుడూలేడు, ఆత్మాలేదు. **గురువు సాక్ష్యాత్తూ పర బ్రహ్మస్వరూపము.** కావున గురువు మరణమును యోగుల మరణములో చూచినట్లు, ఈయన దేవునియందు ఐక్యమైనాడా లేదా అని చూడవలసిన పనేలేదు. అందువలన యోగుల మరణములో చూడవలసిన కాలము గురువునకు వర్తించదని తెలియాలి. అయిపోయిన పెళ్ళికి మేళమేల! అన్నట్లు దేవుడై ఉన్నవానిని దేవుడైనాడా లేదా? అని చూడవలసిన పనిలేదు. అలాగే మోక్షమే తానైయున్న గురువును మోక్షము పొందునా, పొందడా? అని చూడవలసిన పనిలేదు. కావున ఆయన ఏ కాలములో చనిపోయినా ఆయన ఆయనే. ఆయనకు పుట్టుకలేదు, అలాగే చావూలేదు. అయినా శరీరమును ధరించినప్పుడు పుట్టునట్లు భ్రమింపజేశాడు. అలాగే చనిపోవునప్పుడు మరణించినట్లు భ్రమింపజేశాడు. మనిషికి దేవునికి చావు పుట్టుకలో ఎంత తేడా ఉందో తెలియాలంటే **త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల** వారు రచించిన సంచలనాత్మక గ్రంథము **"జనన మరణ సిద్ధాంతము"** ను చదవండి. ఇప్పుడు కొంత గురుపౌర్ణమి గురించి తెలుసుకొందాము.

ఆది, అంత్యములు లేనివాడను అర్థము కలిగిన గురువును గుర్తు చేసుకొని, సంపూర్ణ జ్ఞానముగా పున్నమి చంద్రుని దినమైన పౌర్ణమిని 'గురు పౌర్ణమి'గా తలచి భగవంతుడైన గురువును ఆరాధించడమే గురుపౌర్ణమి యొక్క అంతరార్థము. పౌర్ణమి అనగా చంద్రుడు సంపూర్ణముగా కనిపించు దినము. గురువు సంపూర్ణ జ్ఞానముకలవాడు. భూమియంతటికీ ఒకే చంద్రుడున్నట్లు ఎల్ల ప్రపంచమునకంతటికీ ఒకే గురువు కలడు. చంద్రుడు కనిపిస్తున్నప్పటికీ అతని వెన్నెలలోని ఔషధ శక్తికి మూల కారణము పరమాత్మ. అలాగే గురువు స్థూలముగా కనిపించు శరీరము గల వ్యక్తి అయినప్పటికీ, అతనిలోనున్న జ్ఞానశక్తికి మూలము కనిపించని పరమాత్మ. ఆకాశములో చంద్రుడు వెన్నెలతో ప్రకాశిస్తే, భూమిమీద గురువు జ్ఞానముతో ప్రకాశిస్తాడు. ఈ విషయము తెలియుటకు పూర్వము పెద్దలు గురువును, పౌర్ణమిని ఏకము చేయుచూ 'గురుపౌర్ణమి' అని ఒక పౌర్ణమిని ప్రత్యేకముగా ఎంచుకొన్నారు. 'గురుపౌర్ణమి' ఎంతో ప్రత్యేకత కలిగియున్నది. పౌర్ణమి అందరికీ తెలిసినదేకానీ, గురువే అందరికీ తెలియనివాడు.

చంద్రుడు భూమిమీద చెట్లకు ఔషధశక్తి నిచ్చినట్లు, గురువు భూమిమీద మనుషులకు జ్ఞానశక్తిని ఇవ్వగలడు. చంద్రకాంతి పడిన చెట్లు మాత్రము ఔషధశక్తిని పొందునట్లు, గురువు మీద భక్తి, శ్రద్ధ, వినయములు కల్గినవారు మాత్రమే జ్ఞానమును కల్గి, జ్ఞానశక్తిని పొందు దురు. చంద్రకాంతి పడని చెట్లు చంద్రుని అమృతమును పొందక ఔషధ శక్తిని సంపాదించుకోలేనట్లు, గురువు ఎడల వినయము, భక్తిలేనివారు జ్ఞానమును పొందక, జ్ఞానశక్తిని సంపాదించుకోలేరు. చంద్రుడు అమృత మయుడైనట్లు గురువు నాశనరహిత జ్ఞానమయుడు. చంద్రకాంతికి చెట్లు

ఔషధములైనట్లు, గురువును వినయముగా సేవించిన మనుషులు జ్ఞానధనులు కాగలరు. ఒకే చంద్రకాంతి చెట్లలో మూలిక శక్తియై రోగుల ఎడల ఔషధముగా, ఆరోగ్యవంతుల పట్ల రోగముగా ఎట్లు పరిణ మించుచున్నదో, అట్లే ఒకే గురు జ్ఞానము జ్ఞానశక్తిగా మారి విధేయుల ఎడల కర్మ నిర్మూలనము చేయునదిగా, అవిధేయులపట్ల కర్మను అంటగట్టు మాయగా తయారగుచున్నది. ఒకే ఔషధము విష నివారిణిగా మరియు విషముగా ఎట్లుగలదో, అదే విధముగా ఒకే జ్ఞానము కర్మ నివారణ చేయు జ్ఞానశక్తిగా మరియు కర్మను అంటగట్టు మాయగా ఉన్నది.

గురువు నిండు పౌర్ణమిలాంటివాడు. చంద్రుడు స్వచ్ఛమైన ఆకాశములో ఉన్నప్పుడు మంచి వెన్నెల నివ్వగలడు. చంద్రునికి మేఘములు అడ్డువచ్చినప్పుడు చంద్రకాంతియున్ననూ, ఆ కాంతి మనవరకు చేరదు. అలాగే శిష్యుల భావము స్వచ్ఛత కల్గినప్పుడే, గురువు మంచి జ్ఞానమునంది వ్వగలడు. గురువు ముందర 'మాయ' అను మేఘములు ఆవహించిన శిష్యులున్నప్పుడు గురువు జ్ఞానము పవిత్రమైనదైననూ, అది కలుషితము గానే కనిపించును. చంద్రుడు ఒక్కడే, చంద్రకాంతియూ ఒకటే, క్రింద చెట్లు అనేకరకములు గలవు. అలాగే గురువు ఒక్కడే! గురు జ్ఞానము ఒక్కటే! తెలుసుకొను మనుష్యులు మాత్రము అనేకరకములుగా ఉన్నారు. చంద్రుడు కనిపిస్తాడు కానీ దొరకడు. అలాగే గురువు కనిపిస్తాడుకానీ, ఎవరికీ అర్థము కాడు. చంద్రుడు చేతికి దొరకకపోయినా, చంద్రకాంతిని మనము అనుభవించుచున్నాము. అలాగే గురువు మన మెదడుకు అర్థము కాకపోయినా, ఆయన జ్ఞానమును మనము అనుభవించెదము. చంద్రుడు కొంతకాలము క్షీణ చంద్రుడైపోతాడు. మరికొంతకాలము వృద్ధిని పొందు చంద్రుడై కనిపిస్తాడు అలాగే గురువు ఒకప్పుడు జ్ఞానహీనునిగా కనిపిస్తాడు

మరియొకప్పుడు జ్ఞానతేజునిగా అగుపిస్తాడు. చంద్రుడు అమావాస్య దినమున కనిపించక పౌర్ణమి దినమున సంపూర్ణ జ్ఞానిగా కనిపిస్తాడు. జ్యోతిష్యశాస్త్రములో చంద్రుడు, జ్ఞాన ప్రతినిధి మరియూ జ్ఞానమునకు అధిపతి. అలాగే బ్రహ్మవిద్యా శాస్త్రములో గురువు ప్రతినిధి, మరియు దైవజ్ఞానమునకు అధిపతి. ఈ విధముగా చెప్పుకుంటూ పోతే గురువుకు చంద్రుని వెన్నెలకూ, అవినాభావ సంబంధముండునట్లు పెద్దలు సంవత్సరములో ఒక పౌర్ణమిని అదియూ ఆషాఢ మాసములో వచ్చు పౌర్ణమిని గురుపౌర్ణమిగా నియమించి ఆచరించడము జరుగుచున్నది. నేడు గురువులుగా చెలామణి అగుచున్న చాలామందికి 'గురువు' అంటే అర్థము గానీ, భగవంతుడంటే అర్థముగానీ, పరమాత్మ అంటే అర్థముగానీ, దేవుడంటే అర్థముగానీ తెలియకుండాపోయినది. ఒక్కొక్క పదమునకు ఒక్కొక్క ప్రత్యేకమైన నిర్వచనము, భావముకలదని తెలియనివారు, వారికి ఇష్టమొచ్చి నట్లు చెప్పుకొనుచున్నారు. సాకారముగా ఉన్నవాడు భగవంతుడు లేక అవధూత అనీ, నిరాకారముగా ఉన్నవాడు పరమాత్మలేక దేవుడనీ చాలామందికి తెలియదు. అందువలన 'భగవంతుడు' అని చెప్పవలసిన చోట దేవుడని పలుకుచున్నారు. దీనినిబట్టి వీరికి లింగభేదము, అంగభేదము రెండూ తెలియవని అర్థమగుచున్నది.

ఆకాశములో ఒక్క సమయములో ఒక్క చంద్రుడే ఉండునట్లు భూమి మీద ఒక్క సమయములో ఒక్క గురువే ఉండును. ఆ సమయములో మిగతా వారందరూ బోధకులౌతారుగానీ గురువులు కారు. గురువుకు, బోధకునికి తారతమ్యము తెలియనివారందరూ, పొరపడి తాము గురువులమనుకొనుచున్నారు. చుక్కలలో చంద్రునివలే, బోధకులలో గురువుండును. వేలు, లక్షలు ఎన్ని నక్షత్రములుండినప్పటికీ అమావాస్య

దినమున వెలుగు లేనట్లు, భూమిమీద గురువు లేనప్పుడు ఎందరు బోధకులుండినా జ్ఞాన వెలుగు నివ్వలేరు. బోధించు బోధకుడు తాను గురువుననుకోవడము ఎట్లుండునంటే మిరగడ పువ్వు తాను చంద్రుడనను కొన్నట్లుండును.

'గురువు లేని విద్య గ్రుడ్డివిద్య' అనుమాట అందరికీ సుపరిచితమే. పూర్వము చాలామంది అనెడివారు. ప్రస్తుత కాలములో ఆ మాట బహు అరుదుగా వినిపిస్తున్నది. దీని అర్థము ప్రకారము ఏ విద్యకైనా గురువు లేకుండా ఎంత నేర్చుకొన్నా అది గ్రుడ్డివిద్యేనని పూర్వము పెద్దలనెడివారు. ఈ మాట వాస్తవమేనా? అని పరిశీలించి చూస్తే, ఏకలవ్యుడు విలువిద్యను గురువు నేర్పకున్ననూ, పట్టుదలగా నేర్చుకోగలిగాడు. ఆయనకది గురితప్ప కున్ననూ డ్రైవరు విద్యను నేర్చుకొని వాహనములను నడుపువారు కలరు. గురువులేకనే స్వయానా సంగీతము నేర్చుకొని గానగంధర్వుడని పేరుగాంచిన గాయకుడు బాల సుబ్రమణ్యములాంటివారూ గలరు. అలాగే కొన్ని విద్యలను కొందరు గురువు లేకుండానే అవలీలగా నేర్చుకోగలిగి, వాటిలో ప్రావీణ్యత పొందినవారూ గలరు. ఇటువంటివన్నియూ గమనిస్తే 'గురువులేని విద్య గ్రుడ్డివిద్య' అనుమాట సత్యమేనా అని అనుమానము రాకతప్పదు. ఇటువంటి సందర్భములో మనము బాగా యోచించవలసిన పనియున్నది. తీక్షణముగా యోచించి చూస్తే 'గురువులేని విద్య గ్రుడ్డివిద్య' అనుమాటలో మూడు ముఖ్యమైన పదములు గలవు. అవి ఒకటి 'గురువు' రెండు, 'విద్య' మూడు 'గ్రుడ్డివిద్య. ఈ మాట ముఖ్యముగా విద్యను గురించి చెప్పిన మాట కావున రెండవ భాగమైన విద్యను గురించి వివరించుకొని చూస్తాము.

'విత్' అను పదమునుండి పుట్టినది 'విద్య' అను పదము. విత్ అనగా తెలియడము అని అర్థము. దాని ప్రకారము ఏదైతే తెలియగల్గు చున్నామో లేక నేర్వగలుగుచున్నామో దానిని 'విద్య' అంటున్నాము. దేనినైతే తెలియుచున్నామో, దానినే 'జ్ఞానము' అంటున్నాము. అలాగే దేనినైతే తెలియలేకున్నామో దానిని 'అజ్ఞానము' అంటున్నాము. దీని ప్రకారము విద్యను జ్ఞానము అనియూ, అవిద్యను అజ్ఞానమనియు అంటున్నాము. అదే విధముగా తెలిసిన దానిని విద్య లేక జ్ఞానము, తెలియని దానిని అ విద్య లేక అజ్ఞానమని అంటున్నాము. అదే విధముగా తెలిసిన దానిని విద్య లేక జ్ఞానము, తెలియని దానిని అవిద్య లేక అజ్ఞానమని అందరికీ అర్థమైపోయి ఉంటుంది. ఇప్పుడు విద్యనుగానీ, అవిద్యనుగానీ విభజించి చూస్తే రెండు రకములుగా ఉన్నవని తెలియుచున్నది. అవియే ఒకటి ప్రపంచ విద్య, రెండవది పరమాత్మ విద్య. ఈ రెండు విద్యలలో గురువు లేని విద్య అని దేనిని అన్నారని చూస్తే, పరమాత్మ విద్యనేనని తెలియు చున్నది. ఎందుకనగా, ప్రపంచ విద్యలను గురువు లేకుండానే నైపుణ్యముగా నేర్వగలుగుచున్నారు. ఆ విద్యలోని ఫలితమును పొందుచున్నారు. అందువలన వృథాకాని పెద్దలమాట, పరమాత్మ విద్యను గురించి చెప్పినదని తెలియుచున్నది. దీనినిబట్టి 'గురువులేని విద్య' అను దానిని ఒక పరమాత్మ జ్ఞానముపట్ల మాత్రమే లెక్కించి చూడవలసియున్నది. ఈ మాట ప్రపంచ జ్ఞానమునకుగానీ, లేక ప్రపంచ విద్యకుగానీ వర్తించదని తెలియాలి.

ఇప్పుడు 'గురువు' అను పదమును చూస్తే విద్యనుబట్టి ఈ పదము కూడా ప్రపంచ విద్యకు వర్తించదని తెలియుచున్నది. అందువలన గురువును ఒకే ఒక పరమాత్మ విద్య అయిన బ్రహ్మజ్ఞానముపట్ల మాత్రము చూడాలి. ఇప్పుడు అటువంటి గురువులను గమనిస్తే దైవజ్ఞానమను పేరుతో ఎన్నో

జ్ఞానములను తెలుపువారు గలరు. ఎన్నో జ్ఞానములని ఎందుకంటున్నా మంటే, ఒకదానికొకటి కొంత భిన్నముగా ఉండును కనుక అలా చెప్పవలసి వచ్చినది. నేడు బోధింపబడు విద్యలన్నీ దేవున్ని తెలుపునవేనా? బోధించు వారందరూ గురువులేనా? అని ప్రశ్నించుకొని చూస్తే, ఏ ఒక్క విద్య వలన దేవున్ని చూడలేకపోవుచున్నాము. దీనినిబట్టి ఇది గ్రుడ్డివిద్య అని ఒక్కొక్క దానిని తీసివేయవలసి వస్తున్నది. దేవున్ని తెలుపలేని విద్య ఏదైతే ఉన్నదో, దానిని బోధించిన వాడు గురువుకాదని తెలియుచున్నది. గురువులేని విద్య గ్రుడ్డిది అయినప్పుడు, గ్రుడ్డి విద్యను నేర్పినవానికి గురువు లేదనియేగా అర్థము. దైవజ్ఞానమను పేరుపెట్టి బోధించువాడు గురువు కాదు. అటువంటి వాడు బోధకుడే అవుతాడు కానీ, గురువు కాడు. దేవున్ని తెలియజేయు బోధ చూపుకల్గినది కావున, అటువంటి జ్ఞానమును బోధించినవాడు మాత్రమే 'గురువు' అగును. 'భూమిమీద పుట్టిన మనిషి ఎవడూ గురువుకానేకాడు. భూమిమీద పుట్టని మనిషి మాత్రమే గురువు కాగలడు' నేడు శ్రీకృష్ణుడు చెప్పిన భగవద్గీతను బోధించువారుండినప్పటికీ, శ్రీకృష్ణుడు చెప్పిన భావమునకు వేరుగా బోధిస్తున్నారు. కావున వారిని సరియైన బోధకులు కూడా కాదనియే చెప్పవచ్చును. ఇంతకుముందే ఇతరుల చేత బోధింప బడిన దానిని బోధించువాడు బోధకుడే అవుతాడు. గురువు ఎప్పటికీ ఇతరులు బోధించిన దానిని బోధించడు అని చెప్పబడినది. గురువు బోధించునది గురువుకు తప్ప ఎవరికీ తెలియదు. కావున ఎవరూ చెప్పనిబోధను కానీ, ఎవరూ వ్రాయని జ్ఞానమునుగానీ చెప్పినవాడే గురువు. ఈ సూత్రము ప్రకారము ఇప్పుడున్న వారు ఎవరు బోధకులో, ఎవరు గురువులో మీరే లెక్కించి తేల్చి కనుగొనవచ్చును.

ప్రత్యక్షముగా గురువు ఉండి చెప్పిన బోధను ఆశ్రయించడము వలన, అది జ్ఞానమార్గమును బాగా చూపించి గమ్యము చేర్చును. పుట్టిన

ప్రతి మనిషికీ ముక్తిని పొందడము ముఖ్యము. ముక్తి అనునది గమ్యము కాగా, జ్ఞానముమార్గముకాగా, గురువు దారిని చూపించు దీపమై యున్నాడని గ్రహించవలెను. దీపము లేకుండా మార్గములో పోలేము. దీపము లేని ప్రయాణము అంధకారమయమని తెలియవలెను. అందువలన గురువులేని జ్ఞానము గ్రుడ్డివాని ప్రయాణములాంటిదని చెప్పవచ్చును. నేడు బోధించువారందరిలో ఏ ఒక్కడూ గురువు లేనప్పుడు, బోధించబడు బోధలలో ఏ ఒక్కటి గురువు చెప్పినది కానప్పుడు, అది గ్రుడ్డి విద్యకాక ఏమగును? అటువంటి దానినే 'గురువులేని విద్య గ్రుడ్డివిద్య' అన్నారు. ఒకవేళ గురువువని పేరుపెట్టుకొన్నవానివైతే నీవు గురువువో, బోధకునివో సూత్రము ప్రకారము చూసుకో! ఒకవేళ నీవు బోధకునివైతే నీవు బోధించు బోధ, భగవద్గీతలో గురువు చెప్పినదో, కాదో సూత్రము ప్రకారము చూచుకో! ఒకవేళ నీవు భగవద్గీతనే బోధిస్తూ ఉంటే, అది గురువు చెప్పినట్లు ఉందో లేదో చూచుకో! ఒకవేళ నీవు బోధలు తెలుసుకొనే వానివైతే, నీవు ఆశ్రయించి నది గురువునా? బోధకుడనా అని చూసుకో! ఒకవేళ నీవు బోధకుని ఆశ్రయించియుంటే నీవు వింటున్న బోధలుగానీ, నీవు చదువుతున్న బోధలు గానీ నిజమైన గురుబోధలో కాదో చూచుకో! ఒకవేళ నీకు గురుబోధలు తెలియకుండా, బోధకుల బోధలు మాత్రమే తెలియుచుంటే, అవి గ్రుడ్డి విద్యలేనని, మోక్షమును చేర్చలేవని తెలుసుకో! ఒకవేళ ఇంతవరకూ గురువును ఆశ్రయించక బోధకున్ని ఆశ్రయించినా, గురువు యొక్క జ్ఞానము తెలియక బోధకుల మతవర్గ బోధలనే తెలిసియుండినా "గురువులేని విద్య గ్రుడ్డివిద్య" అనుమాట నీకు పూర్తి వర్తించుచున్నదని తెలుసుకో! ఇప్పటి నుండైనా గురువునుగానీ లేక గురువు యొక్క బోధనుగానీ ఆశ్రయించి వెలుగులో ప్రయాణించవలెను.

గురువు గుర్తింపబడని వాడైనా, గురువు దేవునితో సమానమనీ, గురువు స్వయముగా బోధించగడలనీ, గురువు ఇతరులను అనుసరించడనీ తెలియుట వలన, ఉన్నవారిలో ఎవరికి గురువు యొక్క లక్షణములున్నాయో చూచి తెలుసుకోవచ్చును. ఇప్పుడు ప్రధానమైన దేవుని మూడు గ్రంథములను చెప్పిన ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులుండగా, ఒకరు గ్రహముగాయున్నారు. వారు శ్రీకృష్ణుడు, ఏసుప్రభువు ఇరువురూ ఇద్దరు వ్యక్తులుకాగా, జిబ్రయేల్ అను గ్రహము కనిపించే వ్యక్తియే కాదు. వ్యక్తి అనగా వ్యక్తమవువాడు లేక కనిపించువాడని అర్థము. ఒక వ్యక్తికాని జిబ్రయేల్‌ను వక్త, ప్రవక్త, దూత, ప్రదూతయని చెప్పినా, అతను గురువా? కాదాయని చూడవలసిన అవసరమున్నది. జిబ్రయేల్ ఎవరైనదీ తెలిస్తే, ఆయన చెప్పిన బోధ ఎటువంటిదో తెలియవచ్చును. అందువలన జిబ్రయేల్ గురించి కొంత తెలుసుకొందాము.

మనుషులకు దేవునికి మధ్యలో సంబంధముగా యున్నది దేవుని జ్ఞానము. దేవునికీ మనిషికీ మధ్యలో సంబంధ బాంధవ్యములు కల్పించు జ్ఞానమును మొదట ప్రజలకు దేవుడే చెప్పాడు. దేవుడు భూమిమీద ప్రజలకు మూడు విధములుగా తన జ్ఞానమును తెలియజేశాడని పవిత్ర ఖురాన్ గ్రంథములో 42వ సూరా 51 ఆయత్‌నందు ఈ విధముగా కలదు. **(42-51) "దేవుడు ప్రత్యక్షముగా ఎవరితోనూ మాట్లాడడు. దేవుడు తన జ్ఞానమును ఒకటి 'వహీ' ద్వారా (వాణి ద్వారా) తెలియజేస్తాడు, రెండు తెరవెనుక నుండి తెలియబరుస్తాడు. మూడు తన దూతద్వారా (తన ప్రతినిధి ద్వారా) జ్ఞానమును తన ఆజ్ఞానుసారము తెలియజేస్తాడు. ఆయన మహోన్నతుడు, వివేకవంతుడు"**అని కలదు. ఈ వాక్యమును జిబ్రయేల్, ప్రవక్తగారయిన ముహమ్మద్ గారికి తెలియజేశాడు. ఈ

విషయమును మొదట దేవుడు చెప్పగా, దానినే జిబ్రయేల్ రెండవ వ్యక్తిగా, ప్రవక్తగారికి హీరా గుహలలో తెలియజేశాడు. చెప్పినది జిబ్రయేలే అయినా, వాక్యమంతయూ, వాక్యములోని సారాంశమంతయూ దేవునిదే.

ఇక్కడ జిబ్రయేల్ చెప్పిన వాక్యములో దేవుడు తన జ్ఞానమును శబ్దము ద్వారా, ఆకాశవాణి ద్వారా తెలియజేస్తానని చెప్పాడు. ఇక్కడ బాగా వివరముగా తెలియగోరితే, దేవుడు మనుషులకు జ్ఞానమును తెలియజేయాలని సంకల్పించుకొన్నాడు. దేవుడు అనుకొనేవాడేగానీ, చేసేవాడు కాదు. అలా దేవుడు అనుకొన్న వెంటనే ఆయన పనిని చేయుటకు ముందు అవకాశముగలవారు మహా భూతములు ఆ తరువాత భూతములు, ఉపభూతములు, గ్రహములు, ఉపగ్రహములు ఒకరి తర్వాత ఒకరు అవకాశము కొరకు చూచుచుందురు. ఇలాంటి స్థితిలోనున్న దేవుని పాలనలోని మహాభూతము అయిన ఆకాశము, మొదట దేవుని జ్ఞానమును స్వయముగా శబ్దరూపముగా బయటకు పంపినది. అప్పుడు ఆ శబ్దము ఖగోళములోని ఆకాశమునకు ఆనుకొనియున్న సూర్యుడు వినడము జరిగినది. తరువాత అతని ద్వారా దేవుని జ్ఞానము భూమికి చేరినది. భూమికి సూర్యునిద్వారా చేరిన జ్ఞానము గ్రంథరూపముగా వ్రాయబడలేదు. మొదట ఆకాశ శబ్దము ద్వారా ఒక విధముగా జ్ఞానము తెలియబడగా, రెండవ విధముగా తెరవెనుక నుండి భూమిమీద మనుష్యులకు తెలియ జేయడము జరిగినది. రెండవ విధానములో కూడా శబ్దమే జ్ఞానమును చెప్పినా, ఆ శబ్దము తెరవెనుక కనిపించకుండా ఉండేవాని నుండి వచ్చినది. ఇక్కడ ఎవరు మాట్లాడుచున్నది తెలియక, కేవలము మాటలు మాత్రము వినిపించుట చేత దానిని 'తెరవెనుక నుండి చెప్పడము' అని వర్ణించారు. తెరవెనుకనుండి అంటే అక్కడ గుడ్డ తెరగాయున్నదేమో! అని అనుకోకూడదు.

చెప్పేవాడు కనిపించలేదు. కావున దానిని అర్థము చేసుకొనుటకు తెర వెనుకనుండి అని చెప్పడము జరిగినది.

ఖుర్ఆన్ దైవగ్రంథములోని 42వ సూరా 51వ ఆయత్‌లోని ఈ వాక్యము కూడా ముహమ్మద్ ప్రవక్తగారికి వినిపించినదని తెలియవలెను. ముహమ్మద్ ప్రవక్తగారికి కనిపించకుండా జ్ఞానము చెప్పినవాడు జిబ్రయేలే నని జ్ఞాపకముంచుకోవలెను. తెరవెనుకనుండి అని చెబితే, కనిపించకుండా చెప్పడమని అర్థము చేసుకోవాలి. చాలామంది ఈ వాక్యములో తెర అంటే అడ్డముగా కట్టిన గుడ్డయని, తెరవెనుక అంటే, అడ్డముగా కట్టిన గుడ్డ వెనుక భాగమని అర్థము చేసుకొంటున్నారు. అలా ఇంతవరకూ జ్ఞానమును చెప్పేవారు గుడ్డ వెనుకనుండి ఎప్పుడూ చెప్పలేదు. అలా చెప్పవలసిన అవసరమూ లేదు. ఇక్కడ కనిపించకుండా చెప్పినది మహాజ్ఞాని జిబ్రయేల్ గ్రహమే. జిబ్రయేల్ అనునతడు ఖగోళములో స్థూలముగాయున్న ఒక పెద్దగోళము. గోళాకారమును కల్గియున్న జిబ్రయేల్ ఖగోళములో సూర్యునివద్ద తాను తెలుసుకొన్న జ్ఞానమును మనుషులకు తెలియజేయాలను కొని, భూమిమీదికి వచ్చి తాను జ్ఞానము చెప్పవలసిన వ్యక్తిని ఎన్నుకొని, తన జ్ఞానమును ముందునుంచి ఆ వ్యక్తికి చెప్పడము జరిగినది. అయితే ఇక్కడ గ్రహించవలసిన విషయమేనగా! జిబ్రయేల్ శరీరము ఒక గోళాకృతిలో నున్న గ్రహము. అందువలన తన స్థూల శరీరమును వదలి, సూక్ష్మ శరీరముతో భూమిమీదకు వచ్చి, జ్ఞానమును ముహమ్మద్ ప్రవక్తగారికి చెప్పాడు. అయితే, మనిషి కనిపించకుండా మనిషి శబ్దము మాత్రము వినిపించుట వలన మొదట ప్రవక్తగారు పూర్తి భయపడిపోయాడు. దానితో ప్రవక్తగారికి కొన్ని రోజుల వరకూ జ్వరము రావడము జరిగినది. తరువాత రెండవమారు జిబ్రయేల్, తను భయపెట్టుటకు రాలేదనీ, దేవుని జ్ఞానము

చెప్పుటకు వచ్చాననీ, ముందే చెప్పడము వలన అప్పటినుండి ముహమ్మద్ ప్రవక్తగారు జిబ్రయేల్ కనిపించక మాట్లాడిన మాటలన్నింటినీ జాగ్రత్తగా విన్నాడు. ఆ రోజులలో జిబ్రయేల్ అన్వేషణలో అక్కడున్న ప్రజలలో అన్ని విధములా ఉత్తముడు, ముహమ్మద్‌గారయిన దానివలన, ముహమ్మద్‌గారికి జ్ఞానము చెప్పాలని నిర్ధారించుకొని, జిబ్రయేల్ జ్ఞానము చెప్పడము జరిగినది. ఆ దినములలో ఒంటరిగా ఎవరూలేని స్థలములోయుండు వానికి జ్ఞానము చెప్పాలనుకొన్న జిబ్రయేల్‌కు అటువంటి వ్యక్తి ఒక్క ముహమ్మద్‌గారేనని తెలిసిపోయినది. అప్పటికాలములో ముహమ్మద్ ప్రవక్తగారు తన నివాసమునకు దూరముగానున్న హీరాగుహలలోనికి పోయి, ఒంటరిగా కాలము గడుపుచూ దేవున్ని గురించి ఆలోచించెడివాడు. ఊరికి దూరముగా ఎవరూ లేనిచోట ముహమ్మద్‌గారు జిబ్రయేల్‌కు కనిపించగా, ఆయనకే తాను జ్ఞానము చెప్పుటకు నిర్ణయించుకొన్నాడు.

అప్పటికే కొంతకాలము నుండి (మూడు సంవత్సరములనుండి) హీరా కొండగుహలలో ముహమ్మద్‌గారు ఏకాంతముగా గడిపెడివారు. రెండు, మూడు రోజులు అక్కడే ఉండి, ఇంటికి వచ్చేవాడు ఏకాంతముగా ఉండే అతనిలోని దైవచింతనను చూచిన జిబ్రయేల్, అతనికే జ్ఞానము చెప్పాలని నిర్ణయించుకోవడము జరిగినది. అప్పుడు రంజాన్ నెల 21వ తేదీ ఉండగా, క్రీస్తు శకం 10-08-610 అని చరిత్రలో వ్రాసియుంచారు. ప్రవక్తగారు జిబ్రయేల్‌నుండి మొదటిమారు జ్ఞానము విని ఇప్పటికి 1404 సంవత్సరములు అయినదని తెలియుచున్నది. అప్పటినుండి అప్పుడప్పుడు జిబ్రయేల్ నుండి 23 సంవత్సరములు జ్ఞానమును విన్నాడు. ప్రతి దినమూ జిబ్రయేల్ జ్ఞానమును చెప్పెడివాడు కాదు. వారమునకు ఒకసారో, రెండు సార్లో, రెండువారములకొకసారో వచ్చి, జ్ఞానమును చెప్పేవాడు. ఒక్కొక్క

సారి రెండు మూడు నెలలు కూడా మధ్యలో కాలము గడిచెడిది. ఈ విధముగా 23 సంవత్సరములు ప్రవక్తగారికి జిబ్రయేల్ జ్ఞానము చెప్పడమయినది.

దురదృష్టవశాత్తూ ప్రవక్తగారు చదువురానివాడైనందున జిబ్రయేల్ చెప్పుమాటలను వినిన తరువాత ఇంటికి పోయి తన అనుచరులకు చెప్పెడివాడు. అలా విన్నదానిని అందరూ కలిసి, ఒకమారు ఖురాన్ గ్రంథముగా వ్రాయడము జరిగినది. అక్కడివారు అనేక దినములు విన్నదానిని కొందరు ముందే వ్రాసుకొన్న దానిని ఒకచోట చేర్చి ఖురాన్ గ్రంథముగా వ్రాయడము వలన ఖురాన్ గ్రంథములోని విషయములు ఒక వరుసక్రమములో లేకుండా యుండును. ఎవరికి జ్ఞాపకమున్నది వారు చెప్పడమువలన చెప్పిన విషయములనే రెండు, మూడుమార్లు ఖురాన్ గ్రంథములో కనిపించుచుండును. ఓపికగా చదువుకొను వారికి అందులోని దైవజ్ఞానము లభించగలదు.

జిబ్రయేల్ ముహమ్మద్ ప్రవక్తగారికి చెప్పిన జ్ఞానమూ, ద్వాపర యుగ అంత్యములో శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన జ్ఞానమూ రెండూ ఒకటేనని చెప్పవచ్చును. ఖగోళములో ఆకాశము ద్వారా సృష్ట్యాదిలోనే సూర్యునికి చెప్పిన జ్ఞానమును సూర్యుడు అప్పటినుండి ప్రపంచమంతా వ్యాపింపజేయుచున్నాడు. సృష్ట్యాదిలోనే తనకు జ్ఞానము తెలిసిన వెంటనే, సూర్యుడు భూమిమీదకు వచ్చి 'మనువు' అను ప్రముఖ వ్యక్తికి కృతయుగములోనే చెప్పడము జరిగినది. మనువు తాను సూర్యుని ద్వారా వినిన జ్ఞానమును 'ఇక్ష్వాకుడు' అను రాజుకు తెలియజేశాడు. ఇక్ష్వాకుడు అను రాజు ఇతర రాజులకు తెలియజేశాడు. అప్పుడు జ్ఞానము అలా ఒకరికొకరు చెప్పుకొనుట వలన ప్రపంచములోని మనుషులందరికీ తెలిసిపోయినది.

తరువాత త్రేతా యుగము, ద్వాపరయుగము రెండు యుగములు గడువగా, మొదట అందరికీ తెలిసిన జ్ఞానము ద్వాపర యుగము చివరిలో ఎవరికీ తెలియకుండా పోయినదని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పడము జరిగినది. అప్పటికి కృత, త్రేతా, ద్వాపర అను మూడు యుగముల కాలమునకు సూర్యుడు భూమిమీద తెలియజేసిన జ్ఞానము లేకుండా పోవడము జరుగగా, ద్వాపరయుగ అంత్యములో శ్రీకృష్ణుడు వచ్చి, ఆదిలో నేను సూర్యునకు చెప్పిన జ్ఞానమునే నీకు ఇప్పుడు చెప్పుచున్నాను విను! అని తిరిగి మొదటి జ్ఞానమును పూర్తిగా భగవద్గీత రూపములో చెప్పడము జరిగినది. ఇప్పుడు నీకు చెప్పుచున్న ఈ జ్ఞానమునే సృష్ట్యాదిలో సూర్యునకు నేను చెప్పియుంటిని అని శ్రీకృష్ణుడు ఒక సంచలనమైన మాటను చెప్పడమైనది. ఆ సంచలనమైన మాట, భగవద్గీతలో జ్ఞానయోగమను అధ్యాయమునందు మొదటి శ్లోకములోనే యున్నది. ఆ శ్లోకమును క్రింద చూడవచ్చును.

శ్లో॥ *ఇమం వివశ్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।*
*వివస్వాన్ మనవే ప్రాహమను రిక్ష్వాకవే బ్రవీత్ ॥*

శ్లో॥ *ఏవం పరంపరాప్రాప్తమ్ ఇమం రాజర్షయో విదుః ।*
*సకాలేనేహ మహతా యోగో నష్టః పరంతప! ॥*

శ్లో॥ *స ఏవాయం మయా తేద్య యోగః ప్రోక్తః పురాతనః ।*
*భక్తోసిమే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥*

**భావము :-** "నాశనము లేని ఈ యోగమును (జ్ఞానమును) ఆదిలోనే సూర్యునికి నేను చెప్పియుంటిని. సూర్యుడు మనువుకు చెప్పగా, మనువు ఇక్ష్వాకుడు అను రాజునకు చెప్పాడు. ఈ విధముగా ఒకొరికొకరు చెప్పు కోవడము వలన, భూమిమీదగల రాజులు, ఋషులు అందరూ తెలుసు

కోగలిగారు. అందరూ జ్ఞానులుగా చాలాకాలముయుండగా, కాలక్రమేపీ జ్ఞానములేకుండా పోతూ వచ్చి నేడు పూర్తి లేకుండా పోయినది. "ఇప్పుడు నేను చెప్పబోవు ఆ పురాతన జ్ఞానము చాలా రహస్యమైనది, అందరికీ చెప్పరానిది, ఇప్పుడు నీకు చెప్పుచున్నాను" అని శ్రీకృష్ణుడు చెప్పగా, అర్జునుడు వెంటనే ఒక ప్రశ్నను అడిగాడు. సూర్యుడు సృష్టి ఆదిలోనే పుట్టాడు. నీవు పుట్టినది ఈ కాలములో. నీవు ఆదిలో పుట్టిన సూర్యునికి జ్ఞానమును ఎలా చెప్పగలిగావు? అని అడిగినాడు. ఇక్కడ జరిగిన సంభాషణను బట్టి కొంత సంచలనమైన విషయము అర్థమయినది. ఆ విషయమును అటుంచి సృష్ట్యాదిలో దేవుడు సూర్యునకు జ్ఞానమును చెప్పాడని అర్థమయినది. సూర్యునికి చెప్పిన తరువాత దేవుని జ్ఞానము సూర్యుని ద్వారా మిగతా ప్రపంచ మునకు తెలిసినది. అట్లే జిబ్రయేల్ గ్రహమునకు కూడా తెలిసినది. సూర్యుడు తన గోళమును వదలి భూమిమీదికి సూక్ష్మముగా వచ్చి 'మనువు' అను మహర్షికి చెప్పినట్లు, జిబ్రయేల్ కూడా తన స్థూల శరీరమును ఆకాశములోనే వదలి, సూక్ష్మశరీరముతో భూమిమీదికి వచ్చి ముహమ్మద్ ప్రవక్తకు తాను సూర్యుని ద్వారా తెలుసుకొన్న జ్ఞానమును చెప్పడమైనది. దీనినిబట్టి సూర్యుడు మనువుకు చెప్పిన జ్ఞానమూ, జిబ్రయేల్ ముహమ్మద్ ప్రవక్తకు చెప్పిన జ్ఞానమూ రెండూ ఒక్కటేనని తెలియుచున్నది.

దేవుడు సూర్యునికి ఆదిలో చెప్పిన జ్ఞానమునే ద్వాపరయుగములో కృష్ణుడు అర్జునునికి చెప్పడము వలన, అక్కడ భగవద్గీతగా తెలుపబడిన జ్ఞానమూ, ముహమ్మద్ ప్రవక్తకు చెప్పిన ఖురాన్‌గా తెలుపబడిన జ్ఞానమూ, ఒకటేయని అర్థమగుచున్నది. భగవద్గీత చదివిన అందరికీ సృష్ట్యాదిలోని జ్ఞానమే భగవద్గీతలో యున్నదని తెలియును. అయితే అదే జ్ఞానమునే జిబ్రయేల్ తెలుసుకొని, దేవుని ఆజ్ఞమేరకు ముహమ్మద్ ప్రవక్తకు చెప్పాడనీ,

ప్రస్తుతము ఖురాన్‌గా దైవగ్రంథముగాయున్న జ్ఞానము, భగవద్గీతలోని జ్ఞానమేననీ ఎవరికీ తెలియదు. ఇప్పుడు యోగీశ్వరుల వారు చెప్పినా, కొందరు నమ్మలేకపోవచ్చును. ఎవరు నమ్మినా, ఎవరు నమ్మకపోయినా భగవద్గీతలోనియున్న ధర్మ సూత్రములే ఖురాన్ గ్రంథములోయున్నవి. ఎంతో విచక్షణా జ్ఞానమున్న వారికి మాత్రమే రెండిటియందు ఒకే జ్ఞానమున్నదని తెలియగలదు.

ఐదువేల సంవత్సరముల పూర్వము వచ్చిన భగవద్గీత, 1400 సంవత్సరముల పూర్వము వచ్చిన ఖురాన్ రెండూ ఒకే ధర్మములను తెలియ జేయుచున్నా, నేడు గ్రహించలేని స్థితిలో మానవుడుండి, రెండు గ్రంథముల ఆధారముతో రెండు మతములను అభివృద్ధి చేసుకొంటున్నాడు. దేవుడు చెప్పిన జ్ఞానము ప్రకారము రెండు గ్రంథములయందు 'మతము' అనుమాట ఏమాత్రమూ లేదు. అయితే ఇప్పుడు జిబ్రయేల్ సృష్ట్యాదిలో దేవుడు చెప్పిన జ్ఞానమును చెప్పినందుకు అతనిని 'గురువు' అనాలా లేక 'బోధకుడు' అనాలా అని ప్రశ్న వచ్చుచున్నది. దానికి జవాబును చూస్తే, ఈ విధముగా చెప్పుకోవచ్చును. 'గురువు' అనగా గుర్తింపబడనివాడు. ఎవరూ ఆయనను గుర్తించలేరు. అందువలన జిబ్రయేల్‌ను వెంటనే గురువు అని చెప్పలేము. గురువు అయినవాడు స్వయముగా జ్ఞానమును చెప్పునుగానీ, ఎక్కడో వినిన దానిని గానీ, చదివిన దానినిగానీ బోధగా చెప్పడు. అలా చెప్పువాడు బోధకుడు అవుతాడుగానీ, గురువుకాడు. **దేవునిలోని అనేక అంశలలో ఒక్క అంశ సాక్ష్యాత్తూ భూమిమీద అవతరించినా అతనిని 'గురువు' అనవచ్చును.** జిబ్రయేల్ ఆకాశవాణి ద్వారా చెప్పిన జ్ఞానమును స్వయముగా విని అయినా లేక సూర్యుడు చెప్పినప్పుడు అదే జ్ఞానమును విని అయినా, దానినే చెప్పుట వలన జిబ్రయేల్ బోధకుడగునని చెప్పవచ్చును. జిబ్రయేల్

బోధకుడని తెలిసిపోయినది. అంతపెద్ద జ్ఞానమును చెప్పినప్పటికీ అతనిని బోధకునిగానే చెప్పుచున్నాముగానీ 'గురువు' అనుటకు వీలులేదు.

మూడు గ్రంథములలో ఖురాన్ గ్రంథము కూడా అసలయిన దైవ గ్రంథముగా లెక్కించబడుట వలన ఒక గ్రంథమును గురించి మనకు తెలిసిపోయినది. ఇక తెలియవలసినది ఇద్దరు గురువులు, రెండు గ్రంథములు. దేవుడు నేను ఆదిలో సూర్యునికి జ్ఞానమును చెప్పియుంటిననీ, అతని ద్వారా సమస్త ప్రపంచమునకు జ్ఞానము తెలిసినదనీ, ఇప్పుడు ఆ జ్ఞానము లేకుండా పోయినదనీ, కావున ప్రస్తుతము గతములో నేను సూర్యునికి చెప్పిన జ్ఞానమునే చెప్పుచున్నాను విను! అని అర్జునునితో కృష్ణుడు చెప్పాడు. తరువాత అర్జునుడు వినిన జ్ఞానమే భగవద్గీతగా రూపొందినది. అందువలన భగవద్గీతను దైవగ్రంథము అనవచ్చును. మూడు దైవ గ్రంథములలో ఒకటి 'భగవద్గీత' యని కూడా తెలిసినది. జిబ్రయేల్ చెప్పిన జ్ఞానము ఖురాన్ గ్రంథముగా తయారైన దానివలన, ఖురాన్ గ్రంథములోని జ్ఞానము శ్రీకృష్ణుడు అర్జునునకు తెలిపిన జ్ఞానమే అగుట వలన, అక్కడ భగవద్గీతను, ఇక్కడ ఖురాన్ గ్రంథమునూ రెండింటినీ దైవ గ్రంథములుగా చెప్పుకోవచ్చును. ఇప్పుడు మూడు గ్రంథములు అను మాటలో రెండు గ్రంథములు తెలిసిపోయినవి. ఇక మూడవ గ్రంథము తెలియవలసియున్నది. అలాగే ఒక బోధకుడు తెలిసిపోయాడు ఇక ఇద్దరు గురువులు తెలియవలసినయున్నది.

భగవద్గీత ద్వాపరయుగ అంత్యములో పుట్టినది. అనగా ఇప్పటికి దాదాపుగా 5,000 సంవత్సరముల పూర్వము. ఇంకా ఖచ్చితముగా చెప్పి నట్లయితే, భగవద్గీత పుట్టి నేటికి అనగా 2015 సంవత్సరము నాటికి 5,153 సంవత్సరములు అయినది. భారతయుద్ధము జరిగినది అప్పటికి

క్రీస్తు పూర్వము 3,138 సంవత్సరములు అయినది. శ్రీకృష్ణుడు భగవద్గీతను చెప్పినది కూడా అప్పుడే. భారతయుద్ధము జరుగు సమయము నాటికి, శ్రీకృష్ణుని వయస్సు 90 సంవత్సరములు. శ్రీకృష్ణుడు భగవద్గీతను చెప్పిన తరువాత 36 సంవత్సరములు జీవించాడు. శ్రీకృష్ణుడు చనిపోయినది క్రీస్తు పూర్వము 2-2-3012 సంవత్సరమునందు. శ్రీకృష్ణుని జీవిత కాలము 126 సంవత్సరములు. ఈ సంవత్సరమునకు అనగా 2015 నాటికి భగవద్గీత వయస్సు 5,153 సంవత్సరములన్నమాట. ఖురాన్ గ్రంథము పుట్టినది క్రీస్తుశకము 633 సంవత్సరములు ఇప్పటికి ఖురాన్ వయస్సు 1382 సంవత్సరములు. భగవద్గీతకంటే ఖురాన్ గ్రంథము 3,771 సంవత్సరములు చిన్నదన్నమాట. క్రీస్తు శకము 633 సంవత్సరములప్పుడు తయారయిన ఖురాన్ గ్రంథము చివరి గ్రంథమని ఖురాన్‌లోనే చెప్పబడినది. ముహమ్మద్ ప్రవక్త చివరి ప్రవక్త అని చెప్పడముతో, ఖురాన్ గ్రంథము అంతిమ దైవగ్రంథమని అర్థమగుచున్నది. దానిప్రకారము, భగవద్గీత ముందే పుట్టిన మొదటి గ్రంథమైన దానివలన, భగవద్గీతను ప్రథమ దైవగ్రంథముగా లెక్కించి చెప్పవచ్చును. భగవద్గీత ప్రథమ దైవగ్రంథముగా, అట్లే దాదాపు ఖురాన్ గ్రంథము చివరి దైవగ్రంథముగా తెలిసిపోయినది. ఇక మధ్య దైవగ్రంథము తెలియవలసి యున్నది. అదే విధముగా ఇద్దరు గురువులు ఎవరో తెలియవలసియున్నది.

ఖురాన్ గ్రంథము చరిత్ర ప్రకారము 10-08-610 సంవత్సరము జిబ్రయేల్ ముహమ్మద్ ప్రవక్తగారికి దైవజ్ఞానము చెప్పను ప్రారంభించాడు. అప్పటినుండి 23 సంవత్సరములు ఖురాన్ గ్రంథము యొక్క బోధ కొనసాగినది. ఖురాన్ గ్రంథము ప్రారంభమయినప్పుడు ముహమ్మద్ ప్రవక్తగారి వయస్సు 40 సంవత్సరములు. ఆయన 63 సంవత్సరముల

వయస్సులో ఊహించని పరిస్థితిలో, అకస్మాత్తుగా జబ్బు చేసిన పద్నాలుగు దినములలో చనిపోయాడు. దానిప్రకారము 23 సంవత్సరములు ఖురాన్ బోధ జరిగినది. ప్రవక్తగారి మరణము తర్వాత ఖురాన్ గ్రంథమును తయారు చేయడము జరిగినది. ముహమ్మద్ ప్రవక్తగారు ఖురాన్ గ్రంథమునకు లేక ఖురాన్ జ్ఞానమునకు ప్రవక్తగా యున్నాడని తెలియు చున్నది. ఒక జ్ఞానము చెప్పినవానిని ప్రవక్తయని అనవచ్చును, బోధకుడు అని అనవచ్చునుగానీ, గురువు అని అనకూడదు. గురువు అనుటకు ఒక ప్రత్యేకత ఉండాలి. నేటికి ఒక్క ఇందూ మతమునకు తప్ప మిగతా మతముల న్నిటికీ ప్రవక్తలు ఉన్నారు. ఆ మతములు పుట్టిన సంవత్సరములు కూడా ఉన్నాయి. నేడు హిందూ మతము అనబడునది సృష్ట్యాదిలోనే ఇందూ అను పేరుతో పుట్టినది. ఆ దినము ఇందు అనునది ఒక మతముగా ఉండేది కాదు. ఆనాడు దేశములోని ప్రజలందరినీ ఇందువులు అనెడివారు ఇందువులు అనగా జ్ఞానులు అని అర్థము కలదు.

కృతయుగములోనే ప్రపంచ వ్యాప్తముగా అన్ని దేశములలోనూ ఇందువులు ఉండేవారు. మొదట ప్రపంచ వ్యాప్తముగా ఇందువులు ఉండెడివారనుటకు ఆధారము కూడా కలదు. అలాయున్న కృతయుగము నుండి కాలక్రమేపీ ప్రపంచ వ్యాప్తముగా ఉన్న ఇందువులు లేకుండా పోయి, అజ్ఞానులు తయారై చివరకు ఇందుత్వములో లేని మతములను స్థాపించు కోవడము జరిగినది. కొన్ని దేశములలో ఏ మతమూ లేకుండా ఉండెడిది. ఇందుత్వము మొదట పుట్టినది భారతదేశములోనే. అందువలన మిగతా అన్ని దేశములలో ఇందుత్వము లేకుండా పోయినా, భారతదేశములో కేంద్రముగా ఇందుత్వము ఇంకా నిలిచియున్నది. అయితే నేడు ఇందుత్వము లేక 'ఇందూ' సమాజము కాస్తా, పేరు మార్చుకొని 'హిందూ' మతముగా

తయారయినది నేడు ఇందుత్వము హిందూమతముగా పేరు మార్చు కొనినా, చరిత్ర తెలిసిన యోగీశ్వరులలాంటివారు, మరికొందరు హిందూ పదమును ఒప్పుకొకున్నా, మనము హిందువులము కాదు ఇందువులము అని చెప్పినా, అజ్ఞానముతో విర్రవీగుతున్న చరిత్రహీనులు యోగీశ్వరుల వారి మాటను లెక్కచేయకుండా తమను హిందువులుగానే చెప్పు కొనుచున్నారు. అర్థము లేని 'హిందూ' అను పదము అజ్ఞానులకు ఇంపుగా, సొంపుగా ఉండవచ్చు నేమోగానీ, జ్ఞానులకు నిలయమైన ఇందూ సమాజమునకు పూర్తి సరిపడని సమస్య. ఇప్పుడు అసలు విషయానికి వద్దాము.

శ్రీకృష్ణుడు కంటికి కనుపించు వ్యక్తి అయినా, ఆయనలోనున్న ఆత్మే ఆకాశములో మొదట జ్ఞానమును చెప్పిన ఆత్మయని తెలియవలెను. భగవద్గీతలో జ్ఞానయోగమను అధ్యాయమున మొదటి శ్లోకములోనే "మొదట సూర్యునికి చెప్పిన జ్ఞానమునే నీకు చెప్పుచున్నాను" అని శ్రీకృష్ణుడు చెప్పడము జరిగినది. దీనినిబట్టి సృష్ఠి ఆదిలో సూర్యునికి జ్ఞానమును చెప్పినవాడు శ్రీకృష్ణునిలోని ఆత్మేనని తెలియుచున్నది. సూర్యునికి చెప్పినది తానే కావున, అర్జునునికి చెప్పునది కూడా ఆయనే కావున, ఇతరులు ఎవరూ చెప్పని జ్ఞానమునే శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పాడని అర్థమగుచున్నది. అంతేకాక ఇతరులు చెప్పిన జ్ఞానమును శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పలేదు. కావున ఆయనను బోధకుడు అనుటకు వీలులేదు. మొదటిసారి చెప్పినది ఆయనే కావున, తరువాత చెప్పినవాడు కూడా ఆయనే కావున, శ్రీకృష్ణున్ని బోధకుడు అనకుండా గురువనియే అనాలి. ప్రపంచములో దేవుని జ్ఞానము మొట్ట మొదట గ్రంథరూపములో బయటికి వచ్చినది ద్వాపరయుగ అంత్యములోనే యని తెలియవలెను. అందువలన భగవద్గీత ప్రథమ దైవగ్రంథముగా

చెప్పబడుచున్నది. భగవద్గీతను చెప్పిన శ్రీకృష్ణుడు గురువు అగుట వలన మొదట గురువుగా శ్రీకృష్ణుడు తెలియబడినాడు. తెలియవలసిన ఇద్దరిలో ఒక గురువు ద్వాపర యుగములో వచ్చినట్లు, ఆయన చెప్పిన గ్రంథము భగవద్గీతగా తెలిసి పోయినది. అలాగే కలియుగములో జిబ్రయేల్ బోధకుడు చెప్పిన జ్ఞానము ఖురాన్ గ్రంథమని తెలిసిపోయినది. ఇంకా తెలియవలసినవి 'ఒక గ్రంథము, ఒక గురువు' అని ప్రత్యేకముగా చెప్పవలసినది లేకుండానే, భగవద్గీత తరువాత ఖురాన్ గ్రంథమునకు ముందు, మధ్యమ లేక రెండవ దైవగ్రంథముగా బైబిలును, గురువుగా ఏసుప్రభువును గురించి ముందే మనము కొంత చెప్పుకోవడము వలన ఈ పాటికి కొంత అర్థమయ్యే ఉంటుందని భావించుచున్నాము. అయినా కూడా ఇంకా కొంత విపులముగా చెప్పుకొందాము.

ఇంతకుముందు బైబిలు అంటే ఏదియనీ 'బైబిలులోని సువార్త' ప్రత్యేకత కల్గినదనీ, నాలుగు సువార్తలను మాత్రమే ఏసుప్రభువు చెప్పాడనీ, బైబిలును గురించి వివరించుకొన్నాము. ఇప్పుడు సువార్త బైబిలును గురించి వివరించుకొందాము. ఇప్పుడు సువార్త బైబిలును చెప్పిన లేక సువార్త బైబిలుకు మాత్రము బోధకుడయిన ఏసుప్రభువు గురువా? లేక బోధకుడా? అని చూచుటకు ప్రయత్నిద్దాము.

ఇప్పటికి అనగా 2015వ సంవత్సరము నాటికి ఏసుప్రభువు పుట్టి 2048 సంవత్సరములయినది. ఆయన చనిపోయి 2015 సంవత్సరములు అయినది. ఆయన జీవిత కాలము 33 సంవత్సరములు మాత్రమే. ఆయన బోధించిన కాలము మూడు సంవత్సరములు మాత్రమే. ఆయన మరణమును పొంది, సమాధిలోయున్నది 33 గంటలు మాత్రమే. సమాధి నుండి బయటికి వచ్చిన తరువాత 33 సార్లు మాత్రమే శిష్యులకు

కనిపించాడు. ఈ విధముగా ఆయన జీవితము ఎక్కువగా మూడు సంఖ్యతో ముడిపడియున్నది. ఏసుప్రభువు జన్మ ఒక ప్రత్యేకతను సంతరించుకొని యున్నది. తండ్రి వీర్యకణముతో సంబంధము లేకుండా పుట్టినవాడు ఏసుప్రభువు. ఏసును ఆయన భక్తులు 'ఏసుప్రభువు' అనెడివారు. ఏసు ప్రభువు బాహ్య తండ్రి సంబంధము లేకుండా తల్లి మేరీమాతకు జన్మించాడు. ఆయన 30 సంవత్సరములు సాధారణ జీవితమును గడిపాడు. తన కుటుంబముతో కలిసి వడ్రంగి పనిని వృత్తిగా చేయుచూ, 30 సంవత్సర ములు గడిపిన తరువాత, ఇల్లు వదలి బయటికి వచ్చాడు. అంతవరకు ఏసుప్రభువుకు ఎటువంటి దైవజ్ఞానమూ తెలియదు. ఆయన 30 సంవత్సరముల సాధారణ జీవితములో, ఏనాడూ ఇతర గురువులవద్దకో లేక బోధకులవద్దకో పోయి జ్ఞానము వినలేదు. ఆ కాలములో ఒకటి లేక రెండు సంవత్సరమలు మాత్రము చిన్నవయస్సులో, అక్షరాభ్యాసము చేసి, అక్షరములను నేర్చుకొన్నాడు తప్ప గ్రంథములు ఏవీ చదువలేదు. ఆయన ఇంటివద్ద గడిపిన 30 సంవత్సరముల కాలము ఎక్కడికీ ఇల్లువదలి పోయినది కూడా లేదు. ఎంతో క్రమశిక్షణతో, తన పనిని తాను చేసుకొనే వాడు. 30 సంవత్సరముల వయస్సు వచ్చిన తరువాత బయటి సమాజము లోనికి వచ్చి దైవజ్ఞానమును ప్రజలకు తెలియజేయాలనుకొన్నాడు.

మూడు (3) పదుల వయస్సు గడచిన తరువాత మూడు (3) సంవత్సరములు ప్రజలలో జ్ఞానము చెప్పడము జరిగినది. ఏమాత్రమూ జ్ఞానము తెలియని మనిషి ఒక్కమారుగా ప్రజలకు జ్ఞానము చెప్పడమునకు పూనుకోవడము సామాన్యులతో అయ్యేపనికాదు. ఆ ఒక్క విషయములోనే ఏసుప్రభువు ఎవరని ప్రశ్నరాక తప్పదు. ఎక్కడా జ్ఞానమును వినకుండా, స్వయముగా జ్ఞానమును చెప్పువాడు, ఎవరి బోధలనూ ఆధారము

చేసుకోకుండా జ్ఞానమును తెలియజేయువాడు వాస్తవముగా గురువేయగును. ఒక్క 'గురువు' తప్ప, మిగతావారు ఎవరుగానీ స్వయముగా జ్ఞానమును చెప్పలేరు. దానితో ఏసుప్రభువు సామాన్య మానవుడు కాదని తెలిసి పోవుచున్నది. ఏసుప్రభువు సామాన్య మనిషిగా కనిపించినా, ఆయనలో నుండి వచ్చిన బోధను గురువు తప్ప ఎవరూ చెప్పలేరనీ, ఆయన గురువై యుంటాడేమోనను అనుమానము ప్రజలకు కూడా వచ్చియుండవచ్చును. ఇప్పుడు శ్రీకృష్ణుల వారే ఏసుప్రభువుగా వచ్చినట్లు, తిరిగి ఆదరణకర్తగా వస్తున్నట్లు లోకమునకు కనువిప్పు కలుగునట్లు శ్రీకృష్ణుని మరణమును గురించి వివరించుకొందాము.

క్రీస్తుపూర్వము 02-02-3102వ సంవత్సరము శ్రీకృష్ణుడు మరణించాడు. జనవరి 14వ తేదీ తరువాత ఉత్తరాయణ కాలము వస్తుంది. కావున శ్రీకృష్ణుడు చనిపోయినది ఉత్తరాయణములోనని తెలియుచున్నది. ఒకనాడు శ్రీకృష్ణుడు ఒక చెట్టు పొదవద్ద కాలుమీద కాలుపెట్టుకొని పడుకొని, కాలును కదిలించుచుండగా, ఆ ప్రాంతమునకు వేటకు వచ్చిన బోయవాడు పొదచాటున కాలు కదులుటను చూచి అక్కడ జింక కదులుతున్నదని తలచి, పొరపాటుగా బాణమును వేయగా, అది శ్రీకృష్ణుని కుడికాలు బొటనవ్రేలుకు తగిలినది. బొటనవ్రేలుకు చిక్కుకొన్న బాణము వలన శ్రీకృష్ణుని శరీరము నుండి రక్తము కారిపోయి, ఆయన చనిపోవడము జరిగినది. విశ్వవ్యాప్తమై అణువణువునా ఉన్నశక్తి ఏదో, ఆ శక్తిలోని భాగము ఒక శరీరమును ఏర్పరచుకొని వచ్చి, 126 సంవత్సరములు మానవులతో సహజీవనము చేసి, తన ధర్మములను తెలిపి, శరీరములో లేకుండా అంతటా ఉన్న తన శక్తిలో కలిసిపోయినది. అలా వచ్చిపోయినది సాధారణ జీవాత్మ కాదు. పరమాత్మశక్తియని ఒక భీష్మునికి తప్ప ఎవరికీ తెలియదు. భీష్ముడు శ్రీకృష్ణుని

కంటే ముందే చనిపోయాడు. అందువలన శ్రీకృష్ణుడు చనిపోయినప్పుడు ఆ శరీరములోని జీవాత్మగా ఇంతకాలమున్నది దైవశక్తి అని ఎవరికీ తెలియదు. 126 సంవత్సరములు శరీరముతో బ్రతికిన ఆ శక్తిపేరు 'కృష్ణ' అను రెండక్షరములు మాత్రమే. కృష్ణ అను శబ్దము యొక్క అర్థము 'నల్లనిరంగు' అని తెలియుచున్నది. చీకటి నల్లగా ఉండును. కటిక చీకటిలో ఏమీ కనిపించక, నల్లని రంగుమాత్రము కనిపించుచున్నది. మనిషి ఎల్లప్పుడూ ఏదో ఒకటి కనిపించు వెలుతురునే కోరుకొంటాడు. కానీ ఏమీ కనిపించకయున్న చీకటిని కోరుకోడు. అదే విధముగా భూమిమీద ప్రతి మనిషీ ఏదో ఒక విషయమును తెలియజేయు మాయనే కోరుకొంటాడు. కానీ ఏ విషయమూ లేని, ఏ గుణమూలేని దైవమును కోరుకోడు. దేవుడు ఎవరికీ కనిపించువాడు కాదు. దేవున్ని ఎవరూ కోరుకోవడము లేదు అని తెలియుటకు గుర్తుగా భగవంతుడు నల్లనిరంగుకు గుర్తు అయిన 'నలుపు (కృష్ణ) అని తన పేరును పెట్టుకొన్నాడు.

పుట్టిన మనిషి ఎవడైనా చనిపోయిన తరువాత జన్మించకుండా మోక్షమును పొందాలంటే, అనగా దేవునిలో కలిసిపోవాలంటే భగవద్గీతలో చెప్పిన సూత్రము ప్రకారము చనిపోయిన వ్యక్తి యోగియై ఉండాలి. చనిపోయిన యోగి ఉత్తరాయణము, శుక్లపక్షము, పగలు సూర్యరశ్మి కలిగిన సమయములో చనిపోయి ఉండాలి. అటువంటివాడు మాత్రము మోక్షమును పొందును. ఈ సూత్రమును చెప్పిన శ్రీకృష్ణుడు ఈ సూత్రము ప్రకారము చనిపోయాడా? అని అడుగవచ్చును. దానికి సమాధానము ఏమనగా! భగవద్గీతలో చెప్పిన సూత్రము ప్రకారము శ్రీకృష్ణుడు కర్మయోగియై యున్నాడు. ఉత్తరాయణములోనే, పగటిపూటే, సూర్యరశ్మి కలిగిన సమయములోనే చనిపోయాడు. కానీ ఆయన చనిపోయినది శుక్లపక్షములో

కాదు. కృష్ణపక్షములో చనిపోయాడు. మోక్షమును పొందవలసిన యోగి శుక్లపక్షములో చనిపోవలసి ఉంది. కానీ శ్రీకృష్ణుడు కృష్ణపక్షములో చనిపోవడమువలన, భగవద్గీతలో భగవంతుడైన శ్రీకృష్ణుడు చెప్పిన సూత్రము ప్రకారము కృష్ణుడే మోక్షమునకు పోలేదని తిరిగి జన్మకే పోయాడని చెప్పవచ్చును. అయితే శ్రీకృష్ణుడు దేవునిలోనికే పోయాడు కానీ జన్మకు పోలేదు. ఇక్కడ శ్రీకృష్ణుడు, భగద్గీతలో చెప్పిన సూత్రము శ్రీకృష్ణునకు వర్తించదా? అని కొందరడుగవచ్చును. దానికి యోగీశ్వరులవారి జవాబు ఏమనగా! నీరు నీరులో కలిసేదానికి ఏ అడ్డంకూలేదు. కానీ మంచుముక్కలు నీటిలో కలియాలంటే అవి నీరుగా మారుటకు కొంత ఉష్ణోగ్రత అవసరము. శ్రీకృష్ణుడు చెప్పినది మంచుముక్కలు నీరుగా మారుటకు ఉష్ణోగ్రత అవసర మన్నట్లు, మనుషులు దేవునిగా మారుటకు ఫలానా సమయములోనే మరణము పొందాలి అని చెప్పాడు. శ్రీకృష్ణుడు నీరులాంటివాడు. కావున మరణ కాల నియమము ఆయనకు అవసరములేదు. కానీ మనుషులు మంచుముక్కలలాంటివారు. వారికి 'ఉష్ణము' అను జ్ఞానము అవసరము. కావున వారికి మరణకాల నియమము ఉన్నది. "జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేల" అన్నట్లు గడ్డకట్టిన మంచు మనుషులకు వేడి అను జ్ఞానము అవసరము. అందువలన సాధారణ మనుషులకు మాత్రమే మరణకాల నియమము వర్తించునని తెలియవలెను. మరణకాలము తనకు వర్తించదని తెలుపు నిమిత్తమే, ఆయన కృష్ణపక్షములో చనిపోయాడు.

బోయవాడు వేసిన బాణము శ్రీకృష్ణుని కుడికాలు బొటనవ్రేలికి తాకి రక్తము కారుచున్న సమయములో ఆ బోయవాడు వచ్చి చూచి, "అయ్యో! నేను ఎంత పని చేశాను?" అని రోధిస్తున్నప్పుడు ఆ బోయవానితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "నీవు బాధపడవలసినది ఏమీలేదు. నిర్ణయము

ప్రకారమే అన్నీ జరుగుచున్నవి. నా పుట్టుక, చావూ రెండూ జరుగుటకు ఒక కారణమున్నది. నేను అశుభ్రమైన చెఱసాలలో తల్లిప్రక్కన తండ్రి తప్ప ఎవరూ లేకుండా ఉన్నప్పుడు పుట్టవలెనను నిర్ణయమున్నది. ఆ నిర్ణయము ప్రకారమే దీనస్థితిలో పుట్టాను. అలాగే మరణము కూడా ఒంటరినైన సమయములో, ఇతరుని ఆయుధము వలన గాయపడినవాడినై రక్తము కారి చనిపోవలెనని నిర్ణయము కలదు. దానిప్రకారమే ఇప్పుడు ఒంటరిగా ఉన్న నన్ను నీ బాణము గాయపరచినది. కావున నీవు బాధపడవలదు" అన్నాడు. ఆ మాటలు విన్న బోయవాడు "మీరు ఎంతో కలిమి, బలిమి కలవారు. మీరు ఏమీ లేనివారివలే దీనస్థితిలో పుట్టడము, అలాగే ఒంటరిగా గాయపడి, ప్రక్కన ఎవరూ లేకుండా చనిపోవడము మీరు నిర్ణయమనినా, నాకు చెప్పలేని బాధ కల్గుచున్నది" అన్నాడు. అలా బాధగా మాట్లాడిన బోయవానిని ఓదారుస్తూ శ్రీకృష్ణుడు బోయవానితో ఇలా అన్నాడు. "దీనస్థితిలో పుట్టిన నా జననమూ, గాయపడి ఒంటరినై మరణించు నా మరణమూ భావితరమునకు అవసరము. ఇప్పటి నుండి కలియుగము ప్రారంభమగుచున్నది. కలియుగములో ఇంతవరకూ లేని అజ్ఞానము ప్రారంభమగును. ఇంతవరకూ లేని మతములు కలియుగములో పుట్టుకొచ్చును. సృష్టి ఆదినుండి ప్రపంచ వ్యాప్తముగా ఉన్న ఇందూధర్మములు క్షీణించిపోయి, మచ్చుకు మాత్రము ఇందూదేశములోనే మిగిలి, అదియూ బలహీనముగా ఉండును. 'ఇందువులు' తమ ధర్మములను తామే తెలియక, తమను తాము హిందువులుగా ఇందూపథమును (జ్ఞానమార్గము) హిందూ మతముగా ప్రకటించుకొందురు. పథము అను శబ్దము చివరకు మతము అను పదముగా మారిపోవును. పథము అనగా మార్గము, మతము అనగా

ఇష్టము. ఇది నా మార్గము అను అర్థమును వదిలి, ఇది నా ఇష్టము అను మాటను చెప్పుదురు.

కలియుగములోనే మతములు తయారై 'ఇందూపథము' యొక్క స్థానమును క్రైస్తవ మతము ఆక్రమించుకొనును. ఇందువు లందరూ ఒక్కొక్కరుగా ఆ మతములో చేరిపోవుచూ, చివరకు ఇందూమతము క్షీణించి పోవును. అటువంటి సందర్భములో ఇందూ మతమును కాపాడుకొనుటకు కొన్ని సంఘములు ఏర్పడి 'హిందూ ధర్మ' సంరక్షకులుగా చెప్పుకొందురు. ఇందూమతమునకు సంబంధించిన ధర్మములు వారికి తెలియకపోవడము వలన, వారి కార్యములతో ఇందూ మతము నకు నష్టము ఏర్పడును. ఇందూ దేశములో కూడా క్రైస్తవ మతము విరివిగా వ్యాపించిపోవును. అట్లు పెరిగిపోవుచున్న మతమును చూచి, ఆ మతప్రవక్త ఏసుకు ఇందువులు పూర్తి వ్యతిరేఖులుగా తయారగుదురు. తమ మతమును ఇందువులు కించపరుస్తూ న్నారని ఇందువుల ప్రవక్తనైన నా గురించి క్రైస్తవ మతమువారు అసూయగా, వ్యతిరేఖముగా మాట్లాడుదురు. క్రైస్తవ ప్రవక్త అయిన ఏసును చూచినా, ఆయన పేరును వినినా, హిందువులు కొందరు మండిపడుదురు. అట్లే హిందువుల దేవున్ని, దేవతలను క్రైస్తవులు తక్కువ భావముతో మాట్లాడుదురు. అట్లు మా దేవుడు గొప్ప అని క్రైస్తవులు అనగా, హిందూ సంఘములలోని వారు కొందరు మీ దేవుడు దేవుడే కాదని, ఏసును దూషించుదురు. ఇందువులు క్రైస్తవ ప్రవక్త అయిన ఏసును దూషించే కొలదీ క్రైస్తవులు తమ బైబిలులోని

వాక్యములను చెప్పుచూ, వారి మత ప్రచారము చేయుదురు. జ్ఞానమును బోధిస్తూ మా మతములో రక్షణ ఉన్నదని చెప్పుచుండుట వలన, దేవతా భక్తి తప్ప దేవుని భక్తి ఇందూ మతములో లేనిదానివలన చాలామంది ఇందువులు క్రైస్తవులుగా మారి పోవుదురు.

జగతిలో అతిపెద్ద మతముగా క్రైస్తవమతము పేరుపొందినా, ఆ మత ప్రవక్త చెప్పిన బైబిలు గ్రంథములో కూడా అధర్మములు కలిసిపోయి క్రైస్తవులు కూడా దైవజ్ఞానమును (ఇందుత్వమును) తెలియలేరు. అటు భగవద్గీతలో కూడా అధర్మములు కలిసియుండుట వలన వాటినే కొందరు ఇందువులు ఆశ్రయించి, నేను చెప్పిన ధర్మములను అర్థము చేసుకోలేరు. బైబిలును చదివిన ప్రతి క్రైస్తవుడు, బైబిలును బోధించిన ప్రతి బోధకుడు, అందులో ఉన్న నా ధర్మములను తెలియలేరు. అందువలన క్రైస్తవ ప్రవక్త అయిన ఏసు ప్రజలనుద్దేశించి ఒకమాట చెప్పిపోవును. **“నేను చెప్పిన ధర్మములు మీకిప్పుడు అర్థముకావు. నా తరువాత కొంత కాలమునకు ఒక వ్యక్తి వచ్చి నేను చెప్పిన మాటలనే వివరముగా చెప్పను. అప్పుడు నేను చెప్పిన మాటలు అర్థమగును”** ఏ వ్యక్తి అయితే బైబిలు వాక్యములను వివరించి చెప్పునో, అదే వ్యక్తి భగవద్గీతలో శ్లోక రూపములోనున్న నా ధర్మములను కూడా వివరించి చెప్పును. అంతవరకూ ఇటు భగవద్గీతగానీ, అటు బైబిలుగానీ సరిగా ఎవరికీ అర్థముకావు. ఇటు బైబిలును, అటు భగవద్గీతను ఏకకాలములో చెప్పునతనే, రెండు గ్రంథములలోని ధర్మములు ఒక్కటేయని, ఆ రెండు

గ్రంథములను ఒక్కడే చెప్పాడని సంచలన మాటను చెప్పును. రెండు గ్రంథములలోనూ దేవుడు చెప్పిన ధర్మములతో పాటు మనుషులు వ్రాసిన అధర్మములు కూడా ఉన్నాయని వాటిని వదలి ధర్మములకు మాత్రమే వివరమును చెప్పును. ఆ వ్యక్తి గురువుగాగానీ, స్వామీగాగానీ చలామణి కాడు. ఏ ఆధారమూలేని ఆయనను గుర్తించుట చాలా కష్టము" అని శ్రీకృష్ణుడు బోయవానికి చెప్పాడు.

ఇక్కడ మనము ఆలోచింపదగిన విషయమేమంటే, దైవధర్మములను భగవద్గీతరూపములో ధనస్సు, బాణములను ధరించిన అర్జునునికి మాత్రము చెప్పాడు. అర్జుననకు చెప్పిన సమయములో అర్జునుడు తప్ప మూడవ వ్యక్తి లేడు. పైగా అర్జునుడు ధర్మములను గురించి అడగనూ లేదు. ధర్మములమీద ధ్యాసలేని అర్జునునికి ధర్మములను గురించి శ్రీకృష్ణుడు చెప్పాడు. అట్లే కలియుగములో జరుగబోవు భవిష్యత్తును గురించి అడగకున్నా ధనస్సు, బాణములను ధరించినయున్న బోయవానికి చెప్పాడు. అర్జుననకు గీతా జ్ఞానమును చెప్పినట్లు, భవిష్యత్తును గురించి అడగకున్నా, బోయవానికి కలియుగ ఆధ్యాత్మిక భవిష్యత్తును గురించి చెప్పాడు. ఆ సమయములో కూడా అక్కడ శ్రీకృష్ణుడు, బోయవాడు తప్ప మూడవ వ్యక్తి ఎవరూ లేరు. యుద్ధరంగమున గీతను అర్జుననకు చెప్పినప్పుడు, తరువాత అర్జునుడు వ్యాసునికి చెప్పుట వలన భగవద్గీత అర్జునుని ద్వారా బయటపడి నదని చెప్పవచ్చును. కానీ కలియుగ ఆధ్యాత్మిక భవిష్యత్తును శ్రీకృష్ణుడు బోయవానికి చెప్పినప్పుడు అక్కడ మూడవ వ్యక్తి లేడు. చెప్పిన శ్రీకృష్ణుడు వెంటనే చనిపోయాడు. ఇక బోయవాడు మాత్రము మిగిలాడు. కలియుగ ఆధ్యాత్మిక భవిష్యత్తు ఒక్క బోయవాని ద్వారానే బయటకు రావాలి. కానీ,

బోయవాడు కూడా తాను చేసిన తప్పుకు అప్పుడే అక్కడే నిరాహారదీక్ష చేసి అక్కడ కృష్ణుని ముందరే చనిపోయాడని వ్రాశారు.

నీ తప్పు ఏమీ లేదనీ, అంతా నా కర్మప్రకారము జరిగినదనీ కృష్ణుడు బోయవానితో చెప్పినా, అతను వినకుండా 'నేను చేసిన తప్పుకు శిక్ష ఉండాలని, నిరాహారదీక్ష చేసి వెంటనే చనిపోయాడని, తరువాత శ్రీకృష్ణుని రథసారథియైన దారకుడు అక్కడికి వచ్చాడని వ్రాశారు. నిరాహార దీక్ష చేసి, ఒక మనిషి చనిపోవాలంటే, కనీసము 40 రోజులైనా పడుతుంది. అలాంటిది నిరాహారదీక్ష చేసి, నిమిషానికే బోయవాడు చనిపోయాడని చెప్పడము పచ్చి అబద్ధము కాదా? వాస్తవానికి బోయవాడు చనిపోలేదు. శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక భవిష్యత్తును బోయవానికి చెప్పి, ఈ విషయమును నేను నీకు తప్ప ఎవరికీ చెప్పలేదన్నాడు. శ్రీకృష్ణుడు చెప్పిన చివరి సందేశమైన కలియుగములో ఆధ్యాత్మిక భవిష్యత్తును వినిన బోయవాడు, నేనెంతో అదృష్టవంతున్ని అని సంతోషపడినాడు. "నా జీవిత అంత్య భాగములో నేను చెప్పు పెద్ద రహస్యమిది" నీవు తప్ప దీనిని వినినవాడు ఎవరూ లేరని 'శ్రీకృష్ణుడు చెప్పినమాటనుబట్టి నేను గొప్పవాడినని' బోయవాడు అనుకొన్నాడు. శ్రీకృష్ణుడు బోయవానికి ఇంకా కొన్ని విషయములను చెప్పాడు. కలియుగ ప్రథమములోనే వచ్చి మరియొకమారు ధర్మములను ఇతర దేశములో తెలియబరుస్తానని చెప్పాడు. ఇశ్రాయెల్ దేశములో 'ఏసుప్రభువు'గా ఉద్భవించి ధర్మములను చెప్పిపోతాననీ, అవసరమును బట్టి తరువాత కూడా వస్తాననీ చెప్పాడు. బోయవానిని అడ్డము పెట్టుకొని చెప్పిన మాటలు నేటికి సత్యములుగా కనిపిస్తున్నవి. ఇంకా ఆయన చెప్పిన మాటలు ఈ విధముగా ఉన్నవి.

"శ్రీకృష్ణునిగా వచ్చిన నేను కలియుగ ప్రథమాంకములోనే, ఏసుగా వస్తాను. అలా వచ్చిన నన్ను ఎవరూ గుర్తించలేరు. ఇప్పుడు చెప్పిన భగవద్గీతగానీ, అప్పుడు చెప్పు వార్తగానీ రెండూ నా ధర్మములనే తెలియ జేయును. ఎక్కడా ఏ వాక్యమూ భేదము కలిగియుండదు. నేనే ఏసును ఏసే నేనును అయినప్పటికీ శరీరములు, పేర్లూ వేరైనా ఇద్దరూ ఒక్కరేనని ఎవరికీ తెలియదు. నా బోధ, ఏసుబోధ రెండూ ఒక్కటే అయినప్పటికీ గ్రంథములు, వాటి పేర్లూ వేరుగా వుండుట వలన రెండూ ఒకటేనని ఎవరూ గుర్తించలేరు. అంతేకాక నేను చెప్పిన గీత, ఏసు చెప్పిన నాలుగు సువార్తలు తిరిగి వివరముగా మరొక వ్యక్తి చెప్పేంతవరకూ ఎవరికీ అర్థము కావు. ఆ వ్యక్తిని గురించి ఏసు చెప్పిన వార్తలలో 'ఆదరణకర్త' అని వ్రాయబడి యుండును. ఏసు చెప్పిన 'ఆదరణకర్త' అను పేరులోని మొదటి అక్షరము, చివరి అక్షరములు మొదటిది మొదలులోనూ, చివరిది చివరిలోనూ ఉండు పేరు ఆయనకుండును. ఆ.....ర్త అను రెండక్షరముల పేరు కలిగినవాడే నేను చెప్పిన బోధనూ, అలాగే ఏసు చెప్పిన బోధను అనగా వార్తలనూ ఏక కాలములో వర్ణించి చెప్పును. అలా చెప్పువాడే కాలజ్ఞానమును చెప్పు వీరబ్రహ్మముగారికీ, సమస్త మానవులకూ గురువని బ్రహ్మముగారే తన కాలజ్ఞానములో వ్రాసియుంచును.

ఏసుప్రభువును విశ్వసించినవాడు నన్ను విశ్వసించడు. అలాగే గీతను చదివినవాడు ఏసును విశ్వసించడు. ఇటు నేను అటు ఏసు, ఉత్తర,దక్షిణధృవములవలె కనిపించుచుండుట వలన హిందువులు

క్రైస్తవులను ఏవగించుకొను స్థితిలో ఉందురు. ఆ సమయములో ఏసు చెప్పిన ఆదరణకర్త తప్ప ఎవరూ రెండు మతములకు సమాధానము చెప్పలేరు. అలాగే సమన్వయపరచనూ లేరు. క్రైస్తవులలో ఆదరణకర్త, హిందువులలో ఆ...ర్త అయినవాడు ఒక్కడే. ఆ ఒక్కడే రెండు మతములలోని ఏసుప్రభువు చెప్పిన వాక్యముకు, నేను చెప్పిన భగవద్గీతకు సరియైన భావము చెప్పి, రెండు బోధలను ఒకటిగానే చూపును. రెండు మతములలో చెప్పిన నన్ను, ఏసును ఒక్కనిగానే చూపించును. నేను మూడువేల సంవత్సరముల తరువాత పుట్టి ఈ జన్మలో చెప్పినది తిరిగి అప్పుడు చెప్పగలను. అలా చెప్పిన నేనే ఏసు పేరుతో కొంత కాలముండిపోగలను. తరువాత కొంతకాలమునకు వచ్చినవాడే రెండు జన్మలలో ఉన్నది నేనేనని, చెప్పినది నేనేనని (కృష్ణున్నేయని) తెలియజెప్పును. అలా చెప్పుట వలన, ఆయన ఇటు ఇందువులకూ, అటు క్రైస్తవులకూ వ్యతిరేఖిగా కనిపించును. సమాజములో ఎంత వ్యతిరేఖత వచ్చినా, నా పని ఇదే అన్నట్లు ఆయన మాత్రము ఎవరికీ జంకక, తాను చెప్పవలసినది చెప్పిపోవును. రెండు బోధలనూ వివరించి చెప్పుటయేకాక, ప్రత్యేకించి రెండు మతములలో ఇటు నేను, అటు ఏసు కొన్ని చెప్పక వదలివేసిన బోధలను కూడా క్లుప్తముగా తెలియజెప్పును. అంతేకాక ఆదినుండి తెలియని ఆధ్యాత్మిక రహస్యములను తెలియజెప్పి, ఆయన ప్రత్యేకత ఏమిటో ఇతరులకు అర్థమగునట్లు చేసినా, ఆయనను ఎవరూ గుర్తించలేరు. మానవునికి కావలసిన జ్ఞానమును నేను ఒక విధానముతో చెప్పగా, ఏసు దానినే మరొక విధముగా చెప్పగా, రెండూ ఒకటేనని చెప్పిన ఆదరణకర్త

రెండిటినీ వివరించి చెప్పుచూ, రెండిటియందు ఉన్న దానిని తన విధానముతో చెప్పి పూరించును" అని చెప్పాడు. శ్రీకృష్ణుడు చెప్పిన విధానమును చూస్తే వచ్చే మూడవ వాడు ఎలా ఉంటాడో కొద్దిగా అర్థమవుతుంది.

మనిషి బ్రతుకుటకు ఆహారము తినాలి, ఆహారములో మనము ప్రధానముగా అన్నమును తింటున్నాము. కేవలము అన్నమును ఒక్క దానినే తినినా ఆకలి తీరును. కానీ అన్నములోనికి కూరను కలుపుకొని తింటే రుచిగా ఉంటుంది. అన్నములోనికి కూరనుమాత్రమే కలుపుకొని తిని ఆకలి తీర్చుకొనువారు చాలామంది గలరు. కొంతమంది అన్నమును కూరతో తినిన తరువాత, చివరిలో మజ్జిగతో అన్నమును తినువారు కూడా కలరు. అలా మజ్జిగతో తింటే పూర్తి తృప్తిగా తిన్నట్లగును. ఈ విధముగా ఆహారమును మూడు భాగములుగా చెప్పుకోవచ్చును. ఒకటి అన్నము, రెండు కూరలు, మూడు మజ్జిగ. ఈ మూడింటినీ సంపూర్ణమైన ఆహారముగా చెప్పుకోవచ్చును. అన్నమును, కూరను, మజ్జిగను మూడింటినీ తిన్నవాడు సంపూర్ణ ఆరోగ్యముతో ఉండును. మూడు ఆహార భాగములలోనూ పోషక పదార్థములు సంపూర్ణముగా ఉండుట వలన మూడు భాగముల ఆహారమును తిన్నవాడు శరీరములో తృప్తిగా, ఆరోగ్యముగా జీవించును. అన్నము, కూర, మజ్జిగ గురించి ఇప్పుడు చెప్పుకోవలసిన అవసరమే మొచ్చినదని కొందరనుకోవచ్చును. దీనిని ఉపమానముగా చెప్పుచున్నామని గ్రహించవలెను.

ద్వాపరయుగములో శ్రీకృష్ణుడు భగవద్గీతను చెప్పాడు. భగవద్గీతను ఆధారము చేసుకొని ఆధ్యాత్మికములో ముందుకు పోవువారుండినా,

కలియుగములో ఏసు కూడా జ్ఞానమును చెప్పాడు. ఏసుప్రభువు చెప్పిన జ్ఞానమును ఆధారము చేసికొని ముందుకు పోవువారు కూడా ఎందరోగలరు. ఈ రెండు జ్ఞానములను ఆహారములోని రెండు భాగములుగా పోల్చి చూసుకొందాము. శ్రీకృష్ణుడు చెప్పిన భగవద్గీతా జ్ఞానమును ఆహారములో ఒకటవదైన అన్నముగా పోల్చుకొందాము. అన్నము అనునది ఆహారములో ముడి పదార్థములాంటిది. అన్నము ఒకే రంగు కలిగి ఒకే రుచి కలిగి ఉంటుంది. అన్నమును ఒకే దానినే తినాలంటే కొంత కష్టముగా ఉంటుంది. అన్నము చప్పగా ఉన్నాకూడా దానినే కడుపునిండా తినవచ్చును. అట్లు కేవలము ఒక్క అన్నమును మాత్రమే కడుపునిండా తినినా కూడా మనిషి బ్రతకవచ్చును కానీ, తినే ఆహారము రుచిగా ఉండుటకు దేవుడు శ్రీకృష్ణున్ని పంపి, గీతా జ్ఞానమును చెప్పించినట్లు, ఏసుప్రభువును పంపి వార్తా జ్ఞానమును చెప్పించెను. ఏసుప్రభువు చెప్పిన వార్తాజ్ఞానము అన్నములో కలుపుకొని తిను కూరలాంటిది. అన్నము రుచివేరు, కూర రుచివేరు. అయినా రెండూ మనిషికి అవసరమైన ఆహార పదార్థములే.

ఏసుప్రభువు చెప్పిన జ్ఞానమును, శ్రీకృష్ణుడు చెప్పిన జ్ఞానమును అర్థము చేసుకోగలిగితే, అన్నమును వడ్డించిన వ్యక్తి, కూరను వడ్డించిన వ్యక్తి వేరు వేరయినా, రెండూ తినే పదార్థములేనని తెలుసుకోగలిగితే, రెండింటినీ సమన్వయముగా అర్థము చేసుకోగల్గితే ఎంతో అభిరుచి, తృప్తి ఏర్పడును. అట్లు కాకుండా, అదివేరు, ఇది వేరు, నేను అన్నమును ఒక దానినే తింటానని అన్నమును మాత్రము తినినా కడుపునిండును. అలాగే కూరను మాత్రమే తింటానని కూరనొక దానినే తినినా కడుపునిండును. అలా తినడములో గల రుచి వేరుగా ఉండును. రెండింటినీ కలుపుకొని తినడము వలన రుచి వేరుగా ఉండి కొంత తృప్తికరముగా ఉండును.

ఇప్పుడు భూమిమీద మేము అన్నమును మాత్రము తింటామన్నట్లు, శ్రీకృష్ణుని యొక్క భగవద్గీతా జ్ఞానమును మాత్రము చదవగల్గిన హిందువులనువారు కొందరున్నారు. అలాగే మేము కూరను మాత్రమే తింటామన్నట్లు ఏసుప్రభువు యొక్క వార్తా జ్ఞానముతోపాటు బైబిలు మొత్తమును చదువ గల్గిన క్రైస్తవులనువారు ఎందరో ఉన్నారు. ఇలాంటి సమయములో అన్నము, కూర రెండిటి విషయము తెలిసిన ఆదరణకర్త వచ్చి, రెండిటి వివరమును వివరించి రెండిటినీ కలుపుకొమ్మన్నట్లు, భగవద్గీతలోని జ్ఞానమును, సువార్తల లోని జ్ఞానమును వివరించి చెప్పును. అంతవరకు శ్రీకృష్ణుడు వేరు, ఏసు వేరనీ, అట్లే గీతా జ్ఞానమువేరు, వార్తాజ్ఞానమువేరనీ అనుకొనుచుందురు. భూమిమీద క్రైస్తవ పాస్టర్‌ల, ఫాదర్‌ల, బోధకులకు ఇటు ఇందూ గురువులకు బోధకులకు భిన్నముగా, అంతవరకూ రెండింటియందు భేదమునూ, ఎవరికీ తెలియని వివరమునూ ఆదరణకర్త బోధించగా, వివరము తెలిసినందుకు కొందరు మాత్రము సంతోషపడుదురు. చాలామంది బోధకులకు మింగుడు పడక, పండ్లు కొరుకుచూ, ఆయనను వ్యతిరేఖిస్తారు. ఆయన మీద దాడులు కూడా చేస్తారు. అయినా ఆయన ఎవరకీ భయపడకుండా తన పనిని తాను చేయునని శ్రీకృష్ణులవారు కూడా చెప్పారు. రెండిటికి సమన్వయకర్త అయిన ఆయనను ఏసు ఆదరణకర్త అని చెప్పగా, ఆయన పుట్టుక ఇందూ మతములో ఉండుట వలన మరియు ఆయన రెండు మతములకు ఆదర్శముగా ఉన్నదానివలన, ఏసు ప్రభువు చెప్పిన ఆదరణకర్త హిందువులలో 'ఆదర్శకర్త' అను పేరుతో చెలామణి అగునని శ్రీకృష్ణుడు బోయవానికి చెప్పిపోయాడు. శ్రీకృష్ణుడు చెప్పిన ఆదర్శకర్త, ఏసుప్రభువు చెప్పిన ఆదరణకర్త ఇద్దరూ ఒక్కరేనని తెలిసిపోయినది. ఆదరణకర్త అయిన ఆదర్శకర్త అను పేరు ఎవరికున్నదో వెతికితే ఆ పేరునుబట్టి సులభముగా

మూడవ వ్యక్తిని గుర్తించగలము. ఆ పేరున్నవాడు వచ్చి పోయాడా? లేక వచ్చియున్నాడా? లేక రాబోవు కాలములో వస్తాడా? అను విషయము మాత్రము అర్థముకాని విషయము.

శ్రీకృష్ణుడు గీతను చెప్పగా, అందులో కూడా తెలియనిది ఏదైతే ఉందో, అట్లే ఏసుప్రభువు తన సువార్తలను చెప్పగా అక్కడ కూడా తెలియనిది ఏదైతే ఉందో, రెండుచోట్ల తెలియక మిగిలిన దానిని రాబోవు ఆదర్శకర్త పూర్తిగా తెలియజేయును. దేవుని ధర్మముల విషయములో ఎవరి వద్దా ప్రశ్న అనునదిగానీ, సంశయమనునదిగానీ లేకుండాజేయును. దీనినిబట్టి ఆదర్శకర్త అను పేరుతో వచ్చువాడు అటు నాస్తికులవద్దగానీ, ఇటు హేతువాదులవద్దగానీ, దేవుని గురించి అడుగు ప్రశ్నే లేకుండా చేయును. అందువలన ఆదర్శకర్త అటు నాస్తికులకు, ఇటు ఆస్తికులకు తెలియని జ్ఞాన విధానమును తెలుపునని అర్థమగుచున్నది. ద్వాపర యుగములో శ్రీకృష్ణుడు చనిపోతూ చెప్పిన 'ఆదర్శకర్త' కలియుగములో ఏసుప్రభువు చెప్పిన 'ఆదరణకర్త' ఎంతో గొప్ప జ్ఞానము కలిగి క్రైస్తవులకు హిందువులకు మింగుడుపడనివాడై యుండును. ఆదరణకర్త, ఆదర్శకర్త అయినవాడు చెప్పిన బోధను గ్రహించిన హిందువులు, క్రైస్తవులు ఆయనలోనే శ్రీకృష్ణున్ని, ఆయనలోనే ఏసుప్రభువును చూచుకొందురు. యోగీశ్వరులవారు ఇప్పుడు చెప్పిన విషయములు హిందూమత ప్రచారమునకో లేక క్రైస్తవ మత ప్రచారమునకో కాదని, రెండు మతములకు అతీతమైన దేవున్ని గురించి తెలుపు విధానమని గ్రహించవలెను.

(గమనిక :- "శ్రీకృష్ణుడు దేవుడా! భగవంతుడా!" గ్రంథములో యోగీశ్వరుల వారు వ్రాసిన నాలుగు పేజీల

**సమాచారమును ఇక్కడ పొందుపరుస్తున్నాము.)** శ్రీకృష్ణుడు చనిపోతూ చివరి సమయములో కలియుగ ఆధ్యాత్మికమును గురించి చెప్పాడనీ, దానిని బోయవాడు విన్నాడనీ చెప్పారు. అక్కడ ఎవరూ లేని ఆ సమయములో కలియుగ ఆధ్యాత్మికమును గురించి చెప్పాడనీ, దానిన బోయవాడు విన్నాడనీ కూడా చెప్పారు. అక్కడ ఎవరూ లేని ఆ సమయములో శ్రీకృష్ణుడు చెప్పిన సమాచారమును వినిన బోయవాడు, ఆ విషయమును తరువాత ఎవరికీ చెప్పినట్లు ఆచూకీ లేదు. బోయవాడు చెప్పినట్లు ఎక్కడా లేనప్పుడు, అక్కడ జరిగిన విషయము యోగీశ్వరుల వారికెలా తెలిసింది? యోగీశ్వరులవారెలా ఆ విషయములన్నింటినీ చెప్పగలుగుచున్నారని ప్రశ్నించవచ్చును. దానికి యోగీశ్వరులవారి జవాబు ఏమనగా! అర్జునుడు గీతను వ్యాసునికి చెప్పినట్లు కూడ భారతములోగానీ, భాగవతములోగానీ లేదు. అక్కడ వ్యాసుడు తెలివిగా ప్రవర్తించి, అర్జునుడు చెప్పినట్లు తెలియకుండ చేసి, సంజయుడు దృతరాష్ట్రునికి చెప్పినట్లు వర్ణించాడు. ఎలాగైతే ఏమి, చివరకు కృష్ణుడు అర్జునునికి చెప్పిన విషయము బయటికి వచ్చినది. కానీ ఇక్కడ భాగవతములో బాణముతో కొట్టిన బోయవాని పాత్రను చంపివేసి బోయవానిని పూర్తిగా లేకుండా చేశారు. అందువలన కృష్ణుడు చెప్పిన విషయము ప్రస్తావనకే రాలేదు, తర్వాత ఎవరికీ తెలియకుండా పోయినది. 'ఆ బోయవాడు తనకు కలియుగ ఆధ్యాత్మిక భవిష్యత్తు తెలిసినా, ఆ విషయమును అప్పుడు ఎవరికీ చెప్పాలనుకోలేదు. తనకు పరిచయమున్న వారంతా నిత్యమూ వేటకు పోయి బ్రతుకువారే కావున, ఆ పేదవారికి ఈ సమాచారము అవసరములేదనుకొన్నాడు. ఎవరికన్నా చెప్పాలను కొనినా, వీనికి చెప్పేదానికీ కుదరలేదు. ఆ విధముగా ఆ విషయము వానితోనే లేకుండా పోయినది, వాని మరణముతో ఆ

విషయము ఎవరికీ తెలియకుండా పోయినది. అలా వాడు ఆ జన్మలో చనిపోయిన తరువాత జన్మలలో పుట్టుచు వస్తూ, అప్పటినుండి ఇప్పటివరకూ ఎన్నో జన్మలు ఎత్తాడు. ఆ విధముగా ఆ జీవుడు జన్మిస్తూ, మరణిస్తూ ఎన్నో జన్మలను ధరించినా అతనివెంట ఉన్న ఆత్మ కూడా వానివెంటనే వస్తూ, అన్ని జన్మలకు తోడుగా ఉన్నది. వెనుకటి జన్మ విషయము కూడా జీవునికి తెలియదు. కానీ ఆదినుండి అన్ని జన్మలకు తోడుగాయున్న ఆత్మకు అన్ని జన్మల విషయములూ తెలియును. ద్వారప యుగ అంత్యములో చివరిగా శ్రీకృష్ణుడు బోయవానికి చెప్పిన విషయమంతా అతని ఆత్మకు తెలియును. అతను ఇప్పుడు ప్రస్తుత జన్మలో ఒక రోగముతో బాధపడుచూ యోగీశ్వరుల వారి వద్దకు రావడము జరిగినది. అప్పుడు యోగీశ్వరులవారు అతనికి కర్మను ఉదహరించుటకు దైవజ్ఞానము చెప్పు సమయములో ఆ జీవుడు నిద్రావస్థలోనికి పోయి, లోపలనున్న ఆత్మయే వినుటను మొదలుపెట్టినది. నేను శ్రీకృష్ణున్ని గురించి ఆయన చెప్పిన జ్ఞానమును గురించి చెప్పు సమయములో, అతనిలోని ఆత్మ కృష్ణుని మరణ సమయములో జరిగిన వృత్తాంతమునంతటినీ వివరముగా యోగీశ్వరుల వారికి చెప్పినది. కావున దానినే యోగీశ్వరులవారు మనకు చెప్పారు.

ఇదేదో కాకమ్మ గువ్వమ్మ కథలాంటిది అనుకోవద్దండి. మనిషికి జన్మలు ఉన్నది వాస్తవము. పునర్జన్మలో జ్ఞాపకము ఎవరికైనా అరుదుగా రావచ్చును. అలా వచ్చిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. జరిగి పోయిన జన్మలలోని విషయములు జ్ఞాపకము వచ్చుటకు ఒకే ఒక ఆత్మయే కారణము. జీవునికిగానీ, మనస్సుకుగానీ, బుద్ధికిగానీ గత జన్మ జ్ఞాపకములు ఉండవు. మామూలు విషయములు జ్ఞాపకము పెట్టుకొను స్థోమత శరీర ములోని మనస్సుకు మాత్రముండును. మనస్సు చనిపోయిన జన్మలోనే

పోతుంది. తరువాత జన్మలో క్రొత్త మనస్సు వస్తుంది. కావున ప్రస్తుత జన్మలో గత జన్మ జ్ఞాపకములు ప్రస్తుతమున్న మనస్సుకు తెలియవు. ఏ జన్మ విషయములు ఆ జన్మవరకే మనస్సుకు పరిమితములు. మనస్సు తరువాత జ్ఞాపకమును కలుగజేయునది ఆత్మ. ఒక మనిషి నిద్రబోవు సమయములో మనస్సు బయట అవయవముల సంబంధము కోల్పోయి బ్రహ్మనాడిలో అణిగి ఉండును. అప్పుడు ఆ శరీరములోని ఆత్మ మనస్సువలె పనిచేసి ఎవరైనా పిలిస్తే, ఆ పిలుపును బుద్ధికి, జీవునికి విషయమును చేర్చి నిద్రనుండి లేచునట్లు చేయుచున్నది. అంతేకాక ఆత్మ శరీరములో రాత్రింబగళ్ళు అన్ని కార్యములను చేస్తూ ఉన్నది. ఒక మనిషి ఎన్ని జన్మలు ఎత్తినా వానిని వీడకుండా ఉండునది ఆత్మ ఒక్కటియే.

ఆనాడు శ్రీకృష్ణుడు చనిపోయినప్పుడు బోయవాని శరీరములో జీవునితోపాటు ఉన్న ఆత్మ శ్రీకృష్ణుని మరణ సమయములో ఏమి జరిగినదీ, ఏమి సంభాషణ జరిగినది అన్నింటినీ తెలిసియున్నది. ఇది సర్వమానవులలో జరుగు ప్రక్రియయే. కానీ ఎవరికీ శరీరములోపల జరుగు తతంగమును గూర్చి తెలియదు. బోయవాని శరీరములోని ఆత్మ యోగీశ్వరుల వారికి తెలియజెప్పడము కొందరికి వింతగా కనిపించినా, ఇది వాస్తవముగా కొన్ని సందర్భములలో జరుగునదియే. ఇక్కడ ఇంకొక విశేషము కూడా ఉన్నది. అదేమనగా! ద్వాపరయుగములో శ్రీకృష్ణుని మరణ సమయమున ఉన్న అప్పటి బోయ వాడు అప్పటినుండి ఎన్నో జన్మలు ధరిస్తూ వచ్చి, చివరికి ప్రస్తుత జన్మలో యోగీశ్వరులవారి ముందుకు రావడము జరిగినది. అలా యోగీశ్వరులవారి ముందుకు వచ్చిన ప్రస్తుత వ్యక్తి క్రైస్తవ మతమునకు చెందినవాడు, అప్పటి ఇందూ మతములోని బోయవాడు, ఇప్పటి క్రైస్తవ మతములోని వ్యక్తి అని తెలియుచున్నది.

ఇప్పటి క్రైస్తవుడు అప్పటి విషయమును చెప్పడమేమిటని ఆశ్చర్య పోనవసరములేదు. మనిషి బ్రతికి ఉన్నంతవరకే మతము. చనిపోయిన తరువాత ఎవరు ఏ మతములోనైనా కర్మప్రకారము పుట్టవచ్చును. గత జన్మలోని క్రైస్తవులు ఈ జన్మలో హిందువులుగా పుట్టవచ్చును. ఈ జన్మలోని హిందువులు రాబోవు జన్మలో క్రైస్తవులుగా పుట్టవచ్చును. ఒక మనిషి ఏ మతములో మనుగడ సాగించాలో వానికర్మే నిర్ణయిస్తుంది. దానిప్రకారమే కొందరు హిందువులుగా (ఇందూ), కొందరు క్రైస్తవులుగా పుట్టుచున్నారు. **"ఎవనికైనా పుట్టుకతో వచ్చిన మతము దేవుని సమ్మతితో వచ్చిన దానిగా లెక్కించాలి"** ఎవడైనా ఒక హిందువు క్రైస్తవ మతములోనికి మారాలని తలచినా, ఒకవేళ క్రైస్తవునిగా మారినా, అది దేవునికి వ్యతిరేఖ చర్య అగును. దేవుని పరిపాలనను ధిక్కరించినట్లగును. అట్లే ఒక క్రైస్తవుడు హిందువుగా మారాలనినా, అతను కూడా దేవునికి వ్యతిరేఖి అగును. దేవుని పాలకులు అతని మీద కోపము కల్గియుందురు. అందువలన **మత మార్పిడి మహా పాపమని, దైవనిర్ణయమునకు విరుద్ధముగా చేసినట్లగునని యోగీశ్వరులవారు తెలుపుచున్నారు.** నేటి కాలములో మత మౌఢ్యము అన్ని దేశములలో ప్రాకిపోయినది. దానివలననే యుద్ధములు జరుగుచున్నవి. హింస చెలరేగుచున్నది. ఒకరికొకరు కొట్టుకొని చస్తున్నారు. చివరకు యోగీశ్వరుల లాంటి వారిని కూడా అగౌరవముగా మాట్లాడుచున్నారు. అటువంటి కాలము వస్తుందని ద్వాపర యుగములోనే శ్రీకృష్ణుడు చెప్పాడు అలాగే వచ్చింది. నాది క్రైస్తవము, నీది హిందుత్వము అను అజ్ఞాన రోగము పోవుటకు ఆ రోజే మందును కూడా తయారు చేసి ఇచ్చిపోయినట్లు తెలియుచున్నది. 'మతమ'ను రోగమునకు 'జ్ఞానమను' ఔషధము ఏమిటో ఆ రోజున ఆయన సూచించినా, ఈ రోజు దానిని తెలియలేని స్థితిలో

ఉన్నాము. అందువలన మతరోగము ముదిరి పోవుచున్నది. అలా కాకుండా ఇప్పుడు మనము కృష్ణుడు సూచించిన విధానమును తెలుసుకొందాము.

దేవుడు మతమును సృష్ఠించలేదు. దేవుడు తన జ్ఞానమును ధర్మముల రూపములో తెలిపాడు. దేవుడు తన శక్తిని ఒక వ్యక్తిగా మలచి ఒక శక్తిగా భూమిమీద జ్ఞానమును బోధించునట్లు చేశాడు. ఇలా వచ్చిన వానిని భగవంతుడని హిందువులు, ప్రవక్త అని క్రైస్తవులు అంటున్నారు. ఎవరు ఏమనినా, వచ్చిన వ్యక్తి దేవుని శక్తియేనని జ్ఞాపకముంచుకోవలెను. అపారమైన దైవశక్తి నుండి కొంత భాగము వ్యక్తిగా వచ్చినప్పుడు, ఆ వ్యక్తికి కూడా ప్రపంచములో గుర్తింపుకొరకు పేరుండును. ఒక కాలములో ఒక ఊరిలో ఉన్న ప్రవక్తకుగానీ, భగవంతునికిగానీ ఒక పేరుండును. ద్వాపర యుగములో దైవ భాగములలో ఒక భాగమై వచ్చిన వ్యక్తి పేరు కృష్ణ. శ్రీకృష్ణుడు ద్వాపరయుగములో ఉత్తర భారతదేశమున మధురలో పుట్టాడు. భగవంతుడైన శ్రీకృష్ణుడు దేవుని ధర్మములను తెలిపిపోయాడు. ఆయన పోయిన తరువాత దాదాపు (3000) మూడువేల సంవత్సరములకు దైవశక్తి కలియుగమున ఇజ్రాయెల్ దేశమున జెరూసలేము నగరమున ఒక వ్యక్తిగా పుట్టినది. ఆ వ్యక్తి 'ఏసు' అను పేరుతో పిలువబడినాడు. ద్వాపర యుగములో పుట్టిన దైవశక్తి పేరు 'కృష్ణ' అను రెండు అక్షరములు, కలియుగములో పుట్టిన దైవశక్తికి పేరు 'ఏసు' అను రెండు అక్షరములు. దైవశక్తి భూమిమీదకు రావడమే అరుదు. కొన్ని లక్షల సంవత్సరముల కొకమారు వచ్చు దైవశక్తి మూడువేల సంవత్సరములకు రెండవమారు రావడము ఆశ్చర్యపడవలసిన విషయము కాదు. భగవద్గీతలో కూడా ధర్మములకు ముప్పు ఏర్పడినప్పుడు, అధర్మములు చెలరేగినప్పుడు అధర్మములను అణిచి వేసి, తిరిగి ధర్మములను తెలియజేయుటకు

యుగయుగమందు వస్తానన్నాడు. ఆయన మాటప్రకారము దేవుడు ధర్మముల నిమిత్తము ఎప్పుడయినా రావచ్చును.

సమస్త జగతిలో ఏ జీవాత్మ అయినా పరమాత్మను చేరాలంటే, ఆత్మద్వారానే సాధ్యమగును. జీవాత్మకు దారి ఆత్మయే. ఆత్మ దారిలో ప్రయాణిస్తేనే పరమాత్మ అను గమ్యమును చేరవచ్చును. అందువలన దేవున్ని చేరాలను ఏ జీవుడైనా, ఆత్మను అధ్యయనము చేసి తీరాల్సిందే. ఇది శాసనము. ఆత్మను గూర్చి అధ్యయనము చేయడమే 'ఆధ్యాత్మికము' అంటాము. ఆధ్యాత్మికము తెలియనిది జగతిలో ఎవనికీ ముక్తి లభించదు. 'భగవద్గీత' అనగా భగవంతుడు గీచిన గీత అని అర్థము. అట్లు చెప్పబడిన గీత మూడు భాగములుగా ఉన్నది. తన గీత త్రైతముతో కూడుకొన్నదనీ మూడు భాగములుగా ప్రజలకు తెలియబడునని తెలిసిన శ్రీకృష్ణుడు ఆ రహస్యమును చివరిలో బోయవానికి చెప్పిపోయాడు. భగవంతుడు రెండు సమయములలో, రెండు దేశములలో తన బోధను తెలుపవలసియున్నది. భోజనము చేయువాడు మజ్జిగతో తిన్నప్పుడే అది సంపూర్ణ భోజనమని అనుకొన్నట్లు, చివరిలో మూడవమారు బోధ యొక్క వివరమును తెలిపినప్పుడు సంపూర్ణముగా చెప్పినట్లు అగును. అలాగే చెప్పబడిన బోధ మూడు ఆత్మలను తెలుపునదిగా ఉండాలి. ఈ సూత్రము వర్తించినప్పుడు అది భగవంతుడు మానవునికి బోధించిన బోధ అగును.

ఇంకా కొన్ని ధర్మములనుగానీ, లేక ఒక ధర్మమునుగానీ మరియొక కాలములో మరియొక దేశములో చెప్పవలెనని శ్రీకృష్ణునకు తెలుసు. అలా రెండవసారి రెండవచోట తానే చెప్పవలెనని, అలా చెప్పిన దానినే తిరిగి మూడవసారి తానే వివరించవలెనని కూడా శ్రీకృష్ణునికి తెలుసు. అలా

మూడుసార్లు చేసినప్పుడు తాను ఒకసారి భూమిమీద ధర్మములను తెలియ జేసినట్లగును. అందువలన తన ప్రణాళికను లేక పథకమును ముందే తెలియజేసినట్లు ఆధారము కొరకు బోయవానికి తన రెండవ రాకను, మూడవ రాకను గురించిన సమాచారమును తెలియజెప్పిపోయాడు. ఏదైనా జరుగక ముందు చెప్పితే, చెప్పినవానికీ జరిగిన కార్యమునకు విలువ ఉంటుంది. అట్లుకాక జరిగిన తరువాత చెపితే జరిగినపనికిగానీ, చెప్పిన వ్యక్తికిగానీ విలువ ఉండదు. అందువలన శ్రీకృష్ణుడు జరుగబోవు దానిని గురించి ముందే చెప్పాడు. ఆ విలువైన సమాచారమును వినిన వ్యక్తి అప్పుడే బయటికి చెప్పకపోయినా, తర్వాత చెప్పుట వలన శ్రీకృష్ణుడు చెప్పిన సమాచారమునకు విలువ చేకూరినది. సత్యమును వేయిమంది కాదనినా అది అసత్యముకాదు అను సూత్రమును అనుసరించి చూస్తే, ఎందరు కాదు లేదు అనినా, సత్యము జీవించియే ఉంటుంది. చివరకు ఎవరైనా సత్యమును ఒప్పుకోక తప్పదు.

శ్రీకృష్ణుడు ఏసుప్రభువుగా వచ్చాడని చెప్పుట సత్యము. కనుక ఆ మాటను ఆలోచించి చూస్తే, ఎవరికైనా సత్యముగా కనిపించును. శ్రీ కృష్ణుని జీవితము గడచిపోయి 5118 సంవత్సరములలైనది. అలాగే ఏసుప్రభువు జీవితము గడచిపోయి ఇప్పటికీ 2015 సంవత్సరములైనది. ఇద్దరి జీవితములు గడచిపోయినవే కనుక గడచినవారి చరిత్రను ఎవరూ కాదనలేరు. శ్రీకృష్ణుడు పుట్టాడు, అలాగే ఏసుప్రభువు పుట్టాడు. ఎవరికైనా సాధారణముగా జీవితములో జననము మరియు మరణము రెండూ ముఖ్య సంఘటనలే. ఇప్పుడు ముఖ్యఘట్టమైన శ్రీకృష్ణుని పుట్టుకను, ఏసుప్రభువు పుట్టుకను గమనించి చూస్తాము.

శ్రీకృష్ణుడు పాతబడిన చెఱసాలలో, అశుభ్రమైనచోట తల్లి ప్రక్కన తండ్రి తప్ప ఎవరూ లేని దీనస్థితిలో పుట్టాడు. ఏసుప్రభువు కూడా పాత బడిన పశువులశాలలో అశుభ్రమైనచోట తల్లిప్రక్కన తండ్రి తప్ప ఎవరూ లేని దీనస్థితిలో పుట్టాడు. జీవితముయొక్క ప్రారంభ ఘట్టములో జరిగిన విధానమును ఇటు హిందువులు అటు క్రైస్తవులు యుక్తినిపయోగించి యోచిస్తే శ్రీకృష్ణుడు, ఏసుప్రభువు ఇద్దరూ ఒక్కరే అనుటకు మొదటనే సాక్ష్యము దొరుకుచున్నది. తరువాత చూస్తే, శ్రీకృష్ణుడు పుట్టడము ప్రమాద సమయము. అలాగే ఏసుప్రభువు పుట్టడము కూడా ప్రమాద సమయమే. శ్రీకృష్ణుడు పుట్టాడని తెలియగానే అతనిని చంపుటకు ఆ దేశరాజు సిద్ధముగా ఉన్నాడు. అలాగే ఏసు పుట్టాడని తెలియగానే, అతనిని చంపుటకు కూడా ఆ దేశరాజు సిద్ధముగా ఉన్నాడు. శ్రీకృష్ణుడు పుట్టగానే కొద్దిసేపటికే పుట్టిన చోట లేకుండా తండ్రిగానున్న వసుదేవుడు ప్రక్క ప్రాంతమునకు తీసుకు వెళ్ళాడు. అలాగే ఏసు పుట్టిన కొద్దిసేపటికే, ఆయన తండ్రిగానున్న యోసేపు పుట్టినచోట లేకుండా ప్రక్క ప్రాంతమునకు తీసుకెళ్ళాడు. శ్రీకృష్ణుడుగానీ, ఏసుప్రభువుగానీ ఇద్దరూ రాత్రిపూటనే జన్మించారు. రాత్రిపూట జన్మించిన వారు ఆ రాత్రికే పుట్టిన స్థలములో లేకుండా, అక్కడికి దూరముగా కొంత కాలము అజ్ఞాతముగా పెరిగారు. శ్రీకృష్ణుడు, ఏసుప్రభువూ ఇద్దరూ ఒకటేనని తెలియుటకు ఒకే పోలికగల సంఘటనలు వారు పుట్టినరోజు చోటు చేసుకొన్నాయి. కొంచెము తెలివిని ఉపయోగించి చూచినా వారిరువురు జనన రహస్యము తెలిసిపోతుంది. వారు ఇద్దరూ 'ఒక్కరు కాదు' అనుటకు వీలులేకుండా వారిరువురి పుట్టుకలు ఒకే విధముగా జరిగాయి.

తరువాత శ్రీకృష్ణునికి ముప్పయి సంవత్సరముల వయస్సులో అతని జీవితమందు చెప్పుకోతగిన మార్పు వచ్చినది. అలాగే ఏసుప్రభువుకు కూడా ముప్పయి సంవత్సరముల వయస్సులో మార్పు కనిపిస్తున్నది. ముప్ఫయి సంవత్సరముల వయస్సులో శ్రీకృష్ణుడు మధురను వదలి ద్వారకకు పోయాడు. అలాగే ఏసుప్రభువు కూడా తనకు ముప్పయి సంవత్సరముల వయస్సు రాగానే తల్లితండ్రులను వదలి వెళ్ళిపోయాడు. చివరిలో ముఖ్య ఘట్టమైన మరణములో శ్రీకృష్ణుడు గాయపడి రక్తము కారి చనిపోయాడు. అలాగే ఏసుప్రభువు కూడా గాయపడి రక్తము కారి చనిపోయాడు. శ్రీకృష్ణుడు చనిపోవు సమయములో తనవారు ఎవరూ శ్రీకృష్ణునివద్దలేరు. అలాగే ఏసుప్రభువు చనిపోయినప్పుడు కూడా ఆయనవద్ద తనవారు ఎవరూ లేరు. శ్రీకృష్ణుడు మరణించునప్పుడు ఆయన త్రాగేదానికి నీళ్ళు కూడా అక్కడలేవు. అలాగే ఏసుప్రభువుకు కూడా నీరు దొరకలేదు. శ్రీకృష్ణుడు తన కాలికి బలముగా నాటుకొన్న బాణము వలన చనిపోయాడు. అలాగే ఏసుప్రభువు తనకాళ్ళకు బలముగా నాటుకొన్న సీల (ఇనుప మేకు) వలన చనిపోయాడు. ఈ విధముగా శ్రీకృష్ణుని మరియు ఏసుప్రభువులయొక్క జనన మరణములు ఒకే స్థితిగా జరిగిపోయినవి. భూమిమీద ఆ విధముగా ఎవరికీ జరుగ కుండ, కేవలము వీరిద్దరి విషయములోనే అలా జరుగడము, వీరిరువురూ విశేషముగా ఇద్దరు ప్రవక్తలుగా ఉండడము వలన వీరి జనన మరణములను విశ్లేషించి చూడవలసి వచ్చినది. అలా చూస్తే వీరు ఇద్దరూ ఒక్కరేనని తెలియనివారు కూడా తెలుసుకొనునట్లు అలా జరిగినదని తెలియుచున్నది.

శ్రీకృష్ణుడు చనిపోతూ చెప్పినమాట సత్యమని తెలియుటకు ఏసు జననము, మరణములు రెండూ శ్రీకృష్ణుని జనన మరణములతో సరితూగు నట్లు జరిగినవి. కనిపించని దానిని నమ్మము, కనిపించే దానిని

నమ్ముతామను హేతువాదులకు, కనిపించనిది అసత్యము కనిపించునదే సత్యము అను నాస్తికవాదులు కూడా ఒప్పుకొనునట్లు, కనిపించు సంఘటనలు గానే శ్రీకృష్ణుని, ఏసుప్రభువుల యొక్క జనన మరణములు జరిగినవి. శ్రీకృష్ణుడు చెప్పినవి హిందూమత ధర్మములనీ, ఏసు చెప్పినవి క్రైస్తవ మత ధర్మములనీ పొరపాటున కూడా అనుకోకూడదు. శ్రీకృష్ణుడు గానీ, ఏసు ప్రభువుగానీ మత ధర్మములను బోధించలేదు. వారిరువురూ బోధించినవి ఒకే దేవుని ధర్మములు మాత్రమేనని జ్ఞాపకముంచుకోవలెను. జరిగి పోయినవి, జరుగుచున్నవి, జరుగబోవునవి తెలిసిన శ్రీకృష్ణుడు తాను ఎవరైనదీ కేవలము జ్ఞానులకు, యోగులకు మాత్రమే తెలియాలని, అజ్ఞానులకు ఏమాత్రము తెలియకూడదని అనుకొన్నాడు. శ్రీకృష్ణుడు తన పథకమును జ్ఞానులకు, యోగులకు తెలియునట్లు చేశాడు. అలా చేయుట వలన శ్రీకృష్ణునికి మూడవ రాక, ఏసుప్రభువుకు రెండవ రాక అయిన 'ఆదరణకర్త' విషయము జ్ఞానులకు, అజ్ఞానులకు తెలిసినా ఫరవాలేదను కొన్నాడు. శ్రీకృష్ణుని మొదటి రాకలో ఆయన గొప్ప ధనికుడుగా వచ్చాడు. ఆయనకు రెండవ రాకలో ఏసుప్రభువుగా చాలా బీదవాడిగా, కట్టుకొనే దానికి రెండవ వస్త్రము లేనివాడుగా ఉన్నాడు. శ్రీకృష్ణునిగా బంగారు ఆభరణములు ధరించి పట్టువస్త్రములు కట్టినవాడు, ఏసుప్రభువు జన్మలో ఉన్నప్పుడు నూలువస్త్రము కూడా సరిగా లేనివాడుగా కనిపించాడు. ఇక మూడవ అవతారములో ఎవరికీ తెలియకుండునట్లు అటు ధనికుడూకాక, ఇటు బీదవాడూకాక మధ్యరకముగా ఉండునని తెలియుచున్నది.

శ్రీకృష్ణుడు ద్వాపరయుగములో, ఏసుప్రభువు కలియుగములో యున్నా, వారు సాధారణ మనుషులవలె కష్టసుఖములను అనుభవించుట వలన, మిగతా ప్రజలు వారిని సాధారణ వ్యక్తులుగానే లెక్కించారు. **"ద్వాపర**

**యుగములో శ్రీకృష్ణుడు చనిపోయిన తరువాత భగవద్గీత బయటికి వచ్చినది. కలియుగములో ఏసుప్రభువు కూడా చనిపోయిన తరువాత కొంత కాలమునకు సువార్త బైబిలు బయటికి వచ్చినది.”** భగవద్గీతను ఆనాటి వ్యాసుడు వ్రాయగా, కలియుగములో ఏసుప్రభువు బ్రతికియున్నప్పుడు ఆయనవద్ద ఉండి, ఏసు ప్రభువు మాట్లాడినప్పుడు వినిన వాక్యములను ఆయన శిష్యులు నలుగురు నాలుగు సువార్తలుగా వ్రాశారు. నేడు భగవద్గీత హిందువులకు ప్రామాణిక గ్రంథమయినా, కొందరు హిందువులకు భగవద్గీత తమకు ప్రమాణ గ్రంథమని తెలియదు. భగవద్గీత అంటే సరిపోని హిందువులు చాలామంది గలరు. తమ గ్రంథమేదో తమ దేవుడెవరో తెలియని స్థితిలో నేటి హిందు (ఇందు)వులున్నారు. క్రైస్తవుల విషయానికి వస్తే, వారి గ్రంథము ‘బైబిలు’ గ్రంథమని వారు నమ్మియున్నారు. అట్లే వారి దేవుడు ‘యెహోవా’ అని చెప్పుచున్నారు.

ఇందూమతము ఎప్పుడు పుట్టినదో ఎవరికీ తెలియదు. క్రైస్తవ మతము రెండువేల (2000) సంవత్సరముల పూర్వము పుట్టినది. అయినా ముందు పుట్టిన ఇందూమతముకంటే వెనుక పుట్టిన క్రైస్తవ మతము చాలా వేగముగా అభివృద్ధియై నేడు ఇందూమతముకంటే పెద్దగాయుండడమే కాక ప్రపంచములోనే అతి పెద్ద మతముగా ఉన్నది. నేడు హిందూమతములోని మనుష్యులకు జ్ఞానము తెలియకపోవడము చేత హిందూమతము క్షీణించు చున్నది. క్రైస్తవులు బైబిలు బోధలు ప్రచారము చేయుచూ, వారి మతమును అభివృద్ధి చేసుకొంటున్నారు. వారి దృష్టి మతమును అభివృద్ధి చేయడములో ఎక్కువగా ఉన్నదిగానీ, బైబిలు జ్ఞానమును తెలుసుకోవడములో లేదనియే చెప్పవచ్చును. భగవద్గీతలో ఎంతో జ్ఞానము ఉన్నా, హిందువుల దృష్టి జ్ఞానము మీద లేదు. ఎవరికైనా కొంత దేవుని మీద ధ్యాసకల్గితే, ఆ

ధ్యాసను అసలయిన జ్ఞానముమీద ఉపయోగించకపోవడము వలన, ఎవరు దేవుడో, ఎవరు దయ్యమో తెలియని స్థితిలో ఉన్నారు. కొందరు రాముడే దేవుడని నమ్మియున్నారు. కొందరు వేదములే తమ గ్రంథములని నమ్మి యున్నారు. చివరికి హిందువుల దృష్ఠి దేవునిమీద కాకుండా ఎంతోమంది దేవతల మీద ఉన్నది.

దేవుడు కర్త, కర్మ, క్రియకు సూత్రధారిగా ఉన్నాడని ఎవరికీ తెలియకుండా పోయినది. దేవునియొక్క మూడు భాగములను పూర్తిగా తెలియగలిగితే వాడు సంపూర్ణ జ్ఞానియగును. తన మూడు హోదాలను, తన మూడు ఆత్మల విధానమును మనిషి తెలియడమే ఆధ్యాత్మికమగును. దేవుడు తన విషయము తానే తెలియును. దేవుని విషయము ఏ మనిషికీ తెలియదు. అటువంటి స్థితిలో మనిషికి ఆధ్యాత్మికము 'దేవుని మూడు భాగముల విషయ జ్ఞానము' తెలియాలంటే దానిని దేవుడే చెప్పవలసి యుండును. మొదటికే దేవుని విషయము మనిషికి ఏమాత్రము తెలియదు. దేవుడే తన విషయములను తెలిపినా, తెలుసుకొను యోగ్యత, శక్తి ఏమాత్రమూ మనిషికి లేవు. అందువలన దేవుడు తనకు ఇష్టమయిన మనిషికి మాత్రము తనను తెలియు యోగ్యతను కల్గించుచున్నాడు.

ఖురాన్ గ్రంథమునందు స్వయముగా జిబ్రయేల్ తౌరాత్ (భగవద్గీత) మరియు ఇంజీలు (బైబిలు) గ్రంథముల యొక్క విశిష్ఠతను తెలియజేస్తూ చెప్పిన వాక్యములు ఎన్నో గలవు. వాటిని ఇక్కడ గమనించితే, తౌరాతు మరియు ఇంజీలు యొక్క విశిష్ఠత తెలియును. ఖురాన్ గ్రంథములో 5వ సూరా 46వ ఆయత్‌నందు ఇలా కలదు చూడండి. **(5-46) "ఆ ప్రవక్తల తరువాత మేము మర్యమ్ (మరియమ్మ) కుమారుడు ఈసాను (ఏసును)**

**పంపాము. అతను తనకు పూర్వము వచ్చిన తౌరాతు గ్రంథమును సత్యమని ధృవీకరించేవాడు. మేము అతనికి ఇంజీలు (బైబిలు) గ్రంథాన్ని ఇచ్చాము. అందులో (బైబిలులో) మార్గదర్శకత్వము, జ్యోతి ఉండేవి. అది తనకు ముందున్న తౌరాతు గ్రంథమును ధృవీకరించేది. అంతేకాక అది దైవభీతి కలవారికి మార్గదర్శినిగా, హితబోధినిగా ఉండేది"** ఇక్కడ ఉన్న ఒక వాక్యమును చూస్తూనే తౌరాతు గ్రంథమంటే ఏమిటి? అని తెలిసిపోవు చున్నది. ప్రపంచములో మూడు దైవగ్రంథములు గలవు వాటిని అనుసరించి ఇందూ, ఇస్లామ్, క్రైస్తవ అను ముఖ్యముగా మూడు సమాజములున్నవి. ఈ వాక్యములో ఏసుప్రభువును పంపి, అతని ద్వారా బైబిలు గ్రంథమును ప్రజలకు ఇచ్చినట్లు గలదు. బైబిలు గ్రంథము రెండువేల సంవత్సరముల పూర్వము మనుషుల మధ్యలోనికి వచ్చినట్లు తెలుసుకొన్నాము. దానికంటే మూడు వేల సంవత్సరముల ముందు, కలియుగము మొదటిలో, ద్వాపర యుగము చివరిలో భగవద్గీత గ్రంథము వచ్చిన విషయము అందరికీ తెలిసినదే, ఇక్కడ తౌరాతు గ్రంథము ఏది? అని చూచినట్లయితే అన్ని విధములా భగవద్గీత గ్రంథమనియే తెలియు చున్నది.

బైబిలు గ్రంథముకంటే ముందున్న గ్రంథము భగవద్గీత తప్ప ఏదీ లేదు. అందువలన భగవద్గీతయే తౌరాతు గ్రంథమని చెప్పవచ్చును. భగవద్గీతలోయున్న జ్ఞానమే బైబిలులో ఉండడము వలన, బైబిలు తనకు ముందున్న భగవద్గీతను ధృవీకరించుచున్నదని తెలియుచున్నది. అంతేకాక తౌరాతు అంటే భగవద్గీతయని తెలియునట్లు తౌరాతు పదమునకు గల అర్థము భగవద్గీతతో సరిపోవుచున్నది. ఖురాన్ గ్రంథములో మిగతా చాలాచోట్ల కూడా తౌరాత్ అను పేరుతో వాక్యములు కలవు. ఆ

వాక్యములన్నీ సరియైన భావముతో అర్థమగుటకు తౌరాతు అని చెప్పబడిన చోటంతా భగవద్గీతను ఆ స్థానములో ఉంచుకొని చదువుకోవలెను. తౌరాతు స్థానములో భగవద్గీతను ఉంచుకొని చెప్పుకోవడము వలన అన్ని రకముల దైవభావము సరిపోవును. ఇప్పుడు ఇంకా తౌరాతు అను పేరుతోయున్న వాక్యములను ఇక్కడ చెప్పుకొందాము. 5వ సూరా 48వ ఆయత్ **(5-48) "మేము నీవైపుకు ఈ గ్రంథాన్ని (ఖురాన్‌ను) సత్యసమేతముగా అవతరింప జేశాము. ఇది తమకన్నా ముందు వచ్చిన గ్రంథాలను సత్యమని ధృవీ కరిస్తున్నది. నీవద్దకు వచ్చిన సత్యమును వీడి వారి మనోవాంఛలను అనుసరించకు" అని కలదు.** మరియొక చోట 5వ సూరాలోనే 68వ ఆయత్‌నందు ఇలా కలదు చూడండి. **(5-68) "ఓ గ్రంథవహులారా! మీరు తౌరాతునూ, ఇంజీలును (భగవద్గీత, బైబిలును) మీ ప్రభువు తరపున మీవద్దకు పంపబడిన దానినీ (ఖురాన్ గ్రంథమును) మీ జీవితాలలో నెలకొల్పు వరకు మీరు ఏ ధర్మము పైనా లేనట్లే"** అనికూడా చెప్పారు. ఇంకా, 5వ సూరా 44వ ఆయత్‌నందు పూర్తిగా ఇలా వ్రాయబడివున్నది. **(5-44) "మేము తౌరాతు గ్రంథమును అవతరింపజేశాము అందులో మార్గదర్శకత్వమూ, జ్యోతి ఉన్నాయి. ఈ తౌరాతు గ్రంథ ఆధారముగానే ముస్లీములైన ప్రవక్తలు, రబ్బానీలు, ధర్మవేత్తలు యూదుల సమస్యలను పరిష్కరించేవారు"** అని కలదు. అంతేకాక 62వ సూరాలో 5వ ఆయత్‌నందు ఇలా కలదు. **(62-5) "తౌరాతు గ్రంథము ప్రకారము ఆచరించాలని ఆదేశించినప్పటికీ, దానిని అనుగుణముగా ఆచరించనివారు ఎన్ని గ్రంథములను అనుసరించినా, అటువంటి వారిని ఎన్నో గ్రంథములను వీపుమీద మోయు గాడిదలాంటి వారని ఉపమానముగా చెప్పవచ్చును. దేవుని వాక్యములను ధిక్కరించిన**

**వారి దృష్టాంతము చాలా చెడ్డది. దుర్మార్గపు జనులకు అల్లా సన్మార్గము చూపడు"** అని వ్రాయబడియున్నది.

ఈ వాక్యములన్నింటినీ గమనించి, 5-68వ వాక్యమును చూస్తే, అందులో తౌరాతు గ్రంథమును తెలియకపోతే మరియు బైబిలు, ఖురాన్ గ్రంథములను ధర్మములు తెలియకపోతే, ఏ ధర్మములోలేనట్లే! అనగా వాడు ఏ మతమునకూ సంబంధించినవాడు కాదు అని చెప్పినట్లేని గలదు. ఒక క్రైస్తవుడు తన గ్రంథముకాక దానికంటే ముందుగల తౌరాతు ధర్మములను తెలియకపోతే, వాడు బైబిలును చదివినా అతడు క్రైస్తవుడు కానట్లేయని అర్థము. అలాగే ఒక ముస్లీమ్ తన గ్రంథమైన ఖురాన్‌ను చదివినప్పటికీ, తౌరాతు గ్రంథములోని జ్ఞానమును తెలియకపోతే, వాడు ముస్లీమ్ ధర్మములలో లేనట్లేయగును. అప్పుడు వానిని పూర్తిగా ముస్లీమ్ అని చెప్పుటకు కూడా వీలులేదని, పై 68వ ఆయత్‌లో చెప్పడమైనది. ఇంకా విశేషమేమంటే, తౌరాతు గ్రంథమును అనుసరించక, మిగతా గ్రంథములను చదివినా లేక వాటిని అనుసరించినా ఆ గ్రంథములను వీపుమీద మోయు గాడిదలాంటి వానిగా ఖురాన్ గ్రంథము 62వ సూరాలో 5వ వాక్యములో కలదు.

దీనిప్రకారము క్రైస్తవుడుగానీ, ముస్లీమ్‌గానీ తప్పనిసరిగా వారి గ్రంథములకంటే ముందు వచ్చిన తౌరాతును (భగవద్గీతను) తప్పక తెలిసి ఉండాలని అర్థము. ఇక్కడ చెప్పినట్లే బైబిలు కూడా భగవద్గీతను ఇది సత్యమైన గ్రంథమని ధృవీకరించుచున్నది. అలాగే ఖురాన్ గ్రంథము కూడా భగవద్గీత దైవధర్మములు కలిగిన గ్రంథమని సాక్ష్యమిచ్చుచున్నది. 5వ సూరా 44వ వాక్యములో ఖురాన్ గ్రంథము తౌరాత్ గ్రంథమును

ధృవీకరించునట్లు 5-48లో బైబిలు, తౌరాతును (భగవద్గీతను) సత్యమని ధృవీకరించినట్లు గలదు. బైబిలు, ఖురాన్ గ్రంథములు రెండూ (భగవద్గీతను) దైవగ్రంథమని ధృవీకరించు నిమిత్తము వచ్చాయి. అందువలన బైబిలుకు, ఖురాన్‌కు రెండిటికీ పుట్టినిల్లులాంటిది భగవద్గీతయనీ, ఈ రెండు గ్రంథముల ద్వారా తెలియుచున్నది. ఖురాన్ గ్రంథములో తౌరాత్ ప్రస్తావన ఉండినప్పటికీ, తౌరాత్ గ్రంథము ఏదో ఎవరికీ ఇంతవరకూ తెలియదు. తౌరాతు గ్రంథము ఏ భాషలో తయారైనదో తెలియదు. ఇంతవరకూ దానిని చూచినామని చెప్పువారు లేరు. ఎందుకనగా! భగవద్గీతయే అన్నిటికంటే ముందు పుట్టిన తౌరాత్ గ్రంథమని ఎవరికీ తెలియదు.

తౌరాతు గ్రంథము ఖురాన్ గ్రంథమునకు మాతృగ్రంథమనీ ఖురాన్‌లోని ముఖ్యమైన జ్ఞానమంతయూ భగవద్గీత లేక తౌరాతు గ్రంథములోనే కలదని, అందువలననే ఖురాన్ గ్రంథమునకు మాతృగ్రంథ మయినదని చెప్పవచ్చును. బైబిలు రెండువేల సంవత్సరముల క్రితము పుట్టినది. ఖురాన్ 1400 సంవత్సరముల క్రితం పుట్టినది. భగవద్గీత రెండు గ్రంథములకంటే ముందు ఇప్పటికి 5,150 సంవత్సరముల క్రిందట పుట్టినది. అందువలన బైబిలు, ఖురాన్ గ్రంథములకంటే ముందు వచ్చిన తౌరాతు గ్రంథము భగవద్గీతేయని దృఢముగా చెప్పవచ్చును. బైబిలు గ్రంథములోని జ్ఞానము, ఖురాన్ గ్రంథములోని జ్ఞానము భగవద్గీతలో ఉండుటవలన ఖురాన్‌లో చెప్పిన తౌరాతు గ్రంథము భగవద్గీతయేనని రుజువగుచున్నది. బైబిలులో ఆ గ్రంథమునకంతటికీ ఆధారమైన జ్ఞానము **'తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ'** అనునదియేనని చెప్పవచ్చును. అదే ముఖ్యమైన జ్ఞానమని ఎందుకు చెప్పుచున్నామనగా తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను ముగ్గురితో కూడుకొన్న మాటలనే ప్రజలకు ఉపదేశముగా

బోధించమని ఏసుప్రభువు తన శిష్యులకు చెప్పాడు. అందువలన అదే గ్రంథములో ముఖ్యమైన జ్ఞానమని చెప్పవచ్చును.

ఖురాన్ గ్రంథములో కూడా 50వ సూరా 21వ ఆయత్‌లో నున్న జ్ఞానమే ఖురాన్ గ్రంథములో ముఖ్యమైన గొప్ప జ్ఞానమని చెప్పవచ్చును. ఆ వాక్యములో **'తోలబడేవాడు, తోలేవాడు, సాక్షిగా చూసేవాడు'** అని ముగ్గురి గురించే చెప్పారు. బైబిలులోని వాక్యము, ఖురాన్‌లోని వాక్యము రెండింటి లోనూ ముగ్గురి గురించియే యున్నది. అయితే ఎవరూ గుర్తించని విధముగా ముగ్గురిని రెండు గ్రంథములయందు వేరువేరుగా చెప్పియున్నారు. ఈ రెండు గ్రంథములలోని ముగ్గురు విషయమునే భగవద్గీతలో ముందే 'క్షరుడు, అక్షరుడు, పురుషోత్తముడు' అని చెప్పియున్నారు. భగవద్గీతలో చెప్పిన ముగ్గురు పురుషుల జ్ఞానమే అందులో గొప్పది. ముఖ్యముగా ముగ్గురు పురుషుల జ్ఞానమును చెప్పుటకే భగవద్గీత తయారై వచ్చినది. అదే ముగ్గురు పురుషులను తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ' అని బైబిలు గ్రంథములో చెప్పడమైనది. అలాగే అదే ముగ్గురు పురుషులను గురించి ఖురాన్ గ్రంథములో 'తోలేవాడు, తోలబడేవాడు, సాక్షిగా చూసేవాడు' అని చెప్పడము జరిగినది. ఇదంతయూ గమనించిన తరువాత భగవద్గీత జ్ఞానమే రెండు గ్రంథములలో ఉండుట వలన, రెండు గ్రంథములకు భగవద్గీత మాతృ (తల్లి) గ్రంథమయినదని చెప్పవచ్చును.

అన్నిటికంటే ముందు తయారయిన గ్రంథము భగవద్గీతయని చెప్పితే కొందరు తమ అభ్యంతరమును తెలుపుచున్నారు. వారు ఇలా అడుగు చున్నారు. 5000 సంవత్సరముల క్రిందట, బైబిలు, ఖురాన్‌కంటే ముందు భగవద్గీత తయారయిన మాట వాస్తవమే. అయినా దానికంటే

ముందు త్రేతాయుగములోనే రామాయణము తయారయినది కదా! ద్వాపర యుగము చివరిలో భగవద్గీత తయారయినది. ద్వాపరయుగములోనే భగవద్గీతకంటే ముందు నాలుగు వేదములు, 18 పురాణములు తయారయినవి కదా! అటువంటప్పుడు అన్నిటికంటే ముందు భగవద్గీత గ్రంథము తయారైనదని చెప్పుట అసత్యమగును కదా! అని అడుగవచ్చును. దానికి యోగీశ్వరులవారి జవాబు ఈ విధముగా ఉన్నది చూడండి.

త్రేతాయుగములో రామాయణము, ద్వాపరయుగములో వేదములు, ఉపనిషత్తులు గ్రంథములుగా తయారయినమాట వాస్తవమే. అవన్నియూ భగవద్గీతకంటే ముందు తయారయిన గ్రంథములని ఒప్పుకోవచ్చును. అయితే ఇక్కడ యోగీశ్వరులవారు చెప్పినమాట కూడా వాస్తవమే. ఎలాగంటే యోగీశ్వరులవారు చెప్పినది దైవగ్రంథముల గురించి. రామాయణముగానీ, వేదములు గానీ, ఉపనిషత్తులుగానీ అవి పూర్తి ఆధ్యాత్మిక గ్రంథములు కావు. వాటిలో ఎక్కడయినా కొంత ఆధ్యాత్మిక విషయములుండినా, ఎక్కువగా ప్రపంచ సంబంధ విషయములే వాటిలో ఉండుట వలన, వాటిని దైవగ్రంథములుగా చెప్పుటకు వీలులేదు. రామాయణము, వేదములు, పురాణములు మనుషులు చెప్పినవే. అయితే భగవద్గీత స్వయముగా దేవుని అంశ అయిన భగవంతుడు చెప్పినది. అందువలన భగవద్గీత దైవ గ్రంథమయినది. ఆధ్యాత్మిక గ్రంథములలో మొదట తయారయిన గ్రంథము భగవంతుడు చెప్పిన భగవద్గీతనే. తరువాత రెండవ గ్రంథము భగవదంశ అయినా ఏసుప్రభువు చెప్పిన బైబిలు గ్రంథము. ఆ తరువాత మూడవ గ్రంథము మహాజ్ఞాని అయినా జిబ్రయేల్ చెప్పిన ఖురాన్ గ్రంథము. అందువలన భగవద్గీతకంటే ముందు ఎన్ని గ్రంథములు తయారయినా అవన్నియూ దైవగ్రంథముల క్రింద లెక్కించబడవు.

ప్రపంచములోని పన్నెండు మతములలో అతి ముఖ్యమైనవి మరియు పెద్దవి, దేవుని చేత జ్ఞానము పంపబడిన గ్రంథములు గలవి మూడు మతములు గలవు. అందులో అతి పురాతనమైనది ఇందూ మతముకాగా, రెండవది క్రైస్తవ మతము, మూడవది ముస్లీమ్ మతము. అయితే నేడు జనాభా సంఖ్యనుబట్టి మొదటిదయిన ఇందూమతము మూడవదయినది. రెండవదయిన క్రైస్తవము మొదటిస్థానములోనూ, మూడవదయిన ఇస్లామ్ రెండవ స్థానములోనూ ఉండడమైనది. ఏది ఎన్నో స్థానములో ఉన్నా, ఇందూమతము పుట్టుకలో మొదటిది. జ్ఞానములో మిగతా రెండు గ్రంథములకు ఆధారమైనది. భగవద్గీతలో చెప్పిన దానికి బైబిలులోగానీ, ఖురాన్‌లోగానీ వ్యతిరేఖముగా ఉండదు. అట్లే బైబిలు, ఖురాన్ గ్రంథములలో చెప్పిన జ్ఞానమునకు భగవద్గీతలో వ్యతిరేఖముగా ఉండదు. మూడు గ్రంథములలో సమన్వయ జ్ఞానముండును. ఇప్పుడు కొందరు ఒక ప్రశ్న అడుగవచ్చును. అదేమనగా! యోగీశ్వరుల వారు మూడు గ్రంథములలో ముఖ్యమైన జ్ఞానము, ముగ్గురు పురుషుల జ్ఞానమనీ, అదే మూడు ఆత్మల జ్ఞానమని చెప్పారు కదా! మీమాట ప్రకారము మూడు గ్రంథములలో ముగ్గురి పురుషుల జ్ఞానముండినా, ఒక ఖురాన్‌లో మాత్రము 5వ సూరా 73వ ఆయత్‌లో కొంత వ్యతిరేఖత కనిపించుచున్నది. దీనికి యోగీశ్వరులవారేమంటారు? అని అడుగవచ్చును. దానికి యోగీశ్వరుల వారి జవాబు ఇలా కలదు. ఒక గ్రంథములో వ్రాసినది మరొక గ్రంథములో వ్యతిరేఖముగా ఉండదని చెప్పారు కదా! అందువలన భగవద్గీతలో వ్రాసిన దానికి మిగతా రెండు గ్రంథములలో వ్యతిరేఖతయుండదు. 5-73 వాక్యములో చెప్పిన మాటలో వ్యతిరేఖత ఏమీ లేదుగానీ, అర్థము చేసుకోవడములో పొరపాటు పడుటకు అవకాశము కలదు. కొంత

అజ్ఞానముచే క్రైస్తవములో ఏసు ప్రభువును ఏసు తల్లి మరియమ్మను, యెహోవాను ముగ్గురినీ దేవునిగా లెక్కించడము జరుగును. అట్లే హిందూమతములో విష్ణు, ఈశ్వర, బ్రహ్మలను ముగ్గురిని దేవుళ్ళుగా కొందరు లెక్కించడము జరుగుచున్నది. దీనినిబట్టి దేవున్ని ముగ్గురిగా చెప్పకూడదని ఆ వాక్యములో చెప్పారు తప్ప ఇతర వ్యతిరేఖత ఏమీ లేదు. 5-73 వాక్యము ఇలా కలదు. **(5-73) "దేవుడు ముగ్గురుగాయున్నాడని అని అన్నవారు ముమ్మాటికీ తిరస్కారానికి పాల్పడినట్లే. వాస్తవానికి దేవుడు ఒక్కడే తప్ప ముగ్గురు లేరు. వారుగనుక తమమాటను మానుకోకపోయిన వారికి దేవుడు ఒకడేయను మాటను తిరస్కరించు వారికి బాధాకరమైన శిక్ష తప్పకయుంటుంది."**

ఇక్కడ దేవుడు ఒక్కడు కాదు, ముగ్గురు అనువారు దైవ తిరస్కారానికి పాల్పడినట్లేయగుననీ, దేవుడు ఒక్కడే అని చెప్పితే, అది దైవ తిరస్కారము కాదు. దైవాన్ని అంగీకరించినట్లగును. మూడు గ్రంథములలోని ముగ్గురు పురుషులలో ఒక్కడే దేవుడని, మిగతా ఇద్దరు పురుషులు దేవుడు కాదని చెప్పడములో తప్పులేదు కదా! త్రైత సిద్ధాంతములో మూడవవాడు మాత్రమే ఉత్తమ పురుషుడు. అతడు మాత్రమే దేవుడు. అతడే పరమాత్మ అతడే ఆరాధించదగినవాడు అని చెప్పడములో తప్పులేదు కదా! దేవుడు ముగ్గురుగా ఉన్నాడు అని అంటే తప్పు. దేవుడు ముగ్గురిలో ఒకడు మాత్రమే అంటే ఒప్పు అగునుగానీ తప్పుకాదు.

యోగీశ్వరులవారు ఒక గ్రంథములోని జ్ఞానమును బాగా విశ్లేషించి చూచి, అందులో ఏదైనా అజ్ఞానము దాగియుందేమోనని పరిశీలించి, అందులో కనిపించిన అజ్ఞానమును వదలివేసి, మిగిలిన స్వచ్ఛమైన

జ్ఞానమునే చెప్పుచుందురు. ఈ విధముగా ఎవరో ఒకరు చేయవలసి ఉంది. అప్పుడయితేనే కాలక్రమమున జ్ఞానములో కలిసిపోయిన అజ్ఞానము బయటపడగలదు. ఎవరో ఒకరు చేయవలసిన పనిని దేవుడు యోగీశ్వరులవారికి అవకాశమిచ్చి యోగీశ్వరుల వారి ద్వారా చేయడము అదృష్టముగా భావించవచ్చును. యోగీశ్వరులవారు ఎంతో పరిశోధించి భగవద్గీతలోని కల్పిత శ్లోకములను, అజ్ఞానపు మాటలను బయటపెట్టడము జరిగినది. ప్రథమ దైవగ్రంథములోనే కొంత అజ్ఞానము కలిసివుంటే తరువాత వచ్చిన మధ్యమ, అంతిమ దైవగ్రంథములలో కూడా అంతో ఇంతో అజ్ఞానము కలిసియుండును. యోగీశ్వరులవారు మిగతా రెండు గ్రంథములను కూడా పరిశీలించి, ఒక నిర్ణయమునకు వచ్చి వ్రాయడము జరిగినది. అయితే ఈ రెండు గ్రంథములలో ఏది అజ్ఞాన వాక్యమో యోగీశ్వరులవారు చెప్పలేదు. కనుక ఏది జ్ఞానవాక్యమో దానిని మాత్రమే యోగీశ్వరులవారు వ్రాయాలనుకొన్నారు. వాటిలో కూడా యోగీశ్వరుల వారు కొన్ని జ్ఞానవాక్యములనే వ్రాయుచున్నారు. యోగీశ్వరుల వారు వ్రాయని జ్ఞానవాక్యములు కూడా ఎన్నో ఉన్నవి. అందువలన వ్రాసినదే నిజమైన గ్రంథము, వ్రాయనిది అంతా అజ్ఞానమేమో! నిజమైన గ్రంథము కాదేమో! అని ఎవరూ అనుకోకూడదు.

పూర్వము భారతదేశమునకు జ్ఞానముగల దేశమని, జ్ఞానులు గల దేశమనీ భావించి ఇందూదేశము అనెడివారు. ఇందూ దేశముగా ప్రపంచములో భారతదేశమొక్కటే ఉండెడిది. కృతయుగములో భారత దేశమంతా జ్ఞానులతో నిండియుండేది. అందువలన భారతదేశము ఫలానాయని గుర్తింపుగా 'ఇందూదేశము' అని అన్నారు. ఈనాడు స్వామివారు గ్రంథము మొదటనో లేక చివరనో ఇందూ శబ్దమును పెట్టి

గ్రంథములో జ్ఞానమే కలదని, కొంచెము కూడా అజ్ఞానము లేదని చెప్పుచున్నారు. 'ఇందూ' అని చెప్పడములో అంతేతప్ప వేరు భావము ఏమాత్రమూ లేదు. అయితే బియ్యములో రాళ్ళను మాత్రము ఏరివేస్తాము. అలా కాకుండా, బియ్యములో బియ్యముకంటే రాళ్ళే ఎక్కువగా ఉండి బియ్యము తక్కువ ఉన్నప్పుడు బియ్యమును మాత్రమే ఏరి తీసుకొంటాము. అదే విధముగా మూడు గ్రంథములను చెప్పునప్పుడు ఇందూ పదమును ఉపయోగించినా, భగవద్గీతలోని కల్పిత శ్లోకములను మాత్రము బయటపెట్టి ఇది దేవుడు చెప్పినవి కావు అని తేల్చివేశారు. మిగతా రెండు గ్రంథములలో ఇది అజ్ఞానమునకు సంబంధించినదని ఏ వాక్యమూ స్వామివారు బయట పెట్టలేదు. ఆ గ్రంథములలో యోగీశ్వరులవారి పరిశీలన ఎక్కువలేదు, కావున వారికి తెలిసిన కొన్ని వాక్యముల వరకే వ్రాశారు. వారికి తెలియని వాక్యములు ఎన్నో ఉన్నాయని తెలియవలెను!

నేడు ప్రపంచములో అజ్ఞానులు అనేక రకములుగా భూమిమీద జీవించుచూ, జ్ఞానులకు కంటకులుగా మారి పాపమును సంపాదించు కొనుచూ, జీవితమును సాగించుచున్నారు. అటువంటి వారిని గ్రహములు, భూతములు ప్రమాదరూపములోనో, ప్రకృతి వైపరీత్యముల రూపములోనో, ఒకవైపు శిక్షించుచున్నా, ఇదంతయూ తాము చేసుకొన్న పాపము వలన లేక తప్పిదము వలన వచ్చినదే కదా! అను ఆలోచనా స్పృహ లేనివారై తిరిగి దేవునికి, దేవుని జ్ఞానమునకు వ్యతిరేఖముగా ప్రవర్తించుటే కాక, అజ్ఞాన మార్గములో పోవుటకే ఎక్కువగా ప్రాధాన్యత నిచ్చుచుందురు. కొందరు మాత్రము దైవజ్ఞానమే తమ జీవితాశయముగా బ్రతుకుచున్నారు. అటువంటివారు జ్ఞానులుగా ప్రవర్తించుచుండగా, చాలామంది సాధారణ జీవితము గడుపుచూ, అటు అజ్ఞానులుగా కాకుండా ఇటు జ్ఞానులుగా

కాకుండా మధ్యరకముగా బ్రతుకుచుందురు. అటువంటి వారికి జ్ఞానమూ అవసరములేదు. అట్లే అజ్ఞానమూ అవసరములేదు. వారికి కావలసినది సంపాదన మాత్రమే. ఉదయము లేచింది మొదలు డబ్బును గురించిన చింత, డబ్బును గురించిన కార్యములు చేయుచుందురు. ఆటువంటివారికి దేవుడే దిగివచ్చి చెప్పినా, నీ జ్ఞానముతో మాకేమి పనీ? అదేమయినా కూటికి వస్తుందా? గూటికి వస్తుందా? మాకేదయినా డబ్బులు వచ్చే పనుంటే చెప్పమని అడగగలరు. అటువంటివారు జ్ఞానముతోగానీ, అజ్ఞానముతోగానీ సంబంధము లేకుండా మధ్యరక జీవితమును గడుపుచుందురు. అట్లున్న వారు వారి భవిష్యత్తులో జ్ఞానులుగానైనా మారవచ్చును లేక అజ్ఞానులుగా నైనా మారవచ్చును.

మధ్యరక జీవితము గడుపువారు పూర్తి నాస్తికులూ కారు, అట్లే పూర్తి ఆస్తికులు కాదు. వారు మధ్య రకముగా దేవునిమీద భక్తియున్నా, వారు దేవున్ని మ్రొక్కినా, వారి సుఖములకొరకు, వారి లాభముల కొరకు, వారి రోగముల కొరకు, వారి కోర్కెల కొరకు మ్రొక్కుచుందురు. వారికి దేవుడెవరో తెలియకున్నా, తాము మ్రొక్కుచున్న వారిలో చిన్నదేవుడు ఎవరో, పెద్ద దేవుడు ఎవరో తెలియకున్నా తమ లాభముల కొరకు, తమ కోర్కెల కొరకు దేవుళ్ళందరికీ సమానముగా మ్రొక్కుచుందురు. ఇదంతా హిందూ మతములో ఎక్కువగా ఉన్నది. క్రైస్తవ మతములో దేవుడు ఒక్కడే అను ధ్యాసను వదలి ఒకరు ఏసుప్రభువును, మరొకరు ఏసు తల్లియైన మేరీ మాతను, మరొకరు యెహెూవా దేవున్ని మ్రొక్కుచుందురు. క్రైస్తవులు ముగ్గురిలో ఎవరిని మ్రొక్కినా, ఎవరిని ప్రార్థించిన వారి కొరకు వారి పిల్లల కొరకు, వారి జీవితము బాగా గడుచుట కొరకు ప్రార్థన చేయు చుందురు.

ప్రపంచములోని ప్రజలు కొందరు జ్ఞానులుగా, మరికొందరు అజ్ఞానులుగా, జీవించుచుండగా, మిగిలిన చాలామంది మధ్యరకము భక్తులుగా బ్రతుకుచున్నారు. మూడు రకములవారూ, తామే నిజమైన భక్తులమనీ, తమనే దేవుడు ఎక్కువగా ప్రేమించుచున్నాడనీ, తమకు తామే అనుకొనుచుందురు. అయితే ఆ మాట అజ్ఞానులయినవారి ఎడల సత్యము. మిగతా వారి ఎడల అసత్యము. జ్ఞానులయినవారు తమ జీవితములో ఎక్కువ భాగము దేవుని జ్ఞానము కొరకు, దేవుని సేవకొరకు ఉపయోగించు చుందురు. అటువంటి వారు ప్రాపంచిక సుఖములను, లాభములను ఆశింపక అవి కర్మానుసారము వచ్చిపోవుచుండునని తలచి, వాటిని గురించి దేవున్ని ఎప్పటికీ కోరక, ధన సముపార్జన మీద ఆసక్తి చూపక, కేవలము జ్ఞాన సముపార్జన మీద ధ్యాస కలిగియుందురు. అటువంటివారికి జీవితములో ఏమయినా, బాధలకూ జ్ఞానమునకు ముడివేయక, రెండూ వేరువేరు భాగములని అనుకొనుచూ జీవితమును సాగించుచుందురు. మూడు రకముల జీవితము సాగించువారిలో జ్ఞానులు ఉత్తములు, అజ్ఞానులు అధములు. మిగిలిన భక్తులు అవసరమునుబట్టి మ్రొక్కువారు అయినందున, తరువాత జీవితములో ఎటువైపు అయినా మారగల అవకాశముండుట వలన, వారిని మధ్యరకము వారిగా లెక్కించుచున్నాము.

మధ్యరకము మనుష్యులుగానీ, అధమ రకము మనుషులుగానీ చనిపోయిన తరువాత తిరిగి పుట్టుచుందురు. భగవద్గీతలో చెప్పినట్లు వారికి జనన మరణములు తప్పవు. అటువంటివారు మరణము తరువాత వారిని స్పృహలేని సమాధి స్థితినుండి దేవుడు తిరిగి లేపుచున్నాడు. అనగా తిరిగి క్రొత్త జీవితమును ఇచ్చి గడచిపోయిన జన్మలోని పాపపుణ్యముల ఫలితములైన సుఖ, దుఃఖములను అనుభవించునట్లు చేయుచున్నాడు. సుఖ

దుఃఖములను అనుభవించడమే వారికి జీవితముగా గడచుచున్నది. నేడు ప్రపంచములోని క్రైస్తవులందరూ బైబిలులోని వాక్యములకు అర్థము తెలియని వారై విపరీతార్థముతో చిన్న, పెద్ద బోధకులు మరియు పాస్టర్లు అజ్ఞానముతో కూడిన బోధలు చేయుచూ, తమ జీవితమును సాగించుచున్నారు. ఏసుప్రభువు తన రక్తము ద్వారా మనుషుల పాపములు క్షమించబడునని బైబిలు గ్రంథములో ఎక్కడా చెప్పలేదు. తాను సిలువ వేయబడుటకు ముందురోజు తన 12 మంది శిష్యులతో కలిసి భోజనము చేయునప్పుడు, మత్తయి సువార్త 26వ అధ్యాయము, 28వ వాక్యములో **"దీనిలోనిది మీరందరూ త్రాగుడి, ఇది నా రక్తము. అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న 'నిబంధనరక్తము"** అని ఏసుప్రభువు అన్నాడు. ఇదే విషయమునే మార్కు సువార్త 14వ అధ్యాయము 24వ వాక్యములో **"ఇది నా నిబంధన విషయమై అనేకుల కొరకు చిందింప బడుచున్న నా రక్తము"** అని అన్నాడు.

బైబిలులోని ఈ వాక్యములు ఎంతో ప్రాధాన్యత కలిగియుండగా, వాటిని తమ ఇష్టము వచ్చినట్లు చెప్పుకొనుటకు మనుషులు అలవాటు పడిపోయారు. ఎంతో జ్ఞాన సందేశముతో కూడుకొన్న వాక్యమును ఏసు ప్రభువు చెప్పితే, దానిని ఎలా అర్థము చేసుకోవాలో అలా అర్థము చేసు కోకుండా, తమకు అనుకూలముగా అల్పముగా, ఆకతాయిగా తీసికొని, దేవుని ధర్మమునకు వ్యతిరేఖముగా చెప్పుకొనుచున్నారు. అలా చెప్పు కోవడము వలన దేవుని జ్ఞానమును తప్పుత్రోవ పట్టించినట్లగును. భగవంతుని ఉద్దేశ్యమును మార్చినట్లగును. పండ్రెండు మంది శిష్యుల మధ్యలో కూర్చున్న ఏసుప్రభువు ఒక గిన్నెలో ద్రాక్షరసమును వారికి ఇచ్చి "ఇది పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న

నిబంధన రక్తము” అన్నారు. ఇక్కడ ఏసుప్రభువు తన శరీర రక్తము అని ఏమాత్రమూ చెప్పలేదు. నా నిబంధన రక్తము అని అన్నాడు. ఎంతో స్వచ్ఛముగా అందరికీ అర్థమయ్యేలాగున ‘నా నిబంధన రక్తము’ అని ఏసు ప్రభువు చెప్పియుండగా, దానిని బోధకులు ఆయన శరీర రక్తముగా మార్చి చెప్పవలసిన అవసరమేమిమొచ్చినదని మా యోగీశ్వరుల వారు అడుగు చున్నారు. అంతేకాక నేను చనిపోయినప్పుడు చిందింపబోవు రక్తమని ఆయన చెప్పలేదు కదా! ప్రస్తుతము వర్తమాన కాలములో అనగా జరుగుచున్న కాలములో “చిందింపబడుచున్న రక్తము” అని చెప్పాడుగానీ, రాబోవు కాలములో చిందింపబోవు రక్తమని చెప్పలేదు. నేడు ప్రపంచములో గల ఎంతో తెలివైన బోధకులు, ఏసుప్రభువు (భగవంతుడు) చెప్పిన వాక్యమును తెలివితక్కువగా ఎందుకు అర్థము చేసుకొన్నారని ప్రశ్నించు చున్నారు. మనుషుల పాపముల కొరకు ఆయన ఎందుకు రక్తమును చిందించాలి? అనికూడా అడుగుచున్నారు. ఆయన చెప్పినది ఏ రక్తమో తెలియక గ్రుడ్డిగా మాట్లాడువారికి దేవుని జ్ఞానము ఎంతవరకు తెలిసియుంటుందో, ఆలోచించుకోండి.

దేవుని ధర్మముల ప్రకారము దేవుని ప్రతినిధిగా వచ్చినవాడు, దేవుని జ్ఞానమును తెలియజెప్పితే, దానివలన జ్ఞానసంపన్నులై జ్ఞానాగ్ని కలవారై, తమ కర్మలను (పాపములను) లేకుండా చేసుకోవచ్చును. జ్ఞానమువలననే పాపములు నశించునుగానీ మతము మారితేనో, మనిషి రక్తము పూసు కొంటేనో, జంతువురక్తము కార్చితేనో పాపములు పోవు. దేవుడు మనుషుల పాపములను లేకుండా చేస్తానని, ఏ గ్రంథములోగానీ, ఏ సందర్భములో గానీ చెప్పియుండలేదు. అలా చెప్పడము అధర్మమగునని దేవునికి తెలుసు. దేవుని ధర్మములను తెలియని మనిషి దేవునికి కళంకము తెచ్చు మాటలను

మాట్లాడుచున్నాడు. దేవుని జ్ఞానమును దేవుడే చెప్పినా, దానికి భిన్నముగా వక్రీకరించి చెపితే, దేవునికి వ్యతిరేఖముగా అధర్మములను బోధించినట్లగును. అప్పుడు దానివలన పాపము సంభవించుచున్నది. ఈ విధముగా చాలామంది బోధకులు తమకు తెలియకున్నా, ఏమాత్రము యోచించకుండా దేవుని జ్ఞానమును అధర్మయుక్తముగా, దేవుడు చెప్పిన దానికి వ్యతిరేఖముగా చెప్పడము వలన బోధకులని పేరుగాంచిన వారికైనా దేవుని విషయములో అక్రమమైన పనిని చేసినట్లగును. అందువలన బోధకులైనవారు తమకు సంపూర్ణముగా తెలిసిన జ్ఞానమునే బోధించమని చెప్పుచున్నారు. ధర్మములకు వ్యతిరేఖమైనదానిని, శాస్త్రబద్ధతలేని దానిని బోధించకూడదని యోగీశ్వరులవారు తెలుపుచున్నారు.

దేవుని జ్ఞానము తన శరీరములో ప్రవహించు రక్తముతో సమానమని ఏసుప్రభువు చెప్పుచూ, దానిని నిబంధన రక్తమని అన్నాడు. దేవుని జ్ఞానము అందరికీ ముఖ్యమైనదే. అందువలన ఏసుప్రభువు దేవుని జ్ఞానమును రక్తముతో పోల్చి చెప్పాడు. అది పోలికయేగానీ, నిజముగా శరీర రక్తమని చెప్పలేదు. దీనిని ఉపమానముగా చెప్పిన విషయమని అర్థము చేసుకోవలెను. ఆయన ప్రతి దినము దేవుని జ్ఞానమును ప్రజలకు పంచుతూ, బోధిస్తూ ఉండుటవలన అనేకుల కొరకు చిందిస్తున్న నిబంధన రక్తము అన్నాడు. దేవుని జ్ఞానమును నిబంధన రక్తము అని చెప్పడము జరిగినది. దేవుని జ్ఞానమువలన పాపములు కాలిపోవును, కనుక మనుషుల పాపములు పరిహారమైపోవుటకు, ఆయన జ్ఞానమును వెదజల్లుతూ ఉండెడివాడు. అందువలన అనేకుల పాపక్షమాణకొరకు చిందింపబడు (వెదజల్లబడు) నా నిబంధన రక్తము అన్నాడు. ప్రపంచములో అన్నియూ కర్మ ఆధీనములో ఉన్నవి. కర్మ ఆధీనములో లేనిది ఒకే ఒకటి మాత్రమే

కలదు. అదియే 'దేవుని జ్ఞానము.' అన్నిటినీ బంధించు కర్మ జ్ఞానమును మాత్రము బంధించలేదు. జ్ఞానమే కర్మను బంధించగలదు. కర్మ బంధనములో లేనిది దేవుని జ్ఞానము. కనుక దేవుని జ్ఞానమును నిబంధన రక్తము అన్నాడు. నిబంధన అనగా సృష్ఠిలో ఏదీ బంధించనలవిగానిది, ఏ బంధనమునకు తరముకానిది, కర్మబంధనము కానిది, బంధమునకు అతీతమైనది అని అర్థము. నా రక్తము అనగా దేవుని జ్ఞానమని అర్థము చేసుకోవలెను. కావున చిందించుచున్న లేక చిందింపబడుచున్న నిబంధన రక్తమని అప్పటి కాలములో, అప్పటి వర్తమాన కాలమునకు సంబంధించి అర్థమగునట్లు, సరిపోవునట్లు చెప్పిన మాటయని తెలియవలెను. అక్కడ చిందించబోవు రక్తమని చెప్పలేదని ప్రతి ఒక్కరూ జ్ఞాపకముంచుకోవలెను.

ఏసుప్రభువును శిలువమీద ఉంచి కాళ్ళకు, చేతులకు మొలుకులు (సీలలు) కొట్టినప్పుడు ఆయన శరీరము నుండి కారినది సాధారణముగా అందరి శరీరములలోనున్న రక్తములాంటి రక్తమే కారినది. శరీర రక్తములో ఏ మహాత్యముగానీ, ఏ ప్రత్యేకతగానీ లేదు. కావున భౌతికరక్తమును గురించి చెప్పుకొనుటకు ఏమాత్రము వీలులేదు. మనము పాపము చేస్తే, ఆ పాపమును మనమే లేకుండా చేసుకొనుటకు, అవసరమైన జ్ఞానమును ప్రపంచమంతా ఆయన వెదజల్లిపోయాడు. ఆయన వెదజల్లిన జ్ఞానము నేడు గ్రంథరూపములో మన ముందర ఉన్నది. ఆ దినము ఆయన చిందించానని చెప్పిన 'నిబంధన రక్తమునునది' నేడు సువార్త బైబిలుగా గ్రంథరూపములోనున్నది. నేడు దానిని తెలుసుకోగల్గితే తెలుసుకొన్నవాడు ఎవడైనాగానీ, వాడు కూడా కర్మ బంధముల నుండి బయటపడి నిబద్ధుడై మోక్షమును పొందును. అయితే నేడు క్రైస్తవులలో పెద్ద బోధకులకు వారికే నిబంధన రక్తమేదో, సాధారణ రక్తమేదో తెలియకుండా పోయినది.

ఇటువంటి స్థితిలో ఏసే తిరిగి వచ్చి నేను చెప్పినది అదికాదు ఇది అని చెప్పినా, సదరు మనిషి వినే స్థితిలో లేడు. వినకపోగా, పైగా మా మతములో చేరితే నీకు కూడా పాపక్షమాపణ జరుగుట తథ్యము అని చెప్పి ఏసుప్రభువును ఒప్పుకొన్న వారందరికీ పాప పరిహారమగునని చెప్పుటయే కాక, మా మతములో చేరి బాప్తిస్మము తీసుకొన్నట్లయితే తద్వారా నీకు కూడా పాపక్షమాపణ జరుగును అని చెప్పుదురు.

నేడు క్రైస్తవ సమాజములోని వారందరూ బైబిలు గ్రంథములోని జ్ఞానమును తెలియకపోవడమటుంచి, క్రైస్తవ మతమును విస్తరింపజేయవలె నను చింతలో కుతూహలముగా పని చేయుచున్నారు. 'ఉట్టికి ఎగరలేనమ్మ ఆకాశానికి ఎగురుతానన్నట్లు' సమత (సామెత)గా ఈ రోగము ఒక్క క్రైస్తవ మతములోనేకాక, మొత్తము అన్ని మతములలోనూ కలదు. ఏసుప్రభువు బ్రతికియున్న రోజులలో కూడా ఆయన ఇతరుల పాపములను లేకుండా చేస్తానని చెప్పలేదు. దేవుని జ్ఞానమును తెలిసి, దానిని ఆచరించడము వలన ఎంతటి పాపములైనా తొలగింపజేసుకోవచ్చునని తెలియజేశాడు. అంతేకాక, తనబోధలో నేను ఉన్నప్పుడే జ్ఞానము తెలియకపోతే నేను పోయిన తరువాత నన్ను వెదకినా ఏమీ ప్రయోజనము ఉండదని యోహాను సువార్త 8వ అధ్యాయములో 21వ వాక్యమునందు చెప్పాడు. **"నేను వెళ్ళిపోవు చున్నాను. మీరు నన్ను వెదకుదురుగానీ, మీ పాపములోనే ఉండి చని పోవుదురు. నేను వెళ్ళే చోటికి మీరు రాలేరని వారితో చెప్పెను."** అదే సువార్తలో అదే అధ్యాయములో 23, 24 వాక్యములలో కూడా ఇలా కలదు. **(8-23) "మీరు క్రిందివారు నేను పైనుండు వాడను. మీరు ఈ లోక సంబంధులు. నేను ఈ లోక సంబంధుడను కాను. కావున మీ పాపము లలోనే ఉండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. (24) "నేను**

**ఆయనేనని (దేవుడనేనని) మీరు విశ్వసించని ఎడల, మీరు మీ పాపములోనే ఉండి చనిపోవుదురని వారితో చెప్పెను.”** ఏసుప్రభువు బ్రతికి ఉన్నప్పుడు ఆయనే స్వయముగా చెప్పిన మాటలివి. మీరు జ్ఞానము తెలియకపోతే, మీ పాపములోనే చనిపోతారని చెప్పాడు. అంతేకాక ఈ లోకము అజ్ఞానముతో నిండియున్నదనీ, పై లోకము జ్ఞానముతో నిండియున్నదనీ జ్ఞానముకల ఆయన పైలోక సంబంధుడనీ, జ్ఞానము తెలియని వారు క్రింది లోక సంబంధులైన పాపములోనే చనిపోవుదురనీ చెప్పాడు. ఇంకా దేవుని జ్ఞానము చెప్పువాడు దేవుడే అయి ఉంటాడని నమ్మనివారు, పాపములలోనే ఉండి చనిపోవుదురని చెప్పాడేగానీ, తన రక్తముచేత పాపక్షమాపణ కలదని చెప్పలేదు. దైవజ్ఞానము తెలియనివారు పాపములనుండి బయటపడక, వాటిలోనే చనిపోవుదురని ఆయన ఎన్నోసార్లు బైబిలు గ్రంథములోనే చెప్పి యున్నారు. అలాంటప్పుడు ఏసు రక్తము మనకొరకు కార్చాడనీ, ఏసుప్రభువు మనకొరకు చనిపోయాడనీ, చెప్పుకోవడము పెద్ద పొరపాటు కాదా?

యోహాను సువార్త 9వ అధ్యాయమునందు 41వ వాక్యములో “మీరు గ్రుడ్డివారైతే మీకు పాపములేకపోవునుగానీ, చూచుచున్నామని మీరిప్పుడు చెప్పుచున్నారు. కనుక మీ పాపము నిలిచియున్నదని చెప్పెను.” ప్రపంచ విషయములలో మీకున్న ధ్యాసను వదులుకోక, మిక్కిలి ధ్యాసతో ప్రపంచమునే చూచుచున్నామని మీరు చెప్పుచున్నారు. అందువలన మీ పాపములు నశించిపోవుటకు వీలులేదని, ఏసుప్రభువు చెప్పియున్నాడు. అనగా ప్రపంచ విషయములలో మీరు గ్రుడ్డివారైతే (ధ్యాసలేనివారైతే) అప్పుడు దేవుని విషయమైన జ్ఞానము తెలియునని చెప్పియున్నారు. అంతేగానీ మీరు ఎలా ఉన్న ఫరవాలేదు. నా రక్తము వలన మీరు పాపముల నుండి రక్షింపబడుతారని ఎక్కడా చెప్పలేదు. బైబిలు గ్రంథములో లేని

మాటను ఉన్నదనీ, ఏసు చెప్పాడని నేటి బోధకులు చెప్పడమేకాక, హిందువుల వేదాలలో కూడా **'రక్త ప్రోక్షణం పాపపరిహారం'** అని ఉన్నదని చెప్పడము వారి అజ్ఞానమునకు నిదర్శనము. వీటన్నింటినీ గమనించితే క్రైస్తవులు బైబిలు గ్రంథము యొక్క జ్ఞానమునకు విలువనివ్వక ఎంత దూరముగాయున్నారో తెలిసిపోవుచున్నది.

ఇప్పటికైనా మించిపోయినది లేదు. క్రైస్తవులు బైబిలు గ్రంథమును చదివి అందులో అసలు జ్ఞానమును తెలుసుకోగల్గితే, అలాగే హిందువులు భగవద్గీతను చదువగల్గి అందులోని జ్ఞానమును తెలియగల్గినా, ముస్లీమ్‌లు దేవుని ప్రార్థన చేయడమేకాక, హదీసును వదలి ఖురాన్ గ్రంథములో దేవుడు జిబ్రయేల్ ద్వారా ఏమి చెప్పారని చూచి, చెప్పిన వాస్తవమును విశ్వాసిగా నమ్మగలిగితే, కొంతవరకైనా జ్ఞానము తెలియగలదు. జ్ఞానము తెలియుకొద్దీ దానిని చెప్పిన వ్యక్తి ఈ లోక సంబంధుడు కాడు అనీ అర్థము కాగలదు. ఇంకా జ్ఞానమార్గములో ముందుకు పోవుకొద్దీ దేవుడే దానిని చెప్పాడనీ, ఆయనే ఈయననీ తెలియగలదు. అలా తెలియగల్గిన నాడు మనుషులు తమ పాపములనుండి విముక్తి పొంది, నిబద్ధులై నిబంధన రక్తముగలవారై, నిబద్ధముగాయున్న దేవునియందు కలిసిపోగలరు.

ఇకపోతే మనము ముందు చెప్పుకొన్న ఉత్తమశ్రేణికి సంబంధించిన జ్ఞానులు మాత్రము జ్ఞానమే తమ జీవితముగా గడుపుట వలన, వారు జీవించినప్పుడు సంపాదించిన జ్ఞానశక్తివలన వారి కర్మ అంతయూ కాలిపోయి ఉండును. కనుక వారు చనిపోయినా తిరిగి తరువాత పుట్టడము జరుగదు. వారు శరీరమును ధరించరు. అనగా మళ్ళీ జన్మ వారికుండదు. ఇప్పుడు ఇతరులు ఒక ప్రశ్న అడుగుటకు అవకాశముగలదు. అదేమనగా! చనిపోయిన తరువాత తిరిగి ఇటువంటి జన్మయే కల్గునని మూడు

దైవగ్రంథములలో ఉన్నది. అయితే మీరు ఇక్కడ జ్ఞానమార్గములోయున్న వారు చనిపోతే మళ్ళీ వాడు పుట్టడు అని చెప్పుచున్నారు కదా! చనిపోయిన తరువాత వాడు పుట్టకుండాపోతే వాడు ఎక్కడుండును? అని అడుగవచ్చును. దానికి యోగీశ్వరుల జవాబు ఇలా కలదు. జ్ఞానమార్గములో జీవితమును గడిపిన వాడు చనిపోయిన తరువాత పుట్టితే, తిరిగి ఎప్పుడో ఒకప్పుడు తిరిగి చనిపోవలసి వస్తుంది. అయితే, జ్ఞానిగాయుండి కర్మను కాల్చుకొని చనిపోయినవాడు తిరిగి పుట్టుటకు అవకాశమేలేదు. ఎందుకనగా! జ్ఞానిగాయుంటూ జ్ఞానమార్గములోనే జీవితము సాగించిన వానికి ఎప్పుడు మరణము వచ్చినా, అది ఆఖరీమరణమైయుండును. మరణములో మొత్తము నాలుగు రకముల మరణములుకలవు. అధమగతి అజ్ఞానులుగానీ, మధ్య తరగతి భక్తులుగానీ చనిపోతే వారు మూడు మరణములలో ఏదో ఒక దానిని పొందుదురు. మూడు రకముల మరణములు వరుసగా ఇలా కలవు 1) కాల మరణము 2) అకాల మరణము 3) తాత్కాలిక మరణము. ఈ మూడు మరణములలో ఏ ఒక్కదానినీ జ్ఞాని అయినవాడు పొందడు. జ్ఞాని అయినవాడు చివరి నాల్గవదయిన ఆఖరీ మరణము పొందును. అప్పుడు పొందినదే ఆఖరీ మరణము అయినందున వాడు తిరిగి చనిపోవుటకు వీలులేదు. రెండవసారి మరణములేనందున వాడు పుట్టే అవసరమే లేదు. ఒకవేళ పుట్టితే పుట్టినవాడు తిరిగి మరణించవలసియుండును. అందువలన జ్ఞానిగా మారి జ్ఞానమార్గములో జీవితమును సాగించిన వాడు జనన మరణములకు అతీతుడైపోవును. అనగా వానికి చావు పుట్టుకలు రెండూ లేవని అర్థము.

సంపూర్ణ జ్ఞానియై చనిపోయిన వానికి రెండవచావు ఉండదు. చావు, పుట్టుకలేనివాడు దేవునియందు ఐక్యమైపోవును. దేవునియందు ఐక్యమైపోయినవాడు ఎల్లకాలము దేవునియందే జీవించియుండును.

ఇప్పుడు అసలు విషయమునకు వస్తాము. ఏసుప్రభువు సిలువ మీద చనిపోవడము వాస్తవమే. అయినా అది వాస్తవ మరణముకాదు. మనము పైన చెప్పుకొన్న మూడు మరణములలో తాత్కాలిక మరణము మాత్రమే ఆయన పొందాడు. **(ఈ మరణములను గురించి పూర్తి తెలియుటకు త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులవారు రచించిన సంచలనాత్మక రచనలు 'మరణ రహస్యము', 'జనన మరణ సిద్ధాంతము' అను గ్రంథములను చదవండి.)** కావున ఆయన సిలువమీద మరణించ లేదనియే చెప్పవచ్చును. మూడవరోజు తన పదకొండు మంది శిష్యులకు కనిపించి, నేను చనిపోలేదని ఏసుప్రభువే స్వయముగా సాక్ష్యము చెప్పగా, చనిపోయాడనుట పొరపాటు కాదా? ఇకపోతే ఏసుప్రభువు సిలువ మీద చివరిగా ఒకమాట చెప్పి తలవాల్చి చనిపోవడము అక్కడున్న వారు చూశారు. తరువాత బల్లెముతో పొడిచినప్పుడు ఆయన శరీరములో శ్వాసలేదు. సిలువమీద నుండి ప్రభువు శరీరమును దించినప్పుడు కూడా ఆయన చనిపోయిన స్థితిలోనే ఉన్నాడు. సమాధిలో ఉంచినప్పుడు కూడా ఆయనలో ప్రాణములేనట్లు ఆయన శిష్యులు చూశారు. సిలువమీద నుండి దించినప్పటి నుండి, ఆయనను సమాధిలో పెట్టు వరకు ఏసుప్రభువు శరీరములో ఏ కదలికగానీ, శ్వాస ఆడడముగానీ లేదు. కావున అప్పుడు ఆయన మరణస్థితిలో ఉన్నట్లు ఆయన శిష్యులే మనకు సాక్ష్యమునిచ్చుచున్నారు. దైవజ్ఞానములో గొప్పవారిగా కనిపించువారే తమలో సంపూర్ణమైన అవగాహన లేనిదాని వలన, కొద్దిగా తెలియనితనము (అజ్ఞానము) తమలో ఉండుట వలన, ఇరువురూ సత్యమునకు కొద్దిదూరముగా పోయారని తెలియుచున్నది.

పూర్తి చనిపోయిన మనిషికి శరీరములోని కీళ్ళు కదలకుండా బిగుసుకు పోవడము, రక్తము గడ్డకట్టి పోవడము, శ్వాస ఆడకపోవడము పైకి కనిపించు చిహ్నములుగా ఉండును. ఇటువంటి చిహ్నములను చూసినట్లయితే చనిపోయిన మనిషిని సులభముగా గుర్తించగలరు. అయితే ఇక్కడ అందరికీ తెలియని విషయమేమనగా, శ్వాస ఆడకుండా నిలిచి పోయినప్పటికీ, రక్తప్రసరణ జరుగనప్పటికీ, శరీరమంతా చైతన్యములేకుండా నిలిచిపోయినప్పటికీ, శరీరములో తలయందు జీవుడుంటాడనీ అతను బ్రతికి యున్నట్లేనని ఎవరికీ తెలియదు. పైకి చనిపోయినట్లు శ్వాస ఆడకున్నా, తాత్కాలిక మరణము పొంది పైకి చనిపోయినట్లు కనిపిస్తున్నా, లోపల జీవుడుండే వాడు ఏ స్కానింగ్‌కు తెలియడు. కానీ అటువంటి శరీరములో రెండు చిహ్నములు బాగా కనిపించును. అతని శరీరములో రక్తము ఘనీ భవించదు. అలాగే కీళ్ళు సులభముగా కదలుచుండును. ఏసుప్రభువు సిలువమీద తాత్కాలిక మరణము పొందియుండుట వలన, ఆయన శరీరములో రక్తము గడ్డకట్టక, ద్రవరూపములో ఉండుట వలన, ఏసు ప్రభువు చనిపోలేదని అందరిలాగ బ్రతికే ఉన్నాడని అందరూ తెలియ లేకపోయారు. వాస్తవానికి ఆ సమయములో ప్రభువుకు ప్రాణములేదు. కావున ఆయన చనిపోయాడని చెప్పే మరికొందరి మాట పైకి కనిపించు సత్యమని చెప్పవచ్చును.

ఒక మనిషి మరణిస్తే పైకి కనిపించు చిహ్నములతోనే అతనిని మరణించాడని చెప్పడము పూర్తి నిర్ధారణ కాదు. ఆ మరణము సత్యమూ కావచ్చును, అసత్యమూ కావచ్చును. ఏసుప్రభువు బ్రతికియున్నప్పుడే ఒక ఊరిలో ఒక బాలిక మరణించియుండగా, ఆ శవమును స్మశానమునకు తీసుకొని పోవుటకు డప్పులు వాయించుచుండగా, ఏసు అక్కడికి పోయి

ఎందుకు డప్పులు వాయించుచున్నారని అడుగగా, అక్కడున్న వారు బాలిక చనిపోయింది. శవాన్ని తీసుకొని పోవుటకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అప్పుడు ప్రభువు, 'ఆ బాలిక చనిపోలేదు' అని చెప్పి ఆ బాలికను తట్టి లేపగా, ఆమె తిరిగి సజీవముగా లేచినది. అక్కడ ఏసుప్రభువు తాత్కాలిక మరణమును గుర్తించినట్లు మనకు అర్థమగుచున్నది. బైబిలు గ్రంథములో మత్తయి సువార్త 9వ అధ్యాయమునందు 23, 24, 25 వాక్యములలో ఇలా కలదు. **"స్థలమియ్యుడి ఈ చిన్నది నిద్రించుచున్నదేగానీ చనిపోలేదని వారితో చెప్పగా, వారాయనను అపహసించిరి. జనసమూహమును పంపివేసి, ఆయన లోపలికి వెళ్ళి, ఆమె చెయ్యిపట్టుకోగానే ఆ చిన్నది లేచెను. ఈ సమాచారము దేశమంతటా వ్యాపించెను."**

ఆ కాలములో ఏసుప్రభువే స్వయముగా 'ఆమె చనిపోలేదు' అని అందరి దృష్టిలో చనిపోయిన బాలికను గురించి చెప్పాడు. అయినా క్రైస్తవ బోధకులైనవారికి ఆ విషయము ఏమాత్రము అర్థము కాలేదు. పైగా ఏసు ప్రభువు మూడురోజులకు తిరిగివచ్చి నేను చనిపోలేదు, ముందున్న శరీరమే ఉంది చూడండి' అని ఆయన చేతులకు, ప్రక్కక కడుపుకు ఉన్న గాయములను సాక్ష్యముగా చూపినా, అర్థము చేసుకోలేక ఏసు చనిపోయాడని చెప్పువారి మెదడుకు ఎంత గ్రాహితశక్తియున్నదో అర్థమగుచున్నది. నేటికైనా మేము ఎంతో అజ్ఞానములో ఉన్నామని చింతించక, పొగరుబట్టిన దున్నపోతు రైలును ఢీకొన్నట్లు నాకు ఎవరూ సాటిలేరు, నాకు ఎవరూ పోటీకి రారు, నా చేతులు దురదగా ఉన్నాయి, నేను సింహాన్ని, పులిని అని అజ్ఞానిగా అహంభావముతో విర్రవీగుతూ, అనుకొంటూ ఉంటే, దేవుడు అటువంటి వాన్ని చూచి వీడు ఈ యుగములో కాకపోయినా, వచ్చే యుగములోనైనా జ్ఞాని అవుతాడను నమ్మకములేదే! అని అనుకొంటాడు. అటువంటి వారిని

దయ దలచి వారికి తన జ్ఞానమును తెలియజేయుటకు దేవుడే స్వయముగా వచ్చినా "మాకు అంతా తెలుసు, మాకేమి చెప్పనవసరములేదు. మేమే సవాలక్ష మందికి బోధించేవారిమి. మాకు ఇంకొకరు చెప్పటమా! అని హేళనగా మాట్లాడడమేకాక, సాతాను వారికి వారినే దేవుడిగా చూపించుట వలన వచ్చిన దేవున్ని కూడా మనిషిగా భావించి, మేము మనుషులు చెప్పు బోధలు వినము, చదవము'' అని వ్యంగ్యముగా వెటకారముగా మాట్లాడుదురు. పైగా మా సభలకు వచ్చి మా బోధలు వినవలెనని ఉచిత సలహాలు కూడా ఇచ్చుచుందురు. దేవుడు దేవునిగానే వచ్చుటకు ఆయనకు ఒక రూపమంటూ ఏదీలేదు. అలాంటప్పుడు మనిషికి చెప్పుటకు మనిషిగానే వస్తే, మనిషి మాటను మేము వినము అంటారు. అటువంటి వారికి దేవుడైనా ఎలా చెప్పగలడు?

భగవద్గీతనుగానీ, బైబిలుగానీ, ఖురాన్‌నుగానీ మనుషులే చెప్పారు తప్ప ప్రత్యేకించి దేవుడు చెప్పలేదు కదా! శరీరములో కొన్ని కనిపించు భాగములు కొన్ని కనిపించని భాగములున్నాయి. వాటిలో మనస్సు, బుద్ధి, అహము కనిపించవు. అయితే వాటి పని మాత్రము బయటికి తెలియు చుండును. బైబిలులో ముఖ్యమైన సారాంశము, అహమును వదులుకొమ్మని ఉన్నది. నేను ఫలానా అని చెప్పుకోవడమే అహము యొక్క పని. అసలుకు నీవు నీ శరీరములో ఎక్కడున్నావు? ఏ రూపములో ఉన్నావు? అని ప్రశ్నించితే, ఒక దానికి కూడా జవాబు తెలియదు. జీవాత్మ అయినవాడు తనను గురించి తానే తెలియలేడు. ఎప్పుడైనా శరీరములో తనను గురించి తాను తెలిసిన తరువాతనే ఆత్మను గురించి తెలియగలడు. ఆత్మను గురించి తెలిసిన తరువాతనే పరమాత్మ అయిన దేవున్ని గురించి తెలియబడును. ఇది ఆధ్యాత్మికమునకు దారికాగా, తనను గురించి తాను తెలియనివాడు

మూర్ఖత్వముతో నేను ఇంత, నేను అంత అని చెప్పుకోవడము జరుగుచుండును. తనను గురించి (జీవాత్మను గురించి) తెలిసినవాడు అహముతో కూడుకొని మాట్లాడడు. ఒకపెద్ద గంగాళపు అన్నమును ఉండికిందో లేదో చూచుటకు ఒక్క మెతుకు పట్టుకొంటే చాలన్నట్లు, ఎదుటివాడు మాట్లాడే ఒక్కమాటతో, వాడు జ్ఞానియో, అజ్ఞానియో, పులియో, పిల్లియో, సింహమో, శిఖండియో జ్ఞానధనులైనవారికి వెంటనే తెలిసిపోవును. అయితే కొందరు తమ మత గ్రంథములను అడ్డము పెట్టుకొని, ఇతరుల దృష్ఠిలో గొప్ప వారమనిపించుకోవడము కొరకు, తమ మూల గ్రంథములలోని సూత్రములను అతిక్రమించి మాట్లాడుచుందురు. జీవాత్మ మూడు రకముల మరణములను పొందుటకు అవకాశము కలదని తెలియనివారు ఏసుప్రభువు సిలువమీద నేను మరణించలేదని చెప్పుచున్నప్పటికీ, మరణించాడని ఆయనను గురించి ప్రచారము చేయడము, ప్రభువు మాటను అగౌరవపరచి నట్లు కాదా!

"ఏసుప్రభువు మరణించి మూడు రోజులకు తిరిగి లేచాడు. కావున ప్రభువు గొప్పవాడు, ఆయన నిజముగా దేవుడు, అలా లేచినవారు ఎవరూ లేరు. అందువలన మా దేవునితో సమానము ఎవరూ లేరని" కొందరు అనుచున్నారు. మనము ఏమీ తెలియకుండా ఏసుప్రభువు మరణమును గురించి మాట్లాడితే, ఆయన గౌరవమును తగ్గించినట్లే అగును. కావున మీరు ప్రపంచ విషయములను ఎట్లు మాట్లాడిన ఫరవాలేదు గానీ, దేవుని విషయములో అహము వీడి, తన్నుతాను తగ్గించుకొని మాట్లాడడము అందరికీ మంచిది. ఏ మతములోని మనిషి అయినా దేవుని విషయములో పొరబడినప్పుడు వారికి సత్యమును తెలుపడము యోగీశ్వరులవారి కర్తవ్యము. అందువలన ప్రభువు మరణములో ఒకరినొకరు సవాళ్ళు,

ఛాలెంజ్‌లు విసరుకొన్నవారికి ఏసుప్రభువు మరణమును గురించిన సత్యము తెలియజేయు **'మరణరహస్యము'** అను గ్రంథమును విశాఖపట్టణ ములో మా అనుచరులు సుందరరావుగారికి (B.O.U.I) లో ఇస్తే వారు తీసుకోలేదు. హైదరాబాద్‌లో (U.I.R.C) వారికి ఇస్తే తీసుకొన్నారు గానీ, వారు ఏమాత్రము దానిని చదువలేదు. మాకు అంతా తెలుసు అను అహంభావము ఇరువైపుల వారిలో ఉండుట వలన, వారు మేము చెప్పిన మరణరహస్యమును చూడలేదు. ఇరువైపుల వారికి సత్యము తెలియాలంటే చిరవకు మేము చెప్పినదే ఆధారమగును. మీదేమైనా దేవుని బోధనా? అని ఎవరయినా మమ్ములను ప్రశ్నించితే సత్యము తెలిసేటప్పుడు 'దేవుని బోధయే' అనుకుంటే తప్పేముంది? అని జవాబుగా ప్రశ్నించుచున్నాను. గొప్ప జ్ఞానులమను కొనువారిలో కూడా అజ్ఞానము ఎలా దాగిఉందో, వారు ఎలా సాతాను తెరలను గుర్తించలేకపోవుచున్నారో, తెలుపుటకు తార్కాణముగా ఈ విషయమునంతటినీ చెప్పవలసివచ్చినది. ఈ విషయమును తెలియుట వలన కొందరైనా తమలోని అహమును తగ్గించుకొని, అజ్ఞానమును దూరము చేసుకోగలరు.

అంతిమ దైవగ్రంథములో కొన్ని విషయములు నిగూఢముగా చెప్పడము వలన దానికి ప్రత్యేకమైన శక్తి, జీవవము (జ్యోతి) ఉన్నదని చెప్పవచ్చును. అందువలన ఈ మూడు దైవగ్రంథములశక్తి ఎవరికీ అర్థము కాదు. అర్థము అయినా, కాకపోయినా ఈ మూడు శక్తివంతమైన గ్రంథములు అందులో ఏ సంశయమూ లేదు. ఏసుప్రభువు విషయము ఎదురుగా చెప్పినా అర్థముకాని విధముగా ఉన్నదంటే, అందులో తనకు ఇష్టమైన వానికే అర్థమగులాగున, తనకు ఇష్టములేనివానికి అర్థము కాకుండా ఉండులాగున ఆ గ్రంథము చేయుచున్నది. ఇప్పుడు ఆ గ్రంథములకు

ఇష్టమైనవారిగా కావాలంటే, ముందు దేవునికి ఇష్టమైన వారిగా ఉండాలి. అప్పుడే అక్కడున్న జ్ఞానము అర్థము కాగలదు. బయట ఎంతపేరు ప్రఖ్యాతులున్న, ఎంతోమందిలో గొప్పజ్ఞాని అనిగానీ, బోధకుడు అనిగానీ పిలుపించుకొన్నప్పటికీ, గ్రంథమునకు నీవు ఒప్పుదల కాకపోతే, అందులో నిది ఒకముక్క కూడా అర్థముకాదు. ఇప్పుడు ఉదాహరణకు ఏసుప్రభువు మరణమును గురించి గ్రంథములో వ్రాసినది చూస్తే అంతిమ దైవగ్రంథము ఎటువంటిదో మీకు కొద్దిగానైనా అర్థముకాగలదు.

ఏసుప్రభువు విషయము బైబిలులో గలదు. తరువాత ఇక్కడ ఖురాన్‌లో కూడా కలదు. ముందు వచ్చిన గ్రంథములను ఈ గ్రంథము ధృవీకరించుచున్నది. కావున అక్కడి విషయము ఇక్కడ కూడాయున్నది. అయినా, అక్కడ అర్థముకాని వారికి ఇక్కడ కూడా అర్థముకాదు. అక్కడ అర్థమయినవారికి ఇక్కడ కూడా అర్థము కాగలదు. ఏసుప్రభువు విషయము ఇక్కడ ఖురాన్ గ్రంథములో సూరా 4, ఆయత్ 157, 158లలో ఈ విధముగా చెప్పియున్నారు. దానిని ఇప్పుడు చూస్తాము. **(4-157) "మర్యమ్ కుమారుడన దైవప్రవక్త ఈసాను మేము హతమార్చాము అనడము వలన, వారు ఆయన శిక్షను చూశారు. నిజానికి వారు ఆయనను చంపనూ లేదు, సిలువపైకి ఎక్కించనూ లేదు. నిజము ఏమిటంటే, వారి కొరకు ఆయనను పోలిన వ్యక్తి రూపొందించబడ్డాడు. ఈసా విషయములో విభేదించివారు ఆయన వ్యవహారములో సందేహమునకు గురి అయ్యారు. అంచనాలను అనుసరించడము తప్ప, వారికి ఈ విషయమై ఖచ్చితముగా ఏమీ తెలియదు. అసలు వారు ఆయనను చంపలేదు. (4-158) "పైగా దేవుడు తనవైపు ఆయనను ఎత్తుకొన్నాడు. దేవుడు సర్వాధిక్యుడు, మహా వివేకి."**

అంతేకాక మరొకచోట ఏసుప్రభువును, ప్రభువు విషయమును గురించి 4వ సూరాలోనే 171వ ఆయత్‌నందు ఇలా అంటున్నాడు చూడండి. **(4-171) "మీరు ధర్మము విషయమలో అతిశయిల్లకండి! సత్యము తప్ప అల్లాహ్‌కు మరోమాట అయన అసత్యమును ఆపాదించకండి. మర్యమ్ కుమారుడైన ఈసా కేవలము దైవప్రవక్త. అంతేకాక ఆయన సాధారణ ప్రవక్తకాదు. దేవుని ఆజ్ఞతో దైవ ఆదేశముద్వారా పుట్టించబడిన ఆత్మ. ఆ ఆత్మను మరియమ్‌వైపు మళ్ళించి ప్రయోగించాడు. ఇంకా ఆయన దేవుని దగ్గరనుండి వచ్చిన ఆత్మ మాత్రమే. కావున మీరు దేవున్ని ఆయన పంపిన ప్రవక్తలను అందరినీ విశ్వసించండి. దేవుడు ముగ్గురు అనకండి. దేవుడు ఒక్కడే. ముగ్గురు కాదు. త్రిత్వము వాదనను మానండి. అందులోనే మీకు మేలుంది. ఆరాధ్యుడగు దేవుడు (అల్లాహ్) ఒక్కడు మాత్రమే. ఆయనకు కుమారుడున్నాడును విషయానికి దేవుడు అతీతుడు, పరిశుద్ధుడు. ఆకాశములోనూ, భూమిలోనూ ఉన్నదంతా ఆయనకు చెందినదే. కార్యనిర్వాహకారిగా దేవుడు ఒక్కడేచాలు"**

ఇక్కడ మూడు ఆయత్‌లు చెప్పబడినవి. అందులో చివరిలో చెప్పిన (4-171) ఆయత్‌ను ముందుగా గ్రహించితే పై రెండు వాక్యములు సులభముగా అర్థమగుటకు అవకాశముగలదు. ధర్మము అంటే ముందు కొద్దిగా తెలిసియుంటే దానిని గురించి తప్పుగాగానీ, అసత్యముగాగానీ చెప్పుకొనుటకు వీలుండదు. దేవుడు కార్యములను చేయడు. ఆయన చేయించు ఆజ్ఞ మాత్రమే అయి ఉన్నాడు. అటువంటి వాడు తన ఆజ్ఞ చేత తన ఆత్మనే ఏసుప్రభువుగా పంపించాడు అనుటకు సాక్ష్యముగా ఏసు దేవుని దగ్గరనుండి వచ్చిన ఆత్మమాత్రమే అని వాక్యములో గలదు. దీనినిబట్టి

దేవుడు పంపిన ఈసా లేక ఏసు స్వయముగా దేవుడు పంపిన ఆత్మయే అని తెలియగలదు. అందువలన ఆయన అందరి ప్రవక్తలలాంటి ప్రవక్త కాదు. దేవుని ఆజ్ఞతో వచ్చినవాడని తెలిసిపోయినది.

15వ సూరా 29వ ఆయత్‌లో చెప్పినట్లు దేవుడు తన ఆత్మనే ఏసుగా పంపాడు. అయితే ఆ విషయము మనుషులకు తెలియదు. ఏసు ప్రభువు వచ్చి 'తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ' అని త్రిత్వమును చెప్పాడు. అయినా 'పరిశుద్ధాత్మయే దేవుడు' అని చెప్పాడు. అయితే ఆ మాట మనుషులకు అర్థముకాలేదు. చివరిలో ఆయన ఒక శిక్షకు గురి అయ్యాడు ఏసుప్రభువును సిలువ మీద వ్రేలాడదీయడమే ఆనాడు ఆ దేశమునకు సంబంధించి ఆయనకు పడిన శిక్ష. అయితే ఆయన వాస్తవముగా శిక్షార్హుడు కాదు. అటువంటి సమయములో ప్రజల దృష్ఠిలో ఆయన శిక్షార్హుడు. దేవుని దృష్టిలో శిక్షార్హుడుకాదు. ఈ రెండూ జరగాలి. ప్రజల అజ్ఞానము ప్రకారము ఆయనను సిలువను ఎక్కించి శిక్షను వేశారు. అప్పుడు ఏసు ప్రభువు ఏసుప్రభువుగాలేడు. **ఏసుప్రభువును సైనికులు పట్టుకున్నప్పుడు నుండి సిలువవేయబడేంతవరకూ ఒక పెద్ద మాయ జరిగినది.** దానిని తెలిసినవారే 'మాయ' లేక 'సాతాను' అంటారు. తెలియనివారు జరిగినదే సత్యము అంటారు. ఇక్కడ వాక్యములో ఏసుప్రభువును సిలువ ఎక్కించనూ లేదు. నిజానికి వారు ఆయనను చంపనూలేదు అని అన్నారు. ఈ వాక్యమును చెప్పినది మహాజ్ఞాని అయిన జిబ్రయేల్. ఆయన చెప్పిన వాక్యము ఎప్పటికీ అసత్యముకాదు. పూర్తి సత్యమే. అందువలన (4-171) వాక్యములో మొదటనే మీరు ధర్మము విషయములో దేవునిమాటకు అసత్యమును ఆపాదించకండి అన్నారు. ఈ విషయము దేవుని ఆజ్ఞతో జిబ్రయేల్ చెప్పాడు. ఆ విషయముతో జిబ్రయేల్‌కు పనిలేదు, చెప్పవలసిన

అవసరములేదు. అయినా చెప్పాడు అంటే, ఖురాన్ జ్ఞానము ఏసుప్రభువు చెప్పిన జ్ఞానమును కూడా సమర్థించుచున్నది మరియు ధృవీకరించుచున్నది. అందువలన ఏసుప్రభువు విషయమును తప్పక తెలియవలసియున్నది. అలా తెలియకపోతే ఆయనను అపోహలతో ముంచివేయడము కాకుండా, ఆయన జ్ఞానమును కూడా అపోహలలో ముంచివేయగలరు. అందువలన ఏసుప్రభువు యొక్క మరణమును గురించి జిబ్రయేల్ తప్పనిసరిగా చెప్ప వలసి వచ్చినది. ఇప్పుడు తప్పనిసరిగా మనము కూడా చెప్పుకోవలసి వచ్చినది.

ఇప్పటికీ కూడా ఆ దినము ఏమి జరిగిందో తెలియక ఒక ప్రక్క క్రైస్తవులు, ఒక విధముగా చెప్పుచున్నారు. మరొకప్రక్క ముస్లీమ్‌లు మరొక విధముగా చెప్పుచున్నారు. క్రైస్తవులు బైబిలులో వ్రాసిన విధముగా, ఆనాడు ప్రత్యక్ష సాక్షులు చూచిన దానిని వ్రాసిన దానిని చెప్పుచున్నారు. అంత వరకూ వారిది తప్పులేదు. అయితే అక్కడ వారికి తెలియనిది ఏసుప్రభువు చనిపోలేదనే విషయము. వారు ఏసుప్రభువు సిలువమీద చనిపోయాడని తరువాత మూడవరోజు ఆదివారము ఉదయము బ్రతికి వచ్చాడనీ చెప్పుచున్నారు. ఇక్కడ ఏసుప్రభువు చనిపోయాడు అనడము క్రైస్తవులది తప్పు. అంతవరకూ ఏసుప్రభువుకు శిక్ష వేసినది, ఆయనను శిలువ ఎక్కించినదీ అన్నీ వారు చెప్పునదీ ఒక విధముగా వాస్తవమే, అయితే ముస్లీమ్‌లు తమ గ్రంథమందు ఇలా వ్రాశారు అని ఏసు చనిపోలేదు అని అంటున్నారు. వారి గ్రంథములో జిబ్రయేల్ పై వాక్యములో చెప్పినట్లు నిజానికి వారు ఆయనను చంపలేదు అనుమాట వాస్తవమే. అయితే ఏసుప్రభువుకు శిక్షవేయలేదు, సిలువను ఎక్కించనూ లేదు అన్నమాట ఒక విధముగా పూర్తి తప్పు.

అయితే ఇప్పుడు యోగీశ్వరు వారు చెప్పినది కొంతయినా, కొంత ఇటుగా, కొంత అటుగా ఏదీ పొంతనలేకుండా చెప్పినట్లు కనిపిస్తున్నది కదా! అట్లే కనిపించునని యోగీశ్వరుల వారికి తెలియును. అయినా అన్నీ తెలిసినవారై ఈ మాటను యోగీశ్వరుల వారు చెప్పారు. ఇటు క్రైస్తవులు చెప్పుదానిలో కొంత సత్యమున్నది, అటు ముస్లీమ్‌లు చెప్పుమాటలో కొంత సత్యమున్నది. అయినా వారిది ఏది సత్యమో, ఏది అసత్యమో వారికే సరిగా తెలియదు! ఆ కాలములో ఏమి జరిగినదో, జరిగినది ఏది సత్యమో, ఏది అసత్యమో తెలియాలంటే ఇప్పుడు మనము అక్కడికి పోయి వివరించుకొందాము అని యోగీశ్వరులవారు చెప్పుచున్నారు.

ఆ దినము అనగా గురువారము రాత్రి ఏసుప్రభువూ, అతని శిష్యులు పదకొండుమంది 'గెత్సేము' అనే చోటికి ప్రార్థన చేయుటకు వచ్చి ఆయన శిష్యులనందరినీ ఒకచోట కూర్చోబెట్టి, కొంత దూరము పోయి ఒకచోట ప్రభువు ఒంటరిగా ప్రార్థన చేయుచుండెను. అయినా ఆయన శిష్యులు నిద్రపోవుచుండగా, రెండుసార్లు వారివద్దకు వచ్చి వారిని లేపి, మేల్కొనమని చెప్పి మూడవమారు ఆయన ప్రార్థన చేయుటకు పోయాడు. అప్పటికే అర్థరాత్రి అయివుండుట వలన, ప్రార్థన చేయుచూ, ఏసుప్రభువు కూడా నిద్రలోనికి పోయాడు. ఏసుప్రభువు నిద్రపోయిన విషయము ఈనాటికి కూడా ఎవరికీ, ఏ క్రైస్తవునికీ తెలియదు. ఎవరికీ తెలియనిది యోగీశ్వరుల వారికి ఎలా తెలుసు? అను ప్రశ్న మీకు రావచ్చును. "అక్కడేయున్న నాకు ఎందుకు తెలియదు?" అని స్వామివారిలో ఉన్నవాడు అడిగితే మీరేమి అంటారు? అందువలన వినండి, ప్రశ్నించకండి. ఇక్కడ కావలసినది సత్యము, విశ్వాసము. విశ్వాసముంచి వినండి. సత్యము తెలియబడుతుంది. ఏసును యూదా ఆ రాత్రి పట్టించాడు. అప్పుడు

ఏసు నిద్రలోనేయున్నా ఆయన శరీరము దేవుడు పంపిన ఆత్మచేత మెలకువగా ఉన్నది. అక్కడికి వచ్చిన సైనికులు ఏసును పట్టుకొన్నామను కొన్నారుగానీ, వారు ఏసు శరీరమును పట్టుకొన్నారు. ఏసు నిద్రలో లోపలయున్నాడు. బయట ధ్యాస ప్రభువుకు ఏమాత్రము లేదు. అప్పుడు ఏసుప్రభువు కూడా అంతవరకూ ఆత్మే నడిపించినా ఏసు మెలకువలో ఉండెడివాడు. అయితే అప్పుడు ఏసు జ్ఞాపకములో లేడు కావున, పైన ఏమి జరిగినదో, ఏసుప్రభువుకు ఏమాత్రము తెలియదు.

అందరి శరీరములనూ ఆత్మే నడిపించుచున్నది. అయితే అందరికీ జ్ఞప్తియుండి మెలకువలోయున్నారు, కావున బయట ఏమి జరుగుచున్నదీ, శరీరములోని జీవునికి తెలుసు. అయితే ఇక్కడ ఏసుప్రభువు పూర్తి నిద్రలో ఉండిపోయాడు. బయట జరుగు తతంగము ఆయనకు ఏమాత్రమూ తెలియదు. ఈ విషయమును తెలియని మనుషులు, సైనికులు ఏసును పట్టుకున్నామని అనుకొన్నారు. అయితే వారు ఆయన శరీరమును మాత్రము పట్టుకున్నారు. అప్పటినుండి సిలువవేయబడే వరకూ పెద్ద మాయ జరిగింది. అని ముందే యోగీశ్వరులవారు చెప్పారు గదా! అప్పటినుండి ఏసు మౌనముగాయుంటూ రెండు, మూడు మాటలకంటే ఎక్కువ మాట్లాడలేదు. ఎక్కువ మౌనముగాయున్నవాడు, రెండు మూడు మాటలు మాట్లాడిన వాడు, ఏసు కాదని ఎవరికీ తెలియదు!

చివరకు ఏసుచేత సిలువను మోయించుకొని పోయి, అతనిని సిలువను ఎక్కించి శిక్షను వేశారు. అయితే, సిలువను ఎక్కించినదీ, శిక్ష వేసినదీ, ఏసుకే అని అందరూ అనుకొన్నారుగానీ, ఏసుకి ఆ శిక్ష వేయలేదు. ఆయన శరీరమునకు శిక్ష వేశారని గ్రహించలేకపోయారు. అందులన

ఖురాన్‌లోని 4-157 లోని వాక్యములలో **"వారు ఆయనను చంపనూ లేదు. సిలువను ఎక్కించనూ లేదు."** అని వ్రాశారు. జిబ్రయేల్ చెప్పిన ఈ మాట, నూటికి నూరుపాళ్ళు వాస్తవమే. అయితే క్రైస్తవులు ప్రత్యక్షముగా చూశారు. కావున సిలువను ఎక్కించినది, శిక్షను వేసినదీ వారిలెక్కలో సత్యమే. ఏసును సిలువమీద ఎక్కించిన తరువాత, కొంతసేపటికి ఏసు శరీరములోని ఆత్మ కదలక, మెదలక నాటకీయముగా నిలిచిపోయినది. అప్పుడు అక్కడున్న వారంతా ఏసు చనిపోయాడనుకొన్నారు. శరీరములోని ఆత్మ తన ఆరు నాడీకేంద్రములను నిలిపివేసి, ఏడవ కేంద్రములో ఉండి పోవుట వలన అంతవరకూ కదులుచున్న శరీరము కదలకుండా నిలిచి పోయినది. అప్పుడు శరీరములో జీవము ఉన్నదని ఎవరు తెలియగలరు? ఆ సమయములో అన్నీ నిలిచిపోయి, శ్వాస ఆడక రక్తప్రసరణము కూడా నిలిచిపోవడము వలన అందరూ శరీరము చనిపోయినదని అంటారు. ఈ విధముగానే క్రైస్తవులందరూ ఏసు సిలువమీద చనిపోయాడు అని అనుకొంటున్నారు. వాస్తవానికి ఏసు సిలువమీద చనిపోలేదు అను మాటయే వాస్తవమగును. మరణమును గురించి చాలామందికి తెలియనుగానీ, తాత్కాలిక మరణమును గురించి ఎవరికీ తెలియదు. ఏసు ఆ సమయములో తాత్కాలిక మరణమును పొందియున్నాడని ఎవరూ గ్రహించలేదు. అటువంటి మరణము ఒకటుందనిగానీ, అటువంటి మరణమును పొందిన వారు కొంతసేపు లేక కొంతకాలము లేక కొన్ని దినములు చనిపోయి తిరిగి ప్రాణముతో బ్రతుకుదురనిగానీ ఎవరికీ తెలియదు.

శుక్రవారము మధ్యాహ్నము ఐదుగంటల ప్రాంతములో సిలువ వేయబడిన ఏసును చనిపోయాడని నిర్ధారించుకొన్న తరువాత, ఏసు అనుచరులు సాయంకాలము ఏసు శరీరమును తీసుకొని పోయి, భూగర్భ

సమాధిలో ఉంచారు. అలా తీసుకుపోయిన ఆయన శిష్యులు ఏసు శరీరమును శవము(శివము)గానే భావించారు. అప్పటికది శవములాగే యుంటుంది. అయినా ప్రాణములోపలయుంటుంది. ఏసు శరీరములో గురువారము రాత్రినుండి నిద్రలోయున్నవాడు శుక్రవారము సాయంకాలము సమాధిలో ఉంచగా, తాత్కాలిక మరణములో 33 గంటల కాలమున్న తరువాత ఆయన తాత్కాలిక మరణమునుండి జ్ఞాపకము వచ్చి అనగా మెలుకువలోనికి శరీరమును, ఆత్మ తీసుకురాగా, ఏసు జ్ఞప్తిలోనికి వచ్చి లేచిరావడము జరిగినది. అప్పటికి అది క్రైస్తవులందరికీ వింతగానే కనిపించినా, దేవుడు నిర్ణయించిన మూడు రకముల మరణములలో ఇది తాత్కాలిక మరణమనీ, ఎవరికీ తెలియదు. జరిగినదంతయూ స్థూలముగా అప్పటి క్రైస్తవులు ప్రత్యక్షముగా చూచిన విషయమునే చెప్పారు కావున, ఏసుప్రభువుకు సిలువ మీద శిక్షవేశారు. ఆయన సిలువ మీద చనిపోయాడు అనుట ఒక విధముగా ప్రత్యక్ష సత్యమే అయినా, ఆయన శిక్షకు గురికాలేదు, ఆయన సిలువను ఎక్కనూ లేదు. ఆయన సిలువమీద చనిపోలేదు అన్నదే పరోక్ష సత్యము. ఆ దినము చూడకున్నా, తన జ్ఞానముతో సూక్ష్మముగా జరిగిన విషయము సత్యమని జిబ్రయేల్ చెప్పాడు. జిబ్రయేల్ చెప్పినది పరోక్షముగా నూటికి నూరుపాళ్ళు సత్యమే. అయితే ప్రత్యక్షముగా ఆ రోజు చూచినది ఏసుప్రభువును సిలువమీదికి ఎక్కించారని, ఆయన చనిపోయాడనీ చెప్పుచుండుట సత్యమే. క్రైస్తవులు ప్రపంచ దృష్ఠితో చూశారు. కావున వారికి కనిపించినది ప్రత్యక్ష సత్యమే అయినా, అది స్థూలదృష్ఠేగానీ, సూక్ష్మదృష్ఠికాదు. 4వ సూరా, 158వ ఆయత్‌లో పొరపాటు పడిన ముస్లీమ్‌లు ఏసును దేవుడు అలాగే పైకి తీసుకుపోయాడు, ఏసును

పోలినవ్యక్తిని పట్టుకొని వచ్చి శిలువ మీదికి ఎక్కించి చంపివేశారు అని అంటున్నారు. ఏసు సిలువమీద మరణించాడని క్రైస్తవులు పొరపాటు పడినారనీ, వాస్తవముగా ఏసు వారికి దొరకలేదని, దేవుడు ఆయనను తనవైపు ఎత్తుకొన్నాడని ముస్లీమ్‌లు చెప్పుచున్నారు. దీనినిబట్టి జిబ్రయేల్ సత్యమును చెప్పినా, ముస్లీమ్‌లుగానీ, క్రైస్తవులుగానీ అర్థము చేసుకోలేదని చెప్పవచ్చును. ఏసు తాత్కాలిక మరణములో 33 గంటలు ఉండి తిరిగి మెలకువలోనికి రావడము జరిగినది. అంతకుముందు 12 గం॥ల కాలము నిద్రలో గడపిన ఏసుప్రభువు నిద్రనుండి నేరుగా తాత్కాలిక మరణములోనికి పోయాడు. అక్కడనుండి బయటి వచ్చువరకు బయట ఏమి జరిగినదో ఏసుకు తెలియదు. అందువలన బయట జరిగిన ఒక్క అనుభవమును కూడా ఏసుప్రభువు అనుభవించలేదు.

రెండవ దైవగ్రంథమయిన సువార్త బైబిలును చూస్తే, బైబిలు గ్రంథములోని వాక్యములన్నిటినీ జీవాత్మ,పరమాత్మల మధ్యలోని ఆత్మ బోధించినదని తెలియును. సువార్త బైబిలు గ్రంథములో ఒక వాక్యమును సాక్ష్యముగా తీసుకొని చూస్తాము. యోహాను సువార్త 14వ అధ్యాయము 20వ వాక్యములు **“నేను నా తండ్రియందునూ, మీరు నాయందునూ, నేను మీయందును ఉన్నానని మీరెరుగుదురు”** అన్నాడు. ఈ వాక్యములో మీరు అనగా ప్రజలని అర్థముకాగలదు. నేను నా తండ్రియందునూ, అను వాక్యములో తండ్రియనగా దేవుడు, ఆయన తండ్రి దేవుడు. ఆత్మ దేవునియందు మరియు ప్రజలయందు రెండువైపులాయున్నదనీ అదియే దేవునికీ, మనుషులకూ మధ్యయుండు ఆత్మయని, ఆత్మయే బైబిలు గ్రంథము బోధించినదనీ ఆ గ్రంథమునందు అనేక వాక్యములు కనిపించుచున్నవి.

అంతిమ దైవగ్రంథమును చూస్తే, జీవాత్మగా జిబ్రయేల్ యుండి ఖురాన్ లోని ప్రతి వాక్యమును జీవుడు చెప్పినట్లే చెప్పాడు. ఖురాన్ గ్రంథములో దేవుడు చెప్పినట్లుగానీ ఆత్మ చెప్పినట్లుగానీ యుండక, సాటి మనిషి ఇంకొక వ్యక్తికి చెప్పినట్లు ముహమ్మద్ ప్రవక్తకు బోధించినట్లు గలదు. ఈ విధముగా మూడు దైవ గ్రంథములలో పరమాత్మ చేత అధికారముగా చెప్పబడినట్లు భగవద్గీత గ్రంథముండగా, ఆత్మ చెప్పినట్లు బైబిలు ఉండగా, జీవాత్మ చెప్పినట్లు ఖురాన్ గ్రంథము కలదు. ఇప్పటినుండి చూచినవారికి మూడు దైవగ్రంథములలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మలు బోధించిన తేడాలు కనిపించ గలవు. అందువలన విచక్షణకల్గి మూడు దైవగ్రంథములను చదువమని యోగీశ్వరులవారు చెప్పుచున్నారు. అలాగే మనమందరము చదివి దైవజ్ఞానమును మరింత పెంపొందించుకోవాలని ఆశిస్తూ ముగిస్తున్నాను.

# చివరి మాట

ఆధ్యాత్మికములో అనగా, ఆత్మ జ్ఞానమార్గములో ప్రవేశించాలను కొను ఏ మనిషికైనా ప్రాథమికముగా ముందు శ్రద్ధ అవసరము. తరువాత జ్ఞానము అవసరము. కుల, మత, వర్గ, వర్ణ, భేదములులేని జ్ఞానమార్గము చాలా ఇరుకైనది. నీవు ప్రవేశించుటకు ఎంతదారి అవసరమో, అంతే దారియుండును. అనగా జ్ఞానమార్గములోనికి రాకముందు, ఎంతో సువిశాలమైన అజ్ఞాన మార్గము (మాయ, సాతాను, సైతాను) లో ఏ ఆటంకములు లేక నిరాటంకముగా మన ఇష్టము వచ్చినట్లు, గంతులేస్తూ,

చిందులేస్తూ, పరిగెడుతూ పయనించుట జరిగినది కనుక, ఇరుకుమార్గము చాలా కష్టతరముగా, అసౌకర్యముగా ఉండుట చేత, కొంతమందికి ఇబ్బంది కరముగా కనిపించును. అనగా ఇక్కడ స్థూలముగా చూసి బెదిరి పోవలసిన అవసరము లేదని గ్రహించవలెను. జ్ఞానమార్గమంతయూ, సూక్ష్మముగానే సాగుచుండును. అనగా జీవుడు తాను దైనందిన జీవితములో కర్మ యోగిగా ప్రతి నిత్యమూ ఎరుకకలిగినా అహముతో సూక్ష్మముగా పోరాటము చేయవలసియుండును. ఇక్కడ దీనినే ఇరుకు మార్గముగా తెలిసి, జ్ఞాపకముంచుకోవలెను. జీవుడు అజ్ఞానములో ఉన్నప్పుడు, అనగా జ్ఞానము తెలియనితనములో ప్రపంచమునందు నిజము చేదుగా, అబద్ధము తీయగా జీవులకు రుచించడము చేత, దేవుని విషయములో బయట ధర్మములుగా జీర్ణించుకుపోయిన విషయములు జ్ఞానమార్గములో అవి అధర్మములని వాస్తవము తెలిసినప్పుడు, కొంత ఇబ్బందికరముగా ఉండును. ఇక్కడ ఎవరైనా, ఎంతటి పాపాత్ముడైనా శ్రద్ధకలిగితే, జ్ఞానమును తెలుసుకోవచ్చును. ఏ జీవునికీ జ్ఞానమును తెలుసుకొనుటకు ఆ విధానము అతని కర్మలో ఉండవలసిన అవసరములేదు. కర్మకు అతీతమైనదే జ్ఞానము. కనుక దీనిని గుర్తెరిగి, ప్రతి ఒక్కరూ కర్మాతీతమైన జ్ఞానమును తెలియవలసినదిగా కోరుచున్నాము.

ఈ గ్రంథమును వ్రాయుటకు నాకు అనుమతిని ఇచ్చి, అనిర్వచనీయమైన అవకాశమును కల్పించి సంకల్పమును కలిగించి ఎంతో అదృష్టమును కలిగించినటువంటి గురుదేవులైనటువంటి, ఆదరణకర్త, ఆదర్శకర్త, ఆదికర్త అయినటువంటి **శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల** పాదపద్మములకు నమస్కారములు సమర్పించుచున్నాను.

ఇంతవరకూ శ్రీ స్వామివారు వ్రాసినటువంటి జ్ఞానధనముగల పలు గ్రంథములనుండి కొన్ని గ్రంథములను మూలముగా తీసుకొని, ఆ గ్రంథములనుండి కొంత జ్ఞాన ధనమును సేకరించి ఒకచోట జ్ఞాన ధనపు రాశిగా ప్రోగుచేసినదే ఈ గ్రంథములోని సారాంశము. ఈ గ్రంథమునకు ఉపయోగించిన గ్రంథములను క్రింద పొందుపరుస్తున్నాను. **"గురువు"**, **"మూడు గ్రంథములు - ఇద్దరు గురువులు - ఒక బోధకుడు"**, **"హేతువాదము – ప్రతివాదము"**, **"శ్రీకృష్ణుడు దేవుడా? భగవంతుడా?"**, **"త్రైతసిద్ధాంతము"**, **"సామెతల జ్ఞానము"**, **"జనన మరణ సిద్ధాంతము"**, **"అంతిమ దైవగ్రంథములో జ్ఞానవాక్యములు"**, **"దేవాలయ రహస్యములు"**, **"కథల జ్ఞానము"**. ఈ బృహత్తరమైన కార్యములో అన్నీ తెలిసిన ఆత్మయొక్క కార్యనిర్వహణలో యోహాను అను పేరుగల జీవాత్మ, ఆత్మానుభవములో ఆనందించుచున్నది.

ఇట్లు

**ఇందుశ్రీ బి.యోహాను**